# సాహిత్య చంద్రిక

ప్రథమ పి.యు.సి. తెలుగు పాఠ్యపుస్తకం

Revised Syllabus

Telugu Code No. (05)

**2015 - 2016**

**పదవీపూర్వ శిక్షణ మండలి**

**సంపిగే రోడ్, 18 క్రాస్, మల్లేశ్వరం, బెంగుళూరు.**

© *Department of Pre-University Education* 2014-2015.

*Revised Edition - 2017*

**All Rights Are Reserved**

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted, in any form or by any means, electronic, mechanical, photo copying, recording or otherwise without the prior permission of the publisher.

This book is sold subject to the condition that it shall not, by way of trade, be lent, resold, hired out or otherwise disposed of without the publisher's consent, in any form of binding or cover other than that in which it is published.

The correct price of this publication is the price printed on this page/cover page. Any revised price indicated by a rubber stamp or by a sticker or by any other means is incorrect and should be unacceptable.

*Printed on 80 GSM Maplitho paper*

## Director's Message

Dear Students,

We at the Department of Pre-university Education, Karnataka strive to empower each student to dream big and equip them with the tools that enable them to reach new heights and successfully deal with the challenges of life. As Swami Vivekananda said, "**Real education is that which enables one to stand on one's own legs**".

The course contents in this book are designed with the objective of equipping you well for the next level of study.

We wish you well on your journey and look forward to you becoming a responsible citizen of the nation and give back to the betterment of the society.

With best wishes,

Sd/-
**C. Shikha, IAS**
Director
Department of Pre University Education
Bengaluru

# ముందుమాట

పి.యు.సి విద్య ఇటు ఉన్నత పాఠశాలకు, అటు డిగ్రీ కళాశాలకు వారధి వంటిది, సాంఘికశాస్త్రము మొదలగునవి విషయము మాత్రమే ప్రధానముగా గలవి, కానీ భాష నైపుణ్యమే ప్రధానముగా గలది. ప్రతి తరగతిలోనూ విద్యార్థిక్రొత్త క్రొత్త పదజాలమును గ్రహించవలసి యుంటుంది. మాతృభాషలో బోధన కొరకు భాషా సామర్థ్యాలను పెంపొందించడమే మనలక్ష్యం. ఉత్తమ సాహిత్య అధ్యయనం ద్వారా ఉన్నత సంస్కృతిని, నాగరకతను సంపాదించుకొని, ఉదాత్తమైన వ్యక్తిత్వాన్ని సంతరించుకొనేటట్లు చేయడం కూడా ప్రధానాంశమే.

ఈ లక్ష్యాలను సాధించడానికి అనుగుణంగా 2013-14 విద్యాసంవత్సరంనుండి అమల్లోకి వస్తున్న ఈ నూతన పాఠ్యపుస్తక నిర్మాణంలో సంపాదకమండలి ఈ లక్ష్యాలకు అనుగుణంగా పాఠ్యాంశాలను ఎంపిక చేసింది.

ఆంధ్ర సాహిత్యానికి వెయ్యేండ్ల పైగా ప్రాచీనమైన చరిత్ర ఉంది. కేవలము కవులేకాక కవయిత్రులు కూడ ఇందులో పాలుపంచుకొన్నారు. సాహిత్యంలో కాలాను గుణంగా వచ్చిన మార్పులను గూడ దృష్టిలో ఉంచుకొని ప్రాచీన, ఆధునిక కవుల రచనలను ఇందులో పొందుపరచడం జరిగింది. దీనికి తోడు ప్రభుత్వము వారందించిన విలువైన సూచనలుగూడ పాటిస్తూ విద్యార్థులలో చక్కని మానవతావిలువలు పెంపొందించే విధంగా పాఠ్యాంశాలను కూర్చడం జరిగింది.

**పద్యభాగంలో** **'ఏకలవ్యుడు'** పాఠం ఇటు ఆదికవి నన్నయ గారికి కృతజ్ఞతలు ప్రకటిస్తూ, అటు విద్యార్థులలో విద్యపట్ల జిజ్ఞాసను, గురుభక్తిని పెంపొందించడానికి ఎంతగానో తోడ్పడుతుంది.

సమాజంలో అనాదిగా పాతుకొన్న దురాచారాల్ని అంత మొందించడానికి **'కన్యక'** కావించిన హితబోధ నేటితరం మహిళలకు ఆదర్శంగానూ, పురుషులకు కనువిప్పుగానూ ఉంటున్నది. అహంకారంలేని భక్తిని పెంపొందించుకొని, తన్మూలంగా భగవంతుని అనుగ్రహం ఎలా పొందాలో పిల్లలకు తెలియజేస్తుంది **'గజేంద్రమోక్షం'**. కష్టంలోని వాళ్ళను ఆదుకొనే

విధానాన్ని, కర్తవ్య నిర్వహణను, స్వామి భక్తిని ప్రభోధిస్తుంది **'హనుమత్సందేశం'**.

ఇకమానవులకు సుకుమారమైన మనస్తత్వం ఎంత మంచిదో, మాతృత్వపు మాధుర్యమంటే ఏమిటోచాటుతూ తెలుగు పద్యాన్ని ఎంత సరళంగా నడప వచ్చో తెలియ జేస్తుంది **'కుంతీకుమారి'**. కర్ణాటకలోని హంపీనగర పురాతన వైభవాన్ని, శిల్పనైపుణ్యాన్ని, నేటి శిథిలస్థితినీ చాటుతూ ప్రాచీన శిల్పసంపదను మనం ఎలా కాపాడుకోవాలో తెలియజేస్తుంది **'హంపీక్షేత్రం'**. **'వ్యాసమహర్షి'** పాఠం ఋషి ఋణాన్ని తీర్చుకొనే మార్గాన్ని బోధిస్తుంది. **'గోదావరి'** గేయం తెలుగు కవితామృతాన్ని పంచిపెడుతూ, విద్యార్థులకు ప్రకృతి ఆరాధనను నేర్పుతుంది. ప్రశాంత జీవనానికి తోడ్పడుతుంది.

ఇక **గద్యభాగంలో** **'బుద్ధిబలం'** పాఠంలో తెలుగు గ్రాంథిక వచన రచనా స్వరూపాన్ని చూడవచ్చు. జీవితంలో ఎదురయ్యే సమస్యల్ని ఎలా పరిష్కరించు కోవాలో ఈకథ బోధిస్తుంది. **'విదురనీతులు'** పాఠం జీవిత గమనానికి అనువైన రాచబాటను ఏర్పరుస్తుంది. **బసవేశ్వరుడు** కర్ణాటక దేశంలో గొప్ప సంఘ సంస్కర్త ; మహాభక్తుడు. విద్యార్థులకు ఈ పాఠం ఆదర్శంగా నిలుస్తుంది. నేటి ఆధునిక జీవితంలో ప్రకృతిసిద్ధంగా లభించే **'సౌరశక్తి'**ని అన్ని కోణాల్లో ఎలా సద్వినియోగం చేసుకోవచ్చో, పర్యావరణాన్ని ఎలా పరిరక్షించుకోవచ్చో విజ్ఞానశాస్త్ర జ్ఞానంతో మేళవించి బోధిస్తుంది **'సౌరశక్తి'**.

నేడు ప్రపంచమంతటా 150 వ వివేకానంద జయంతి మహోత్సవాల సందర్భంగా స్వామివారి అమూల్యజీవిత సందేశాలు విద్యార్థులకు విజ్ఞానదాయకంగా మార్గదర్శకంగా ఉండేటట్లు **'వివేకానంద సందేశం'** చెబుతుంది. **'నిగమశర్మ అక్క'** పాఠం తెనాలి రామకృష్ణుని చమత్కార వైభవాన్ని చాటుతూ, చెడుమార్గంలో మెలిగేవారి జీవితాలు ఎలా భ్రష్టుపడ్డాయో తెలుపుతూ మంచిమార్గంలో నడుచు కొమ్మని సందేశాన్నిస్తుంది. నియమబద్ధంగా జీవించడం వల్ల కలిగే ఫలితాన్నీ దానితోపాటు పతివ్రతా ధర్మాన్ని **'ఎఱ్ఱనగారిసావిత్రి'** బోధిస్తుంది. అలాగే సంగీత ప్రపంచంలో

త్యాగయ్య ఆదర్శ జీవితాన్ని. భగవద్భక్తిలోని మహిమను **'త్యాగరాజు'** పాఠం వివరిస్తూ మానవతా విలువలను ప్రబోధిస్తుంది.

ఇక **ఉపవాచకం "కెంపేగౌడ"** కర్ణాటక రాజధాని బెంగళూరు మహానగర స్థాపనలో చేసిన సాటిలేని కృషిని తెలుపుతూ, విద్యార్థులలో తమ పూర్వీకులపట్ల భక్తి గౌరవాలను పెంపొందిస్తుంది. తలచు కుంటే తాముకూడా దేన్నైనా సాధించవచ్చుననే నమ్మకాన్ని దృఢం చేస్తుంది.

పి.యు.సి. విద్యార్థుల వయస్సును, మానసిక స్థాయిని దృష్టిలో ఉంచుకొని వారిలో సువిశాల జాతీయ భావాలు పెంపొందించు కొనే విధంగా ఈ పాఠ్య గ్రంథాన్ని రూపొందించాం.

విద్యార్థులకు అవసరమైన **"అభ్యాస వేదిక"**ను చేర్చడంవల్ల వారిలో సాహిత్య వ్యాకరణాది పరిజ్ఞానం పెరుగుతుందని ఆశిస్తున్నాం. చివరిగా వ్యాసాలు, లేఖలు, అపరిచిత గద్యం చేర్చడం వల్ల విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంపొందించు కోవడానికి అనుకూలంగా ఉంది.

ప్రథమ పి.యు.సి. భాషాగ్రంథాల అధ్యయనానికి సుమారు 120 పీరియడ్ల సమయం లభించును. దీనిని దృష్టిలో పెట్టుకొని పద్యభాగానికి 40, గద్య భాగానికి 35, ఉపవాచకానికి 10, వ్యాకరణాదికాలకు 35 పీరియడ్లగా అధ్యాపకులు కేటాయించుకోవచ్చును. చిట్టచివరిగా **'మాదిరి ప్రశ్నపత్రం'** 100 మార్కులకు జత చేయబడింది.

పదవి పూర్వ శిక్షణా శాఖవారి సూచనల మేరకు నేటి విద్యా విధానాల్ని దృష్టిలో ఉంచుకొని ఈ పాఠ్యపుస్తకమూ, ఉపవాచకము ప్రథమ పి.యు.సి. విద్యార్థుల భాషా పటిమను, సామాజిక విలువలను పెంపొందిస్తాయని విశ్వసిస్తూవున్నాం.

ఈ పాఠ్య గ్రంథాన్ని రూపొందించే సదవకాశాన్ని కల్పించిన పదవీపూర్వ శిక్షణ మండలి నిర్దేశకులకు, పాఠ్యగ్రంథాన్ని సకాలంలో సుందరంగా డి.టి.పి. చేసియిచ్చిన బెంగళూరు, తరుగుపేట, **శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ముద్రణాలయం** వారికి సహృదయ పూర్వక కృతజ్ఞతలు.

**– సంపాదక మండలి.**

## పాఠ్య పుస్తక సంపాదకులు

### అధ్యక్షులు

**శ్రీ. పి. కృష్ణప్పగారు**

సెలెక్షన్ గ్రేడ్ లెక్చరర్,

వివేకానంద జూనియర్ కళాశాల, డా॥ రాజకుమార్ రోడ్డు,

రాజాజినగర్, బెంగుళూరు – 55.

### సభ్యులు

1. **డా ॥ పణతుల రామేశమ్‌గారు**

ఆంధ్ర శాఖాధ్యక్షులు

శ్రీ సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్,

కాడుగుడి, బృందావన్, బెంగుళూరు – 67.

2. **డా ॥ పి. హేమచంద్ర బాబుగారు**

ఆంధ్రోపన్యాసకులు/ప్రాచార్యులు

బి.బి.ఎం.పి. I గ్రేడ్ కాలేజ్

కస్తూరిబా నగర్, మైసూర్ రోడ్,

బెంగుళూరు – 560 0026.

పదవీపూర్వ శిక్షణ నిర్దేశనాలయ

మల్లేశ్వరం

**బెంగుళూరు.**

# విషయ సూచిక

## పద్యభాగం


పుట

1. ఏకలవ్యుడు – నన్నయ
2. కన్యక – గురజాడ వేంకట అప్పారావు
3. గజేంద్ర మోక్షం – పోతన
4. హనుమత్సందేశం – కవయిత్రి మొల్ల
5. కుంతీ కుమారి – కరుణశ్రీ
6. హంపీ క్షేత్రము – గుఱ్ఱం జాషువా
7. వ్యాసమహర్షి – డా.సి.వి. సుబ్బన్న శతావధాని
8. గోదావరి – అడవి. బాపిరాజు


## గద్యభాగం


1. బుద్ధిబలం – పరవస్తు చిన్నయసూరి
2. విదురనీతులు – ఉషశ్రీ
3. బసవేశ్వరుడు – ............
4. సౌరశక్తి – డా. విజయలక్ష్మి
5. వివేకానంద సందేశం – ........
6. నిగమశర్మ అక్క – రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ
7. ఎఱ్ఱనగారి సావిత్రి– డా. జక్కంపూడి. మునిరత్నం
8. త్యాగరాజు – డా. కె. సర్వోత్తమ రావు.

## వ్యాకరణం

సంధులు

ఛందస్సు

అలంకారాలు

## నమూనాలు

వ్యాసాలు

లేఖలు

సొంతవాక్యాలు

అపరిచిత గద్యం

## ఉపవాచకం

కెంపేగౌడ (బెంగళూరు మహానగర నిర్మాత)

మాదిరి ప్రశ్న పత్రము (Model Question Paper)

## కంఠస్థ పద్యాలు

❋ పువ్వు గుర్తుగల పద్యాలు కంఠస్థం చేయవలెను.

| | | | |
|---|---|---|---|
| 1. | **ఏకలవ్యుడు** | – | 5వ పద్యం |
| 2. | **గజేంద్రమోక్షం** | – | 1, 7, 11, 12 – పద్యాలు |
| 3. | **హనుమత్సందేశం** | – | 16, 21 – పద్యాలు |
| 4. | **కుంతీ కుమారి** | – | 1, 7, 22 పద్యాలు |
| 5. | **హంపీ క్షేత్రము** | – | 1వ పద్యం |
| 6. | **వ్యాసమహర్షి** | – | 3వ పద్యం |
| | **మొత్తము** | | **12** పద్యాలు |

## పద్యభాగం

# 1. ఏకలవ్యుడు

– నన్నయ

## (ఆంధ్ర మహాభారతము – ఆదిపర్వము – పంచమాశ్వాసము)

[ఈ పాఠ్యభాగం నన్నయ రచించిన ఆదిపర్వం, పంచమాశ్వాసం నుండి గ్రహింపబడింది. కవిత్రయంలో మొదటివాడైన నన్నయ 11 వ. శతాబ్దివాడు. ఇతనికి 'ఆదికవి', 'శబ్దశాసనుడు' లేక – 'వాగను శాసనుడు' అనే రెండు బిరుదులు న్నాయి. నన్నయ రాజరాజ నరేంద్రుని ఆస్థానకవి. భారతంలోని ఆది, సభా పర్వాలూ, అరణ్యపర్వంలోని కొంత భాగాన్ని నన్నయ అనువదించాడు.

గురువును త్రిమూర్తి స్వరూపంగా ఆరాధించిన ఏకలవ్యుని అచంచల గురుభక్తి ఇందు మనోహరంగా వర్ణించబడింది.]

### పాఠ్యభాగము

వ. ద్రోణాచార్యుల ప్రసిద్ధివిని హిరణ్యధన్వుండను నెఱుకు
రాజు కొడు కేకలవ్యు డను వాడు ధనుర్విద్యా గ్రహ
ణార్థియయి వచ్చిన, వానిని నిషాద పుత్రుండని శిష్యుంగా
జేకొనకున్న వాడును ద్రోణు ననుజ్ఞవడసి చని
వనంబు లోన. 1

తే. వినయమున ద్రోణు రూపు మన్నున నమర్చి
దాని కతి భక్తి తోడ బ్రదక్షిణంబు
చేసి మ్రొక్కుచు సంతతాభ్యాస శక్తి
నస్త్ర విద్యా రహస్యంబు లర్థి బడసె. 2

కం. ఇట పాండవ కౌరవులొ
క్కట నందఱు గురుననుజ్ఞ గొని మృగయా లం
పటులై వనమున కరిగిరి
పటుతరజవ సారమేయ భటనివహముతోన్. 3

వ. మఱియు నందొక్క భటుని కుక్క తోడు దప్పి పఱచి యొక్కెడ
సేకతంబ యేయుచున్న సేకలవ్య సమీపంబున మొఱింగిన
నయ్యెలుంగు విని దాని ముఖంబునం దేడు బాణంబు
లొక్కట దొడిగి యక్కజంబుగా నతి లాఘవంబున
వాడేసిన నది శర పూరిత ముఖంబయి కురు కుమారుల
యొద్దకుం బాఱిన దానిం జూచి విస్మయంబంది యట్లేసిన
వాడెవ్వడో యని రోయుచు వచ్చు వారు ముందఱ 4

✺ఉ. తేజిత బాణహస్తు దృఢదీర్ఘమలీమస కృష్ణదేహు గృ
ష్ణాజిన వస్తునస్త్రవిషయాప్త విషాదు నిషాదు జూచియా
రాజకుమారు లందఱు బరస్పర వక్త్ర విలోకన క్రియా
వ్యాజమునం దదీక్షణ నివారితులై రతిమత్సరంబునన్. 5

వ. అక్కుమారులు వాని కరలాఘవంబునకు మెచ్చి నీవెవ్వండ
వెవ్వరి చేత విలువిద్య గఱచితని యడిగిన వారికి
నయ్యెఱు కిట్లనియె. 6

కం. వినుడే హిరణ్య ధన్వుం
డను వనచరనాథుకొడుక నాచార్యుడు ద్రో
ణునకున్ శిష్యుడ నెందును
ననవద్యుడ సేకలవ్యు డనువాడ మహిన్. 7

వ. అనిన విని కురుకుమారులందఱు మగుడి వచ్చి ద్రోణున
కంతయు జెప్పిరంత నర్జునుం డేకాంతంబ యొక్కనా
డాచార్యున కిట్లనియె. 8

కం. విలువిద్య నొరులు నీక
గ్గలముగలేకుండ నిన్ను గఱపుదు ననిమున్
బలికితిరి నాక కాదీ
త్రిలోకముల కధికు జూచితిమి యొకయెఱుకున్. 9

కం. నాకంటెను మీకంటెను
లోకములో నధికు డతిబలుండు ధనుర్వి
ద్యాకౌశలమున నాతడు
మీకుం బ్రియ శిష్యుడటె యమిథ్యావచనా ! 10

వ. అనిన విని ద్రోణుం డదరిపడి వానిం జూతము రమ్మని యర్జునుం దోడ్కొని యనవరత శరాసనాభ్యాసనిరతుండయి యున్న యేకలవ్యుకడ కేగిన నెఱింగి వాడు నెదురు పఱతెంచి ద్రోణునకు మ్రొక్కి తన శరీరంబు సర్వస్వంబును నివేదించి యేను మీ శిష్యుండ మిమ్మారాధించి యివ్విలు విద్యగఱచితి నని కరంబులు మొగిచియున్నం జూచి ద్రోణుండట్లేని మాకు గురుదక్షిణ యిమ్మనిన సంతసిల్లి వాడిట్లనియె. 11

కం. ఇదె దేహంబిదె యర్థం
బిదె నా పరిజన సమూహ మిన్నిటలో నె
య్యది మీకిష్టము దానిన
ముద మొదవగ నిత్తు గొనుడ మోఘం బనినన్. 12

కం. నెమ్మిని నీ దక్షిణ హ
స్తమ్మున పెనుప్రేలు దునిమి దక్షిణ యిమ్మి
ష్టమ్మిది నా కనవుడు విన
యమ్మున వా డిచ్చె దాని నాచార్యునకున్. 13

తే. దక్షిణాంగుష్ఠ మిచ్చిన దాన చేసి
బాణ సంధాన లాఘవ భంగ మయిన
నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యె
బార్థునకు మనోరుజయును బాసెనంత. 14

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

ధనుర్విద్య = విలువిద్య ; గ్రహణ + అర్థి = గ్రహించగోరినవాడు ; సారమేయము = కుక్క; కృష్ణ = నల్లనైన ; అస్త్రవిషయ + ఆప్తవిషాదుడు = అస్త్రవిద్యను నేర్చుకొన లేక పోతినే అను బాధతో కూడినవాడు ; వక్త్రము = ముఖము ; శరము = బాణము ; లాఘవము = నేర్పు ; కృష్ణ + అజినము = నల్లజింక చర్మము ; వ్యాజము = నెపము.

**సారాంశము :**

హిరణ్యధన్వుడనే ఎఱుకరాజు కుమారుడు ఏకలవ్యుడు. ఇతడు ద్రోణాచార్యుల విలువిద్యా నైపుణ్యాన్నిగూర్చి విని, తనకుగూడ విలువిద్యను నేర్పించమని అడిగాడు. ఆ నాటి పద్ధతులను బట్టి ఎఱుకవాడైన ఏకలవ్యునికి విలువిద్య నేర్పుటకు ద్రోణుడు అంగీకరిచలేదు. ఏకలవ్యుడు మట్టితో చేసిన ద్రోణాచార్యుని విగ్రహాన్ని అతిభక్తితో పూజిస్తూ 'విలువిద్య'లోని రహస్యాలన్నీ క్షుణ్ణంగా నేర్చుకొన్నాడు.

ఒకనాడు కౌరవపాండవులు వేగంగా పరుగెత్తే వేటకుక్కలను వెంటపెట్టుకొని, భటులసమూహంతో అడవికి వెళ్ళారు. ఒక భటుని కుక్క దారితప్పి, ఏకలవ్యుడున్న చోటికి వెళ్ళి మొఱగడం మొదలు పెట్టింది. ఆ శబ్దాలు భరించలేని ఏకలవ్యుడు, దానిముఖంలో నాటుకొనే టట్లుగా ఏడు బాణాలు

వేశాడు. ఆకుక్క అలాగే కౌరవపాండవులున్న చోటు కెళ్ళింది. ఈ విచిత్రాన్ని వారు ఆశ్చర్య చకితులై చూస్తుంటే ఏకలవ్యుడు వారి కంటపడ్డాడు.

పదును పెట్టిన బాణాన్ని చేతపట్టుకున్నవాడు, దిట్టమై, పొడవై, మురికిపట్టిన నల్లని దేహం కలవాడు, జింక చర్మాన్ని వస్త్రంగా ధరించినవాడు, ఎఱుకవాడైన ఆ ఏకలవ్యుణ్ణి చూచి ఆ రాజకుమారు లందరు మిక్కిలి అసూయతో కూడినవారై, అతనిముఖం చూడలేక, ఒకరిముఖం ఒకరు చూచుకుంటూ ఉండి పోయారు.

ఆ కుమారులు అతని నేర్పరితనానికి మెచ్చి 'నీ వెవ్వడవు ? ఎవరివద్ద విలువిద్య నేర్చుకొన్నావు ?' అని అడుగగా ఏకలవ్యుడిలా బదులిచ్చాడు.

నేను హిరణ్యధన్వుడనబడే ఎఱుకలరాజు కుమారుడను. ద్రోణాచార్యుల శిష్యుణ్ణి, ఏ దోషమూలేనివాణ్ణి. అనగానేవారు తిరిగివచ్చి ద్రోణునికి అంతా చెప్పారు. ఆపై అర్జునుడు ఒంటరిగా నున్న ద్రోణునితో "ఆచార్యా ! విలువిద్యలోనీకంటె అధికులు లేనట్లుగా నేర్పుతానని ఇదివరకు నాతో చెప్పారు. ఇపుడు నాకేకాదు. ఈ ముల్లోకాలకంటె అధికుడైన ఒక ఎఱుకును చూచాము. మరి మీరెందుకు అబద్ధాలాడారు ? అతడు విలువిద్యలో మీకంటె, నాకంటె అధికుడు ; మహాబలవంతుడు. అతడుమీకు ప్రియశిష్యుడటగదా!" అని అర్జును డనగానే ద్రోణుడు అదిరిపడి, అతనితో ఏకలవ్యుని చెంతకువెళ్ళాడు. అతడు ఎదురువచ్చి, ద్రోణునికి నమస్కరించి, తనశరీరాన్నీ, మొత్తం సంపదను ఆయనకు సమర్పించి 'నేను మీశిష్యుడను, మిమ్మల్ని సేవించి ఈ విలువిద్య నేర్చుకున్నాను' – అని చేతులు జోడించి నిలిచాడు. 'అయితే నాకు గురుదక్షిణ ఇమ్మ'న్నాడు ద్రోణుడు.

'ఇదినా దేహం ; ఇదినాధనం ; ఇది నాసేవకసమూహం. వీటిలో మీకేది ఇష్టమో దానిని సంతోషంగా ఇస్తా తీసుకోండి'. అని ఏకలవ్యుడనగానే 'నీకుడిచేతి

బొటన వ్రేలిని కోసి, ప్రీతితో గురుదక్షిణగా ఇమ్ము అదినాకిష్టం' అని ద్రోణుడుకోరగానే ఏకలవ్యుడు వినయంతో దానినికోసి ఆచార్యున కిచ్చాడు.

కుడిచేతి బొటన వ్రేలిని ఇవ్వటంచేత బాణాన్నికూర్చడంలో నేర్పులోపించి ఏకలవ్యుడు విలువిద్యా సంపద కోల్పోయాడు. కానీ దీనివలన అర్జునునికి మాత్రం దుఃఖం తొలగింది.

**లఘుప్రశ్నలు :**

1. 'ఏకలవ్యుడు' పాఠ్యభాగ రచయుత ఎవరు ?
2. 'నన్నయ' ఏకాలము వాడు ?
3. 'నన్నయ' ఎవరి ఆస్థానములోనివాడు ?
4. ఏకలవ్యుని తండ్రి పేరేమి ?
5. ఏకలవ్యుడు ఎవరి మట్టిబొమ్మను పెట్టి పూజించెను ?
6. ద్రోణుడు ఏకలవ్యుని కోరిన గురుదక్షిణ ఏమి ?
7. 'దక్షిణాంగుష్ఠము' అనగా నేమి ?
8. 'పార్థుడు' అనగా ఎవరు ?

**ప్రశ్నలు**

1. ఏకలవ్యుడు ఏరీతిగా అస్త్రవిద్యలన్నీ నేర్చుకున్నాడు ?
2. కౌరవపాండవులు ఏకలవ్యుని వద్దకు ఎందుకువచ్చారు ?
3. ఏకలవ్యుడు కౌరవపాండవులకు తననుగూర్చి ఏమని తెల్పాడు ?
4. అర్జునుడు ద్రోణాచార్యునితో ఏమన్నాడు ?

**సందర్భాలు**

1. అస్త్ర విద్యారహస్యంబు లర్థి బడసె.

2. ఆతడు మీకుంబ్రియ శిష్యుడటె.

3. ఎయ్యది మీకిష్టము దానిన ముదమొగవగనిత్తు.

4. మనోరుజయును బాసెనంత.

**సంధులు**

అనుజ్ఞ + పడసి = అనుజ్ఞవడసి (గసడదవాదేశసంధి)

దేహంబు + ఇదె = దేహంబిదె (ఉకారసంధి)

మిమ్ము + ఆరాధించి = మిమ్మారాధించి (ఉకార సంధి)

గురు + అనుజ్ఞ = గురుననుజ్ఞ (నుగాగమ సంధి)

**సొంతవాక్యాలు**

1. **అగ్గలము లేకుండ** – సాటిలేకుండ

నేనుమాకళాశాలలో నాకు ఇంకెవరు **అగ్గలములేకుండా** చదువుతాను.

**విశేషాంశాలు**

విద్యార్థులు గురువుల పట్ల మెలగవలసిన తీరును గుర్తించుట. ఏకలవ్యుని ఆదర్శముగా పట్టుదలతో విద్యా బుద్ధులు నేర్చుకొనుట.

**అలంకారాలు**

'తేజిత బాణహస్తు' పద్యములో హస్తు – వస్త్ర / విషాదు – నిషాదు అనుచోటులలో వృత్త్యను ప్రాసాలంకారమున్నది.

**కార్యాచరణ**

నీకు చిన్నప్పటినుండి చదువు చెప్పిన గురువులను గుర్తు చేసికొని, వారి పేర్లు వ్రాయుము.

★ ★ ★ ★ ★

# 2. కన్యక

## – గురజాడ వేంకట అప్పారావు

['కన్యక' అనే ఈ పాఠ్యభాగం 'ముత్యాల సరాలు' అనే గ్రంథంలోనిది. వాడుక భాషకు రాచబాట వేసిన మహాకవి గురజాడ 1862 లో జన్మించారు. 'కన్యాశుల్కం' వీరి ప్రసిద్ధ నాటకం. ఇదికాక 'కొండుభట్టీయం', 'దిద్దుబాటు', 'దేశభక్తి', 'పూర్ణమ్మ' వంటివి వీరి ఇతర రచనలు.

కన్యక అందగత్తె. దుర్గపూజకై ఆలయానికి వెళ్ళితే పట్నమేలే రాజు ఆమెను పొందడానికి ప్రయత్నించాడు. అగ్నిసాక్షిగా పెళ్ళిచేసుకొమ్మని ఆమెతండ్రి రాజును కోరాడు. రాజు అంగీకరించలేదు. పైగా కన్యకను ఎత్తుకు పోవాలని ప్రయత్నిస్తాడు. కన్యక ఆక్రోశిస్తుంది. చేసేదిలేక చివరికి 'ఆత్మాహుతి' చేసుకుంటుంది. అంతకుముందు మేలుకొలుపుగా తనవారికి ఆత్మాభిమానాన్ని ప్రబోధించడం ఇందలి ఇతివృత్తం.]

భక్తి పరవశమైన మనసున
　　దుర్గనప్పుడు కొలిచి, కన్యక
ముక్తివేడుచు వ్రాఢ్చినగలను
　　శక్తి కర్పించెన్.

దుర్గకొలనున గ్రుంకి పిమ్మట
　　రక్తగంధం, రక్తమాల్యం
దాల్చి గుండం చుట్టు నిలిచిన
　　జనుల కిట్లనియెన్.

అన్నలారా ! తండ్రులారా !
　　అలకించం డొక్క విన్నప
మాడు బిడ్డల కానుకొనుటకు
　　ఆశలేదొక్కో !

పట్టమేలే రాజు అయితే
　　రాజు నేలే దైవ ముండడొ !
పరువు నిలుపను పౌరుషము మీ
　　కేల కలుగ దొకో !

'విద్యనేర్చిన వాడు విప్రుడు'
　　'వీర్యముండినవాడు క్షత్రియు'
డన్న పెద్దల ధర్మ పద్ధతి
　　మరచి, పదవులకై –

ఆశచేయక, కాను వీసం
　　కలిగి వుంటే చాలుననుకొని
వీర్య మెరుగక, విద్య నేర్చక
　　బుద్ధి మాలినచో !

కలుగవా యిక్కట్లు ! మేల్కొని
　　బుద్ధిబలమును బాహుబలమును
పెంచి, దైవమునందు భారం
　　వుంచి, రాజులలో –

రాజులై మనుడయ్య ! ఇట్లని
　　కన్య నరపతి కప్పుడెదురై
నాలుగడుగులు నడచి ముందుకు
　　పలికె నీరీతిన్ –

పట్టపగలే నట్టి వీథిని
　　పట్టబోరే జారచోరులు !
పట్టదలచితి వింక నీవొక
　　పట్టమేలే రాజువట !

కండకావరమెక్కి నీ వీ
　　దుండగము తలపెట్టినందుకు
వుండదా వొక దైవమంటూ
　　వుండి వూర్కొనునా !

పట్టమేలే రాజువైతే
　　పట్టునన్నిపుడనుచు కన్యక
చుట్టు ముట్టిన మంటలోనికి
　　మట్టి తా జనియెన్

పట్టమేలే రాజు గర్వం
　　మట్టి గలిసెను, కోటపేటలు
కూలి నక్కల కాట పట్టై
　　అమరె

పట్టమేలే రాజు పోయెను
　　మట్టి కలసెను కోటపేటలు
పదం పద్యం పట్టి నిలిచెను
　　కీర్తులపకీర్తుల్.

**అర్థాలు :**

ముక్తి = మోక్షం, విడుపు, స్వేచ్ఛ ; రక్తగంధం = ఎఱ్ఱని చందనం, రక్తమాల్యం = ఎఱ్ఱనైన పూలదండ, దుండగం = దుష్టచేష్ట, ఊడ్చి = శరీరంపై ఏమీ లేకుండా తీసివేసి.

**సంక్షిప్త ప్రశ్నలు :**

1. కన్యక ఎవరిని పూజించడానికి కోవెలకు వచ్చింది ?
2. కన్యక నగలను ఏమి చేసింది ?
3. కన్యకపై ఎవరు దౌర్జన్యం చూపారు ?
4. కన్యక రాజుకు చిక్క కుండా ఎలా తప్పించుకొన్నది ?
5. రాజు 'అంతా తనకైవసం' అనుకొన్న గర్వం ఏమైంది ?

**వివరణ ప్రశ్నలు :**

1. కన్యక రాజుతో ఏమన్నది ?
2. 'విప్రుడు', 'క్షత్రియుడు' – వీళ్ల లక్షణం ఏమిటి ?
3. కన్యక పాత్రను గురించి మీ అభిప్రాయం రాయండి.
4. ~~ఈ~~పాఠంద్వారా గురజాడ అందించదలచిన సందేశం ఏమిటో వివరించండి.

**సందర్భాలను వివరించండి :**

1. పట్టమేలే రాజు అయితే రాజునేలే దైవముండడో.
2. పరువు నిలుపను పౌరుషము మీకేల కలుగదొకో ?
3. వీర్యమెరుగక, విద్య నేర్చక బుద్ధిమాలినచో కలుగవా యిక్కట్లు.
4. పదం పద్యం పట్టి నిలిచెను కీర్తులపకీర్తుల్.

**కార్యాచరణ :**

గురజాడ సంఘ సంస్కరణను – భాషోద్యమాన్ని గూర్చి తెలుసుకోండి.

★★★★★

# 3. గజేంద్ర మోక్షం

– పోతన

## (ఆంధ్ర మహాభాగవతం – అష్టమస్కంధం)

[పోతన కాలము 15వ. శతాబ్ది. ఈయనకు 'సహజపండితుడు' అని బిరుదు. భోగినీ దండకము, వీరభద్ర విజయము, నారాయణ శతకము – వీరి ఇతర రచనలు.

'గజేంద్ర మోక్షం' భాగవతంలోని ప్రముఖ కథల్లో ఒకటి . ఒక ఏనుగు నీటికోసం సరస్సుకేగి, అక్కడమొసలి చేత పట్టుబడి, శ్రీమహావిష్ణువు యొక్క అనుగ్రహంతో ఆ ఆపదనుండి బయటపడుట ఇందలి వృత్తాంతం. గజేంద్రుని ప్రార్థనతో పాఠ్యభాగం ప్రారంభమవుతుంది.]

✺ఉ. ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండు లీనమై
యెవ్వనియందు డిందు బరమేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు సర్వము దానయైన వా
డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్. 1

కం. లోకంబులు లోకేశులు
లోకస్థులుదెగిన తుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వడు
నేకాకృతి వెలుగునతని నే సేవింతున్. 2

కం. నర్తకుని భంగి బెక్కగు
మూర్తులతో నెవ్వడాడు మునులున్ దివిజుల్
కీర్తింప నేర రెవ్వని
వర్తన మొరు లెరుగ రట్టివాని నుతింతున్. 3

కం. కలడందురు దీనులయెడ
గలడందురు పరమయోగి గణములపాలన్
గలడందు రన్నిదిశలను
గలడుగలండనెడువాడు గలడోలేడో ! 4

సీ. కలుగడే నాపాలి కలిమి సందేహింప
గలిమిలేములు లేక గలుగువాడు
నాకడ్డపడరాడె నలి నసాధువులచే
బడిన సాధుల కడ్డపడెడువాడు
చూడడే నాపాటు చూపుల జూడక
చూచువారల గృపజూచువాడు
లీలతో నా మొఱాలింపడే మొఱగుల
మొఱ లెఱుంగుచుదన్ను మొఱగువాడు

తే. నఖిలరూపులు దనరూపమైనవాడు
నాదిమధ్యాంతములు లేక యడరువాడు
భక్త జనముల దీనుల పాలివాడు
వినడె చూడడె తలపడె వేగరాడె. 5

వ. అనిపలికి, తన మనంబున నగ్గజేంద్రుండీశ్వర
సన్నిధానంబు గల్పించు కొనియిట్లనియె. 6

❋శా. లావొక్కింతయు లేదు ధైర్యము విలోలం బయ్యె బ్రాణంబులున్
ఠావుల్ దప్పెను, మూర్ఛవచ్చె దనువున్ డస్సెన్, శ్రమంబయ్యెడిన్
నీవే తప్ప నితః పరం బెఱుగ మన్నింపందగున్ దీనునిన్
రావేయీశ్వర ! కావవేవరద ! సంరక్షింపు భద్రాత్మకా ! 7

ఉ. ఓ కమలాప్త ! యోవరద ! యోప్రతిపక్షవిపక్షదూర ! కు
యో్య ! కవియోగివంద్య ! సుగుణోత్తమ ! యోశరణాగ తామరా
నోకహ ! యో మునీశ్వర మనోహర ! యోవిపులప్రభావ ! రా
వే, కరుణింపవే, తలపవే, శరణార్థినినన్ను గావవే. 8

వ. అనిపలికి, మఱియు నరక్షిత రక్షకుండైన యీశ్వరుం డాపన్నుండైన నన్నుంగాచుగాక యని నింగి నిక్కి చూచుచు నిట్టూర్పులు నిగిడించుచు, బయలాలకించుచు, నగ్గజేంద్రుండు మొఱసేయుచున్న సమయంబున.9

ఆ. విశ్వమయత లేమి వినియు నూరకయుండి
రంబుజాసనాదు లడ్డుపడక,
విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు
భక్తియుతున కడ్డుపడ దలంచె. 10

❋మ. అలవైకుంఠపురంబులో నగరిలో నామూలసౌధంబుదా
పల మందార వనాంతరామృతసరః ప్రాంతేందుకాంతోపలో
త్పల పర్యంక రమావినోదియగు నాపన్నప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము "పాహి పాహి" యన గుయ్యాలించి సంరంభియై. 11

❋మ. సిరికిం జెప్పడు శంఖచక్ర యుగముం జేదోయి సంధింప డే
పరివారంబును జీర డభ్రగపతిం బన్నింప డాకర్ణికాం
తరధమ్మిల్లము జక్కనొత్తడు వివాదప్రోత్థిత శ్రీకుచో
పరి చేలాంచలమైన వీడడు గజప్రాణావనోత్సాహియై. 12

న. ఇట్లు భక్తజనపాలన పరాయణుండును, నిఖిలజంతు హృదయారవింద సదనసంస్థితుండును నగు నారాయణుండు కరికులేంద్ర విజ్ఞాపిత నానావిధ దీనాలాపంబులాకర్ణించి, లక్ష్మీకాంతా వినోదంబులం దనివిసాలించి, సంభ్రమించి, దిశలు, నిరీక్షించి, గజేంద్ర రక్షాపరత్వంబు నంగీకరించి, నిజపరికరంబును మరల నవధరించి, గగనంబున కుద్గమించి వేంచేయునప్పుడు. 13

మ. తనవెంటన్ సిరి, లచ్చివెంట నవరోధవ్రాతమున్ దానివె
న్కను బక్షీంద్రుడు, వాని పొంతను ధనుః కౌమోదకీశంఖచ
క్ర నికాయంబును, నారదుండు, ధ్వజినీకాంతుండు రా వచ్చి రొ
య్యన వైకుంఠపురంబునంగలుగువా రాబాల గోపాలమున్. 14

కం. అడిగెదనని కడువడిజను
నడిగినదను మగుడ నుడుగడని నడయుడుగున్
వెడవెడ సిడిముడి తడబడ
నడుగిడు ; నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్. 15

వ. అట్టిచో భక్త రక్షకుండైన హరి చక్రంబుపంచిన 16

శా. భీమంబై తలద్రుంచిప్రాణముల బాపెం జక్రమాశుక్రియన్
హేమక్ష్మాధరదేహముం జకితవన్యేభేంద్ర సందోహమున్
గామక్రోధనగేహమున్ గరటిరక్తస్రావగాహంబు ని
స్సీమోత్సాహము వీతదాహము జయశ్రీమోహమున్ గ్రాహమున్. 17

**సారాంశం :**

"ఈ లోకమంతా ఏమహాత్ముని మాయవల్ల పుడుతోందో, ఎవనిలో లీనమై ఉంటుందో, ఎవనిలో కలిసి పోతుందో, ఎవడు పరమాత్ముడో, ఎవడు ఈలోకాని కంతామూలమో, ఎవనికి పుట్టుట - గిట్టుట–నాశము లేకుండా ఉంటుందో, ఎవడు అన్నీతానే అయిఉంటాడో అట్టి భగవంతుణ్ణి నేను శరణు కోరుతున్నాను. లోకాలూ ఆలోకాలన్నిటినీ పాలించేవారూ, లోకాలలో ఉండేవారూ అందరూ నశించిన అనంతరం, ఆ చీకట్లకు అవతల ప్రకాశించే దేవుణ్ణి నేను సేవిస్తాను. నటునిలాగా పెక్కురూపాలతో ఎవడుంటాడో, ఋషులు దేవతలు ఎవణ్ణి కీర్తింపలేరో, ఎవణ్ణి ఇతరులు అర్థం చేసుకోలేరో అట్టి దేవదేవుణ్ణిస్తుతిస్తాను.

దేవుడు దీనుల దగ్గర, యోగులదగ్గర, దిక్కులన్నిటా ఉంటాడంటారు. మరి ఆ దేవుడిప్పుడు ఉన్నాడో లేడో అనుమానంగావుంది. నావిషయంలో దేవుణ్ణి అనుమానించడ మెందుకు ? అన్నీ అతని రూపాలే, అతడే భక్తులకూ, దిక్కులేనివారికీ ఆధారం. అతడునన్ను దయతలచడా ? ఓ దేవ దేవా ! నాలోని శక్తీ, ధైర్యమూ తగ్గాయి. మూర్ఛవస్తూంది, ప్రాణాలు పోయేట్లున్నాయి. బాగా అలసి పోయాను. నీవు తప్ప వేరే దిక్కు లేదు. నన్ను కాపాడు. ఓ స్వామీ ! నా మొరవిను, భక్తుల పాలిటి కల్పవృక్షమైన నీవు నన్ను రక్షించు". ఇలా గజేంద్రుడు ప్రార్థిస్తూ ఉన్న సమయంలో బ్రహ్మాది దేవతలు ప్రపంచమంతా నిండివుండే శక్తిలేనివారై ఉంటే, అప్పుడు శ్రీమహా విష్ణువు గజేంద్రుణ్ణి కాపాడాలనుకున్నాడు.

వైకుంఠంలోని ఓ అంతః పురంలో మేడప్రక్క సరస్సుగట్టుపై నున్న పాలరాతి అరుగుపై లక్ష్మీదేవితో వినోదంలోవున్న విష్ణువు గజేంద్రుని మొరాలకించాడు. లక్ష్మికి చెప్పకుండా శంఖచక్రాలు పట్టకుండా, సేవకులను పిలువకుండా, గరుడుణ్ణికూడా గమనించకుండా భక్తుడైన గజేంద్రుణ్ణి కాపాడే ఆత్రుతతో ఆకాశమార్గంలో బయలు దేరాడు. తన వెనుక లక్ష్మి, ఆపై స్త్రీజనులూ, గరుడుడూ, ధనుస్సు, గద, శంఖము, చక్రమూ, నారదుడూ, సేనాపతి విష్వక్సేనుడూ, వైకుంఠవాసులంతా వచ్చారు. అప్పుడు లక్ష్మీదేవి తనభర్తను ఎక్కడికి

వెళ్ళుచున్నాడో అడగాలనుకొని వేగంగా ముందుకు వెళ్ళేది. అడిగితే వెనక్కు పొమ్మంటా డేమోనని నడకమానేది. మళ్ళీమెల్లమెల్లగా వెళ్ళేది ; ఆగేది ; ఇలా తడబడుతూ నడుస్తోంది. దేవతలను గూడా గమనించకుండా మనోవేగంతో వెళ్ళి, విష్ణువు తనచక్రాన్ని వదిలాడు. ఆచక్రాయుధం రివ్వురివ్వున పోయి మొసలి తల నరికేసింది. ఆమొసలి మేరుపర్వతంలాగా పెద్దగావుంది. అడవి ఏనుగులు కూడా దాన్ని చూస్తే భయపడతాయి. కామ క్రోధాలకు నిలయమైన ఆమొసలి గజేంద్రుని రక్తాన్ని బాగా రుచిచూచింది. అటువంటి మకరం శిరస్సును ఖండించి, ప్రాణాలు తీసి, గజేంద్రుణ్ణి విడిపించింది చక్రం. భగవంతుడెప్పుడూ భక్తుల పాలిటే ఉంటాడని పాఠ్యభాగ సారాంశం.

**అభ్యాస వేదిక**

**అర్థాలు :**

ఆకృతి = రూపం ; అనోకహము = చెట్టు ; దివిజులు = దేవతలు ; వంద్యుడు = నమస్కరించ దగినవాడు ; ఆపన్నులు = బాధలలో నివారు ; అభ్రగపతి = గరుత్మంతుడు ; ధ్వజిని = సేన ; అవధరించి = విని.

**లఘుప్రశ్నలు :**

1. 'గజేంద్ర మోక్షం' పాఠ్యభాగమును రచించిన కవి ఎవరు ?
2. ఇది ఎందుండి గ్రహింపబడినది ?
3. పోతనగారి బిరుదమేమి ?
4. పోతనగారి కాలమేది ?
5. పోతన ఇతర రచన లేవి ?
6. విష్ణువు వెంట మొదట వెళ్ళిన దెవరు ?
7. మొసలిని విష్ణువు దేనితో చంపాడు ?

ప్రశ్నలు

1. గజేంద్రుడు విష్ణువును ప్రార్థించిన విధమెట్టిది ?
2. విష్ణువు వెనుక ఎవరెవరు వెళ్ళారు ?
3. విష్ణువు తనచక్రంతో మొసలిని ఎలాచంపాడు ?

**సందర్భాలు :**

1. ఈశ్వరునే శరణంబు వేడెదన్.
2. ఏకాకృతి వెలుగు నతనినే సేవింతున్.
3. కలడు కలండనెడు వాడు కలడో లేడో !
4. వినడె చూడడె తలపడె వేగరాడె.
5. రావే యీశ్వర ! కావవే వరద ! సంరక్షింపు భద్రాత్మకా !
6. శరణార్థిని నన్ను గావవే !

**సంధులు :**

1. కలడు + అందురు = కలడందురు (ఉకార సంధి)
2. మొఱ + ఆలించు = మొఱాలించు (అకార సంధి)
3. లావు + ఒక్కింతయు = లావొక్కింతయు (ఉకార సంధి)
4. నిడు + ఊర్పు = నిట్టూర్పు (ద్విరుక్తటకారాదేశ సంధి)
5. ఆ + గజేంద్రుడు = అగ్గజేంద్రుడు (త్రిక సంధి)
6. కుయ్యి + ఆలించి = కుయ్యాలించి (ఇకార సంధి)

**అలంకారాలు :**

1. 1వ పద్యంలో – ఎవ్వడు / ఎవ్వని – శబ్దాలు మరల మరలరావడం, వృత్త్యనుప్రాసం.
2. 4వ పద్యంలో – 'కలడందురు' అన్నది 'కలడు' అన్నది మరల మరలరావడం, వృత్త్యనుప్రాసం.
3. 5వ పద్యంలో – ప్రతి పాదంచివర – 'వాడు', 'వాడు' – అంటూ పునరుక్తికావడం.
4. 16వ పద్యంలో – అడిగెదనని – 'డ'కారం పదేపదే రావడం,
5. 17వ పద్యంలో – దేహమున్ / సందోహమున్ / గేహమున్/గ్రాహమున్ ... అంటూ 'మున్' పదేపదే రావడం అంత్యానుప్రాసాలంకారం.

**కార్యాచరణ :**

గజేంద్రుని పూర్వ జన్మ వృత్తాంతాన్ని సేకరించండి.

★ ★ ★ ★ ★

# 4. హనుమత్సందేశము

– కవయిత్రి మొల్ల

## (మొల్లరామాయణము – సుందర కాండము)

[ఈ పాఠ్యభాగం కవయిత్రి మొల్లరచించిన రామాయణము – సుందరకాండము నుండి గ్రహింపబడినది. ఈమె కాలము 16వ శతాబ్దము. గోపవరపు శ్రీకంఠేశ్వరుని వరమున ఈమె కవిత్వము చెప్పుట నేర్చినది. మొల్ల రామాయణము తేటతెలుగులో ఉండడం వల్ల చాలా ప్రసిద్ధి పొందింది. ఈమె తన రామాయణాన్ని శ్రీరామచంద్రునకే అంకితమిచ్చింది.

సీతాన్వేషణతత్పరుడై ఆంజనేయుడు లంకానగరం చేరి, సీతమ్మనుగాంచి, శ్రీరాముడు చెప్పిన సందేశమును ఆమెకు వినిపించుట ఇందలి కథాంశం.]

వ. హనుమంతుండు సముద్రము దాటి లంకం జొచ్చి యశోక
వనంబుననున్న సీతనుంగనుంగొని యామె మ్రోలనిల్చి యిట్లనియె. 1

ఉ. తమ్ముని గూడి పుణ్యగుణ ధాముడు రాముడు వచ్చి మాల్యవం
తమ్మున సైన్య సంఘము ముదంబున గొల్వగనుండి భూమి పై
మిమ్ముల జూచి రండనుచు మేటి కపీంద్రుల బుచ్చి యందు మొ
త్తమ్ముగ మమ్ము గొందఱను దక్షిణభాగము జూడ బంపుచున్. 2

కం. అంగన బొడగని నీవి
య్యంగను గడుజాలు వాడ వంచును నాచే
నుంగరమంపెను శ్రీరఘు
పుంగవుడిదె కొమ్మటంచు భూమిజ కిచ్చెన్. 3

వ. ఆమెయు దానింగనుంగొని రామముద్రికగా నెఱింగి
కన్నుల నద్దుకొని యింకను రాక్షసమాయ యగునేమో
యని సందేహించుచు మారుతికిట్లనియె. 4

కం. నిను విశ్వసింపజాలను
వినిపింపుము నీతెఱంగు విభుని విధము నా
కనవుడు పావని తెలియగ
వినయంబున విన్నవించె విస్ఫుట ఫణితిన్. 5

వ. సుగ్రీవున కభయమిచ్చిన దాదిగా దాను లంకజొచ్చిన
వఱకుం గల వృత్తాంతం బెఱుంగజెప్పి 6

సీ. నీలమేఘచ్ఛాయ బోలు దేహమువాడు
ధవళాబ్జ పత్రనేత్రములవాడు
కంబు సన్నిభమైన కంఠంబు గలవాడు
బాగైనయట్టి గుల్ఫములవాడు
తిన్ననై కనుపట్టు దీర్ఘబాహులవాడు
ఘనమైన దుందుభి స్వనమువాడు
పద్మరేఖలు గల్గు పదయుగంబులవాడు
చక్కని పీన వక్షంబువాడు

తే. కపట మెఱుగని సత్యవాక్యముల వాడు
రమణి ! రాముండు శుభలక్షణముల వాడు
ఇన్ని గుణముల రూపించ నెసగు వాడు
వరుస సౌమిత్రి బంగారువన్నె వాడు. 7

తే. ఉరుతరాటవిలోన మహోగ్రతపము
వాయుదేవుని గుఱియించి వరుసజేసి
యంజనాదేవి కనియె నన్నర్థితోడ
నర్కజుని మంత్రి, హనుమంతు డంద్రు నన్ను. 8

వ. దేవీ! నీదేవుండయిన శ్రీరాముడు నాచేతికిచ్చియంపిన
నూత్నరత్నాంగుళీయకంబు నీకు సమర్పించితి. నేనురిక్త
హస్తంబులతో జనరాదు, నీ శిరోరత్నంబును శ్రీరామునికి
నాపై నమ్మిక పుట్టుటకై యిమ్మనిన నామె యిట్లనియె. 9

కం. నానాథు క్షేమమంతయు
ధీనిధి! నీచేతవింటి దెలియగ, నైనన్
నీ నిజరూపము చూడక
నే నారత్నంబు నమ్మి నీకీయ జుమీ ! 10

వ. అనుటయు నా హనుమంతుడు. 11

కం. చుక్కలు తలపూవులుగా
నక్కజముగ మేనుపెంచి యంబరవీథిన్
వెక్కసమ్మై చూపట్టిన
నక్కోమలి ముదమునొందె నాత్మ స్థితికిన్ 12

వ. ఇట్లు తన మహోన్నత రూపంబు జూపి యెప్పటి యట్ల మఱల సూక్ష్మ
రూపంబును గైకొని నమస్కరించిన యాహనుమంతునకు నద్దేవి తన శిరో
రత్నంబు ననుగ్రహించి యిట్లనియె. 13

కం. ఏ యెడ జూచిన ధరణీ
నాయకు శ్రీపాదయుగము నాచిత్తములో
బాయదని విన్నవింపుము
వాయు తనూజుండ పుణ్యవంతుడ తెలియన్. 14

తే. ఇపుడు రావణుడేతెంచి కపటబుద్ధి
గర్వమున జేసి నన్నెన్ని కాఱులాడె
నన్నియును నీవు చెవులార విన్న తెఱగు
పతికి దయపుట్టగా విన్నపంబు సేయు. 15

❋చం. జనకుని భంగి రామనృపచంద్రుని నన్నును దల్లిమారుగా
గని కొలువంగ నేర్చు గుణగణ్యుని లక్ష్మణు నీతిపారగున్
వినదగరాని పల్కులవివేకముచేతను బల్కినట్టి యా
వినుతమహాఫలం బనుభవించితి నంచును జాటి చెప్పుమా ! 16

కం. ఆ మాటలు మది నుంపక
నామానము గావుమంచు నయవినయ గుణో
ద్దాముడు రాముని తమ్ముడు
సౌమిత్రికి జెప్పుమయ్య సాహసివర్యా ! 17

వ. అనియిట్లు జనకరాజతనయ పలికిన పలుకు లాలకించి
హనుమంతుడా జవ్వనితో. 18

కం. ఇను డుదయింపక మున్నే
వననిధి లంఘించి మనుజ వల్లభుకడకున్
నిను గొనిపోయెద వీపున
జననీ ! కూర్చుండు మనిన సంతోషమునన్. 19

వ. ఓయీ! నీవంతవాడవగుదువు కాని రామచంద్రునిందప్ప నితరుల నంటు దానంగాను. కావున నీతో రాదగదు. అదియునుంగాక దైత్యుడు నన్ను దొంగిలితెచ్చె నట్టివానిని సంగరమున జంపి కాని శ్రీరామునకు నన్ను గొని పోదగదు. జకదేకవీరుని కది యనుచితంబని చెప్పిన హనుమంతుండు. 20

❋ఉ. నీవిభుడబ్ధిదాటి ధరణీతలనాథులు సన్నుతింప సు
గ్రీవ సుషేణ ముఖ్య బలబృందముతో నరుదెంచి నీచునిన్
రావణు నాజిలో దునిమి రాజసమొప్పగ నిన్నుగొంచు సే
నావళి తోడ నీపురికి నారయనేగు నిజంబునమ్ముమా. 21

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

భూమిజ = భూమియందు పుట్టినది – సీత ; సౌమిత్రి = లక్ష్మణుడు ; పావని = పవనుడనగా వాయుదేవుడు = అతని అంశమున పుట్టినవాడు = ఆంజనేయుడు ; ధవళ + అబ్జము = ధవళాబ్జము – తెల్ల తామర ; పీన వక్షము = ఎత్తయిన రొమ్ము ; అర్కజుడు = సూర్యుని వలన పుట్టిన వాడు = సుగ్రీవుడు; అంబరవీథి = ఆకాశ మార్గము ; కంబు కంఠము = శంఖము వంటి కంఠము ; దుందుభి = నగారా ; అంగుళీయకము = ఉంగరము ; రిక్తహస్తంబులు = వట్టి చేతులు ; జనకునిభంగి = తండ్రివలె.

**సారాంశము :**

హనుమంతుడు సముద్రాన్ని దాటి, లంకలో ప్రవేశించి, అశోకవనంలో ఉన్న సీతమ్మను చూచి, ఆమె ఎదుట నిల్చి ఇలా అంటున్నాడు.

అమ్మా ! మాల్యవంతమనే పర్వతంపై పుణ్యమూర్తి అయిన శ్రీరాముడు లక్ష్మణునితో కూడిఉన్నాడు. అనంతమైన సైన్యం అతణ్ణి సేవిస్తూవుంది. మిమ్ములను వెదకడానికి దక్షిణం వైపుగా కొంతమంది కపీంద్రులను పంపించాడు. ఆ సమయంలో శ్రీరాముడు తన ఉంగరాన్ని నీకిమ్మని పంపాడు. ఇదిగో తీసుకోతల్లీ ! అంటూ ఇచ్చాడు.

ఆమె దాన్ని చూచి 'ఇది నిజంగా రామునిదే' అనుకొని, కన్నుల కద్దుకొని ఇది ఏమైనా రాక్షసమాయో ఏమో అని సందేహిస్తూ హనుమతో ఇట్లంటూవుంది. అయ్యా ! నిన్ను నేను నమ్మలేకుండా వున్నాను. నీవివరాలు, మరియు నాభర్త వివరాలు తెలియజెయ్యి – అనగా ఆయిన ఇలా చెప్పసాగాడు.

సుగ్రీవునకు శ్రీరాముడు అభయమిచ్చినది మొదలుకొని తాను లంకానగరానికి వచ్చినంతవరకూ వివరించి చెప్పి – అమ్మా ! విను – నీలమేఘ కాంతితో సమానమైన దేహం, తెల్లతామరలవంటి విశాలమైన కన్నులు,

శంఖమువంటికంఠం, దృఢమైన శరీరం, ఆజానుబాహువులు, విశాల వక్షస్థలము మున్నగు శుభలక్షణాలతో కూడి ఎల్లవేళలా సత్యాన్నే పలికేవాడు శ్రీరాముడు – ఇంక బంగారురంగు కలవాడు లక్ష్మణుడు. నేను వాయుదేవునికి అంజనాదేవికి జన్మించిన హనుమంతుడను. సుగ్రీవునకుమంత్రిని – అంటూ వివరాలు తెలిపాడు.

అమ్మా ! రాముని ఉంగరాన్ని నీకిచ్చాను. నీ శిరోరత్నాన్ని నాకిస్తే శ్రీరామునకు నామీద నమ్మకం కలుగుతుంది. ఈ తల్లీ ! అన్నాడు. నాభర్త వివరాలన్నీ చక్కగా చెప్పావు – కానీ నీ నిజరూపాన్ని చూపిస్తే అప్పుడు నమ్మి శిరోరత్నాన్ని ఇస్తానంటుంది. హనుమ అలాగే నక్షత్రాలు తలపువ్వులయ్యేంతగా విశ్వరూపాన్ని చూపి – ఆమెను నమ్మించి శిరోరత్నాన్ని తీసుకొన్నాడు. అప్పుడు సీతమ్మ – అయ్యా ! హనుమా ! నీవిక్కడ ఉన్నట్లే రావణుడు వచ్చి నన్నెంత కఠోరంగానిందించాడో విన్నావుగదా ! అన్నీ రాముడితో చెప్పు. అంతేకాదు లక్ష్మణుణ్ణి పర్ణశాలలో అనరాని మాటలన్నాను. దానిఫలితం అనుభవిస్తూ వున్నానని కూడ లక్ష్మణునికి చెప్పు – అంటూ సీతమ్మ చెప్పగానే, హనుమ సూర్యోదయానికి ముందే సముద్రాన్ని దాటి నిన్ను రాముని చెంతకు చేరుస్తాను నావీపుపైకూర్చో తల్లీ ! అన్నాడు. అప్పుడామె అయ్యా ! నీవు అంతవాడవే, అనుమానం లేదు కానీ నీతో రాకూడదు. రావణుడు నన్ను దొంగిలించి తెచ్చాడు. అలాంటివాణ్ణి యుద్ధంలో చంపి, నన్ను తీసుకు పోతే శ్రీరామునకు గౌరవం. లేదంటే కళంకం. అని చెప్పగానే హనుమ, అమ్మా ! నీభర్త సముద్రాన్ని దాటి సుగ్రీవుడు, సుషేణుడు మొదలైన బలగంతో వచ్చి, యుద్ధంలో రావణుణ్ణి వధించి, నిన్ను తప్పక తీసుకొని వెళ్ళుతాడు. ఇది నిజం తల్లీ ! నామాటనమ్ము. అంటూ ఓదార్చుతాడు హనుమంతుడు.

**లఘు ప్రశ్నలు :**

1. 'హనుమత్సందేశము' – రచయిత్రి ఎవరు ?

2. మొల్లకవయిత్రి కాలమేది ?

3. ఈమె తన రామాయణమును ఎవరికి అంకితమిచ్చింది ?

4. ఆంజనేయుని తల్లి ఎవరు ?

5. రాముడు సీతమ్మకు దేనిని గుర్తుగా పంపించెను ?

6. సీతమ్మ రామునకు దేనిని గుర్తుగా పంపించెను ?

7. సుగ్రీవుని మంత్రి ఎవరు ?

8. హనుమంతుడు పెరిగినపుడు చుక్కలు ఎట్లుండెను ?

**ప్రశ్నలు :**

1. సీత ఎదుట నిలచి హనుమంతు డేమని పలికాడు ?

2. సీత తనసందేహాన్ని హనుమంతునిలో ఎలా చెప్పింది ?

3. రామలక్ష్మణుల రూపురేఖలను హనుమంతుడెలా వర్ణించాడు ?

4. శిరోరత్నాన్ని ఇవ్వడానికి అనుమానించిన సీతమ్మను హనుమంతుడెలా నమ్మించాడు ?

**సందర్భాలు :**

1. వినయంబున విన్నవించె విస్ఫుట ఫణితిన్.

2. నన్నునుదల్లి మారుగా గని కొలువంగ నేర్చు.

3. చుక్కలు తల పువ్వులుగా.

**సంధులు :**

ఉంగరము + అంపెను = ఉంగరమంపెను (ఉకారసంధి)

కాటులు + ఆడు = కాటులాడు (ఉకార సంధి)

క్షేమము + అంతము = క్షేమమంతయు (ఉకార సంధి)

ఆ + కోమలి = అక్కోమలి (త్రిక సంధి)

**సొంతవాక్యాలు :**

1. **కన్నుల కద్దుకొను** – పవిత్రముగా భావించు

   నాకు మాఉపాధ్యాయుడిచ్చిన బహుమతిని **కన్నులకద్దుకొని** భద్రముగా దాచుకొన్నాను.

2. **కాఱులాడు** – కఠినముగా మాటలాడు

   **కాఱులాడుట** మంచివారి స్వభావము గాదు.

**విశేషాంశాలు :**

హనుమంతునిలోని సమయస్ఫూర్తి, వాక్పటిమ, కార్యదీక్షాదక్షత, ఎంతఎదిగినా అంత ఒదిగివుండే వినయగుణం గ్రహింపదగిన అంశాలు. మొల్లకవయిత్రి సరళరచన గమనించదగింది.

**అలంకారాలు :**

1. 'నీలమేఘచ్ఛాయబోలుదేహమువాడు..' ఈ పద్యములో ప్రతి పాదాంతములోను ఒకేరీతిగా అంత్యాను ప్రాసమున్నది.
2. నీలమేఘచ్ఛాయ, బోలు దేహమువాడు – ఇచట **పోలు** – సమానమైన అనిఅర్థము. కాబట్టి ఉపమాలంకారము.

**కార్యాచరణ :**

'సుందరకాండము'లోని కథను సేకరించుము.

★ ★ ★ ★ ★

# 5. కుంతీకుమారి

– డా. కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి

## (ఉదయశ్రీ – ఖండకావ్య సంపుటినుండి గ్రహింపబడినది)

[ఆధునిక కవులలో అగ్రగణ్యులు డా.కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారి జననం 4-8-1912, మరణం 21-6-1992. వీరు జీవించినంత కాలం కవిత్వం వ్రాసిన మహాకవి. తన కవిత్వాన్ని ప్రజల నాల్కలపై నాట్యం చేయించిన ప్రజాకవి ; మధురకవి.

ప్రస్తుత పాఠ్యభాగం 'కుంతీకుమారి' వీరి 'ఉదయశ్రీ' లోనిది. దుర్వాసమహర్షి మంత్రోపదేశంవల్ల కర్ణుడు పుట్టడం. కుంతి ఆ బిడ్డను పెట్టెలో పెట్టి గంగానదిలో విడిచిపెట్టడం – ఇందలి ప్రధాన కథ.]

✺చం. అది రమణీయ పుష్పవన – మావనమం దొక మేడ – మేడపై
నది యొక మాఱుమూలగది – ఆ గదితల్పులు తీసి మెల్లగా
పదునయిదేండ్ల యీడుగల బాలిక – పోలిక రాచపిల్ల – జం
కొదవెడి కాళ్ళతోడ దిగుచున్నది క్రిందకు మెట్లమీదుగన్ ! 1

ఉ. కన్నియలాగె వాలకము కన్పడుచున్నది – కాదు కాదు – అ
చిన్ని గులాబి లేత అరచేతులలో – పసిబిడ్డ డున్నయ
ట్లున్నది – ఏమికావలయునోగద ఆమెకు – అచ్చు గ్రుద్దిన
ట్లున్నవి – రూపురేక – లెవరో యనరా దత డామెబిడ్డయే ! 2

తే. దొరలు నానంద బాష్పాలొ – పొరలు దుఃఖ
బాష్పములొ గాని యవి గుర్తుపట్టలేము ;
రాలుచున్నవి ఆమె నేత్రాలనుండి
బాలకుని ముద్దు చెక్కుటద్దాల మీద ! 3

ఉ. పొత్తులలోని బిడ్డనికి పుట్టియు పుట్టకముందె యెవ్వరో.
క్రొత్తవి వజ్రపుంగవచకుండలముల్ గయిసేసినారు ! మేల్
పుత్తడి తమ్మిమొగ్గ జిగిబుగ్గల ముద్దులు మూటగట్టు నీ
నెత్తురుకందు నెత్తుకొని నెచ్చెలి యెచ్చటి కేగుచున్నదో ! 4

తే. గాలితాకున జలతారు మేలిముసుగు
జాఱె నొక్కింత – అదిగొ! చిన్నారిమోము !
పోల్చుకొన్నాములే ! కుంతిభోజ పుత్రి
స్నిగ్ధ సుకుమారి ఆమె కుంతీకుమారి !! 5

మ. కడువేగమ్మున చెంగుచెంగున తరంగాల్ పొంగ ఆ తోట వెం
బడి గంగానది పాఱుచున్నయది బ్రహ్మాండమ్ముగా – అల్లదే
బుడుతన్ చేతులలోన బట్టుకొని యా పూబోడియుంగూడ ని
య్యెడకే వచ్చుచునుండె గద్గదికతో నేమేమొ వాపోవుచున్ ! 6

❋మ. "ముని మంత్రమ్ము నొసంగనేల ? ఇడెబో మున్ముందు మార్తాండు ర
మ్మని నే కోరగనేల ? కోరితినిబో ఆతండు రానేల ? వ
చ్చెనుబో కన్నియనంచు నెంచక ననున్ జేపట్టగానేల ? ప
ట్టెనుబో పట్టి నొసంగనేల ? అడుగంటెన్ కుంతి సౌభాగ్యముల్. 7

ఉ. ఏయెడ దాచుకొందు నిపు డీ కసిగందును ? కన్నతండ్రి "చీ
చీ" యనకుండునే ? పరిహసింపరె బంధువు ? లాత్మగౌరవ

శ్రీ యిక దక్కునే ? జనులు చేతులు చూపరె ? దైవయోగమున్
ద్రోయగరాదు – ఈ శిశువుతో నొడిగట్టితి లోకనిందకున్. 8

తే. ఈ విషాదాశ్రువులతోడ నింక నెంత
కాలమీ మేను మోతు ? గంగాభవాని
కలుషహారిణి – ఈ తల్లి కడుపులోన
కలసిపోయెద నా కన్నకడుపుతోడ. 9

తే. అనుచు పసివాని రొమ్ములో నదుముకొనుచు
కుంతి దిగినది నదిలోన – అంతలోన
పెట్టె కాబోలు పవన కంపిత తరంగ
మాలికా డోలికల తేలితేలి వచ్చు ! 10

తే. మందసము రాక గనెనేమొ – ముందు కిడిన
యడుగు వెనుకకు బెట్టి దుఃఖాశ్రుపూర్ణ
నయనములలోన ఆశాకణాలు మెఱయ
ఆ దెసకె చూచు నామె కన్నార్పకుండ. 11

తే. దూరదూరాల ప్రాణబంధువు విధాన
అంతకంతకు తనకు దాపగుచునున్న
పెట్టె పొడవును తన ముద్దుపట్టి పొడవు
చూచి తలయూచు మదినేమి తోచినదియొ ? 12

తే. ఆత్మహత్యయు శిశుహత్య యనక గంగ
పాలు గానున్న యీ దీనురాలిమీద

భువనబంధునకే జాలి పుట్టనేము !
పెట్టె నంపించి తెరువు చూపెట్టినాడు. 13

తే. ''ఇట్టులున్నది కాబోలు నీశ్వరేచ్ఛ''
యనుచు విభ్రాంతిమై దిక్కు లరసికొనుచు
సగము తడిసిన కోకతో మగువ, పెట్టె
దరికి జని మెల్లమెల్లగా దరికి తెచ్చి – 14

తే. ఒత్తుగా పూలగుత్తుల నెత్తు పెట్టి–
పైచెఱగు చింపి మెత్తగా ప్రక్కపఱచి –
క్రొత్త సెత్తలిరాకుల గూర్చి పేర్చి –
ఒత్తుకొనకుండ చేతితో నొత్తిచూచి– 15

తే. ఎట్టకేలకు దడదడ కొట్టుకొనెడి
గుండె బిగబట్టుకొని కళ్ళనిండ జూచి –
బాష్పముల సామి తడిసిన ప్రక్కమీద
చిట్టిబాబును బజ్జుండబెట్టె తల్లి. 16

తే. చిన్ని పెదవుల ముత్యాలు చిందిపడగ
కలకలమటంచు నవ్వునేగాని, కన్న
యమ్మ కష్టము – తన యదృష్టమ్ముకూడ
నెఱుగ డింతయు నా యమాయికపు బిడ్డ. 17

తే. చెదరు హృదయము రాయిచేసికొని పెట్టె
నలలలో ద్రోయబోవును – వలపునిలుప
లేక – చెయిరాక – సుతు కౌగిలించి వెక్కి
వెక్కి యేడ్చును – కన్నీరు గ్రుక్కుకొనును. 18

తే. "భోగభాగ్యాలతో తులతూగుచున్న
కుంతిభోజుని గారాబు కూతురునయి
కన్న వలుసుకు ఒక పట్టెడన్నమైన
పెట్టుకో నోచనైతి పాపిష్ఠిదాన. 19

ఉ. నన్నతి పేర్మిమై గనెడి నా తలిదండ్రుల ప్రేమ యర్థమౌ
చున్నది; నేడు బిడ్డ నిట నొంటరిగా విడిపోవ కాళ్ళు రా
కున్నవి; యేమి సేతు; కనియున్ గనలేని యభాగ్యురాల నే
నన్నివిధాల – కన్న కడుపన్నది కాంతలకింత తీపియే ! 20

ఉ. పెట్టియలోన నొత్తిగిలబెట్టి నినున్ నడిగంగలోనికిన్
నెట్టుచునుంటి తండ్రి ! యిక నీకును నాకు ఋణంబుదీరె, మీ
దెట్టుల నున్నదో మన యదృష్టము! ఘోరము చేసినాను నా
పుట్టుక మాసిపోను ! నినుబోలిన రత్నము నాకు దక్కునే ! 21

✺ఉ. పున్నమ చందమామ సరిపోయెడి నీ వరహాలమోము నే
నెన్నటికైన చూతునె ! మఱే ! దురదృష్టము గప్పికొన్న నా

కన్నుల కంతభాగ్యమును కల్గునె ? ఏ యమయైన ఇంత నీ
కన్నము పెట్టి ఆయువిడినప్పటిమాటగదోయి నాయనా ! 22

తే. పాలబుగ్గల చిక్కదనాల తండ్రి !
వాలుగన్నుల చక్కదనాల తండ్రి !
మేలి నీలి ముంగురుల వరాల తండ్రి !
కాలుచెయి రాని తండ్రి ! నా కన్నతండ్రి ! 23

తే. కన్నతండ్రి నవ్వుల పూలు గంపెడేసి –
చిన్నినాన్నకు కన్నులు చేరెడేసి –
చక్కనయ్యకు సెరికురుల్ జానెడేసి –
చిట్టిబాబు మై నిగనిగల్ పెట్టెడేసి – 24

తే. బాలభానుని బోలు నా బాలు నీదు
గర్భమున నుంచుచుంటి గంగాభవాని !
వీని నేతల్లిచేతిలో నైన బెట్టి
మాట మన్నింపుమమ్మ ! నమస్సులమ్మ !" 25

తే. దిక్కులను జూచి భూదేవి దిక్కుచూచి
గంగదెస చూచి బిడ్డ మొగమ్ము చూచి –
సజల నయనాలతో ఒక్కసారి "కలువ
కంటి"తలయెత్తి బాలభాస్కరుని చూచె – 26

తే. మరులు రేకెత్త బిడ్డను మరల మరల
సెత్తుకొనుచు పాలిండ్లపై నొత్తుకొనుచు
బుజ్జగింపుల మమకార ముజ్జగించి
పెట్టెలోపల నుంచి జోకొట్టె తల్లి. 27

తే. ఆతపత్రమ్ము భంగి కంజాతపత్ర
మొండు బంగారుతండ్రిపై సెండ తగుల
కుండ సంధించి, ఆకులోనుండి ముద్దు
మూతిపై కట్టకడపటి ముద్దునుంచి. 28

తే. "నన్ను విడిపోవుచుండె మా నాన్న" యనుచు
కరుణ గద్గద కంఠియై కంపమాన
హస్తములతోడ కాంక్ష లల్లాడ, కనులు
మూసికొని నీటిలోనికి ద్రోసి పెట్టె. 29

తే. ఏటి కెరటాలలో పెట్టె యేగుచుండ
గట్టుపై నిల్చి అట్టె నిర్ఘాంతపోయి
నిశ్చల నిరీహ నీరస నిర్నిమేష
లోచనమ్ములతో కుంతి చూచుచుండె. 30

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

రాచపిల్ల = రాజకుమార్తె ; వాలకము = పోలిక ; మరులు = ప్రేమ ; పుత్తడి = బంగారు ; తమ్మిమొగ్గ = తామర మొగ్గ ; జిగి కాంతి ; పూబోడి = పుష్పమువంటి మెత్తని దేహముకలది (స్త్రీ) ; మార్తాండుడు = సూర్యుడు ; కలుషహారిణి = పాపమును తొలగించునది ; తరంగము = అల; డోలిక =

ఉయ్యాల ; మందసము = పెట్టె ; ముద్దుపట్టి = ముద్దుబిడ్డ ; నెత్తలిరాకులు = మెత్తని చిగురుటాకులు ; కన్ననలుసు = కన్నబిడ్డ ; నెరికురుల్ = అందమైన వెంట్రుకలు ; ఆతపత్రము = గొడుగు ; కెరటాలు = అలలు ; సాము = సగము.

**సారాంశం :**

రమణీయమైన ఒక పూలవనం. అందులోని మేడమీది గదితల్పులు తీసుకొని ఒక అమ్మాయి మెట్ల మీదుగా క్రిందికి దిగుతోంది. ఆమె చేతిలో ఒక పసిబిడ్డ ఉన్నాడు. ఆమెకుంతి – అతడు కర్ణుడు. ఆమె ఏడుస్తూవుంది. పెళ్ళికిముందే బిడ్డను కనడం తప్పుకదా ! ఆ బిడ్డనికి పుట్టీ పుట్టకముందే ఎవరో వజ్రకవచకుండలాలు అలంకరించారు. ఆ పూదోట ప్రక్కగా గంగానది ప్రవహిస్తోంది. ఆమె చేతిలోని బిడ్డతో ఆనదివైపే వస్తూ ఇలా చింతిస్తోంది.

నాకు ఆ దుర్వాసముని ఎందుకు మంత్రాన్ని ఇవ్వాలి ? ఇచ్చాడుబో నేను సూర్యుణ్ణి రమ్మని ఎందుకు పిలవాలి ? పిలిచానుబో అతడెందుకు రావాలి ? వచ్చాడుబో కన్యనైన నన్ను ఎందుకు చేపట్టాలి ? పట్టాడుబో బిడ్డనెందుకు ఇవ్వాలి? కుంతి సౌభాగ్యాలన్నీ నశించాయి సుమా ! ఇప్పుడువీణ్ణి ఎక్కడ దాచుకోవాలి? కన్నవారు, బంధువులు, లోకులు అందరూ ఛీ ఛీ అనరా ? అంతావిధివైపరీత్యం. ~~ఈ~~ కష్టంతో ఇలా ఎంతకాలం బ్రతకాలి ? ~~ఈ~~ గంగా భవాని కడుపులో కలిసి పోతాను. ఆంటూ బిడ్డతో కూడా దుమకడానికి సిద్ధమైంది. నదిలోకి దిగీదిగగానే ఒక పెట్టెకొట్టుకొని వస్తుంటే, అందుకొని – అందులో ఒత్తుగా పూలగుత్తుల్ని పెట్టీ, పైచెంగు చించి మెత్తగాపఱచి, లేత చిగురుటాకుల్ని పేర్చి మిక్కిలి దుఃఖంతో అందులో పడుకో బెట్టింది. బిడ్డను మరల మరల ఎత్తి చూచుకొంటూ, బిడ్డకు ఎండ తగులకుండా తామరాకును గొడుగులాగా పెట్టింది. మాతృప్రేమ పొంగుతుంటే మరల మరల ఎత్తుకొని గుండెలకు హత్తుకొంటూ, గుండెరాయి చేసుకొని పెట్టలోపల పరుండబెట్టి జోకొట్టి, నిద్రపోగానే పెట్టెమూసివైచి, నీటి లోనికిత్రోసి వేసింది. ఏటికెరటాలలో పెట్టె ఏగుతుంటే పెల్లుబికి వస్తున్న దుఃఖంతో ఇక చేసేది లేక నిశ్చేష్టురాలై కుంతి చూస్తూవుండి పోయింది.

**లఘు ప్రశ్నలు :**

1. 'కరుణశ్రీ' గారి పూర్తి పేరేమి ?
2. కుంతి ఎవరి కుమార్తె ?
3. మంత్రం జపిస్తూ కుంతి ఎవరిని పిలిచింది ?
4. కుంతి బిడ్డను ఏనదిలో వదిలింది ?

**ప్రశ్నలు :**

1. గంగలో వదలడానికి ముందు కుంతి ఏమని దుఃఖించింది ?
2. కుంతి పెట్టెను అమర్చడానికి ఏమేమి చేసింది ?
3. కుంతి మాతృహృదయాన్ని మీ పాఠ్యభాగం ఆధారంగా వర్ణించండి.

**సందర్భాలు :**

1. ఎవరో అనరా దత డామె బిడ్డయే !
2. అవి గుర్తుపట్టలేము.
3. అడుగంటెన్‌కుంతి సౌభాగ్యముల్.
4. పెట్టె నంపించి తెరువు చూపెట్టినాడు.
5. కన్న కడుపన్నది కాంతల కింతతీపియే !
6. నినుబోలిన రత్నము నాకు దక్కునే !
7. దైవయోగమున్ ద్రోయగరాదు.

**సంధులు :**

1. ఏమి + చేతు = ఏమిసేతు (గసడదవాదేశ సంధి)
2. పట్టెడు + అన్నము = పట్టెడన్నము (ఉకార సంధి)

3. ఎలుగడు + ఇంతయు = ఎలుగడింతయు (ఉకారసంధి)

4. ఎన్నటికి + ఐన = ఎన్నటికైన (ఇకార సంధి)

**అలంకారాలు :**

1. చిక్కదనాలతండ్రి / చక్కదనాలతండ్రి! / వరాలతండ్రి ! / నాకన్నతండ్రి

ఈ పద్యంలో చివరల 'తండ్రి' పదేపదే రావడంతో అంత్యానుప్రాస.

2. గంపెడేసి / చేరెడేసి / జానెడేసి / పెట్టెడేసి.

ఈ పద్యంలో కూడ అంత్యానుప్రాసాలంకారం ఉంది.

**కార్యాచరణం :**

★ కరుణశ్రీగారి ఇతర రచనలను సేకరించండి.

★ ఘంటసాలగారు పాడిన కరుణశ్రీ సి.డిలను సేకరించి, వినండి.

★ ★ ★ ★ ★

# 6. హంపీ క్షేత్రం

– గుఱ్ఱం. జాషువా

## ('గబ్బిలం' ఖండకావ్యం నుండి)

[జాషువాగారు 1895లో గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. బాల్యంలో కష్టాలు కడగండ్లు అనుభవించి మడమత్రిప్పని మహావీరునిలా ముందుకు సాగాడు. ఫిరదౌసి, గబ్బిలము, స్వప్నకథము, వి వీరి ఇతర రచనలు. నవయుగ కవిచక్రవర్తి, కవికోకిల, పద్మశ్రీ, పద్మవిభూషణ్, కళాప్రపూర్ణవంటి చాలా బిరుదులున్నాయి. ఇతడు ప్రజాకవి. హంపీక్షేత్రాన్ని దర్శించమని గబ్బిలానికి కథానాయకుడు అరుంధతీసుతుడు చెప్పిపంపడం ఈ పాఠ్యభాగ సారాంశం.]

❋శా. హంపీక్షేత్రము జూచి పోవలయు నమ్మా తెల్గురాజ్యంపు సై
లింపశ్రీల కొకానొకప్పుడది కేళీరంగ మేతద్రమా
శంపావల్లరు లాటిపోయిన ప్రదేశంబందు నీ బందుగుల్
కొంపల్గట్టి నివాస ముండెదరు నీకుం గూర్తు రానందమున్. 1

మ. పరదాపద్ధతి మాన్పిరో సిరికి గుప్పల్ వోసి యంగళ్ళ యం
దురుమాణిక్యము లమ్మినారచట మున్నో పక్షిణీ ! మూరురా
యరగండండు మహేంద్రవైభవముతో నాంధ్రక్షమామండలిన్
బరిపాలించిన నాటి పెంపును దలంపన్ మేను గంపించెడిన్. 2

చం. పగతురసూయ చేత గరవాలములన్ దనువెల్ల జెండినన్
జిగిరిచియున్న యుగ్రనరసింహుని భీమదృగంచలంబులన్

బొగలుడివోవలే దతని ప్రోల నిమేషము నిల్వజాలినన్
ఖగపతి ! నిన్ను ధైర్యవతిగా గణియింతురు వీరయోధులున్. 3

ఉ. ఏనికవంటి సానువు గణేశుని నున్నని బొజ్జమీద గా
లూనగ లేదు తుమ్మెద తదుజ్జ్వలశిల్ప మఖండ తుంగభ
ద్రానది కప్పగించుకొని దద్దమలైన తెలుంగువారి వి
ద్యానగరాన జిందుమొక యశ్రుకణంబు నుపాయనంబుగన్. 4

చం. సరసుడు కృష్ణ భూవిభుడు స్వారియొనర్చిన పారసీహుమా
దొరల ఖురాగ్ర హల్యలను దున్నిన భూములలోన నాంధ్ర సుం
దరు లొకనాడు నాటుకొనినారు దిగంత జయప్రరోహముల్
గరిసెల నించినా రురువుగా ఫలియించిన సుప్రతిష్ఠలన్. 5

సీ. మూరురాయరగండ దూరేగ డీనాడు
విద్యానగర రాజవీథులందు
మేలైన పట్టుడేరా లెత్తరీనాడు
పారసీక గుఱాల బేరగాండ్రు
ఇనుపరోకళ్ళ సాధన సేయవీనాడు
కొమ్ము నిక్కిన భద్రకుంజరములు
తెలుంగు స్కంధావారముల నిండ దీనాడు
మరఫిరంగుల తెల్ల దొరల దండు.

తే. మణిమయంబైన యాంధ్రసామ్రాజ్య రథము
భువికి గ్రుంగిన పదియునాఱవ శతాబ్ది
గృష్ణవిభువీట బ్రొద్దు గ్రుంకినది మొదలు
ఋషిఖగాంగన ! తెల్లవారినది లేదు. 6

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

నైలింప శ్రీలు = 'నిలింపులు' అనగా దేవతలు = దేవతావైభవాలు ; శంపావల్లరులు = మెఱపుతీగలు ; పక్షిణీ ! = ఓ గబ్బిలమా ! ; మూరు రాయర గండడు = కృష్ణదేవరాయలు ; కరవాలము = ఖడ్గము = కత్తి ; భీమ = భయంకరమైన ; ఏనిక = ఏనుగు; ఉపాయనము = కానుక ; ఖురము = గిట్ట ; గరిసెలు = గాదెలు ; కుంజరము = ఏనుగు; దండు = సైన్యము ; హల్య = నాగలి.

**సారాంశం :**

ఓగబ్బిలమా ! నీవు హంపీ క్షేత్రాన్ని చూడాలి. ఒకనాడిది తెలుగు రాజ్యదివ్య సంపదలకు క్రీడారంగం. సర్వవైభవాలతో తులతూగేది. ఆదివ్య సంపదలనే మెరపు తీగలు ఆరిపోయిన ఆ ప్రదేశంలో నీబంధువులైన గబ్బిలాలు గూళ్ళు కట్టుకొని నివాసం వుంటారు. నీకు సంతోషాన్నిస్తారు. ఓగబ్బిలమా ! ఆ నాడు లక్ష్మిని దాపరికం లేకుండా శ్రేష్ఠమైన మాణిక్యాలు కుప్పలుగా పోసి హంపీనగర వీథులలో అమ్మారు. కృష్ణదేవరాయలు దేవేంద్ర వైభవముతో ఆంధ్రదేశాన్ని పరిపాలించిన నాటి వైభవాన్ని గుర్తు చేసుకుంటే ఒళ్ళు జలదరిస్తుంది.

శత్రువులు అసూయతో దేహాన్నంతా కత్తులతో ఖండించినా ఉగ్ర నరసింహ విగ్రహం యొక్క భయంకరమైన కంటికొసలలో పొగలు చల్లార లేదు. చూస్తుంటే భయాన్నిగొలిపే ఆ ఉగ్రనరసింహస్వామి ఎదుట ఒక్క నిమిషం నీవు నిలబడగలవా? అలా నిలబడితే నిన్ను ధైర్యం కలదానినిగా లెక్కిస్తారుసుమా !

హంపీలో ఒక పెద్ద గణేశుని విగ్రహంవుంది. దాన్ని శిల్పులు నున్నగా చెక్కారు. ఎంత నున్నగా అంటే ఆ విగ్రహం బొజ్జ మీద తుమ్మెద వ్రాలినా దాని కాలు జారి పోతుంది సుమా ! అంతటి అద్భుత శిల్పసంపదను మన తెలుగువారు తుంగభద్రా నదిలో కలిపివేశారని, అనగా పట్టించు కోవడం లేదని కవి ఆ వేదన.

శ్రీకృష్ణదేవరాయలు పార్సీదేశ గుఱ్ఱాలపై స్వారి చేసి, శత్రువులను జయించి జయకేతనాలను ఎగుర వేశాడనీ, ఆంధ్రదేశపు కీర్తులు నిండుగా ఉన్నాయనీ కవి భావన. గుఱ్ఱపు డెక్కల చివరలు అనేనాగళ్ళచే దున్నిన భూములలో ఆంధ్రసుందరులు జయాంకురములను నాటారని, ఆ నాట్లు ఫలించి, కీర్తిప్రతిష్ఠలు అనే పంటలనివ్వగా వాటిని గాదెలలో నింపుకున్నారనీ కవి తెలిపాడు.

పూర్వం కృష్ణరాయలు హంపీ వీథులలో ఊరేగింపుగా వెళ్ళేవాడు. ఇప్పుడు ఆ వైభవాలు లేవు. ఆరోజులలో పార్సీ దేశంనుండి గుఱ్ఱాల వర్తకులు వచ్చి, పట్టు డేరాలు వేసి వర్తక కేంద్రాలు సాగించేవారు. ఇప్పడు అవి లేవు. ఆనాడు శత్రువుల కోట తలుపులు బ్రద్దలు కొట్టడానికి ఏనుగుల తొండాలతో ఇనుప రోకళ్ళను ఎత్తించి సాధన చేయించేవారు. తెల్లదొరలు మరఫిరంగులతో లొంగిపోగా వారితో తెలుగు సేనా శిబిరాలు నిండిపోయేవి. ఇప్పడు ఇవన్నీ లేవు.

కృష్ణరాయలు మరణించడంతో ఆంధ్ర సామ్రాజ్య రథం 16వ శతాబ్దంలో నేలలో క్రుంగి పోయిందనీ, అప్పడే సూర్యాస్తమయ మయిందనీ, ఇప్పటికీ తెల్లవారలేదనీ అనగా కృష్ణరాయల సామ్రాజ్యము వంటి సామ్రాజ్యము తిరిగి రాలేదని భావము.

**లఘు ప్రశ్నలు :**

1. ‘గబ్బిలము’ కావ్యాన్ని ఎవరు వ్రాశారు ?
2. జాషువ ఎప్పుడు జన్మించారు ?

3. జాషువగారి రెండు బిరుదులు వ్రాయండి.

4. శ్రీకృష్ణదేవరాయల ముఖ్య పట్టణమేది ?

5. హంపీ సమీపమున నున్న నదిఏది ?

**ప్రశ్నలు :**

1. హంపీ క్షేత్రాన్ని గూర్చి వివరించండి.

2. ఉగ్ర నరసింహుని గూర్చి కవి ఏమి చెప్పాడు ?

3. గణపతి శిల్పాన్ని గూర్చి కవి చెప్పిన దేమి ?

4. శ్రీకృష్ణరాయల వైభవ మెట్టిది ?

**సందర్భాలు :**

1. నీకుంగూర్తు రానందమున్.

2. నాటి పెంపును దలంపన్ మేను కంపించెడున్.

3. నిన్ను ధైర్యవతిగా గణియింతురు.

4. తెల్లవారినది లేదు.

**సంధులు :**

1. కొంపల్ + కట్టి = కొంపల్గట్టి (గసడదవాదేశ సంధి)

2. ఉడి + పోవు = ఉడివోవు (గసడదవాదేశ సంధి)

3. స్వారి + ఒనర్చిన = స్వారియొనర్చిన (యడాగమ సంధి)

4. మణిమయంబు + ఐన = మణిమయంబైన (ఉకార సంధి)

**అలంకారము :**

1. 'పగతురసూయచేత...' అను పద్యములో నాలుగు పాదముల చివరలలో – నన్, లన్, నన్, లున్ – అని నకారాంతముగా వచ్చినందున అంత్యాను ప్రాస.

**విశేషాంశములు :**

1. **మూరురాయర గండడు :** శ్రీకృష్ణదేవరాయల బిరుదు. రాయలవారు అశ్వపతి, గజపతి, నరపతి – అనే ముగ్గురు రాజులను జయించాడు కావున ఈ బిరుదం వచ్చినదట.

**కార్యాచరణ :**

మీ ఉపాధ్యాయులను తోడు తీసుకొని 'హంపీయాత్ర' వెళ్ళి, విశేషములను వ్రాసికొని రాగలరు.

★ ★ ★ ★ ★

# 7. వ్యాసమహర్షి

– డాక్టర్ సి.వి. సుబ్బన్న శతావధాని

## (శ్రీ వ్యాస విలాస ప్రబంధము – ద్వితీయాశ్వాసము)

['అవధానం' తెలుగు భాషకు మణికిరీటం. ఈ విద్యలో ఆరితేరినవారు డాక్టర్ సి.వి. సుబ్బన్న శతావధానిగారు. వీరు కడప జిల్లా, ప్రొద్దుటూరున 1929లో జన్మించారు. భోజకువింద చరిత్రము, అవధాన విద్య, శతావధాన ప్రబంధము – త్రిపుటి ; కబీరుదాస, రామదాస ప్రబంధములు, శ్రీవ్యాస విలాస ప్రబంధము మొ వి. వీరి రచనలు. 'అవధాని పితామహ' బిరుదాంకితులు. మనకు భారత, భాగవతాలను, అష్టాదశ పురాణాలు మున్నగువాటిని అందించిన వ్యాసమహర్షి, జన్మించడం – తల్లిదండ్రుల ఆజ్ఞతో తపస్సుకై వెళ్ళడం ఇందలి కథాభాగం.]

ఆ. కొడుకు మొగము జూచి కొండంత సంతోష
మొందె శక్తితనయు డుల్లమందు
దనయు మొగముజూచు టనిన దా దనమూర్తి
నద్దమందు జూచినట్ల కాదె ! 1

తే. కందు నానందనిష్పందు గని యమంద
విస్మయస్తబ్ధయగు నరవిందనయన
యాననము జూచి, 'వాసవీ' యని పిలిచి, క
రాబ్జమునదట్టె యిట్లనె నమృతఫణితి. 2

✺ఉ. ప్రాంశుడు నీలనీరదసవర్ణశరీరుడు వైదికుండు వి
ష్ణ్వంశభవుండు కృష్ణహరిణాజినవస్త్రుడు వీడు భారతీ

వంశవివర్ధనుండగు దపశ్చరణప్రవణుండగున్ దుషా
రాంశుముఖీ ! త్వదీయహృదయప్రియకారిచరిత్రు డయ్యెడున్. 3

కం. కృష్ణుడు ద్వీపభవుడగుట
కృష్ణద్వైపాయను డన గీర్తితుడగు రో
చిష్ణుడు వీనిన్ సాక్షా
ద్విష్ణుండని గారవింత్రు ద్విజముఖ్యజనుల్. 4

ఆ. ఇట్లు మత్స్యగంధి నీక్షించి యప్పరా
శరుడు పలుకుచుండ బరమభక్తి
నంఘ్రిసారసమ్ము లంటి పారాశర్యు
'డయ్య ! దీవెన లిడి యనుపు' మనియె. 5

చం. అనిన బరాశరర్షి శిరమంటి చిరాయురభీప్సితార్థముల్
తనరుతమంచు నాశిషములన్ రచియించుచు బోయి రమ్మనెన్
దనయుదెసన్ సబాష్పనయనమ్ముల జాచుచు నీరసించి ని
ల్చిన జనయిత్రిజాచి, ముకుళీకృతహస్తుడు కృష్ణుడిట్లనెన్. 6

శా. అమ్మా ! నీవును నాకనుజ్ఞ యొసగన్ బ్రార్థించుచున్నాడ, లే
శమ్మున్ నన్ను గుఱించి చింత వల దేసందర్భమందైన నన్
రమ్మన్నన్ జనుదెంచెదన్ క్షణమునన్ సంకల్పమాత్రమ్మునన్
నెమ్మిన్ నాదలయూపె నజ్జనని నిర్నిద్రానురాగమ్మునన్. 7

కం. మాతరపితర చరణ జల
జాతముల కెఱగి యదృచ్ఛజనియెన్ వినయా
న్వీతుడు పారాశర్యుడు
వాతూలవిలోల నీలవారిదలీలన్. 8

కం. బాలఋషి ద్వీపసంభవు
డీలలి హంసపథమందు నేగిన నట్లే
యాలోకించుచు నుండిరి
క్షాళిత సకలాంహసులగు జననీజనకుల్. 9

ఉ. అక్షయపుణ్యుడొక్కక్షణ మాగతినుండి పరాశరుండు మం
దాక్షనతాస్య సత్యవతి నంకగతన్ గని బుజ్జగించుచున్
మాక్షికరీతి బల్కె నభిమానపురస్కృతకోమలోక్తి బ
ద్మాక్షి ! మదీప్సితార్థఫల మబ్బె నికన్ బయనింతు నెమ్మదిన్. 10

మ. అనినన్ దత్పదముల్ స్పృశించి యపు డయ్యబ్జాక్షి యీభాష లీ
పునుగుంగస్తురి యాసుచేలకము లీభోగార్హనైపథ్యమున్
గొని తూగాడుచు నింటికిం జనగ నౌనో ? యప్సరోలీల, నా
మనికిన్, మంటికి–మింటికిన్ జెడిన సంబంధమ్ముగాజేతురే? 11

చం. అనిన దపస్వి యిట్లనియె, నంగన ! యిప్డుపసంహరింతు నే
నొనరిచినట్టి కల్పనము లోలి విచారము దక్కుమింత నీ
మునుపటి బింకమున్ జిగియు బొంకము వీసరవోదు లేశమున్
గనకము తాచినన్ గొలిమిగాచిన దగ్గనె వన్నె వాసియున్ ?

12

ఆ. చెక్కు చెదరకుండు జెలి ! నీదు మైనిగ్గ
కడుపు కాన్పు వలన ముడుత వడదు
నబ్జగంధి ! నీ వనాఘ్రాతపుష్పమ్ము
లీల నలరి పరిమళింతు వెపుడు. 13

మ. వనితా ! నీకు ననుగ్రహింతు నొక దివ్యంబైన సౌరభ్య మిం
దనుకన్ సుందరు లెవ్వరుంగనరు, తత్సౌరభ్య మేపారు యో
జనపర్యంతము తావకీనతనుసంజాతమ్ము, నీయాఖ్యయున్
దనరున్, యోజనగంధి, యన్ ప్రథ, జగత్సంశ్లోకితవ్యస్థితిన్.
14

కం. ఒక మధురస్వప్నము చే
పకడన్ గంటినని యెంచి, పడతి ! మఱచి పో
మ్మిక నేను పోయివచ్చెద
సకలశుభవిభవము నీకుజర్పిత మగుతన్. 15

ఉ. బర్హిరుదారతేజుడిటు పల్కుచు బైదలి నియ్యకొల్పి యం
తర్హితుండయ్యె శక్తిమునితల్లజ పుత్రుడు, మత్స్యగంధియున్

బర్హకలాపకుంతల నిబద్ధసమిద్ధమృదుప్రసూన స్తు
త్యర్హమరాళయాన ప్రమదాతిశయస్థితి నింటికిం జనెన్. 16

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

కందు = బిడ్డ ; ఆననము = ముఖము ; వాసవి = వసురాజు కుమార్తె. తుషారాంశుడు = చంద్రుడు ; సారసము = పద్మము ; కృష్ణుడు = నల్లనివాడు (వ్యాసుడు) ; మంటికి మింటికి = భూమి–ఆకాశములకు ; కనకము = బంగారు; అనాఘ్రాతపుష్పమ్ము = వాసనచూడబడని పూవు ; ఆఖ్య = పేరు ; సౌరభ్యము = సువాసన ; ప్రథ = పేరు ; యోజనము = 32 వేల అడుగుల దూరము ; పైదలి = స్త్రీ ; మునితల్లజుడు = మునిశ్రేష్ఠుడు ; బర్హకలాపము = నెమలి పింఛము. పారాశర్యుడు = పరాశరుని కుమారుడు (వ్యాసుడు) హంసపథము = ఆకాశం; ఎఱిగి = నమస్కరించి.

**సారాంశం :**

వసిష్ఠమహర్షి కుమారుడు శక్తి ; ఆయన కుమారుడు పరాశరుడు. ఒకసారి ~~ఈ~~యన యమునానదిలో పడవలో ప్రయాణం చేస్తుంటే, పడవనడిపే మత్స్యగంధి (సత్యవతి) అనే ఆమెనుచూచి మోహిస్తాడు. వీరి కలయికవల్ల వ్యాసమహర్షి జన్మిస్తాడు.

పరాశరుడు కొడుకు ముఖంచూచి కొండంతగా సంతోషిస్తాడు. తల్లి కూడా ఆపిల్లవాని ముఖం చూచి ఆనందిస్తుంది. పరాశరుడు ఆమె భుజంతట్టి ~~ఈ~~పిల్లవాడు చాలా పొడగరి, నీలమేఘంతో సమానమైన శరీరం కలవాడు ; వేదాలే ప్రాణంగా జీవిస్తాడు. ఇతడు విష్ణువు యొక్క అంశలోనివాడు. నల్లజింకతోలు వస్త్రంగా కలవాడు, తన తపశ్శక్తితో భరతవంశానికి, గొప్పసాహిత్యానికి సృష్టికర్త అవుతాడు. ఓ చంద్రముఖీ ! నీ మనస్సుకు సంతోషాన్ని కలిగించే పనులన్నీ

చేస్తాడు. ఇతడు ద్వీపంలో జన్మించాడు కాబట్టి కృష్ణ ద్వైపాయను డనబడుతాడు. అందరూ ఇతణ్ణి విష్ణుస్వరూపునిగా భావిస్తారు. ఈ విధంగా పరాశరుడు పలుకుతుంటే వ్యాసుడు తనను దీవింపుమని పాదాలకు నమస్కరిస్తాడు. ఆపై తల్లిదగ్గరకు వెళ్ళి నమస్కరించాడు. ఆమె ఏడుస్తుంటే – అమ్మా ! నాగురించి బాధ పడకు, నీవు తలచుకున్నపుడు నీ ఎదురు వచ్చి నిలుస్తాను – అంటూ ఆకాశమార్గంలో వెళ్ళి పోయాడు. 'నాకోరిక సిద్ధించింది ఇక వెళ్ళి వస్తా'నంటూ పరాశరుడు అనగానే ఆయన కాళ్ళకుమ్రొక్కి ఆమె అయ్యా ! ఈ అలంకారాలన్నీ ఉపసంహరించుకో నాకన్యాత్వం చెడకుండా, నాదేహంలో ఏమార్పు లేకుండా చూడు అంటే 'నీవు వాసనచూడబడని పుష్పం' లాగా ప్రకాశిస్తావు. నీ దేహానికి చేపలవాసనపోయి దివ్యమైన సుగంధం యోజన దూరం వ్యాపిస్తుంటుంది. నీపేరు 'యోజనగంధి' గా స్థిరమౌతుంది. దీన్నంతా ఒక కల అనుకో. అని అగ్నితేజంకల పరాశరుడు మాయమయ్యాడు. 'యోజనగంధి' కూడా సంతోషంతో ఇంటికి వెళ్ళుతుంది.

**లఘు ప్రశ్నలు :**

1. 'వ్యాసమహర్షి' పాఠ్యభాగ కవి ఎవరు ?
2. డా. సి.వి. సుబ్బన్న శతావధాని గారి బిరుదమేమి ?
3. వ్యాసమహర్షి తండ్రి ఎవరు ?
4. వ్యాస మహర్షి తల్లి ఎవరు ?
5. 'మత్స్యగంధి' కి గల మరి రెండుపేర్లేమి ?

**ప్రశ్నలు :**

1. వ్యాసునిగూర్చి పరాశరుడు సత్యవతిలో ఏమన్నాడు ?
2. తనతల్లితో వ్యాసమహర్షి ఏమన్నాడు ?
3. 'మత్స్యగంధి'ని పరాశరుడు 'యోజనగంధి' గా ఎట్లు మార్చాడు ?

**సందర్భాలు :**

1. అద్దమందుజూచి నట్లకాదె !
2. త్వదీయ హృదయ ప్రియకారి చరిత్రుడయ్యెడున్.
3. రమ్మన్నన్ చనుదెంచెదన్ క్షణమునన్.
4. నీ వనాఘ్రాత పుష్పమ్ము లీలనమరి పరిమళింతువు.

**సంధులు :**

1. విచారము + తక్కువము = విచారము దక్కువము (గసడదవాదేశ సంధి)
2. ఆ + పరాశరుడు = అప్పరాశరుడు (త్రికసంధి)
3. దీవెనలు + ఇడి = దీవెనలిడి (ఉకార సంధి)
4. ఆ + అబ్జాక్షి = అయ్యబ్జాక్షి. (యడాగమ త్రికసంధి)

**అలంకారాలు :**

1. 3వ పద్యంలో ప్రాంశుడు – శరీరుడు – వైదికుండు – భవుండు – ఇలాగా 'డు' అనే అక్షరం మరల మరల వచ్చింది కావున ఇది వృత్త్యను ప్రాసాలంకారం.
2. 8వ పద్యంలో 'వాతూల విలోల నీలవారిద లీలన్' ఇక్కడు 'ల' అనే అక్షరం మరల మరల వచ్చినందువల్ల ఇది కూడా వృత్త్యను ప్రాసమే.

**కార్యాచరణ :**

1. వ్యాసమహర్షి రచించిన భారత, భాగవత, పురాణాదులను గ్రంథాలయము నకు వెళ్ళి చూచి రమ్ము.
2. భారతములోని 18 పర్వముల పేర్లు సేకరించుము.

★ ★ ★ ★ ★

# 8. గోదావరి

**– అడవి బాపిరాజు**

## కవి పరిచయం

[పశ్చిమగోదావరిజిల్లా భీమవరంలో 1895లో జన్మించిన అడవిబాపి రాజుగారు ఆధునికాంధ్ర కవులలో సుప్రసిద్ధులు, న్యాయవాది, పత్రికా సంపాదకులు, చేయి తిరిగిన చిత్రకారులు.

అనసూయ, ధ్రువ, మీరాబాయి చలనచిత్రాలకు కళాదర్శకుడిగా పనిచేశారు. నారాయణరావు, హిమబిందు మున్నగు నవలలు రచించారు.

**పాఠ్యపరిచయం :**

మహారాష్ట్రలోని నాసికాత్ర్యంబకంలో జన్మించిన గోదావరినది వివిధ రాష్ట్రాలలో ప్రవహిస్తూ ఆంధ్రదేశం చివర సముద్రంలో కలుస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లావాడైన బాపిరాజు గోదావరిని గూర్చి తన అనుభూతిని కనులకు కట్టినట్లు ఈ గేయంలో చిత్రీకరించారు.]

ఉప్పొంగిపోయింది గోదావరి – తాను

తెప్పున్నయెగిసింది గోదావరి

కొండల్లొ ఉరికింది

కోనల్లు నిండింది

ఆకాశ గంగతో

హస్తాలు కలిపింది

ఉప్పొంగిపోయింది గోదావరి – తాను

తెప్పున్నయెగిసింది గోదావరి

అడవి చెట్లన్నీని

జడలలో తురిమింది

ఊళ్ళు దండలగుచ్చి

మెళ్ళోన తాల్చింది

ఉప్పొంగిపోయింది గోదావరి – తాను

తెప్పున్నయెగిసింది గోదావరి

వడులలో గర్వాన

నడలలో నుడులలో

పరవళ్ళు తొక్కుతూ

ప్రవహించి వచ్చింది.

ఉప్పొంగిపోయింది గోదావరి – తాను

తెప్పున్నయెగిసింది గోదావరి

శంఖాలు పూరించి

కిన్నెర్లు మీటించి

శంకరాభరణ రా

గాలాప కంఠియై

ఉప్పొంగిపోయింది గోదావరి – తాను

తెప్పున్నయెగిసింది గోదావరి

నరమానవుల ఫణులు

శిరమొగ్గి వణికాయి

కరమెత్తి దీవించి

కడలికే నడిచింది.

ఉప్పొంగిపోయింది గోదావరి – తాను

తెప్పున్నయెగిసింది గోదావరి.

**సారాంశం :**

గోదావరి ఒడుదుడుకులతో కూడిన అలలతో, గర్వంతో కూడిన గమనంతో రకరకాలుగా సుళ్ళు తిరుగుతూ, పరవళ్ళుత్రొక్కుతూ ఉప్పొంగి పోతూ ప్రవహిస్తూ వచ్చింది. ఒక్క సారిగా లెక్కలేనన్ని శంఖాలు ఊదితే వచ్చే ధ్వనులతో సమానంగా, లెక్కకు మిక్కిలి వీణలను మీటితే వినిపించే శబ్దాలతో, శంకరాభరణ రాగంలాగా వీనులవిందైన ధ్వనులతో గోదావరి ఉప్పొంగుతూ ప్రవహిస్తోంది. ఇంతలో ఎత్తైన అలలతో ఉన్నట్లుండి పైకి లేస్తున్నదా అన్నట్లుంది. మానవులంతా శిరస్సు వంచిమ్రొక్కుతుంటే అలలనే చేతులతో దీవించి, చక్కని పాడి పంటలందించి, సముద్రంలో కలవడానికి వెడలుతోంది.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

ఉప్పొంగు = పైకిలేచు

కడలి = సముద్రం

తెప్పున్న = వేగంగా

కరము = చేయి

**సొంత వాక్యాలు :**

1. పరవళ్ళు త్రొక్కు

2. శంఖాలు పూరించు

3 కరమెత్తి

**సంధులు :**

కరము + ఎత్తి = కరమెత్తి (ఉకారసంధి).

చెట్లు + అన్నీ = చెట్లన్నీ (ఉకార సంధి).

శిరము + ఒగ్గి = శిరమొగ్గి (ఉకార సంధి).

**లఘు ప్రశ్నలు :**

1. అడవి బాపిరాజు ఎప్పుడు జన్మించాడు ?

2 అడవి బాపిరాజుగారి ఇతర రచనలేవి ?

3. గోదావరి దేనితో హస్తాలు కలిపింది ?

4. గోదావరి వేటిని మెళ్ళో దాల్చింది ?

5. గోదావరి ఎలా ప్రవహించి వచ్చింది ?

**ప్రశ్నలు :**

1. గోదావరి పరవళ్ళను కవి ఏవిధంగా వర్ణించాడు ?

**కార్యాచరణ :**

గోదావరి నదిని దూరదర్శన్‌లో ఎప్పుడైనా గమనించుము.

★ ★ ★ ★ ★

# గద్యభాగము

# 1. బుద్ధిబలం

**– పరవస్తు చిన్నయసూరి**

[ఈ పాఠ్యభాగం పరవస్తు చిన్నయసూరి రచించిన 'నీతిచంద్రిక' లోని మిత్ర భేదంనుండి గ్రహింపబడింది. వీరి బిరుదు 'సూరి'. బాలవ్యాకరణం, అక్షరగుచ్ఛం, విభక్తిబోధిని, ధాతుమాల మున్నగునవి వీరి రచనలు.

ఒక సింహం అడవిలోని జంతువుల్ని భయపెడుతూ చంపడం మొదలు పెట్టింది. అన్ని జంతువులూ కలిసి సింహం దగ్గరకు వెళ్ళి రోజుకు ఒక జంతువు ఆహారంగా వస్తామని విన్నవించుకొన్నాయి. సింహం అందులకు అంగీకరించింది. ఒక రోజు కుందేలువంతు వచ్చింది. కుందేలుసింహం వద్దకు ఆలస్యంగా రాగా కోపగించుకొన్న సింహానికి తనబుద్ధిబలంతో సరైన గుణపాఠం చెప్పాలనుకొంది. దారిలో మరోసింహం అడ్డు వచ్చిందని దాని నుండి తప్పించుకు రావడానికి ఆలస్యమైందని తెల్పింది. కుందేలుమాటలు నమ్మిన సింహం దాన్ని చూపమని కుందేలును వెంబడించింది. ఒకబావి దగ్గరకు తీసుకువెళ్ళి బావిలో చూడమని చెప్పింది. సింహం బావిలో తన ప్రతిరూపాన్ని చూసి మరో సింహంగా భావించి బావిలోదూకి ప్రాణాలు విడుచుట ఇందలి వృత్తాంతం.]

బుద్ధిబలంబు గలవానికిం దక్కు బలంబులేకుండిన గొఱతలేదు. ధీశక్తి విరహితునకుం దక్కుంగల బలిమి ఎంత గలిగిన నత్యల్పంబులయి చను. తొల్లి యొక శశకంబు నేర్పునంజేసి యొక సింగంబుం ద్రుంగించె నక్కథ వక్కాణించెద, నవధానంబు తోడవినుము. ఒక్క యరణ్యంబున సత్త్వసారంబను కంఠీరవంబు కలదు. అయ్యది అయ్యడవింగల జంతుసంతానంబుల బొలియించుచు భక్షించుచుండు. అందుల కచ్చట సత్త్వంబులెల్లం బెల్లు భీతిల్లి యొక్క చక్కటికంజేరి పెక్కుతెఱంగుల బరికించి తమకుం బాటిల్లిన బారికిం ప్రతీకారంబు గానక తుదకుం గర్తవ్యాంశం బొక్కటి విచారించి కలయం బలికికొని బెండగిలి మృగనాథు పాలికిం జని మనంబుల ఘనంబు గదరంబు గదుర నాననంబు దీన భావంబు నివ్వటిల్ల దవ్వుదవ్వుల నిలిచి యభివందనం బొనరించి యో మృగస్వామీ ! మేము మీ కొక్క చిన్న విన్నపంబు గావింపవచ్చి యున్నారము. మామీదం గరుణించి యవధరింపుడు. భవదీయ

ప్రతాపానలంబులకు లోకంబులోని వ్యాళజాలంబెల్ల దృణప్రాయంబునా మాయట్టి ప్రముక్కడుల లెక్కింపనేల. కొంత దయ గలిగి తెగవు గాని యొక్క నిమిషంబులోన మమ్మందర నిర్మూలింప జాలవే. అట్టి కరుణాళుండ వగుటం జేసి మా ప్రార్థనంబు పాలివోవదని తలంచెదము. దేవర సన్నిధికి వంతు మెయిం ప్రతిదినం బొక్కొక్క మృగంబుం దమ యాహారార్థంబు పనుపందలచి యున్నారము. ఇందులకు మేకొని మమ్ము భయంబు వలనం బాచి రక్షింపవలయును. నావుడు సింగంబు అట్ల కానిండని యభయం బొసంగి మృగంబుల వీడు కొలిపె. అంత నా మృగసంతానంబు కొంతవంత దొలంగి ప్రత్యహంబు వరువాత వంతు కొలంది నొక్కొక్క మృగంబు సింగంబు చెంగటికిం బనుచుచుండు.

ఇవ్విధంబునం గొంతకాలంబు గడువ మృగంబు లెల్ల యథా సంకేతంబుగ నొక్క చెవులపోతుం బిలిచి ఎల్లి మృగవల్లభు పాలికిం బోవలయు. వంతు నీ పాలంబడియె నావుడు శశంబు భృశంబు మూర్ఛిల్లి కొంత వడికిం దెలిసి బెదరిన హృదయంబు పదిలంబు గొని ఎంత వానికేని విధి విధానం బప్రతివిధానంబు గాదె యని దలపోయుచు దట్టంబుగ వేడి నిట్టూర్పులు నిగుడ శిరఃకంపంబు గావించి యడరు తొడరిన తరి ఎరుకబలిమి కొలది వెఱవు పరికింపవలయునేకాని వెఱగుపాటు తెఱంగుగాదు. ఎట్లనిన నాబుద్ధి బలంబునం జేసి కేసరిం బ్రతారించి దోరింపం గడంగెద. అటుమీద దైవంబు పంచిన గతి యయ్యెడుం గాక యని యచ్చట తన బలగంబు వలన సెలవు గైకొని నడువం గాళ్ళు లాడక యల్లనల్లం బోవుచు చేయంగల యుపాయంబు రోసి మానసంబున కది సరిపరచికొని దారిం గొంత మసలి యాహారంబు తరి తప్పించి డాయంబోయి సవినయంబుగం బ్రణమిల్లుడు, హర్యక్షంబు సటాజాలంబు నిక్క వెక్కసంబగు రోసంబున భీషణంబై యదరులు బెదరం జూడ్కులు నిగిడించి యహహా, యస్మదీయ క్షతికి ఫలంబు తోడన గలిగె. కుట్టిన తేలంద్రు కుట్టకున్న కుమ్మరిపురువంద్రు గాదె. నాకు దరి తప్పించి యాహారంబు పనుచుట చూడ నా వేడిమిచవి ఇంకొక్క మరి చూడ వేడి కాబోలు. ఈ అడవి మృగంబు లింతలోనన ఇంత మత్తిల్లునే ? నేడ

ఇప్పొలంబునం గల జంతు జాలంబుసెల్లం జమరి సమరించి యెరియు కడుపు చిచ్చున వ్రేల్చెదనని వాలంబు నేల తాడించి లేచుడు, శశంబు దేవా ! తావకులగు సేవకుల వలన లేశంబైన దోసంబులేదు. నేటి టేపు మావారల శాసనంబు శిరంబునంబూని యేను సరభసగతిం జనుదేర, దారి నొక్కహర్యక్షంబు రూక్షంబుగా వీక్షించి యోరి ! శశాధమా ! యెట్టిసత్వంబేని, మాకట్టెదురర దర విరహితంబుగ జరింపం గానము. మాయురే నీ యుద్ధతిం జూడ మాకుం గరంబు వెఱంగయ్యెడు. మమ్ముం జీటికిం గొనక వెఱచి గొని పారు పోతరంబు మీకు రాగతంబేమి. నిలు, నిలు మెటకుం బారెద వని యధిక్షేపించి ప్రతిరోధింప సేనాతనిం గాంచి మా కెల్లరకు వల్లభుండు సత్త్వసారాభిధానుండగు సింహరాజు గలండు, అమ్మహామహుని సన్నిధికి జనుచున్నవాడ నన్ను మసలింపకుము. అతండొక్కింత కోపగించిన లోకం బాకులంబగు. నావుడు నతడు మధ్యందిన విద్యోతమాన ఖద్యోత మండలంబుబోలె మండుచు నహహా ఇంత కాలంబున కిట్టి వింత వినంబడియె.

ఇవ్వనంబునందలి మృగ సందోహంబునకు నేనొక్కరుండ దొరగాని నాకు దొర యొక్కరుండు గలడే యెవ్వండేని యెదిరిం దన్ను గానక యందని పదవికింగంతు గొన నుంకించెనేని వాని మదీయ తేజోనలంబున కింధనంబు గావించెద. నీ విటకుముందు ప్రభువని పేర్కొనిన వానిం గానిపింపుము. ఇప్పుడు కయ్యంబునకుం గడంగెద. నిన్నుం బొలియించెద నని పలికి యట్ల కానిమ్మని నన్నుం బలికించి నీపాలికిం బుత్తెంచె దానం జేసి ఇంత మసల వల సె. నా విని మృగనాథుం డప్రతిరోధ క్రోధుడై ఈక్షణంబ యా దుష్ట మృగంబుం గానిపింపుము. దండధరుని వీటికి మసలక పుత్తెంచెద, నాకు మార్గాభిజ్ఞానార్థంబు మును చనుము. నావుడు శశకంబు వినయ సంభ్రమములు పెనంగొన వల్లె యని కడు వడింజని యొక్క బావింగానిపించి యో మృగకుల సార్వభౌమా ! నీ మార్తుండు ఈ వాపిక యందున్నవాడు. తొంగి చూడుమన సింగంబు తొంగి చూచి యుదకంబునందలి తన ప్రతిబింబంబు మారుసింగంబని భావించి

కోపాటోపంబు మీర వలంకులు మారు చెలంగ గర్జిల్లి గుభిల్లున దుమికి కాలధర్మంబు నొందె.

కావున నెంత బలవంతుసైన బుద్ధిబలంబుచే గెలువవచ్చును.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

కంఠీరవము = సింహము ; ప్రతీకారము = బదులుక్రియ ; ఆననము = ముఖము ; ఎడరు = ఆపద ; వరువాత = ఉదయము ; హర్యక్షము = సింహము; క్షాంతి = సహనము (ఓర్పు) ; ఇంధనము = కట్టె ; వాపిక = బావి ; సత్త్వము = జంతువు; వ్యాళజాలము = జంతుసమూహము ; ప్రుక్కడులు = నీచులు (అల్పులు) ; ప్రతారించుట = మోసగించుట ; శశము = కుందేలు ; చెవులపోతు = కుందేలు; మార్తుడు = శత్రువు ; వలంకులు = దిక్కులు.

**లఘు ప్రశ్నలు :**

1. 'బుద్ధిబలం' పాఠ్యభాగ రచయిత ఎవరు ?
2. చిన్నయసూరి ఇతర రచనలేవి ?
3. 'శశము' అనగానేమి ?
4. 'కంఠీరవ' మనగానేమి ?
5. అడవికి రాజు ఎవరు ?
6. సింహం బావిలో ఏమి చూచెను ?
7. ఎంత బలవంతుసైనను ఏవిధంగా గెలువవచ్చును ?

**వివరణ ప్రశ్నలు :**

1. మృగములన్నియు కలిసి సింహంతో పలికిన పలుకు లేవి ?
2. కుందేలు తన ప్రాణమును కాపాడు కొనుటకై పన్నిన ఉపాయమేమి ?
3. శశకంబు సింహాన్ని ఏ విధంగా చంపించినది ?
4. 'ఎంతవాడైనను బుద్ధిబలముచే గెలువవచ్చు' అను నీతిని తెల్పుకథను వివరించుము ?

**సందర్భాలు :**

1. "వంతు నీ పాలంబడియె".
2. ఎంతవానికేని విధి విధానంబు అప్రతిహతంబుగాదె.
3. కుట్టిన తేలంద్రు కుట్టకున్న కుమ్మరి పురువంద్రుగాదె.

**కార్యాచరణ :**

చిన్నయసూరి రచించిన నీతి కథలను సేకరించండి.

★ ★ ★ ★ ★

# 2. విదుర నీతులు

**– 'ఉపశ్రీ'**

(ఉపశ్రీ భారతం – ఆదిపర్వం – పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు)

[భారతాన్ని అవలీలగా రచించినవారిలో 'ఉపశ్రీ'గారు ప్రథమగణ్యులు. కథ చెప్పడంలో వారి బాణీయే వేరు. ఆకాశవాణిలో ధారావాహికంగా ప్రసారమైనదే ఈ భారతం. విజ్ఞాన దాయకమైన భారతకథ అమృతంవలె ఆనందదాయకం. పుత్ర వ్యామోహుడైన ధృతరాష్ట్రునికి విదురుడు చెప్పేనీతులే ఈపాఠం.]

ధృతరాష్ట్రుడు విదురుణ్ణి చూచి మనశ్శాంతి కలిగించే మాటలు చెప్పమన్నాడు. విదురుడిలా చెప్పసాగాడు.

ఎల్ల వేళలా ఏదో కృషి చేస్తూ సాత్విక భావంతో, సహనశీలంతో, నిశ్చల ధర్మదీక్షతోఉండేవారు ఏనాటికైనా సత్ఫలం పొందుతారు. వీరినే విద్వాంసులుగా లోకం గౌరవిస్తుంది. పొగడ్తలకులొంగక, కోపంచెందక, వినయమే అలంకారంగా గర్వం లేకుండా, ప్రశంసలకు పొంగకుండా ఉండేవాడే విద్వాంసుడు. మఱియు అప్రస్తుత విషయాలలో తలదూర్చరాదు. దొరకని వస్తువులకోసం బాధపడకూడదు. పోయినవాటికోసం విచారింప కూడదు. కష్టాలలో ధైర్యంగా ఉండాలి. ఆరంభించిన పనిని చివరివరకూ సాగించాలి. వీరు కృతజ్ఞత కలిగి ఉంటారు. గంగానదివలె నిర్మలంగా ఉంటారు. అపాయంలేని ఉపాయాలు వీరికి తెలుస్తాయి. వీరిమాటలు పొల్లువోవు. ఏ విషయాన్నైనా న్యాయంగా ఆలోచిస్తారు. శిష్టాచారాలను మర్యాదతో నడిపిస్తారు. ఇవి విద్వాంసుల లక్షణాలైతే.

ఇక మూర్ఖులున్నారే వీరి మొదటి లక్షణం అహంకారం. విద్యా వివేక శూన్యులై కావలసినంత గర్వంతో విఱ్ఱవీగుతుంటారు. ఏ పనీ చెయ్యరు కానీ, ఫలం మాత్రం కావాలనుకుంటారు. పరమ దరిద్రంలో ఉన్నప్పటికీ ఆకాశానికి నిచ్చెనలు వేస్తారు. స్నేహితులపట్ల అన్యాయంగా మెలగుతారు. బలవంతులతో వైరం

తెచ్చుకుంటారు. శత్రువులను స్నేహితులుగా భావిస్తారు. మనం పిలువకుండానే కార్యక్రమాలకు వస్తారు. అడుగకుండానే సలహాలు కురిపిస్తారు. ఎల్లప్పుడూ ఎదుటివారిలో దోషాలే వెదుకుతారు. కృతఘ్నుల పట్ల విశ్వాసం చూపుతారు. అకారణంగా కోపంచూపుతారు. శూన్యప్రదేశాన్ని (నిరాకారాన్ని) ఆరాధిస్తారు. దరిద్రులనూ, దీనులనూ ఆశ్రయిస్తారు. తమను ఆశ్రయించుకున్నవారి పోషణభారం వహించకుండా తమకడుపు నింపుకుంటారు. క్షమించేవాళ్ళను అసమర్థులనుకుంటారు. ఓర్పును మించిన శాంతిసాధనం లేదు.

ఒకరి అధీనంలో ఉన్న స్త్రీని వాంఛించేవాడూ, పరుల ఆశ్రయంలో బ్రతికేవారిని చేరదీసేవాడూ అధములే. శత్రువులను లక్ష్యపెట్టని చక్రవర్తీ, దేశాలు తిరగని విద్వాంసుడూ - ఈ ఇరువురూ వ్యర్థజీవులే. మనం సంపాదించే ధనాన్ని సత్పాత్రులకు దానం చెయ్యాలి. అపాత్రదానం వ్యర్థమౌతుంది. పరధనాపహరణం, పరనారీ సాంగత్యం, స్నేహితులను విడిచి పెట్టడం - అనే దోషాలు మన ఆయుస్సును, కీర్తిని నశింప జేస్తాయి. కామ, క్రోధ, లోభాలు నరకానికి తెరచిన ద్వారాలు. శరణన్న వారిని రక్షించడం మనవిధి. కుటుంబంలో వృద్ధులనూ బ్రతికి చెడినవారినీ, సంతానం లేని అక్కచెల్లెళ్ళనూ మనం ఆదరించి పోషించాలి.

తల్లి, తండ్రి, గురువు, ఆత్మ, అగ్ని - ఈ అయిదింటినీ పంచాగ్నులుగా సేవించుకోవాలి.

సిరిసంపదలు కోరేవారు నిద్రా భయక్రోధ అలసత్వాదులను విడిచి వెయ్యాలి. ప్రజా రక్షణ చెయ్యలేని ప్రభువు, నిరంతరం పరుషంగా మాట్లాడే భార్య, శిష్యులకు విద్య నేర్ప లేని గురువు, గ్రామమధ్యంలోనే ఉండాలనుకునే గోపాలకుడు వీరంతా ఎందుకూ కొరగానివారు.

ఆరోగ్యం, సంపదలు, అనుకూలవతి అయినభార్య, చెప్పిన మాట వినేకొడుకు, జీవితానికి పనికి వచ్చేవిద్య, చక్కని సలహాలిచ్చే స్నేహితుడు - ఉన్నవారికంటె సుఖంగా బ్రతుకగలవాడులేడు. సంరక్షణలేని గోవూ, వ్యవసాయమూ, విద్యా, స్త్రీలూ-పాడవుతారు.

విద్య నేర్చుకున్నాక శిష్యుడు గురువునీ, వివాహం అయ్యాక కుమారుడు తల్లినీ, నదిని దాటిన తరువాత నావను, పనిపూర్తికాగానే తోడుపడిన వారినీ, రోగం తగ్గిన అనంతరం వైద్యుణ్ణీ, సామాన్యులు మరచి పోతుంటారు.

స్నేహితులతోకలవడం, ధనాన్ని సంపాదించడం, పుత్రుణ్ణి కౌగిలించుకోవడం, సాటివారిలో కీర్తిపొందడం, ప్రియంగామాట్లాడగలగడం, మహా సభలలో సన్మానం, ఆశించినవి నెరవేరడం – ఇవి ఎవరికయినా సంతోషాన్నిస్తాయి.

ఈర్ష్య, ద్వేషం, అసంతృప్తి, క్రోధం, నిత్యమూ అనుమానించడం, పరభాగ్యోప జీవనం – ఇంతకంటే దుఃఖదాయకాలు లేవు. ఇంద్రియ నిగ్రహం, శాస్త్రజ్ఞానం, దీశక్తి, మితభాషిత్వం, దానగుణం, కృతజ్ఞత – వీటివల్ల కీర్తివస్తుంది.

ఎప్పుడూ ఏదోఒకపని చేస్తూ ఉండాలి. మితంగా భోజనం చెయ్యాలి – ఎక్కువగా నిద్రపోరాదు.

పువ్వు పాడవకుండా తేనె త్రాగుతుంది తుమ్మెద. పూలు కట్టేవాడు చెట్టుకు హాని కలుగకుండా పూలుకోస్తాడు. అలాగే రాజైనవాడు ప్రజలకు కష్టం కలుగకుండా పన్నులు వసూలుచెయ్యాలి. సజ్జనులు నడచినదారిలో, సంప్రదాయం విడువకుండా నడిచే ప్రభువు ఏలుబడిలో దేశం వృద్ధిపొందుతుంది. వ్యక్తికిశీలం ప్రధానం. అదిలేనివాని జీవితం వ్యర్థం.

గొడ్డలిపెట్టు తిన్నచెట్టు మళ్ళీ చిగురించవచ్చు. కానీ, కటువచనంతో బాధపడ్డ హృదయం కోలుకోదు. విధి ఎదురుతిరిగితే పాపాలు చేస్తారు. అవే వారి నాశనానికి బాటలు.

మహారాజా! నీబిడ్డలు పాండవులను ద్వేషిస్తున్నారు. ధర్మవిదుడు, గుణసంపన్నుడైన ధర్మరాజు మీవారు చేసిన అన్యాయాలను సహిస్తూ, ఇప్పటికీమిమ్ము గురుభావంతో చూస్తున్నాడు.

వెయ్యిపుణ్య తీర్థాలలో స్నానమాడిన ఫలం భూతదయవల్ల కలుగుతుంది.

అందరిలోనూ సాధువుగా మెలగడం చాలమంచిది. మీరు మీబిడ్డలను చూస్తున్నట్లే పాండవులనూ చూడండి.

దుఃఖించడంవల్ల దేనినీ సాధించలేము. దుఃఖము మనలోని శక్తినీ, రూపాన్ని, జ్ఞానాన్నీ నాశనంచేసి రోగాన్ని తెచ్చిపెడుతుంది. జననమరణాలు, సుఖదుఃఖాలు, లాభనష్టాలు కలుగుతూ పోతుంటాయి. దానిని గురించి చింతించడం అనవసరం. మితంగా ఆహారం, నిత్యం పరిశుభ్రస్నానం దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. అందువల్ల శరీరానికి జవసత్త్వాలు వస్తాయి. ఫలితంగా వీరి సంతానంకూడా చక్కగాఉంటుంది. మట్టి నీ, బంగారాన్నీ సమదృష్టితో చూడాలి. అధిక ప్రసంగాలు చేయకూడదు. ధనానికంటే గుణానికే ప్రథమగౌరవం.

తల్లిదండ్రులనూ, శిష్యులనూ, సేవకులనూ, తనఇంటినీ జాగ్రత్తగా రక్షించుకోవాలి. విద్యలేని పురుషుడు, తిండిలేని ప్రజలు, రాజులేని రాజ్యం – అనర్థాలే.

ఆత్మస్తుతి, సేవారాహిత్యం, సోమరితనం, మదం, మోహం, చపలత్వం, దొంగతనం, స్వార్థం , అనవసర ప్రసంగం – ఇవి విద్యార్థికి పనికిరావు. జీవితం అశాశ్వతం ; ధర్మమొక్కటే శాశ్వతం. అందు చేత నిత్యమయిన ధర్మం మీదనే మనస్సును లగ్నం చెయ్యాలి. అదే ఆనందదాయకం. మరణానంతరం ధర్మమొకటే మనకు తోడుగా నిలుస్తుంది. మంచి, చెడులు మాత్రమే మనల్ని అనుసరిస్తాయి.

అందు చేత ఓరాజా ! మీరు ధర్మ పరులయిన పాండవులను చేరదీసి సుఖంగా ఉండండి. అంటూ విదురుడు ధృతరాష్ట్రునికి నీతులు బోధిస్తాడు.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

సహనము = ఓర్పు ; ప్రశంస = పొగడ్త ; కృతజ్ఞత = చేసిన మేలు మరచి పోకుండా ఉండడం ; పరభాగ్య + ఉపజీవనం = పరభాగ్యోపజీవనం, ఇతరుల సంపదతో జీవించడం ; ధీశక్తి = బుద్ధిబలం ; భూతదయ = ప్రాణుల పట్లజాలి.

**లఘు ప్రశ్నలు :**

1. 'ఉషశ్రీ' గారి పూర్తి పేరేమి ?
2. 'విదుర నీతులు' ఎందుండి గ్రహింప బడింది ?
3. విదురుడు ఎవరికి నీతులు చెబుతున్నాడు ?
4. విద్వాంసులను లోకం ఏమి చేస్తుంది ?
5. మూర్ఖుల మొదటి లక్షణమేది ?
6. 'కృతఘ్నులు' – అనగా ఎవరు ?
7. అపాత్రదానం ఏమౌతుంది ?
8. పంచాగ్నులు అనగా ఏ వేవి ?
9. జ్ఞానులు మట్టినీ, బంగారాన్ని ఏదృష్టితో చూస్తారు ?
10. మరణానంతరం మనకు ఏది తోడుగా నిలుస్తుంది ?

**ప్రశ్నలు :**

1. విద్వాంసుల లక్షణాలేవి ?
2. మూర్ఖుల స్వభావం ఎలాంటిది ?
3. 'విదురనీతులు' లో నీకు బాగా నచ్చినవాటిని ఎనిమిదింటిని వ్రాయుము.

**సందర్భాలు :**

1. దొరకని వస్తువుల కోసం బాధపడకూడదు.
2. పరమ దరిద్రంలో ఉన్నప్పటికీ ఆకాశానికి నిచ్చెనలు వేస్తారు.
3. ఈ ఇరువురూ వ్యర్థ జీవులే.
4. ఎప్పుడూ ఏదో ఒకపని చేస్తూ ఉండాలి.
5. వ్యక్తికి శీలం ప్రధానం.
6. ధనానికంటే గుణానికే ప్రథమగౌరవం.

**సొంతవాక్యాలు :**

1. **ఆకాశానికి నిచ్చెనలు వెయ్యడం** – (శక్తినిమించికోరడం) మాస్నేహితుడు సరిగా చదువకుండానే డాక్టరు కావాలని **ఆకాశానికినిచ్చెనలు వేస్తుంటాడు.**
2. **పొల్లుపోకుండా** – (వ్యర్థము కాకుండా) నేను కంఠస్థపద్యాలను ఒక్క అక్షరమైనా **పొల్లుపోకుండా** మాస్టారుకు ఒప్పజెప్పాను.

**విశేషాంశాలు :**

**పంచాగ్నులు** – (1) తల్లి (2) తండ్రి (3) గురువు

(4) ఆత్మ (5) అగ్ని.

**ఇంద్రియములు – (అ) జ్ఞానేంద్రియములు**

(1) చర్మము (2) కన్ను (3) చెవి

(4) నాలుక (5) ముక్కు

**(ఆ) కర్మేంద్రియములు –**

(1) వాక్కు (2) చేయి (3) పాదము

(4) గుదము (5) జననేంద్రియము.

**కార్యాచరణ :**

ఈ పాఠములోని నీతులను నీజీవితమున ఎట్లు అనుసరింతువో తెలుపుము.

★ ★ ★ ★ ★

# 3. బసవేశ్వరుడు

[సాంఘిక పరిస్థితులను చక్కదిద్ది మానవుని సక్రమ పద్ధతిలో నడిపించినవాడు బసవేశ్వరుడు అతని రచనలు కన్నడ సారస్వతంలో ప్రసిద్ధి కెక్కినవి. మానవుడు మానవుడుగా ఉండుటకు ఇతని 'వచనాలు' తోడ్పడును. ఈ పాఠం ప్రజానీకాన్ని మేల్కొలిపి భక్తిని, కార్యదీక్షను, త్యాగాన్ని, సచ్చరిత్రను బోధిస్తుంది.]

శ్రీశైలమునకు పడమట కన్నడరాజ్య కర్నాటక పుణ్యభూమియే గాక కడు సుందరమైన రాష్ట్రము. ఇచ్చటనెందరో మతప్రవక్తలు, కళారాధకులు, శాస్త్రజ్ఞులు వెలసిరి. నేటికిని మతత్రయ పీఠము లిందు గలవు. ఇచ్చట జైన పుణ్యక్షేత్రము పలువురచే నాకర్షింపబడుచున్నది. మనకన్నడరాష్ట్రము శిల్పములతో, జీవనదులతో, పుణ్యక్షేత్రములతో సర్వజనాకర్షకమై యున్నది. ఇచ్చట వీరశైవ మతివ్యాప్తియందున్నది. ఈ మతప్రవక్త బసవేశ్వరుడు. బసవేశ్వరుడు బిజ్జలుని కాలమున బిజాపురము జిల్లాలోని 'బాగెవాడి' యను అగ్రహారమున పుణ్యదంపతులగు మాదాంబా, మాదరసులకు జన్మించెను. ఇతడు చిన్నప్పటినుండియు ఖండితవాది. ఏ విషయమునైనను, చక్కగా విచారింపక చేసెడివాడు కాదు. ఉగ్గుపాలతోపోసిన శివభక్తి యితనిలో పొంగి పొరలు చుండెను. అతనికి భక్తియే ప్రధానము.

ఆనాడు జంగములకు కప్పుడి సంగమేశ్వరము కూడలిపట్టు. ఇది పవిత్ర కృష్ణామలప్రభల సంగమస్థానమున గలదు. ఇచ్చట సంగమేశ్వర దేవాలయమున్నది. తలి దండ్రులను వదలి బసవన అచ్చటికి పోయి శివశరణుల సేవజేసి వారియొద్ద సమస్త విద్యలను నేర్చుకొనెను. విద్యాభ్యాసము ముగియగనే బసవన లోకకళ్యాణమునకై సాటిసంఘమును సంస్కరింప ప్రయత్నించెను. బసవన కళ్యాణ కటకమునకు వచ్చెను. ఆ పట్టణమానాడు బిజ్జలుని యేలుబడిలో నుండెను. బిజ్జలునికి మంత్రిగ దండనాయకుడుగ బలదేవుడుండెను. బసవనకు తల్లివైపు బంధువు బలదేవుడు తన కుమార్తెయగు గంగాంబికను శివభక్తుడగు బసవనకిచ్చి వివాహము జేసెను. బసవన బిజ్జలుని యాస్థానమున కరణిక వృత్తిలో

బ్రవేశించి స్వల్పకాలమునకే ఉన్నత పదవినధిష్టించెను. బిజ్జలుని ధనాగారమున కధ్యక్షుడయ్యెను. ఇతని బుద్ధిబలమున ధనాగార మభివృద్ధిపొందెను. సత్ప్రవర్తనము. సాత్విక జీవనము, త్రికరణశుద్ధి, పరిపాలనాదక్షత, కార్యదీక్ష, సాధుజన సహవాసము, శివభక్తి మొదలగు గుణములచే రాజాస్థానమునసేగాక ప్రజలయందు నీతడు ప్రీతివిశ్వాసగౌరవములకు పాత్రుడయ్యెను. ఇతని గుణగణములు జూచిన బిజ్జలుడు బలదేవుని తర్వాత నితనినే మంత్రిని జేసెను.

రాజాస్థానము నందీత డున్నతపదవి నలంకరింపగనే యితని దగ్గఱకు శివశరణు లెక్కువ మంది వచ్చుచుండిరి. కర్తవ్యనిష్ఠుడు, వినయశీలుడు, భక్తి భండారియుగు బసవన వారిని అతిశ్రద్ధాభక్తులతో సేవించుచుండెను. అల్లమ ప్రభుడను యోగీశ్వరు డీకాలమున బసవనచే పూజింపబడెను. అతని యొద్ద అతడెన్నియో సిద్ధులను పొందెను. బసవన యానాటినుండియు గొప్పమహిమల జూపుచుండెను. బసవన తనయున్నత స్థానమునకు గర్వింపలేదు. ~~ఈ~~శ్వర సన్నిధానమున హెచ్చుతగ్గులులేవు. అందఱు సమానులే. కులమును బట్టిగొప్ప వాడుకాదు. గుణముగలవాడే గొప్పవాడు. త్రికరణ శుద్ధిగలవాడే గొప్పవాడవి, బసవన తాను తెలిసికొనుటయేగా కితరులకును బోధించెను. కులభేదముల నాతడు బహిష్కరించెను. యోగ్యతగల వారి నితడుద్ధరించెను, తక్కువకులమున బుట్టిన వారిలోనితడు గొప్పతనమును చూడగల్గెను.

ఇతని స్నేహమున బుట్టలల్లుకొని జీవించెడి మేదరచెన్నయ్య శరణశ్రేష్ఠ డయ్యెను. బట్టలనుతికి బ్రతికెడి మడివాలమాచయ్య యెన్నియో మహిమల జూపెను. చేపలబట్టెడి అంబిగచౌడయ్య మహాత్ముడయ్యెను. ఇటులనే యితని ప్రభావముచే సామాన్యులు కూడ మహాత్ములై తరించుచుండిరి. ప్రతియొక్కడును గష్టించిపనిచేయవలెను. పరభాగ్యోపజీవియై బ్రతుకరాదు. 'కష్టించుటయే కైలాసమ'ని బసవన యెలుగెత్తి చాటి ప్రజలలోని సోమరితనమును బోగొట్టెను. కాయకష్టమునం దుచ్చనీచములు లేవు. అన్ని వృత్తులు సమానమే. చెప్పులు కుట్టువాడు, వేదములు చదువువాడు నొకటే. కొలిమి పనిచే కమ్మరి,

ఉతుకుటచే చాకలి, నేయుటచే సాలెయు, వేదాభ్యాసముచే బ్రాహ్మణుడగు చున్నాడు. కాని యిట్టివి వారి కులమున యెచ్చుతగ్గులను సూచించుటలేదు. అవి ఆయావృత్తుల వలన వచ్చిన పేళ్ళుమాత్రమే. అని బసవన ప్రజలలో వృత్తులను గూర్చిన హెచ్చుతగ్గుల భావమును తొలగించెను. ఏ వృత్తియం దుండినను అందరును సమానులే యనెడి భావమును ప్రజలలో బసవన మేల్కొలిపెను.

దేవుని మెప్పించుట కడవికి పోయి తపసుచేయపనిలేదు. కనబడిన ప్రతి గుడిని చుట్టవలసిన పనిలేదు. ప్రతిగుంటయందును మునుగవలసిన పనిలేదు. అంతరంగ బహిరంగ శుద్ధిగలవారినే దేవుడనుగ్రహించును. ''దొంగిలింపకు, నొప్పించకుమా, బొంకకు, కోపింపకు, పరులను జూచి యసహ్యింపకు, పరుల నిందింపకు ఇదే అంతరంగ శుద్ధి. ఇదే మన కూడలి సంగమదేవుని మెప్పించుగతి'' యని చెప్పి బసవేశ్వరుడు దేవుని మెప్పించుటకు సులభముగు మార్గమును ప్రజలకు చూపెను. ప్రాణిహింస తగదు. భూతదయ చూపవలెను. దయయే ధర్మమునకు మూలమని బసవన జంతువధను మాన్పెను. కష్టపడి సంపాదించినది తానొక్కడేతినక ప్రజలకు, భక్తులకును బంచవలయును. వంచనలేనిదే భక్తి.

**'మెతుకుల జూచి కాకి పిలువదే**

**తన బలగమును',**

**'గుటుకను జూచి కోడి పిలువదే**

**తనకులమును',**

**అటులనే మనుజుడు తనకున్న**

**దానినే పరులకు పంచి బ్రతుకవలె'**

అని బసవన ప్రజలకు బోధించెను.

'దేవుడొక్కడే, అతనికి యెన్నియో పేరులు గలవు. అతనిని సేవించుటకు స్త్రీ పురుష జాతి భేదములు లేవు'. అను బసవన ప్రబోధమెందరినో యాకర్షించెను. ఎందరో స్త్రీలు గూడ శివశరణలైరి. వారిలో అక్కమహాదేవి సుప్రసిద్ధురాలు. భక్త్యావేశమున బసవేశ్వరుని నోట యెన్నియో వచనములు బయల్పడినవి.

అవి చిట్టిపొట్టి మాటలతో నర్ధవంతములై, వాని భావము, తక్షణమే సూటిగ హృదయమునకు తాకుచుండును. ఇతని వాక్కులను శివభక్తులు నేటికిని 'వచనశాస్త్రమ'ని గౌరవించుచున్నారు. బసవేశ్వరుని కీర్తి ఆసేతుహిమాచలము వ్యాపించెను. అతని భక్తి మహిమలు ప్రజలలో పాతుకపోయెను. ప్రజలితని సందేశమునాలకించి యనుసరించిరి. సంఘమున వర్ణభేదము నశింపజొచ్చెను. విప్లవము బయలుదేరెను. బిజ్జలుని మనస్సీ విప్లవమునకు చెదరిపోయెను. ప్రజలీరీతి మేల్కొనగసే బసవన సంగమేశ్వరమునకు పోయి లింగైక్యము చెందెను. ఆ మహాత్ముడు సిరియాలుని వంటి మహాభక్తుడే గాక యవతార పురుషుడని ప్రజలు నేటికి నాతనిని పూజించుచున్నారు.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

సాత్త్విక జీవనం = ప్రశాంతమైన బ్రతుకు ; త్రికరణ శుద్ధి = మనోవాక్కాయములందు దోషములేకుండుట ; దక్షత = సామర్థ్యం ; శరణులు = శివభక్తులు ; కార్యదీక్ష = పనులయందు పట్టుదల ; భక్తిబండారి = భక్తికి బొక్కసంవంటివాడు (బసవణ్ణ) ; కర్తవ్యనిష్ఠుడు = తన పనియందు నియమం కలవాడు,

**సొంత వాక్యాలు :**

1. తరించుట :

2. ఎలుగెత్తి చాటుట

3. పాత్రుడు
4. అప్పగించెను
5. చెదిరిపోయెను
6. అర్థవంతం
7. అనుగ్రహించు
8. కులభేదాలు
9. కాయకష్టం
10. సోమరితనం

**లఘు ప్రశ్నలు :**

1. శ్రీశైలమునకు పడమట ఏ రాజ్యమున్నది ?
2. బసవేశ్వరుని తల్లిదండ్రు లెవరు ?
3. కళ్యాణ కటకానికి రాజు ఎవరు ?
4. బసవేశ్వరుని భార్యపేరేమి ?
5. బసవేశ్వరుడు ఎవరిదగ్గర మంత్రిగానుండెను ?
6. బసవేశ్వరుడు 'ఎలాంటి వారు గొప్పవాడని' బోధించెను ?
7. బసవేశ్వరుడు ఎక్కడ లింగైక్యం చెందెను ?

**వివరణ ప్రశ్నలు :**

1. బసవేశ్వరుని బాల్యజీవితం ఎట్లుండెను ?
2. బసవన విద్యాభ్యాసం ఎప్పుడు ఎక్కడ ఎట్లు సాగెను ? ఎలా మంత్రి అయ్యెను ?

3. భగవంతుని మెప్పించుటకు బసవన చూపిన మార్గమేది ?

4. కల్యాణకటకమున విప్లవమునకు కారణమేమి ?

**సందర్భాలు :**

1. ఈశ్వర సన్నిధానమున హెచ్చు తగ్గులు లేవు.

2. త్రికరణ శుద్ధిగలవాడే గొప్పవాడు.

3. కాయకష్టములం దుచ్చ నీచములు లేవు.

**సంధులు :**

1. ఎలుగు + ఎత్తి = ఎలుగెత్తి (ఉకారసంధి)

2. ప్రజలు + ఇతని = ప్రజలితని (ఉకారసంధి)

3. దేవుడు + అనుగ్రహించు = దేవుడనుగ్రహించు (ఉకారసంధి.)

4. బట్టలు + ఉతికి = బట్టలుతికి (ఉకారసంధి)

★ ★ ★ ★ ★

# 4. సౌరశక్తి

**– డా॥ విజయలక్ష్మి**

## రచయిత్రి పరిచయం :

[ఈ పాఠ్యభాగం డాక్టర్ విజయలక్ష్మిగారి విజ్ఞానవ్యాసం ఆంధ్రప్రభ దినపత్రికనుండి తీసుకోబడింది. ఈమె తెలుగులో అనేక విజ్ఞానవ్యాసాలు వ్రాసింది. అవి వివిధ పత్రికలలో ముద్రింపబడ్డాయి. ఇందులో సౌరశక్తినిగురించి అది నేటి విజ్ఞాన పద్ధతులలో ఎలా మానవునికి దగ్గర అవుతుందో అనే విషయాలు సరళసుందరమైన శైలిలో రచింపబడ్డాయి.

ఇంధనం లేనిదే మానవ జీవితమే లేదు. జనాభాపెరుగుతున్న కొద్దీ ఇంధనం వనరులు తగ్గిపోతున్నాయి. ఏ ఇంధనమైనా వాడుకొంటూ పోతే ఒకనాటికి క్షీణించి పోతుందని శాస్త్రజ్ఞుల అంచనా. అందుకే మనశాస్త్రజ్ఞులు ఎన్నో పరిశోధనలు జరిపి సర్వశక్తులకూ మూలకారణమైన సూర్యుని నుండి శక్తిని గ్రహిస్తున్నారు. దీన్నే 'సౌరశక్తి' అంటారు. సౌరశక్తి గురించి దాని వినియోగం గురించి ఈ పాఠంలో వివరించబడింది.]

సౌరశక్తి ఈ నాటిది కాదు. భూమి పుట్టుకనుండి ఉన్నది. మనుషులకు ఉపయోగపడుతోంది. మాతృస్థానం నుండి పరిస్థితుల వల్ల మధ్యదారులలో పయనించిన బిడ్డ తిరిగి మాతృస్థానం చేరడం సహజం. సౌరశక్తి ప్రత్యామ్నాయం కాదు. అదే ప్రాథమికం.

భూమి సూర్యుడికి పుట్టింది. ఆనాటి నుండి ఈ నాటి వరకు భూమిని, అక్కడ పుట్టిన జీవజాలాన్ని పుత్రవాత్సల్యంతో చూసుకుంటున్నాడు సూర్యుడు. ఆహారం, నీరు, వెలుగు, వేడి, అనేవి జీవుల మనుగడకు మూల అవసరాలు. వీటిలో దేనినుండయినా, ఏ రకం నుండయినా మొదలు పెట్టి ఆధారం కోసం వెదికితే చివరకు తేలేది సూర్యుడే. ఈ విషయాన్ని గ్రహించయినా, గ్రహించకుండా అయినా అది మానవుడు సూర్యుడికి చేతులెత్తి మ్రొక్కాడు. ఎన్ని యుగాలు మారినా, ఎన్ని మతాలు మారినా, ఎన్ని సిద్ధాంతాలు మారినా నాటినుండి నేటి వరకు మనలను పోషిస్తున్నది, కాపాడుతున్నది సూర్యుడొక్కడే.

భూమికి, ఇక్కడ జనానికి ఆధారమైన వెలుగు, వేడిమి సూర్యుడినుండే వస్తున్నాయి. ఇవే లేకుంటే భూమిమీద జీవంఉనికి సాధ్యమయ్యేది కాదు. ఈ నాటి పారిశ్రామిక నాగరికతకు కావలసిన శక్తి, నీరు, ఇంధనాలు, గాలి అన్నీ కేవలం సూర్యుడి వల్లనే మనకు లభిస్తున్నాయి.

విద్యుదయస్కాంతతరంగాల రూపంలో సూర్యుడి నుండి వచ్చే కిరణాలను సౌరశక్తి అంటారు. సూర్యుడు మండుతున్న అగ్నిగోళం. అందులో నుండి ఇటువంటి వికిరణాలు పెద్ద ఎత్తున అన్నివైపులకు వెదజల్లబడుతుంటాయి. సూర్యుడి సంపూర్ణశక్తిలోని వందకోట్ల భాగంలో సగంమాత్రం భూమిని చేరుతుంది. అక్కడే మనం సూర్యుడి తాపానికి అల్లాడి పోతాం. భూమిని చేరిన ఈ శక్తిలో చాలా భాగాన్ని సముద్రాలు గ్రహిస్తాయి. ఆ వేడిమి వల్ల సముద్రాలలో నీరు ఆవిరై తిరిగి వాతావరణంలోకి చేరుతుంది. మేఘాలేర్పడతాయి. వర్షాలు కురుస్తాయి. మిగిలిన సౌరశక్తిని మనం ప్రత్యక్షంగా, పరోక్షంగా వాడుకుంటున్నాం. పచ్చనిచెట్లలో సూర్యుడి శక్తి ఆధారంగా కిరణజన్యసంయోగక్రియ జరుగుతుంది. అందులో తయారైన పిండిపదార్థం భూమిమీద సమస్త జీవరాశికి ఆహారాన్ని అందజేస్తుంది. ఇక సౌరశక్తిని వేడిమిగా వాడుకోవడం, కొన్ని భౌతిక రసాయనచర్యల ద్వారా విద్యుచ్ఛక్తిగా వాడుకోవడం ప్రత్యక్షఉపయోగాలకు ఉదాహరణలు అయితే ప్రత్యక్షంగా వాడుకునే శక్తిని మాత్రమే సౌరశక్తిగా వ్యవహరించడం మనమంతా గమనిస్తున్నాం.

సౌరశక్తిని నేరుగా వాడుకోవడం వల్ల 3000 డిగ్రీలు సెంటిగ్రేడ్ దాకా వేడిమిని పొందవచ్చు. నేరుగా వాడుకునేటప్పుడు సౌరశక్తిని వేడిమిగా మార్చి, ఆ వేడిమిని నిలువ ఉంచి వాడుకోవడం ప్రధాన పద్ధతి. శీతలదేశాలలో నివాస భవనాలను వెచ్చగా ఉంచుకోవడానికి ఈ విధానాన్ని విరివిగా వాడుకుంటారు. సూర్యుడినుండి వేడిమిని గ్రహించడానికి రెండురకాల పరికరాలను

వాడుతుంటారు. వాటిలో సమతలంగా ఉండే అద్దాలను వాడే కలెక్టర్‌లు, ముఖ్యంగా నీటిని వేడి చేసుకోవడానికి ఎక్కువగా వాడుతున్నారు. ఈ పద్ధతిలో సోలార్ కుక్కర్‌లు కూడా పని చేస్తాయి. ఈ కలెక్టర్‌లను ఇంటి పై భాగంలో అమరుస్తారు. అద్దాలకింద నల్లని పూత పూసిన భాగం ఉంటుంది. అద్దం ద్వారా వేడిమి ఈ భాగానికి చేరుతుంది. ఇందులోని గొట్టాల గుండా ప్రవహించే నీరు గానీ, గాలిగానీ బాగా వేడెక్కుతుంది. వాటిని సేకరించి మరొక చోట వాడుకోవడానికి వీలుంటుంది. రెండు చదరపు మీటర్ల వైశాల్యంగల కలెక్టర్‌ను అమర్చితే దాన్నుండి నూట ఇరవై అయిదు లీటర్ల నీరు 60 డిగ్రీల వేడిమిలో లభిస్తుంది. ఇటువంటి వేడినీటిసదుపాయాలను, భవన సముదాయాలలో, హాస్టళ్ళలో మన దేశంలో కూడా బాగా వాడుతున్నారు.

ఇటువంటి కలెక్టర్‌లను గాని, గిన్నెలాగా ఉండే మరోరకం పరికరాలను గాని ఉపయోగించి వంట చేసుకోవచ్చు. ఈ పరికరాలనే సోలార్ కుక్కర్స్ అంటారు. అయితే వీటిలో వంట చెయ్యడానికి చాలా సమయం పడుతుంది. అంతే గాక వీటిని ఆరు బయట ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇంట్లోనే సౌరశక్తిని వాడుకోవడానికి వీలయ్యే విధంగా అతి తక్కువ సమయంలో వంట పూర్తి చేయగల కుక్కర్ల నిర్మాణానికి కృషి జరుగుతోంది. అవి అందుబాటు లోకి వచ్చినప్పుడు వంటకు సౌరశక్తి ఉపయోగం మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

గృహరంగంలో మంచి నీటి కోసం సౌరశక్తిని వినియోగించుకోవడం మాత్రం లాభసాటి. సముద్రపు నీరు తాగడానికి అనువుగా లేకపోయినా, ఉప్పగా ఉన్నా సౌరశక్తి సాయంతో దాన్ని మంచినీటిగా మార్చుకునే పరికరాలను సులభంగా అమర్చుకోవచ్చు. వీటిలో నుండి వచ్చేనీరు ఆసుపత్రులలో డిస్టిల్ వాటర్‌గా, వాడుకునేందుకు యోగ్యంగా ఉంటుంది. అందులో కొంచెం ఉప్పు కలుపుకొంటే తాగడానికి కూడా రుచిగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతాలలో పరిశ్రమలు గనుక ఉంటే వాటిలో వాడుకోవడానికి పెద్ద ఎత్తున మంచినీటిని తయారు చేసుకోవడానికి అనువుగా కూడా ఈ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవచ్చు.

సెమి కండక్టర్స్ అనే రసాయనాలను వాడి సూర్యరశ్మి నుండి విద్యుత్‌ను తయారు చేసే పద్ధతి ఈ మధ్య గొప్ప అభివృద్ధి చెందింది. సోలార్ ఫోటో వోల్టాయిక్స్‌లో సిలికేన్, జెర్మేనియం వంటి పదార్థాలను వాడుతున్నారు. ఈ సౌర ఘటాలకు వాడే స్ఫటికాలను చాలా వెడల్పుగానూ, చాలా సన్నవి గానూ తయారు చేస్తారు. కాంతి ప్రసరించినప్పుడు ఈ సెల్స్ యెక్క ధృవాల మధ్య పొటెన్షియల్ తేడా ఏర్పడుతుంది. అందువల్ల చాలామంచిమొత్తాలలో విద్యుత్తు ఏర్పడుతుంది. ఇలా తయారైన విద్యుత్తును నిలువచేసి వాడుకునే అవకాశాలున్నాయి. అయితే ప్రస్తుతం వాడుకలో నున్న ఫోటో వోల్టాయిక్స్ యొక్క విద్యుదుత్పాదక శక్తిని ఇంకా బాగా పెంచే వీలున్నది. అందుకోసం ప్రపంచ వ్యాప్తంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మన కేంద్రప్రభుత్వం వారు నవీనఇంధన వనరులకు గాను ఒక ప్రత్యేకమైన శాఖను ఏర్పాటు చేశారు. ఈ శాఖకు అనుబంధంగా అన్ని రాష్ట్రాలలోనూ సంస్థలున్నాయి. అంతేగాక ఈ శాఖకు ఢిల్లీసమీపంలో ఒక ఆధునిక పరిశోధనశాల కూడా ఏర్పాటు చేశారు. ఇక్కడ, మరికొన్ని చోట్ల ఫోటో వోల్టాయిక్స్ గురించి పరిశోధనలు జరుగుతున్నాయి.

సాంప్రదాయ పద్ధతుల ద్వారా జరుగుతున్న విద్యుదుత్పత్తి దేశంలో అన్ని అవసరాలనూ తీర్చలేక పోతోంది. విద్యుత్ కొరత వల్ల ముఖ్యంగా పరిశ్రమలు, వ్యవసాయరంగాలు బాగా దెబ్బతింటాయి. మన దేశంలో వ్యవసాయ రంగంలో విద్యుత్‌ను, వేడిమిని సౌరశక్తి నుండి పొందడం ద్వారా ఈ సమస్యకు స్వస్తి చెప్పవచ్చు. మెట్ట ప్రాంతంలో సేద్యానికి అవసరమయ్యే నీటిని పంపు చెయ్యడానికి, భూగర్భ జలాలను తోడడానికి సౌరశక్తిని వాడవచ్చు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తుల నిలువ కూడా పెద్ద సమస్య. ఒక సంవత్సరం పాటు ధాన్యాన్ని నిలువ చేయడానికి సౌరశక్తి ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ రకం సోలార్ గాదెల నిర్మాణం చాలా సులభం. వేడినుండి, ఎలుకలనుండి ధాన్యాన్ని కాపాడే ఈ గాదెలను అభ్యుదయ కర్షకులు విరివిగా వాడుకుంటున్నారు. వ్యవసాయ రంగంలో మరెన్నో

రకాలుగా సౌరశక్తిని వాడుకోవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా చమురులాంటి ఇంధన వనరులు త్వరగా తరిగి పోతున్నాయని శాస్త్రజ్ఞులు గుర్తించారు. అందుకనే సాంప్రదాయేతర ఇంధనాల పట్ల శ్రద్ధ పెరిగింది. పరిశోధనలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రగతి కూడా చెప్పుకో తగినంతగా కనబడుతోంది.

ప్రపంచం మొత్తం మీద ఇంధన వనరులు నశిస్తున్న ఈ తరుణంలో అన్ని ఇంధనాలకు మూలమైన సూర్యుడు ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్నాడని శాస్త్రజ్ఞులు హామీ ఇస్తున్నారు. భూమి మీద సృష్టికే ఆధారమైన సూర్యుడు నేరుగా తన వెచ్చని కిరణాలను మనపైన వెదజల్లి వాడుకొమ్మంటున్నాడు. అన్నిటికన్నా పాతదైన ఈ ఇంధన వనరులను కొత్త కొత్త తీరుల్లో మనకు ఉపయోగ యోగ్యంగా చేయడానికి శాస్త్రజ్ఞులున్నారు కాబట్టి సూర్యుడు ఉన్నన్ని రోజులు మనకు శక్తి కొరత ఉండదనే అనుకోవచ్చు.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

ప్రత్యామ్నాయం = ఒకదానికి బదులుగావాడేది ; వాత్సల్యం = కన్నప్రేమ ; మనుగడ = జీవించుట ; ఇంధనాలు = మండేందుకు లేదా శక్తి నిచ్చేందుకు ఉపయోగపడే బొగ్గు, కిరోసిన్, పెట్రోలు మొదలైనవి ; తరంగాలు = అలలు ; తాపం = వేడి ; సముదాయాలు = గుంపులు.

**లఘు ప్రశ్నలు :**

1. సూర్యుడు భూమిని ఎలా చూసుకుంటున్నాడు ?
2. జీవుల మనుగడకు మూల అవసరా లేవి ?
3. సౌరశక్తి అని దేన్నంటారు ?

4. సూర్యుని శక్తిలోని ఎన్నోవంతు భూమిని చేరుతుంది ?
5. కిరణజన్య సంయోగక్రియ ఎక్కడ ఎలా జరుగుతోంది ?
6. సౌరశక్తి ప్రత్యక్ష ఉపయోగాలకు ఉదాహరణాలేవి ?
7. సౌరశక్తి వల్ల ఎన్నిడిగ్రీలదాకా వేడిమిని పొందవచ్చు ?
8. సూర్యునినుండి వేడిని గ్రహించడానికి ఎన్నిరకాల పరికరాలను వాడు తుంటారు ?
9. నీటిని వేడి చేయడానికి ఎక్కువగా ఏ పరికరాన్ని వాడుతున్నారు ?
10. శాస్త్రజ్ఞులు ఏమని హామీ ఇస్తున్నారు ?

**వివరణ ప్రశ్నలు :**

1. భూమిపై ప్రాణుల మనుగడకు సూర్యుడే ఆధారం ఎలా ?
2. సోలార్ కుక్కర్లు ఎలా పనిచేస్తాయి ?
3. సౌరశక్తి గృహరంగంలో మంచినీటికోసం ఎలా ఉపకరిస్తుంది ?
4. సూర్యరశ్మినుండి ఈ మధ్య విద్యుత్‌ను ఎలా తయారుచేస్తున్నారు ?
5. వ్యవసాయరంగంలో సౌరశక్తి ఎలా ఉపయోగపడుతుంది ?

**సొంతవాక్యాలు :**

1. అల్లాడి పోతున్నాం
2. చెల్లా చెదరైపోవు
3. ఆలోచన
4. వినయ విధేయతలు
5. పంటపొలాలు
6. కూలీలు.

★ ★ ★ ★ ★

# 5. వివేకానంద సందేశం

స్వామివివేకానందుడు జగత్ప్రసిద్ధినందిన మహాపురుషుడు. 12–1–1863 తేదిన విశ్వనాథ దత్తు, భువనేశ్వరీ దేవి దంపతులకు కలకత్తాలో జన్మించెను. అసలుపేరు వీరేశ్వర. కానీ అందరు ప్రేమతో నరేన్, నరేంద్ర అంటూ పిలిచేవారు. తల్లిదండ్రులు మరణించగా, ఇంటివారినందరినీ నరేంద్రుడే చూచుకొనవలసి వచ్చెను. విద్యావంతుడైనను సంపాదన లేకుండెను. ఇదే చింత అతనిని బాధింపసాగెను.

ఒకరోజు నరేంద్రుడు పరమహంసవద్దకు వెళ్ళెను. తన కష్టములన్నీ విన్నవించుకొనెను. పరమహంససలహాపై కాళీమాత గుడికివెళ్ళి దేవి ముందునిలచి 'అమ్మా ! నాకు జ్ఞానాన్ని ప్రసాదించు' అనికోరుకొనెను. పరమహంస తిరిగి పంపగా రెండవసారికూడా అట్లే కోరుకొనెను.

వివేకానందుని జ్ఞానదాహానికి పరమహంస అచ్చెరువందెను. ఇతడు లోకకల్యాణమునకు ఉపకరించు ననుకొనెను. పరమహంస ఆశీస్సులతో సన్న్యాసం స్వీకరించెను. చికాగో నగరములో జరిగిన విశ్వధర్మసమ్మేళనములో హిందూధర్మమును గూర్చి ఉద్ఘాటించెను. తన 39వ యేట 4-7-1902 లో కాలధర్మముచెందెను. వివేకానంద జన్మదినమును యువజనదినోత్సవముగా భారతప్రభుత్వము ప్రకటించి ఋణము తీర్చుకొన్నది.

వివేకానందుని సందేశాలన్నీ దివ్యత్వం ఉట్టిపడే అమృతగుళికలే. ఆయనమాటల్లోనే ఆయన సందేశాలు..

"లేవండి ! మేల్కొనండి ! ఇకపై నిద్రించకండి. అజ్ఞానాంధకారంనుండి బయటకు రండి. ప్రతి ఒక్కరిలోను కోరికలు, దుఃఖాలను తొలగించుకొనే శక్తిఉంది. నమ్మండి ! అప్పుడు ఆశక్తి ప్రకటితమవుతుంది. నాదృష్టిలో ఎవరైనా తనను తాను అల్పుడనని, హీనుడనని తలచడమే మహాపాతకం, అజ్ఞానం. మీలో ఉన్న దివ్యత్వాన్ని వ్యక్తీకరించండి. నిరంతరం కృషి చేయండి. అంతా చక్కగా

సర్దుకుంటుంది. ప్రతి వారూ పరిపూర్ణ జీవిగా లేదా భౌతిక రహస్యాలను కనుగొనే జ్ఞానిగా రూపొందడానికి తగిన శక్తి సామర్థ్యాలు కలిగే ఉన్నారు. మీలో ఏపాపమూ లేదు ; దైన్యమూ లేదు. మీరు అనంతశక్తి సంపన్నులు. జీవితం గడుస్తున్న కొద్దీ రోజు రోజుకూ 'ప్రతిమనిషీ దైవమే' అనే భావన ప్రతి స్త్రీలోనూ పురుషుడిలోనూ పెరుగుతూ ఉంటుంది.

ఎల్లప్పుడూ ఆత్మ విచారణ చేస్తూ వుండండి. మీలోని బలహీనతలు తొలగి ఆత్మవిశ్వాసం, దేన్నైనా సాధించాలనే సంకల్పం బలపడుతుంది. లేచినిలబడు, ధైర్యంగా బలిష్ఠంగా ఉండు. మొత్తం బాధ్యతనంతా నీభుజ స్కంధాలపైనే వేసుకో. నీభవిష్యత్తుకు నీవే బాధ్యుడవని తెలుసుకో. నీకు కావలసిన శక్తులన్నీ నీలోనే ఉన్నాయి.

మన ప్రస్తుత స్థితికి మనమే బాధ్యులం. మనము ఏమి కాగోరుతామో అదిగా అవడానికి మనకు శక్తి ఉంది. మన వర్తమానస్థితి పూర్వకర్మల ఫలితమైతే, మనకు భవిష్యత్తులో కలిగే స్థితి ప్రస్తుత కర్మల ఫలితంగా మనం పొందవచ్చునని నిశ్చిత మగుచున్నది. కాబట్టి మనం పనులను ఎలా ఆచరించాలో తెలుసుకోవాలి. ఇలా కర్మలను చేసే విధానం తెలుసుకుంటే అద్భుత ఫలితాలను పొందవచ్చు. అల్ప కార్యాలను గూడ చాల జాగ్రత్తగా చేసుకుంటూ ముందుకు పోవాలి.

మనకు కావలసింది ఇనుపకండలు ; ఉక్కునరాలు. మనం చాలా విలపించాం, విలపించినదిచాలు. మనకాళ్ళపై మనం నిలబడి మనుషులుగా ఎదుగుదాం.

పవిత్రత, సహనం, పట్టుదల – విజయసాధనకు ఈ మూడూ అత్యవసరం. వీటన్నిటికీ మించి కావలసింది ప్రేమ. మిమ్మల్ని మీరు మేల్కొల్పుకొని ఇతరులనూ మేల్కొల్పండి. మీరు మరణించడానికి మునుపే జీవిత పరమావధిని సాధించండి ! లేవండి ! గమ్యం చేరే వరకు ఎక్కడా నిలవకండి.

ఏ వ్యక్తి అయినా, ఏ దేశమైనా ఉన్నతస్థితికి చేరుకోవాలంటే మూడు లక్షణాలు అవసరం–

1. మంచి తనానికి ఉన్న శక్తిమీద అఖండ విశ్వాసం.
2. అసూయ, అనుమానం లేకుండా ఉండడం.
3. మంచికి సహాయపడడం.

కష్టాలు పర్వతం అంతగా కనిపించినా, పరిస్థితులన్నీ,భయంకరంగా, నిరాశా జనకంగా ఉన్నా, అవి అన్నీమాయే. భయపడవద్దు. అదితొలగి పోతుంది ; అణచి పెట్టండి ; అది అదృశ్యమవుతుంది. ఎన్నిసార్లు పరాజయాన్ని పొందానని ఆలోచి ంచద్దు. కాలం అనంతం ; ముందుకు సాగిపో. ఆత్మశక్తిని మాటిమాటికి భావించు; వెలుగు వచ్చే తీరుతుంది.

లోకం బలవంతులను, శక్తిమంతులను మాత్రమే ఆదరిస్తుంది. ఎన్నడూ బలహీనులుగా ఉండకండి. మీరు శక్తి సమన్వితులై ఉండాలి. మీలో అనంతశక్తి ఇమిడిఉంది.

మనం ఎంతకాలమైతే ఇతరులపై నిందలను మోపుతామో అంతవరకు మనబలహీనతలను, తప్పులను మనం గుర్తించలేం ! మనం ఏది నాటితే అదే పండుతుంది. మన విధికి మనమే కారకులం. ఎవరినీ నిందించడానికీ లేదు ; స్తుతించడానికీ లేదు.

చెదరిన సూర్యకిరణాలను కేంద్రీకరించినప్పుడు అవి తీక్షణంగా ప్రకాశిస్తాయి. అలాగే ఏకాగ్రతవల్ల మన శక్తులు దీప్తిస్తాయి. జ్ఞానానికి ఇదే సాధనం. మనస్సు ఎంతగా ఏకాగ్రమౌతుందో అంతగా ఒక విషయంపై కేంద్రీకృత మవుతుంది. మిమ్మల్ని మీరు బలహీనులుగా అనుకోవద్దు. అది మహాపాపం. బలంగురించి ఆలోచించడమే బలహీనతకు పరిష్కారం.

భారతదేశం, ప్రపంచానికి ఇచ్చేకానుక ఆధ్యాత్మిక జ్ఞానమే ! మన ఆధ్యాత్మిక భావాలు నేలకు జాలువారు మంచుబిందువులవలె ప్రపంచమంతటా మెల్లమెల్లగా వ్యాప్తి చెందు చున్నాయి. సత్యాన్ని అంటిపెట్టుకో ; ఆలస్యమైనా విజయం నీదే.

సత్యం, పవిత్రత, నిస్వార్థత – ఈ మూడూ ఉన్న వ్యక్తిని ఏశక్తీ ఏమీచెయ్య జాలదు. తప్పకుండా జయంతనదే. పరోక్షంగా ఇతరులనుగూర్చి చెడుగామాట్లాడడం మహాపాపం. మనస్సులో ఏమేమో తోచవచ్చు. కానీవాటిని బయటపెట్టడానికి ప్రయత్నిస్తే క్రమక్రమంగా అవి గోరంతలు కొండంతలుగా తయారవుతాయి. క్షమించి మరచి పోతే అంతా సమసిపోతాయి. ఇతరులు ఏమి చేసినా సరే నీవు మాత్రం నీపావనత్వాన్ని, నైతిక ప్రవర్తనను, భగవద్భక్తియొక్క స్థాయిని దిగజార్చవద్దు.

మీ అంతట మీరే ఆలోచించుకొని సత్యాన్ని స్వయంగా అన్వేషించండి. ధైర్యవంతులు, సాహసవంతులు మనకు ఇప్పుడు అవసరం. రహస్యసాధనతో కూడుకొన్న క్షుద్రవిద్యలవల్ల మనస్సు బలహీనమవుతుంది. సత్సంకల్పం, నిష్కాపట్యం, అఖండప్రేమ – ఇవి ప్రపంచాన్ని జయించగలవు. ప్రజలు మనల్నిమంచివారంటారు, చెడ్డవారంటారు, కానీ ఆదర్శాన్ని ముందుంచుకొని సింహాలలాగా మనం పనిచెయ్యాలి.

సత్యానికీ, మానవాళికీ, దేశానికీ విశ్వాసపాత్రుడవై ఉండు. నీవు ప్రపంచాన్ని కదలించి వేయగలవు. దేనికీ భయపడకండి. మీరు అద్భుతాలను సాధించగలరు. భయపడిన మరుక్షణమే మీరు ఎందుకూ పనికిరాని వారవుతారు. దుఃఖానికి మూలకారణం ఈభయమే ! నిర్భయత్వం ఒక్క క్షణంలో స్వర్గాన్ని చేర్చగలదు.

మిమ్మల్ని మీరు మహాపురుషులని భావించండి. అపుడు మీరు మహాపురుషులే అవుతారు. 'నాకు చేత కాదు' అని ఎన్నడూ అనవద్దు. మనిషికి కావలసింది శ్రద్ధ. మనుషుల మధ్య తేడా శ్రద్ధలో ఉన్న తారతమ్యమేకాని వేరేమీ కాదు. కాబట్టి ఈ శ్రద్ధ మీలో ప్రవేశించాలి, శ్రద్ధావంతుడికే జ్ఞానం లభిస్తుంది.

నీలో అనంతశక్తి ఉందని విశ్వాసం కలిగిఉండు. జాగరూకుడవై, ఆశక్తిని వ్యక్త పఱచు. 'నేను ఏదైనా సాధించగలను' అని సంకల్పించు. పాము విషాన్నైనా సరే గట్టిగా తిరస్కరిస్తే అది నీపట్ల నిర్వీర్యమై పోతుంది సుమా ! జాగ్రత్త. 'చేయలేను' అనవద్దు, ప్రతికూల భావనలు రానివ్వద్దు. మీపై మీరు విశ్వాసం కోల్పోవడం అంటే భగవంతునిపై విశ్వాసం కోల్పోవడమే. అంటూ తన దివ్యసందేశాన్ని లోకానికి అందించి అజరామరుడయ్యాడు వివేకానందస్వామి.

**అర్థాలు :**

అంధకారం = చీకటి, దైన్యము = దీనత్వము, సహనం = ఓర్పు, విలపించుట = బాధపడుట, ప్రకాశించు = వెలుగు, క్షుద్ర = నీచమైన, నిష్కాపట్యం = కపటంలేనిది, విశ్వాసం = నమ్మకం, అజరామరము = ముసలితనమూ, మరణమూ లేనట్లుగా (శాశ్వతంగా)

**సంక్షిప్త ప్రశ్నలు :**

1. స్వామి వివేకానందుడు ఎప్పుడు, ఎక్కడ జన్మించెను ?
2. స్వామి వివేకానందుని తల్లి దండ్రులెవరు ?
3. స్వామి వివేకానందుని అసలు పేరేమి ?
4. స్వామి వివేకానందుడు ఎవరివద్దకు వెళ్ళెను ?
5. పరమహంస సలహాపై స్వామివివేకానందుడు ఏగుడికి వెళ్ళెను ?
6. కాళీమాతను స్వామివివేకానందుడు ఏమి కోరెను ?
7. స్వామి వివేకానందుడు ఎప్పుడు మరణించెను ?
8. స్త్రీపురుషులలో ఏభావన పెరుగుతుంది ?
9. విజయసాధనకు ఏవి అత్యవసరాలు ?
10. భారతదేశం ప్రపంచానికి ఇచ్చేకానుక ఏది ?

**వివరణ ప్రశ్నలు :**

1. స్వామి వివేకానందుడు సన్యాసం స్వీకరించినవిధం.
2. శీలం పెంపొందించుటలో స్వామి వివేకానందు డిచ్చిన సూచనలు.
3. ఉన్నతస్థితి చేరుకోవడానికి వివేకానందుడిచ్చిన సలహాలను వివరించండి ?

★ ★ ★ ★ ★

# 6. నిగమశర్మ అక్క

## – రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ

[ఈ పాఠ్యభాగం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ రచించిన ''సారస్వతోపన్యాసములు'' నుండి గ్రహింపబడింది. వీరు సంస్కృత, ప్రాకృత, తెలుగు, కన్నడ, ఆంగ్లభాషల్లో పండితులు. ప్రసిద్ధ సంగీత విద్వాంసులు, స్వరకర్త కూడా. వేమన, సారస్వతాలోకము, నాటకోపన్యాసములు వీరి విమర్శగ్రంథాలు. శాలివాహనగాథాసప్తశతి వీరి అనువాదం (ప్రాకృతంనుంచి). మీరాబాయి వీరికావ్యం. అన్నమయ్య పదాలను పరిష్కరించారు. పోతన భాగవతాన్ని, తెనాలి రామకృష్ణుని పాండురంగ మాహాత్మ్యాన్ని పరిష్కరించారు.

తెనాలి రామకృష్ణుడు **'పాండురంగ మాహాత్మ్యము'** అనే ప్రబంధం రచించాడు. ఆ ప్రబంధంలో నిగమశర్మకథ ఒకటి. అతనికి అక్క ఉంది. నిగమము అంటే వేదం. వేదాలను అధ్యయనం చేసినవాడు నిగమశర్మ. కాని పాండురంగ మాహాత్మ్యంలోని నిగమశర్మ అందుకు విరుద్ధం. విద్యాధికుడు కావడానికి సకల సదుపాయాలూ ఉండి కూడా అన్ని రకాలుగానూ, పతనమౌతాడు నిగమశర్మ. ఇంట్లో దొంగతనం చేస్తాడు, మోసాలు చేస్తాడు. అప్పటి కులాచారాలకు విరుద్ధంగా నడుచుకుంటాడు. ఇంట్లో నుంచి వెళ్ళిపోయి దొంగలతో దెబ్బలు తింటాడు. అతనిని సంస్కరించడానికి వస్తుంది అతని అక్క. ఎన్నో ఉపచారాలు చేసి బుద్ధి మాటలు చెప్పిన వృత్తాంతం ఇందులో చిత్రీకరించారు.]

నిగమశర్మ అక్క తండ్రి సభాపతి. పేరుకుదగినట్లు 'వేదముల్ వోసినగాదె, శాస్త్రములు పుట్టినయిల్లు, కళాకలాపముల్ డాసినరచ్చ', పీఠికాపుర సంస్థానమున పేరెన్నికగన్న వైదికాచార్యుడు. ఆగర్భ శ్రీమంతుడు, రాజాధిరాజుల మ్రొక్కులు గొన్నవాడు. తల్లి 'అతులనిష్ఠ' గల ముసలిముత్తైదువ.

ఇట్టి తలిదండ్రుల కడుపున బుట్టి పెరిగిన పెద్దకూతురు మనకథానాయిక, కులాభిమానము, ధర్మార్థములందలి జాగ్రత్త, తెలివి తేటలు, శీల నైర్మల్యము, పనిపాటలందలి దిట్టతనము, తీవ్రమైన ప్రయోజనదృష్టి ఇవన్నియు చిన్న నాటినుండే చెప్పక చూపక వచ్చిన చిట్టలు.

తనయింటదాను మర్యాదగా సంసారము చేసికొనుచున్న యామెకు పుట్టినింటినుండి వార్తయొకటి వచ్చి చాల మనసు నొప్పించినది. తమ్ముడు నిగమశర్మ పచ్చి పోకిరి యైపోయినాడు. ఆస్తియెల్ల నించుమించుగా కరగదిన్నాడు. ఆచార వ్యవహారములడుగంటినవి. మానమర్యాదలు, చదువు సంతలు నశింపవచ్చినవి. అభక్ష్యభక్షణము, అపేయపానము, అప్పులు, జూదము, మోసము, దొంగటికము మొదలగువానికి లోగి కడపటిలోతునకు దిగినాడు. కంచెంతకాపురము ; తలిదండ్రులు ముదుకలు ; దిక్కు విచారించు వారు లేరు.

ఇంటి పెద్దకూతురు తాను. నిగముడు తానెత్తి ముద్దాడి పెంచి పెద్దచేసిన తమ్ముగుట్టు. వానికి బుద్ధిచెప్పిత్రోవకుతేలేనా యనుకొన్నది. మగనిని బిడ్డలను గట్టుకొని యొకనాడు బయలుదేరి పుట్టినింటికి వచ్చినది.

ఇంటిలో జూడగా అన్నియు నన్నిత్రోవలై చెడి చెటాకుల గలిసినవి. ఎవరును ఏ పనికిని పూనుకొనువారు గానరారైరి. తలిదండ్రులు చెరియొక మూల ప్రాణావశిష్టులై వగల మునిగి సుడివడియున్నారు. పెరుమాళ్ళ యింటిలో బూజునిండినది. పాత్రలు ప్రాచిపట్టినవి. పెద్దయిల్లు చూచి మధ్యాహ్నమునకు వచ్చునతిథులు మాటాడించువారు లేక వేఱు గృహముల వెదక బోవుచున్నారు. చిన్నపిల్లలు వేళకన్నము, నీరు విచారించువారు లేక మాసి నలగినారు. పాడి యావులు బందెలదొడ్లకో, బైటితెరువులకో పాలయినవి. పనివారు మొగము జూపుట యరుదైనది. వారి జీతబత్తెము లరయువారు లేరు. పుస్తక భాండాగారములో తాటాకుల గ్రంథములు కొన్ని – దీపారాధనయందలి యసడ్డచేగాబోలు నిప్పుపాలైనవి. ఇన్నియనర్థములకు మూలకారణము తమ్ముడింటిలో లేడు. ఎక్కడనున్నాడో, ఎప్పుడువచ్చునో, రానేరాడో తెల్పువారు లేరు.

మొట్టమొదట మూలస్తంభములవంటి ముసలితలిదండ్రులను దేర్పవలయునని తలచినది. 'తీండ్రగల వచనరచనా చమత్కారంబులు'

ప్రయోగించి వారినంత కొంత దొలగించి మొగముల తెలివిగలిగించినది. వారికి వలయు నుపచారములెల్ల దానేచేసినది. భగవదారాధనకు వలయు నేర్పాటులు చేసి జరిపించినది. తొంగిచూచి పోబోవునతిథులను దయచేయుడని పిలిచి యాదరించి యుపచరించినది. తల్లిని రహస్యముగా నడిగి తమ్ముని చేతికిదప్పిన మూలధనమున్న చోటు తెలిసికొని మరింత, భద్రపరిచినది. నయభయముల చేతను, కలియగలపు మాటల చేతను పిల్లలను, పనివాండ్రను లోగ జేసికొన్నది.

ఇట్లన్నిటను ఆమె జాణతనము సాగినదిగాని తన చిన్న మరదలిని జూచినప్పుడేమి చేయవలయునో తోపలేదు, వయసు చిన్నది. పొంగివచ్చు యౌవనము ; అరుదైన చక్కదనము, కాపురమునకు వచ్చిన నాటినుండియు మగని మొగమైన జక్కగా జూచినదో లేదో ! తనవారు, నావారనువారు లేరు. మీదు మిక్కిలి తానెంత మనసునొచ్చి 'నలంగియు నత్తమామల చిత్తంబు వచ్చునట్లు భక్తి శక్తులు మెఱసి పాటులంబడు' ధర్మము, కర్మముగలయిల్లాలు, ఆ వేదనామూర్తియెడ తన ధైర్య మెందుకును బనికిరాక వదినె, యూరక "వగచి వగచి కడుపుచుమ్మలు చుట్టి కన్నీరుట్టిపడం బొట్టుపొరలగు చుండినది". అనివార్యమగు దుఃఖమునకు హార్దమగు సహానుభూతియే ప్రతీకారము. ఇట్టి వదినెను సంపాదించుకొనగల పుణ్యవతులు మరదండ్రెందరుగలరు ?

ఉన్నదున్నట్టుగా "చుక్క తెగి పడినవడుపున" ఒక్కనాడు తమ్ముడు వచ్చివాలినాడు. అప్పుల వారివలె ఆకలికిని దలదాచుకొనుట సాధ్యముగాదు గదా ! ఎన్ని పూటలనుండి పస్తుండెనో ! మధ్యాహ్నభోజన పంక్తికి తండ్రి మొగము కనబడునని భయము. కావున మెల్లగ తల్లిని బీడించి "చల్ది వంటకము" దిని చప్పున తప్పించుకొని పోదమని వచ్చినాడు. కాలిడిన వెంటనే అక్కమొగము కనిపించినది. తప్పించుకొని పోగలడా? ఆ ప్రేమమయి చిరునవ్వు సంకెలలను ద్రెంచుకొని, ఆ మహనీయమూర్తియెడ తనకుగల గౌరవభారమును దిగంద్రోసి పోవుటకు శక్తి యెక్కడిది? వచ్చి నమస్కరించినాడు. 'సీమంతపు బెడ్డ కొడుకవుగమ్మని హేతుగర్భితంబుగా' ఆశీర్వదించినది. అతడు గుమ్మడికాయల

దొంగ గిలియున్నది. ఆ దీవనలోని భావము కనుగొన్నాడు. ఉపన్యాసములు, ఉపదేశములు, చీవాట్లును ఈమెయు నుపక్రమించునేమో! ఇది యెక్కడి గొడవ పోదమని యుంకించినాడు. ఆమె వ్రేలునుజూపకయే, హస్తమునేగాదుమేనెల్ల దిగమ్రింగగలజాణ, ఆత్రపడి వాని కసహ్యమైన భావమును సూచించి పొరపడితినని యెఱిగినది. 'నీ మేనల్లుని జూచితివా? ఇంద' అని యిందు బింబమువంటి తన కడగొట్టు కొడుకును ఊరక చూపలేదు – చంక కిచ్చినది. వాని మొగమునగాన వచ్చిన యాకలి నకనకలు చూచి, వీని గట్టిప్రేయు బ్రహ్మాస్త్రమిది రాయని ' మీ బావ బంతి నారగింతువుగాక, శాక పాకంబులు నిమిషంబులోనం గావింతు' నని ప్రయోగించినది. ఈలోన ముఖ్యమైన వ్యక్తిని మరదలిని మఱచునా ? ఆమెకు కను సన్న చేసి వాని కాళ్ళు గడిగించినది. ఇంక ఇన్ని బంగారు త్రాళ్ళనుండి తప్పించుకొనుటయెట్లు? వాడు గ్రుక్కుమిక్కనక తలంటు స్నానము, నూతన వస్త్రధారణము, వెంద్రుకల తడియార్పు, పూలముడుపు, గంధపు మైపూతమొదలగు నన్ని యుపచారములకును మేనొగ్గినాడు. అపురూపముగా మగనికి సేవలు చేయగల్గి వానియిల్లాలు ధన్యురాల ననుకొన్నది. ఆమె యాశలు మొలచినవి.

శ్రద్ధతో భయముతో అక్క తమ్మునికి పలువగల వంటలు వండినది. 'కనుగీటినంతలోననె !' తలిదండ్రులకును భర్తకును మౌన మంత్రము చేసినది. తన బిడ్డలతోపాటు వారిపంక్తిలో తమ్మునికి చేయార తానే తృప్తిగా వడ్డించినది. వాడు భుజించినపిదప ఎంత చెడినను వైదికుల యింటి బిడ్డడుగదా! వార్చి యింటితిన్నెపై కూర్చున్నాడు. భార్యకు రెండవమారు కనుసన్న చేయనక్కర లేదుగదా ! ఆమె వచ్చి అరుగుచెంత నిలుచుకొని తాంబూలమును చుట్టియిచ్చు చున్నది. అతనికిపుడు పదునాల్గు లోకములును చల్లగా సుఖముగా నిండు గడుపుతో గానవచ్చుచున్నవి. చీవాట్లను, తిట్లను చిరునగవుతో స్వీకరింపగల యుదారహృదయముతో నున్నాడు. చంటవెంట సందడిసేయు సంతానము, నెమ్మదిగా అరుగుదగ్గర నిలిచి, చీరపేలచిట్టడివిగా నున్నవాని తలను జూచి 'సీ !

ఏమిరాయిది !' అని ప్రేమప్రస్తావన చేసి, జుట్టు ముడివిడిచి విదలించి, ఈళ్ళుగ్రుక్కి, అంట్లబొడిచి, గోరుముక్కుల దిగదువ్వి, తూరుపెత్తి పేలనన్నిటిని దిగిచి, ముడివేసినది. పాణి పద్మములు గరగరగా గడుగుకొన్నది. ఆ వేళకు సరిగా అదనెరిగిన మరదలు విడెము మడిచియిచ్చు చుండగా దాసి తెచ్చిన పీటపై కుడిప్రక్క నించుక యొరగిల్లి కూర్చున్నది. "ఏమి నాయనా ! ఎన్నాళ్ళాయెరా మా యూరికి నీవువచ్చి? ప్రారంభించి, యఖండముగా జరుగుచున్న వేదపాఠమునకు విఘ్నమగునని వెరచితివికదా ! అని తిన్నగా ఏసమాటలతో నుపక్రమించినది. 'సాలగ్రామాలగనిలో గులకరాయివలె సముద్రమువంటి యాతండ్రి కడుపున ఇట్టివాడ వెట్లురా పుట్టితివి!' అని యొక్కమాటుగా గసరి పల్కినది. బ్రహ్మనుండి తమవరకు మచ్చ పేరెరుగని బ్రాహ్మణవంశమే! తలిదండ్రులు ముసలివారు, తమ్ములు కసుగందులు, తానింటికి పెద్దకొడుకు. వారిగతి యేమి? చేసికొన్న యిల్లాలి దిక్కేమి? 'భారతమునకు కర్ణునివలె నీవేయీయింటి కాధారము. నీవు లేనిది కథనడువదు. అనియతని పౌరుషమున కన్వయించి పురికొల్పినది. 'నీవు యజ్ఞము చేయగా వేదికను నలంకరించి సుమంగళీపూజ లందుదునని గంపెడాసతో వేయిమందిలో జెప్పుకొన్నానే! నాయాశలు త్రెంచితివే! యని సౌభ్రాత్రమును జూపి కన్నీరు పెట్టుకొనబోయినది. 'కామవికారము బలమైయుండెనేని రూపగుణకులశీలములు గల్గు బ్రాహ్మణకన్యలను వేయిమందినైనను బెండ్లాడరాదా! బ్రాహ్మణ గృహస్థునికి బహుపత్నీవ్రతము తప్పని యెవరు చెప్పగలవారు ? ఈ పాడు వారకాంతల వ్యవహారము నీకెందుకు? వారి దోపిళ్ళకు మన్నీలు, ఆఢ్యులునుదట్టి కొనజాలరే! నీకేమి భార్య లేదా? బిడ్డలు పుట్టరా? వెన్నంటి పుట్టిన తమ్ములు లేరా? ఇట్లు కులధ్వంసము చేయుదురా? యెవరైనా" అని తనవారి తప్పులను క్షమించి సరిపుచ్చుకోగల స్త్రీ హృదయ మార్దవమును వెలువరచి అధర్మము చేసినను అవివేకముగా చేయరాదను సామాన్య న్యాయమును చాటి చెప్పినది. వేశ్యాజనుల వంకర టింకరలన్నియు సూదులతో బొడిచినట్లు వాని గుండెకంట

నొత్తిక్రుచ్చియెత్తి పెట్టినది. కడకు వాని చేతిలో చేయివేసి 'చేయి మీదుగా నడచిన పూర్ణకాముడవే ! నా తమ్ముడవే ! నీకీ బికారితనమేల ? వలదు నాయనా ! ఇంకనైన వదలుతండ్రీ !' యని దీనదీనముగా వేడుకొన్నది. 'నీకు గావలసెనా హరికౌస్తుభమైన దెచ్చెద' నని ధీరధీరముగా ప్రతిజ్ఞ చేసినది !

అక్క సద్బుద్ధి మాటలాదరించి నిగమశర్మ నాల్గునాళ్లింటిలో వివేకము దెచ్చుకొన్న వానివలెనుండి, యొకనాటిరాత్రి చేతికి దొరికిన యింటిసొమ్ములనెల్ల హరించి మూటగట్టుకొని పండుకొన్న 'పడకకునుజెప్పక' పారిపోయెను. అప్పుడింటనందరు నేడ్చిరి, వారితోడ నక్కయు నేడ్చినది. ఎందు కనుకొన్నారు ? తమ్ముడు చెడె నేయని కాదు; ఇల్లు మునిగెనేయని కాదు; తన ప్రయత్నము వ్యర్థమాయెనే యనియును గాదు! మరి 'క్రొత్తగా చేయించుకొన్న ముక్కర–పోయెనే యని' దుర్వారయై యడలెనట !

**అర్థాలు :**

నిగమం = వేదం ; ఆగర్భ శ్రీమంతుడు = పుట్టుకతోనేసంపన్నుడు ; అతులనిష్ఠ = సాటిలేని నిష్ఠగలది ; చిట్టలు = ఆశ్చర్యములు (వింతలు) ; అభక్ష్య భక్షణము = తినరానిదానిని (మాంసమును) తినుట ; అపేయపానము = త్రాగకూడని (కల్లును) దానిని త్రాగుట; లోగి = వశమై ; ముదుకలు = ముసలివారు ; పెరుమాళ్ళయిల్లు = దేవగృహము ; తెరువు = మార్గము ; అరయువారు = విచారించువారు ; అసడ్డచే = అశ్రద్ధచే ; మెఱసి = ప్రదర్శించి; వేదనామూర్తి = దుఃఖమే ఆకారముగాగలది ; అనివార్యము = నివారింపరాని ; గరగరగా = శుభ్రముగా ; ముక్కర = ముక్కుపుడక ; దుర్వారయై = నివారింపరానిదై ; అడలెను = దుఃఖించెను.

**లఘు ప్రశ్నలు :**

1. 'నిగమశర్మ అక్క' పాఠ్య భాగ రచయిత ఎవరు ?

2. 'నిగమశర్మ అక్క' పాఠ్యభాగం ఎందుండి గ్రహింపబడింది ?

3. 'నిగమశర్మ' అంటే అర్థమేమి ?

4. 'నిగమశర్మ అక్క' తండ్రి పేరేమి ?

5. నిగమశర్మ భుజించిన పిదప ఎక్కడ కూర్చున్నాడు ?

**వివరణ ప్రశ్నలు :**

1. నిగమశర్మ అక్క తనతమ్ముని సరిదిద్దడానికి చేసిన ప్రయత్నమేది ?

2. నిగమశర్మ అక్క పాత్రచిత్రణ వివరింపుము.

3. నిగమశర్మను గూర్చి వివరించుము.

4. నిగమశర్మ అక్క తమ్ముని మందలించిన తీరెట్టిది ?

**సందర్భాలు :**

1. చుక్క తెగి పడిన వడుపున

2. 'సీ' ! ఏమిరాయిది' ?

3. 'భారతమునకు కర్ణుని వలె' నీవే యీయింటి కాధారము.

4. ఇట్లు కులధ్వంసము చేయుదురా ?

5. నీకీ బికారితన మేల ?

6. నీకు గావలసెనా హరికౌస్తుభమ్మైన దెచ్చెద.

**సంధులు :**

పతన మౌతాడు = పతనము + ఔతాడు (ఉకారసంధి).

ధనమున్న చోటు = ధనము + ఉన్నచోటు (ఉకారసంధి).

ధైర్యమెందుకు = ధైర్యము + ఎందుకు (ఉకారసంధి).

కన్నీరుట్టిపడు = కన్నీరు + ఉట్టిపడు (ఉకారసంధి).

కాళ్ళు గడిగించి = కాళ్ళు + కడిగించి (గసడదవాదేశ సంధి).

నిండుగడుపు = నిండు + కడుపు (గసడదవాదేశ సంధి).

చిట్టడవి = చిఱు + అడవి (ద్విరుక్తటకారాదేశ సంధి).

**సొంతవాక్యాలు :**

తెలివి తేటలు

అతిథులు

ప్రతీకారం

ఆశీర్వదించు

పారిపోవు

**కార్యాచరణం :**

తెనాలి రామకృష్ణుని కథలను సేకరించండి.

★ ★ ★ ★ ★

# 7. ఎఱ్ఱనగారి సావిత్రి

**– ఆచార్య జక్కంపూడి మునిరత్నం**

[ఈ పాఠ్యభాగం ఆచార్య జక్కంపూడి మునిరత్నంగారు రచించిన ''భావనా తరంగిణి'' అనే వ్యాస సంపుటినుండి గ్రహింప బడింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేసి ఉద్యోగ విరమణపొందారు. స్వయంకృషితో పలుభాషలు నేర్చారు. వీరు 15 శతకాలతో పాటు నాటక వ్యాసాలు, తాళ్ళపాక కవుల సాహితీకిరణాల వంటి విమర్శనాత్మక వ్యాసాలు, తలపుల పందిరివంటి వచన కవితా సంపుటాలు, 'విపంచిక' అనే గేయ సంపుటాన్ని వెలువరించారు. తమిళంలోను అనేక రచనలు చేశారు.

సత్యవంతుడు త్వరగా చని పోతాడని తెలిసినా అతన్నేవరించి, సావిత్రిపడ్డ కష్టాలు, చివరికి స్వయం ప్రతిభతో అన్నిటినీ అధిగమించడం ఈ వ్యాసంలో రమణీయంగా చర్చించ బడింది.]

సావిత్రి పరమపతివ్రత. సాధ్వీమణులందరికీ ఆదర్శనీయురాలు. దేవతలకు కూడా వందనీయురాలు. అభినందనీయురాలు.

మద్ర దేశాధిపతి అశ్వపతి. అతని కుమార్తె సావిత్రి. ఈమె అందరిలాగా సహజంగా పుట్టినబిడ్డగాదు. పద్దెనిమిది సంవత్సరాల తపస్సుకు ఫలితం. సావిత్రికి యౌవనం వచ్చింది. సౌందర్యం హెచ్చింది. ఆమె అందం దేవకన్యల అందాన్ని కూడా అపహసించింది. సావిత్రి గుణవయోరూపాల కనుకూలుడైన భర్తను సంపాదించడమెలా ? అని అశ్వపతి విచారగ్రస్తుడయ్యాడు. ద్యుమత్సేనుని కొడుకు సత్యవంతుడు, రూపవంతుడు, గుణవంతుడు అని విన్నది. మరులు గొన్నది. గుట్టుచప్పుడుగాకుండా ఉండిపోయింది సావిత్రి.

ఒకరోజు నారదుడు వచ్చాడు అశ్వపతి సముచితంగా సత్కరించాడు. చెలికత్తెలతో వచ్చిన సావిత్రి వారిని కొంతదూరంలో నిలిపింది. తాను మాత్రమే వచ్చి సవినయంగా నమస్కరించింది. యుక్తవయస్కురాలైన ఈమెను తగిన వరునికివ్వక ఎందుకిలా ఉంచేశావని నారదుడు అశ్వపతిని ప్రశ్నించాడు. ఆమెకు తగిన వరుడెవ్వడూ తనకు స్ఫురించనందువల్ల ఆమెనే చూసుకొమ్మన్నాడు

అశ్వపతి. తన మనస్సునదివరకే హరించిన సత్యవంతుని వరించినట్లు సావిత్రి చెప్పింది. రాజ్యాన్ని కోలుపోయి అంధులై అడవిలో తపిస్తున్న తల్లిదండ్రులతో పాటు సత్యవంతుడు కూడా అడవిలో ఉన్నట్లు చెప్పింది. ప్రీతితో అతనికిచ్చి పెండ్లి చేయమంది. రాజు కోరిక మీద నారదుడు సత్యవంతుని సద్గుణాలను తెలియజేశాడు. సంవత్సరానికల్లా అతడు మరణిస్తాడని కూడా చెప్పాడు. అశ్వపతి సావిత్రిని మరోవరుణ్ణి కోరుకొమ్మన్నాడు. ఆమె అందుకు అంగీకరించలేదు. మనమున గైకొన్న భర్త మానందగునే? అని తన సంకల్ప స్థిరత్వాన్ని స్పష్టం చేసింది. 'దీని తలంపు మాన్పగా మనకు నశక్యమని' నారదుని చేతనే చెప్పించింది. దుస్థితిలోఉన్నా, దుర్మరణం పాలుగానున్నా సలక్షణసంపన్నుడైన సత్యవంతుణ్ణేవరించి సావిత్రి తన ధీరతను, వివేకాన్ని ప్రదర్శించింది.

నారదుని ఆదేశానుసారం సపరివారంగా కుమార్తెను వెంటబెట్టుకొని అశ్వపతి అరణ్యానికి వెళ్ళాడు ద్యుమత్సేనుని కలుసుకొన్నాడు. తానువచ్చిన పని తెలియజేశాడు. అతనిని ఒప్పించాడు. సావిత్రీ సత్యవంతుల వివాహం సలక్షణంగా జరిగింది.

సావిత్రి రాకుమార్తెలు ధరించే భూషణాంబరాలు పరిత్యజించింది. వనవాస యోగ్యమైన వల్కలాజిన వసనగా భర్తృ శుశ్రూషలో కాలం గడపసాగింది. మాటలతో, చేతలతో అత్తమామలను సంతోషపరిచింది. నారదుడు చెప్పిన రోజునుండి సావిత్రి రోజులు లెక్కపెడుతూ వచ్చింది. సంవత్సరం పూర్తి కావడానికింక నాలుగురోజులు మాత్రమే ఉన్నాయి. నాల్గవరోజు భర్తృ మరణకాలమని సావిత్రి గుర్తించింది. త్రిరాత్రోపవాస పరమయిన వ్రతమొకదాన్ని ప్రారంభించింది. కారణమడిగాడు ద్యుమత్సేనుడు. చెబితే ఇంకేమయినా ఉందా? కొంపమునుగుతుంది. ముందుగానే హరీమంటారు ముసలాళ్ళు. తనప్రయత్న మంతా వ్యర్థమౌతుంది. సావిత్రికి ఈ సంగతి తెలుసు. అందుకే చెప్పకుండా జాగ్రత్తపడింది. శుభాలకోసం చేస్తున్నాను. కారణం తర్వాత

తెలుసుకోవచ్చు అని అప్పటికి సులువుగా తప్పించుకొంది.

నాల్గవ రోజువచ్చింది. సావిత్రి వేకువ జామున్నే లేచింది. కాలోచిత కృత్యాలు తీర్చుకుంది. భర్తకు అత్తమామలకు పరిచర్యలు చేసింది. బ్రాహ్మణులకు మ్రొక్కింది. వారందరి చేతా సౌభాగ్యవర్ధనంగా వర్ధిల్లుమని దీవెనలు పొందింది. ద్యుమత్సేనుడు పారణచేయమన్నాడు. ఆమె అందు కంగీకరించ లేదు. భర్తమరణ భయం, బాధ ఆమె మనసును అంగీకరించనీయ లేదు. నాడు కూడా 'వ్రతదీక్ష' అని దాటవేసింది.

సమిత్కుశ ఫలాహరణార్థం సత్యవంతు డడవికి బయలుదేరాడు. సావిత్రికి ఇంటనుండ బుద్ధికాలేదు. తనభర్తకు ఎప్పుడు ఏంజరుగుతుందో అనే తపన తొందర చేసింది. అతనితో వెళ్ళడానికి నిశ్చయించింది. తననుకూడ వెంట తీసుకవెళ్ళుమని సత్యవంతుని కోరింది. ఉపవాసబడలికతో ఉన్నందు వల్ల వద్దని వారించాడు సత్యవంతుడు. సావిత్రిలో ఆరాటం హెచ్చింది. 'ఉపవాస శ్రమమిప్పుడించుకయు నాయుల్లంబునందోపదు' అంది. వనసౌందర్యాన్ని చూడాలనే కుతూహలం తనకు ఎక్కువగా ఉందని సత్యవంతుని ఒప్పించింది. ఎప్పుడు ఏ కోరిక కోరని ఆమెకోరిక వారినిగూడా ఒప్పించింది.

సావిత్రిమనసులో అగ్నిపర్వతాలు ప్రజ్వరిల్లుతున్నాయి. బయటపడేందుకు వీలులేదు. సమయమూకాదు. పెదవిమీద బలవంతంగా చిరునవ్వు పులుముకొంది. సావిత్రి సత్యవంతునితో అడవికి వెళ్ళిన తీరును ఎఱ్ఱన ఎంతో హృద్యంగా వర్ణించాడు.

సత్యవంతుడు వనసౌందర్యాన్ని చూపుతూ వెళ్ళసాగాడు. తనమనసులో వికారాన్నణచుకుంటూ అతని తీరు జాగ్రత్తగా గమనిస్తూ, చూస్తూ, వింటూ, సావిత్రి వెంబడించింది. సత్యవంతుడు మధుర ఫలాలు కోసి బుట్టనిండించాడు.

నిరంతర నిశ్వాసవేగ వివర్ణవదనుడయ్యాడు. సావిత్రితో ఇలా అన్నాడు. ''ఒడలు వశముగాదు, మనస్సు భ్రమపడుతున్నట్లు తూలుతూ ఉంది. తల శూలంతో పొడుస్తున్నట్టు బాధగాఉంది. నిలబడలేను శ్రమతీరేటట్టు ఇక్కడ కొంత సేపు పడుకొంటాను''.

ఆపదసమీపించింది. ఆ సంగతి నామె గ్రహించింది. దైవ విశ్వాసంవల్ల కలిగిన ఆత్మవిశ్వాసం ఆమెధైర్యాన్ని కొంచెంగూడ సడలనియ్యలేదు. ఆమె కళ్ళలో కాంతి తగ్గలేదు. ఆమెలో ఆందోళన కలిగింది. అయినా వెలిబుచ్చ లేదు. పదిలంగా తనలోనే దాచుకుంది. అతడు సోలి వాలి నిశ్చేతనుడై ఉండిపోయాడు. సావిత్రి కొంతసేపటికి అంత్యకాల దహన జ్వాలాప్రచండంగా పటుపాశహస్తోద్ధతుడైన దివ్యపురుషున్నొకణ్ణి చూసింది. అతడు సంభ్రమంగా సత్యవంతుని సమీపించాడు. ఆమె ఎంతోభయంతో భర్త శిరస్సును నేలమీదికి చేర్చింది. కృతాంజలితో ''అయ్యా ! మీరెవ్వరు ? ఏమి చేయడానికిలా వచ్చారు ? అనిప్రశ్నించింది. తాను కాలుడనని సత్యవంతుని ప్రాణాలు తీసుకపోవడానికి వచ్చానని పాతివ్రత్య మహిమవల్ల సావిత్రి తన్ను చూడగలిగిందని'' వచ్చిన వ్యక్తి చెప్పాడు.

ఉగ్రంతో రాకుమారుని శరీరంలో ఉన్న జీవుని వెడలదీసి భయదపాశ బద్ధుని చేశాడు. దక్షిణాభిముఖుడై ఘోరమార్గంలో వెళ్ళసాగాడు. సావిత్రి నిశ్చేష్టురాలై నిలబడి పోలేదు. గొల్లుమని ఏడవలేదు. సాహసించింది. భర్తశవాన్ని భద్రపరచింది. పైకొన్న శోకంతో తడబడే అడుగులతో యముణ్ణి వెంబడించింది. మార్గ మగమ్యమని యముడువారించాడు. అయినా ఆమె ఆగలేదు. ముందుకు సాగింది. సమవర్తితో సంభాషణ సాగించింది. పతులతో వెళ్ళడమే సతులకు కర్తవ్యమంది. తనపతిభక్తివల్లను యముని కరుణవల్లను తనకు వెళ్ళరాని చోట్లు లేవంది. సజ్జనశేఖరుడైన యముని చూచిగూడా శుభాలు పొందకుండా పోకూడదంది. 'ప్రశంస కుబ్బనివారుండరు'. అనే రహస్యమెరిగిన జాణ సావిత్రి. యముడు కూడా బోల్తాపడ్డాడు. భర్తప్రాణం మినహా యేదైనా కోరుకొమ్మన్నాడు. ఏ ఉత్తమ ఇల్లాలైనా మెట్టినింటికే ప్రాధాన్యతనిస్తుంది. సావిత్రి కూడా

ద్యుమత్సేనుని చక్షుఃపునర్లాభం కోరింది. యముడంగీకరించాడు. 'మరలు' మన్నాడు అయినా ఆమె అతన్ననుసరించింది.

ఆర్య ధర్మాలను గురించి ప్రసంగించింది. 'నీవెరుగని ధర్మమేదీలేదని' యముణ్ణికొనియాడింది. 'యమ' శబ్దసార్థకతనుగురించి కూడా ముచ్చటించింది. యముడామె వాగ్ధోరణికి హర్షించాడు. సత్యవంతుని ప్రాణాలుతప్ప మరేదైనా కోరుకొమ్మన్నాడు. తమకు 'పునఃరాజ్య ప్రాప్తి'కోరింది సావిత్రి. 'అట్లే యగును మరలు మన్నాడు' యముడు. అయినా సావిత్రిని మరలింపలేకపోయాడు. సావిత్రి ధర్మాత్ముల పట్టుదలను గురించి చెప్పింది. యముణ్ణి 'ధర్మాధ్యక్షుడ'ని కొనియాడింది. పతిసహగమున మనివార్యమంది. మోహాన్ని విడనాడి ధర్మస్థితి నడపాలని సావిత్రికోరింది. భర్తప్రాణం మినహా మరోవరం కోరుకొమ్మన్నాడు యముడు.

మెట్టినింటి అవసరాలు చాలా మట్టుకు తీరిపోయాయి. ఆమె దృష్టి పుట్టింటి మీదికి వెళ్ళింది. తన తండ్రికి పుత్రశతలాభం కోరింది. యముడు అంగీకరించాడు. చాలాదూరం వచ్చి డస్సినందువల్ల వెనుదిరగమన్నాడు. సావిత్రి తనమనస్సు భర్తృచరణసంలగ్నమయి ఉందంది. సతులకు భర్తృసంశ్రయం మినహా ఇతరమేదీ అపేక్షణీయం కాదంది. ధర్మనిరతుల గొప్పదనంగురించి మళ్ళీ మాట్లాడింది. 'సఖ్యం సప్తపదాధీనం' అనే ఆర్యోక్తి చెప్పింది. దాని ప్రకారం యముడు తనకిప్పుడు మిత్రుడంది. మిత్ర మనోరథ మవశ్య కర్తవ్యం కాబట్టి తన అభీష్టం నెరవేర్చమంది. యముడు ప్రసన్నుడయ్యాడు. మరోవరం కోరుకొమ్మన్నాడు. సావిత్రి భర్తృజీవితం కోరింది. యముడు సత్యవంతుని పాశవిముక్తుని చేశాడు.

సావిత్రి తిరిగివచ్చింది. యథాపూర్వకంగా భర్తశిరస్సును తొడమీద ఉంచుకొంది. కొంతసేపటికి సత్యవంతుడు లబ్ధచేతను డయ్యాడు. తన దీర్ఘ

నిద్రగురించి, వచ్చిన దివ్యపురుషునిగురించి అడిగాడు. అసలే అస్వస్థుడు. ఆ సంగతులన్నీ అప్పుడేచెబితే భయపడే అవకాశముంది. కాబట్టి సావిత్రి చెప్పదలచుకో లేదు. రేపు చెబుతానని దాటవేసింది. ఆలస్యమైందంది. అంధకారం వ్యాపించిందంది. అరణ్యం భీకరమంది. ఆశ్రమానికి వెళ్ళాలని తల్లిదండ్రులను చూడాలని ఉద్బోధించి అతని దృష్టి వృద్ధదంపతుల మీదికి మళ్ళించింది. తన తల్లి దండ్రు లేమయ్యారో అనే బెంగతో దుఃఖించిన సత్యవంతుణ్ణి ఊరడించింది. సవినయంగా ద్యుమత్సేనునికి తక్కిన మునులకు అడివిలో జరిగిన సంగతులు వారికోరికమీద నివేదించింది. 'నిగర్వి' అనిపించుకొంది. అందరి దీవెనలు పొందింది.

సావిత్రి తన ఆదర్శవర్తనతో సౌందర్యవిలసనంతో మృదుమధుర భాషణతో, చక్కనిజ్ఞానంతో, సంస్తవనీయచరిత్రతో పలువురి ప్రశంసలు పొందింది. సావిత్రిని 'గుణముల ప్రోక' అని నారదుడు కొనియాడాడు.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

అశక్యం = అసాధ్యం ; ధీరత = ధైర్యగుణం ; పరిత్యంజించుట = వదలి పెట్టుట ; వల్కలాలు = వస్త్రాలు ; కాలుడు = యముడు ; చక్షుః పునర్లాభం = చూపురావడం ; సఖ్యం = స్నేహం ; అంధకారం = చీకటి; సమవర్తి = యముడు.

**ప్రశ్నలు :**

1. సావిత్రి ఎవరికుమార్తె ?
2. సావిత్రి తండ్రి ఎవరు ?
3. సావిత్రి భర్త ఎవరు ?
4. సత్యవంతుడు మరణిస్తాడని ఎవరు చెప్పారు ?
5. అరణ్యంలో సావిత్రి ఎవరిని చూసింది ?

6. యముణ్ణి మెప్పించి సావిత్రి ఏమిపొందింది ?

**వివరణ ప్రశ్నలు :**

1. సావిత్రి గొప్పదనాన్ని తెలియజేయండి.
2. సావిత్రి సత్యవంతుని వివాహమాడిన విధం తెల్పండి.
3. సావిత్రి సత్యవంతున్ని ఎలా బ్రతికించుకుంది ?
4. సావిత్రి యముణ్ణి పొగడిన విధాన్ని తెల్పండి.

**సందర్భాలు :**

1. అయ్యా ! మీరెవ్వరు ? ఏమిచేయడాని కిలా వచ్చారు ?
2. ఉపవాసశ్రమ మిప్పుడించుకయు నాయుల్లంబునం దోపదు.
3. నీవెరుగని ధర్మ మేదీ లేదు.

**సొంతవాక్యాలు :**

1. వేకువజాము
2. ఆందోళన
3. ప్రశంస
4. ఆత్మవిశ్వాసం.

**కార్యాచరణం :**

అనసూయ, సుమతీలాంటి పతివ్రతల కథలను సేకరించండి.

★ ★ ★ ★ ★

# 8. త్యాగరాజు

**- ఆచార్య కె. సర్వోత్తమరావు**

['త్యాగరాజు' రచయిత ఆచార్య కె. సర్వోత్తమరావుగారు. వీరు తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖలో ఆచార్యులుగా పనిచేశారు. వీరు బహుభాషాకోవిదులు ; బహుగ్రంథకర్తలు. బాలసాహిత్య రచనలో అందెవేసిన చేయి రావుగారు.]

సకల కళలలోను సంగీతానికి ప్రథమస్థానం ఉంది. ఇట్టి సంగీత ప్రపంచంలో 'గాయక త్రయం' అని ప్రసిద్ధులైనవారిలో త్యాగరాజు ఒకడు. ఈయన జీవిత చరిత్ర ఈ పాఠంలో ఎంతో మనోహరంగా వర్ణింపబడింది.

తంజావూరు జిల్లాలో కావేరినదీతీరంలో 'తిరువారూర్' అనే గ్రామంవుంది. ఆ గ్రామంలోనే 04-5-1767 న వాగ్గేయ కారుడు త్యాగయ్య జన్మించాడు. వీరు కాకర్లవంశానికి చెందినవారు. భరద్వాజ గోత్రులు, ములికినాటి బ్రాహ్మణులు, త్యాగయ్య తల్లి సీతమ్మ ; తండ్రి రామబ్రహ్మం గారలు. తల్లి సీతమ్మ పురందరదాసు కీర్తనల్ని, జయదేవుని అష్టపదుల్ని శ్రావ్యంగా పాడుతూంటే, తన్మయత్వంలో కళ్ళుమూసుకొని ధ్యానిస్తూ ఆనందబాష్పాలు రాల్చేవాడు.

సమీపంలోని తిరువైయారు గ్రామంలో శొంఠివెంకటరమణయ్య అనే సుప్రసిద్ధ సంగీత విద్వాంసుడు వుండేవాడు. రామ బ్రహ్మం త్యాగరాజును వెంకట రమణయ్య దగ్గరే శిష్యునిగా చేర్పించాడు. 'రొట్టెవిరిగి నేతిలో పడ్డట్ట'య్యింది త్యాగయ్యకు. త్వరలోనే గురువు మెచ్చుకొనే శిష్యుడయ్యాడు త్యాగయ్య.

త్యాగరాజు యుక్త వయస్కు డయ్యాడు. గురువుగారి వద్ద చెప్పుకో వలసిందల్లా క్షుణ్ణంగా నేర్చుకున్నాడు. ప్రసిద్ధ వైణికులు వీణకాళహస్తయ్య త్యాగయ్యకు మేనమామ. వీరివద్ద ఎన్నోసంగీత గ్రంథాలు ఉండేవి. అవన్నీ పరిశీలించినా త్యాగయ్యకు సందేహాలు పూర్తిగా తీరలేదు. ఇలావుండగా ఒకవిచిత్రం జరిగింది.

నారదమహర్షి సన్యాసి వేషంలో త్యాగయ్య ఇంటికి వచ్చి 'స్వరార్ణవము' – 'నారదీయము' – అనే గ్రంథాల్ని ఇచ్చాడు. వాటిని చదవగానే త్యాగయ్య సందేహాలన్నీ మంచు కరిగినట్లు తీరి పోయాయి.

తిరువైయారులో పంచనదీశ్వరాలయం వుంది. అందులో దక్షిణకైలాసమనే మంటపంకూడావుంది. త్యాగయ్య ఆమండపంలోకూర్చొని మధ్యాహ్నవేళ రామతారక మంత్రాన్ని జపించడం మొదలు పెట్టాడు. 38 ఏళ్ళకే 96 కోట్ల పునశ్చరణ చేశాడు. త్యాగయ్యకు సర్వం రామమయమయింది. బాలమోహన–రూపంలో రాముడు సాక్షాత్కరించాడు. త్యాగయ్య దివ్యతేజస్సుతో ప్రకాశించాడు.

త్యాగయ్యపూర్వులు రాజుల్ని ఆశ్రయించి జీవనోపాధి కల్పించు కొన్నవారే. త్యాగయ్యకు ఆ పద్ధతి నచ్చలేదు. త్యాగయ్య ప్రశస్తినివిని తంజావూరు రెండవ శరభోజి మహారాజు ఆయన్ని చూడాలని ఉబలాట పడ్డాడు. మహారాజు ఆంతరంగికులు త్యాగయ్య దగ్గరికి వచ్చి, మహారాజుకోరిక తెలుపుతూ, ఒకటి రెండు పాటలు ప్రభువుల పేర పాడితే 10 ఎకరాల భూమి పారితోషికంగా ఇవ్వబడుతుందనికూడా ఆశ చూపారు. కానీ త్యాగయ్యకు ఈ వ్యవహారం చికాకు కలిగించింది.

**'నిధిచాల సుఖమా – రాముని**

**సన్నిధి సేవ సుఖమా –**

**నిజము తెల్పుము మనసా !'** – అని ప్రశ్నించుకొని శరభోజి కానుకల్ని నిరాకరించాడు.

త్యాగయ్య ఎక్కువకాలం రామపంచాయతన పూజల్లో మునిగిపోయేవాడు. అన్న జపేశయ్యకు ఈధోరణి నచ్చ లేదు. వాటిని కావేరినదిలో పడవేశాడు. విగ్రహాలు లేక పోవడం గమనించిన త్యాగయ్య దిగ్భ్రాంతుడయ్యాడు. చాలాక్రుంగి పోయాడు. రామనామ జపంలో పలవరించ సాగాడు. ఒకనాడు రాముడే కలలో కనబడి కావేరీ ఘట్టంలోదాగి వున్నానని చెప్పాడు. వెదకి తెచ్చి మరల పూజించడం

మొదలు పెట్టాడు. అప్పుడే 'కనుగొంటినీ శ్రీరాముని నేడు' అనే కీర్తన పాడాడు త్యాగయ్య.

కంచిలో 'ఉపనిషత్ బ్రహ్మ' అనే విద్వాంసుని ఆహ్వానంపై కొన్నాళ్ళుండి. అక్కడి ఏకామ్రనాథస్వామిని, కామాక్షీ దేవిని, వరదరాజ స్వామిని దర్శించి, భక్త్యావేశంతో ఎన్నో కీర్తనలు పాడాడు. తరువాత తిరుపతి, పుత్తూరు, మదరాసు సమీపంలోని తిరువొత్తియూరు క్షేత్రాలను దర్శించారు. మరొక పుణ్యక్షేత్రం కోవూర్ ను గూడా దర్శించాడు. ఆ గ్రామంలో సుందర ముదలియార్ ధనవంతుడు. తన ప్రార్థనను మన్నించి తమ గ్రామానికి విచ్చేసిన త్యాగయ్యకు ఏవిధంగానైనా సహాయపడాలనుకున్నాడు. త్యాగయ్యకు తెలియకుండా పల్లకిలో వేయిబంగారు నాణేల్ని దాచాడు. ఈ డబ్బును రామకైంకర్యానికి వినియోగించ వలసినదిగా శిష్యుల్ని కోరాడు. త్యాగయ్య ఈ క్షేత్రంలో ఐదు చక్కని కీర్తనలు పాడాడు. దారిలో ఎన్నోక్షేత్రాల్ని దర్శించి ఆయా ప్రదేశాల్లోని దేవుళ్ళను మనసారా కీర్తించి తిరువైయారుకు మరలారు. అడవి మార్గంలో ప్రయాణం. దొంగలు పల్లకిని, పరివారాన్ని దూరంనుండే గుర్తించారు. ఉన్నట్టుండి నలువైపులా చుట్టుముట్టారు. ఇది తెలిసి త్యాగయ్య శిష్యులతో 'దొంగలంటే జడుసు కుంటా రెందుకు ? వారికి కావలసిన వస్తువులు మనదగ్గరేం లేవే ?' అన్నాడు. శిష్యులు వేయి బంగారునాణేల విషయం చెప్పారు. వెంటనే త్యాగయ్య 'అలాగైతే ఆడబ్బును దొంగలకు ఇచ్చేయండి' అన్నాడు శిష్యులు 'స్వామీ ! దీన్ని రామనవమి ఉత్సవాల కోసం భక్తుడిచ్చినది' అన్నారు 'అయితే ఆ డబ్బును దేవుడే కాపాడుకొంటాడు ; మధ్యన మనమెందుకు బాధపడాలి ?' అన్నాడు త్యాగయ్య.

**'ముందు వెనుకల ఇరు ప్రక్కలతోడై**

**మురహర ఖరహర రారా రారా'** అంటూ కీర్తించాడు. మరుక్షణమే ఇద్దరు యువకులు దొంగలపై బాణవర్షం కురిపించారు. దొంగలు పారిపోయారు.

ఉదయం దాకా ఆయువకులు పల్లకి వెంబడేవున్నారు. బాగా తెల్లవారిన తర్వాత దొంగలు మరలవచ్చి త్యాగయ్య పాదాలపైపడి క్షమాభిక్ష వేడారు. వారికి త్యాగయ్య రామమంత్రోపదేశం  చేశాడు.

వాల్మీకి రామాయణంలో 24 వేల శ్లోకాలున్నాయి. త్యాగయ్య గూడ 24 వేల కీర్తనలు వ్రాశాడట. కానీ అచ్చుయినవి 660 వరకు మాత్రమే మనకు కనిపిస్తాయి. వీరి ప్రతికీర్తన 'త్యాగరాజ వినుత' అనే ముద్రతో కూడిఉంటుంది. త్యాగయ్య 'ప్రహ్లాదభక్తివిజయము' నే ఐదంకాల పెద్దనాటకాన్నీ 'నౌకాచిత్రము'నే గేయనాటకాన్నీ 'సీతారామవిజయము'నే మరో నాటకాన్నీ కూడా వ్రాశాడు. సుమారు 200 రాగాలను త్యాగయ్య పాడినట్లు పెద్దలు చెబుతారు.

త్యాగయ్య భక్తికి ప్రాధాన్యమిచ్చాడు. డాంబికాచారాల్ని, ప్రజల బలహీనతల్ని, రాజులకుటిల వర్తనాలను, శిష్టవ్యావహారికంలో సూటిగా విమర్శిస్తూ ఆవేశాత్మకంగా కీర్తనలు రచించాడు. త్యాగయ్య ఎన్నో పంచరత్న కీర్తనలు వ్రాసినా, ఘనరాగ పంచరత్న కీర్తనలకే విశేష ప్రాచుర్యం ఉంది.

కలలో రాముడు సెలవిచ్చిన ప్రకారం క్రీశ 1847 పుష్య బహుళ చవితి రోజు ఉదయం 11 గం.కు 'పరమాత్ముడు – జీవాత్ముడు' అన్న కీర్తనను వాగధీశ్వరి రాగంలోను, 'పరితాపము' అనే కీర్తనను మనోహరిరాగంలోను గానం చేసి, యోగ సమాధిలో కూర్చొన్నారు. త్యాగయ్యకు కపాలం పగిలి ఒక దివ్య తేజస్సు పై కెగిరి పోయింది. త్యాగయ్య కోరికపై శిష్యులు, గురువు శొంఠి వెంకట రమణయ్య సమాధి ప్రక్కనే అంత్యక్రియలు చేసి, బృందావనం నిర్మించారు. బెంగళూరు నాగరత్నమ్మ తాను సంపాదించిన ధనమంతా ఖర్చుపెట్టి 1925లో త్యాగరాజు సమాధిపైన ఆలయం కట్టించింది. 1945 నుండి ఆరాధన మహోత్సవ సభలు ప్రతిఏటా ఘనంగా జరుగుతుంటాయి.

తమిళ దేశంలో జన్మించి, తెలుగులో కీర్తనలు వ్రాసి, కర్ణాటక సంగీతంలో కృతుల్ని వెలువరించిన త్యాగయ్య ధన్యజీవి. నిరాడంబరమైన జీవితం, నిశ్చలమైన

రామభక్తి, నిరంతర నాదోపాసన సంగీతసామ్రాజ్యానికి ఆయన్ను సార్వభౌముణ్ణి చేశాయి. అందుకే రాయప్రోలు సుబ్బారావు గారు

**"నాద ధేనువు పిండి నవనీతమందించె**

**త్యాగరాజస్వామి తన్మయుండు"**-అంటూ త్యాగయ్యకు నివాళులర్పించారు.

**అభ్యాస వేదిక :**

**అర్థాలు :**

క్షుణ్ణంగా = వివరంగా ; దిగ్భ్రాంతి = దిక్కుతోచని స్థితి ; జీవనోపాధి = కుటుంబ పోషణ ; చికాకు = విసుగు ; శ్రావ్యంగా = ఇంపుగా.

**లఘు ప్రశ్నలు :**

1. త్యాగయ్య జన్మదినమేది ?
2. త్యాగయ్య తల్లి దండ్రులెవరు ?
3. త్యాగయ్య గురువు ఎవరు ?
4. త్యాగయ్య తన కీర్తనలలో దేనికి ప్రాధాన్యమిచ్చారు ?
5. త్యాగయ్యను కంచికి రమ్మని ఆహ్వానించిన దెవరు ?
6. త్యాగయ్య సమాధిపై ఆలయ నిర్మాణం చేసిన వారెవరు ?
7. త్యాగయ్యకు సన్యాసి వేషంలో వచ్చి గ్రంథములిచ్చిన వారెవరు ?

**ప్రశ్నలు :**

1. తిరువైయార్‌లో త్యాగయ్యకు రామసాక్షాత్కారం ఎలా కలిగింది ?
2. త్యాగయ్య రామపూజకు భగ్నం ఎలా కలిగింది ? ఆ తరువాత ఏమైంది ?

3. త్యాగయ్యగారి కోవూరు క్షేత్ర సందర్శనం విశేషాంశాలు తెల్పండి.

4. త్యాగయ్య ఎలా నిర్యాణం చెందాడు ?

**సందర్భాలు :**

1. నిధిచాల సుఖమా ? రాముని సన్నిధి సేవ సుఖమా ?


2. అయితే ఆడబ్బును దేవుడే కాపాడు కుంటాడు.

3. 'కావేరీ ఘట్టంలో దాగి వున్నాను'.

**కార్యాచరణం :**

పురందరదాసు, కనకదాసు, ముత్తుస్వామిదీక్షితుల జీవితములను సేకరించుము.

★ ★ ★ ★ ★


Grid Tied Solar Electric System
Solar (Photovoltaic or PV) panels turns photons from the sun into DC electricity
The AC electricity you do not use is sent back to the grid
Micro-inverters mounted on each PV panel will convert the DC voltage from the PV Panel to voltage suitable for your home.



# వ్యాకరణము

## సంధులు

## ఛందస్సు

## అలంకారాలు

# సంధులు

**సంధి :** పూర్వపర స్వరంబులకు పరస్వరంబు ఏకాదేశం బగుట సంధియన బడును.

రాముడు + అతడు = రాముడతడు

**అకారసంధి :** సూత్రము:– అత్తునకు సంధి బహుళముగానగు.

రామ + అయ్య = రామయ్య

చింత + ఆకు = చింతాకు

పెద్ద + అన్న = పెద్దన్న

**ఇకారసంధి :** సూ : ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు.

ఏమి + అంటివి = ఏమంటివి ; ఏమియంటివి.

**ఉకారసంధి :** ఉత్తునకచ్చు పరమగునపుడు సంధినిత్యం.

రాముడు + అతడు = రాముడతడు

అతడు + ఎక్కడ = అతడెక్కడ

వాడు + అనెను = వాడనెను

చోటు + ఇచ్చు = చోటిచ్చు

ఇట్లు + అనియె = ఇట్లనియె

దళము + ఎక్కి = దళమెక్కి

కాలు + ఆడు = కాలాడు.

**యడాగమసంధి :** సూ : సంధిలేనిచోట స్వరంబుకంటె బరంబయిన స్వరంబునకు యడాగమంబగు.

మా + ఇల్లు = మా + య్ + ఇల్లు = మాయిల్లు.

మీ + అమ్మ = మీయమ్మ

హరి + అతడు = హరియతడు.

**గసడదవాదేశసంధి:** సూ : ప్రథమ మీది పరుషములకు గసడదవలు బహుళంబుగానగు

అతడు + కలవాడు = అతడుగలవాడు

వాడు + చేసెను = వాడు సేసెను

వారు + పోయిరి = వారువోయిరి.

ఇతడు + టక్కరి = ఇతడుడక్కరి

ఇట్లు + పలుక = ఇట్లువలుక

వాడు + పోగా = వాడువోగా

**సరళాదేశసంధి :** సూ : ద్రుతప్రకృతికముమీది పరుషములకు సరళములగు.

పూచెను + కలువలు = పూచెనుగలువలు

తోచెను + చుక్కలు = తోచెనుజుక్కలు

సూ : ఆదేశ సరళములకు ముందున్న ద్రుతమునకు బిందు, సంశ్లేషములు విభాషనగు.

ద్రుతమనగా న కారము, పూచెంగలువలు, పూచెన్గలువలు, తోచెంజుక్కలు, తోచెన్జుక్కలు.

**ఆమ్రేడితసంధి :** సూ : అచ్చునకు ఆమ్రేడితము పరంబగునపుడు సంధి తఱచుగనగు.

ఔర + ఔర = ఔరౌర

అయ్యో + అయ్యో = అయ్యయ్యో

ఎట్టో + ఎట్టో = ఎట్టెట్టో

అందున్ + అందున్ = అందందున్.

**ప్రాతాదిసంధి :** సూ: సమాసంబునం బ్రాతాదుల తొలియచ్చు మీది వర్ణంబులకెల్ల లోపంబు బహుళంబుగ నగు.

ప్రాత + తోట = ప్రాదోట

లేత + కొమ్మ = లేగొమ్మ

లేత + పచ్చిక = లేబచ్చిక.

**పుంప్వాదేశసంధి :** సూ : కర్మధారయంబులందు మువర్ణమునకు పు,ంపు లాదేశమగు.

సరసము + మాట = సరసపుమాట, సరసంపుమాట

విరసము + వాక్కు = విరసపువాక్కు, విరసంపువాక్కు

నిక్కము + నీలము = నిక్కపునీలము, నిక్కంపునీలము.

**ద్విరుక్తటకారసంధి :** సూ : కుఱు, చిఱు, కడు, నడు, నిడు శబ్దముల ఱ, డ ల కచ్చు పరంబగునపుడు ద్విరుక్త టకారంబగు.

కుఱు + ఉసురు = కుట్టుసురు

చిఱు + ఎలుక = చిట్టెలుక

కడు + అలుక = కట్టలుక

నడు + ఇల్లు = నట్టిల్లు

నిడు + ఊర్పు = నిట్టూర్పు.

**త్రికసంధి :** సూ : ఆ, ఈ, ఏ లు త్రికంబులు.

సూ : త్రికంబుమీది అసంయుక్త హల్లునకు ద్విత్వంబు బహుళంబుగానగు.

సూ : ద్విరుక్తంబగు హల్లు పరమగునపుడు ముందున్న దీర్ఘంబునకు హ్రస్వంబగు.

ఆ + చోటు = అచ్చోటు

ఈ + కాలము = ఇక్కాలము

ఏ + అది = ఎయ్యది

ఈ + అవి = ఇయ్యవి

ఈ + కాంత = ఇక్కాంత

ఆ + భంగి = అబ్భంగి.

★ ★ ★ ★ ★

# ఛందస్సు

పద్యాల నియమాన్ని తెల్పేది ఛందస్సు. గురు, లఘువుల కూర్పుతో గణము లేర్పడును. కొన్ని గణాల కూర్పుతో పద్యాలేర్పడును.

**లఘువు :** ఒక్క మాత్ర కాలంలో ఉచ్చరింపబడే అక్షరాన్ని లఘువందురు (ఒకమాత్ర అనగా ఒక క్షణంలో నాల్గవవంతు) హ్రస్వాక్షరాలన్నీ లఘువులు.

**గురువు :** రెండు మాత్రల కాలం, అంతకన్నా ఎక్కువ కాలంలో ఉచ్చరింపబడే అక్షరాలు గురువులు

1. దీర్ఘాలు (ఆ, రా, చా- మొ॥ వి)
2. పూర్ణబిందు పూర్వకాలైన అక్షరాలు (కం, తం)
3. విసర్గతో కూడిన అక్షరాలు (కః, దుః)
4. పొల్లు హల్లుతో కూడిన అక్షరాలు. (క న్, వన్, ముల్)
5. ఒకే పదంలోనిసంయుక్తాక్షరాలకు, ద్విత్వాక్షరాలకు ముందున్న అక్షరాలు

   U U
   చర్య, పిట్ట
6. ఐ, ఔ లు వానితో కూడిన హల్లులు ( కై, కౌ)

U - ఇది గురువుకు గుర్తు (గ)

I - ఇది లఘువుకు గుర్తు (ల)

**రెండక్షరాల గణాలు :**

U U – గగము (రామా)

U I – గలం (రామ) దీనిని హగణమందురు.

I U – లగం (రమా) దీనిని వగణమందురు.

I I – లలము (లత)

**గణములు గుర్తించుట :**

యమాతారాజభానసలగం

ఈవరుస ప్రకారము ఒక్కొక్క అక్షరానికి మూడు అక్షరాలచొప్పున ఒక్కొక్కగణం.

య గణము – య మా తా – I U U

మ గణము – మా తా రా – U U U

త గణము – తా రా జ – U U I

ర గణము – రా జ భా – U I U

జ గణ ము – జ భా న – I U I

భ గణము – భా న స – U I I

న గణ ము – న స ల – I I I

స గణము – స ల గం – I I U

లగం (లేక) వ గణము : ల గం – I U

హ గణము (లేక) గలం – U I

**ప్రాస :** పద్యపాదమందలి రెండవ అక్షరం ప్రాస. మొదటి పాదమున ఉపయోగించిన ప్రాసాక్షరము మిగిలిన పాదములలోను ఉపయోగించవలెను.

**యతి :** పద్యపాదమందలి మొదటి అక్షరం యతి. ప్రతిపాదమందును 'యతి' నియమానుసారంగా రావలెను. నియమాన్ననుసరించి అక్షరాల్ని

కలిగియుండడాన్ని "యతి చెల్లుట" లేక "యతిమైత్రి కుదురుట" అటారు.

ఉదా : <u>ఎ</u>వ్వనిచేజనించు జగ<u>మె</u>వ్వనిలోపలనుండు లీనమై.
1 10

ఈ పద్యపాదంలో మొదటి అక్షరమైన 'ఎ' '10'వ అక్షరమైన జగము + ఎవ్వనిలో 'ఎ'తో సంబంధంఉండి యతి మైత్రి చెల్లినది.

**ఉత్పలమాల :**

1. ప్రతిపాదంలో "భ, ర, న, భ, భ, ర, వ" గణాలు ఉంటాయి.
2. 20 అక్షరాలుంటాయి
3. 10 వ అక్షరం యతిస్థానం.
4. నాలుగు పాదాలుంటాయి.
5. ప్రాసనియమం ఉంటుంది.
6. ప్రాసయతి చెల్లదు.

ఉదా :

| భ | ర | న | భ | భ | ర | వ |
|---|---|---|---|---|---|---|
| U I I | U I U | I I I | U I I | U I I | U I U | I U |
| <u>దూ</u>రిన | లేతవె | ల్గులకు | <u>దు</u>ప్పటి | సెత్తితి | అమ్మలే | పినన్. |
| 1 | | | 10 | | | |

**చంపకమాల :**

ప్రతి పాదంలో 'స–జ–భ–జ–జ–జ–ర గణాలు ఉంటాయి.

21 అక్షరాలుంటాయి.

11వ అక్షరం యతిస్థానం.

నాలుగు పాదాలుంటాయి.

ప్రాసనియమం ఉంటుంది.

ప్రాసయతి చెల్లదు.

ఉదా :

| న | జ | భ | జ | జ | జ | ర |
|---|---|---|---|---|---|---|
| I I I | I U I | U I I | I U I | I U I | I U I | U I U |
| పకప | కనవ్వి | నారుత | లవంచి | తినేనొ | కకొమ్మ | చాటునన్. |
| 1 | | | 11 | | | |

## శార్దూలం :

ప్రతిపాదంలో 'మ–స–జ–స–త–త–గ' గణాలుంటాయి.

19 అక్షరాలుంటాయి

13వ అక్షరం యతిస్థానం

నాలుగు పాదాలుంటాయి

ప్రాసనియమం ఉంటుంది

ప్రాస యతిచెల్లదు.

ఉదా :

| మ | స | జ | స | త | త | గ |
|---|---|---|---|---|---|---|
| U U U | I I U | I U I | I I U | U U I | U U I | U |
| నీవేయ | ర్థమున | న్నువేడె | దవు,దా | నిం జెప్పు | మా నావు | డున్ |
| 1 | | | | 13 | | |

**మత్తేభం :**

ప్రతిపాదంలో 'స – భ – ర – న – మ – య – వ' గణాలుంటాయి.

20 అక్షరాలుంటాయి

14వ అక్షరం యతిస్థానం

నాలుగు పాదాలు ఉంటాయి.

ఉదా :

| స | భ | ర | న | మ | య | వ |
|---|---|---|---|---|---|---|
| I I U | U I I | U I U | I I I | U U U | I U U | I U |
| ధరణీ | చక్రము | సంచలిం | పగస | ముద్ధాంతం | బులైగ్ర | క్కునన్ |
| 1 | | | | 14 | | |

★ ★ ★ ★ ★

# అలంకారాలు

పద్యగద్యాత్మకములైన కావ్యాలను అందమైన భావనలతో అలంకరించునవి అలంకారాలు. ఇవి శబ్దాలంకారాలనియు, అర్థాలంకారాలనియు రెండు విధాలు.

**శబ్దాలంకారాలు :** శబ్దముల వైచిత్రివలన చెవికి ఇంపును గూర్చునవి శబ్దాలంకారాలు.

1. **వృత్త్యను ప్రాసం :** ఒకే అక్షరం అనేక పర్యాయాలు ఆవృత్తి చెందుట.

ఉదా : 1. హరి హరి సిరి యురమునగల

హరి హరిహయుకొరకు దనుజు నడుగంజనియెన్

2. అడుగులు తడబడ బుడుతడు నడిచెను.

**2. ఛేకాను ప్రాసం :**

అర్థ భేదముగల రెండేసి అక్షరములు వ్యవధానము లేకుండా వెనువెంటనే వచ్చుట.

ఉదా : 1. కందర్ప దర్పదములగు సుందర దరహాసరుచులు.

ఇందు దర్ప, దర్ప, దర, దర, అనురెండేసి హల్లులు వెంట వెంటనే ప్రయోగింపబడినవి.

**3. యమకం :** అర్థభేదంగల పదాలు ఆవృత్తి చెందుట. సమాన అర్థముగల అక్షరముల యొక్క జంటగాని, అక్షరసమూహముగాని ఆవృత్తి చెందినచో యమక మందురు.

ఉదా : **లేమా !** దనుజుల గెలువగ **లేమా** ?

**4. లాటానుప్రాసం :** అర్థభేదం లేకున్నను తాత్పర్య భేదంగల శబ్దములు పునరుక్తిచెందుట.

ఉదా : కమలాక్షునర్చించు **కరములు కరములు**

శ్రీనాథు వర్ణించు **జిహ్వ జిహ్వ.**

**ముక్తపదగ్రస్తం :** విడిచిన పదమును మరల గ్రహించి వాడిన ముక్తపదగ్రస్తమగును.

ఉదా : సుదతీ నూతన <u>మదనా</u>

<u>మదనా</u>గ తురంగ పూర్ణమణిమయ <u>సదనా</u>

<u>సదనా</u> మయగజ<u>రదనా</u>

<u>రదనా</u>గేంద్ర నిభకీర్తి రసనరసింహా !

**అర్థాలంకారములు :** అర్థము ప్రధానముగా గలవి అర్థాలంకారములు.

**ఉపమాలంకారం :** ఉపమాన ఉపమేయములకు చక్కని సాదృశ్యము చెప్పుట ఉపమాలంకారం. దీనిలో ఉపమానం, ఉపమేయం, ఉపమావాచకం, సమానధర్మం – అనునాలుగు విభాగాలుండును.

1 2 3 4

ఉదా : <u>"ఆమె ముఖము</u> <u>చంద్రబింబము</u> <u>వలె</u> <u>అందముగా నున్నది"</u>.

1. **<u>ముఖము</u>** – ఉపమేయము – పోల్చబడు ప్రకృతవస్తువు.
2. **<u>చంద్రుడు</u>** – ఉపమానము – దేనితో పోల్చుచున్నారో అది అప్రకృతం.
3. <u>వలె</u> – ఉపమా వాచకం వలె, పోలె, అట్లు, లాగు ఇట్టి పదములు ఉపమావాచక పదములు.

**<u>4.</u>** **<u>అందముగానున్నది</u> :** సమాన ధర్మము. దీనిని బట్టి పోలిక చెప్పబడినది.

**ఉత్ప్రేక్షాలంకారం :** 'ఉత్ప్రేక్ష' అనగా ఊహ. సమాన ధర్మములచే ఒక విధముగ ఉన్నదానిని మరొక విధముగా ఊహించుట ఉత్ప్రేక్ష అనబడును.

ఉదా : ఆ కొండపైనుండి చూచిన చెఱువులు, కుంటలు అద్దపు బిళ్ళలో అనునట్లున్నవి.

★ ★ ★ ★ ★

# నమూనాలు

వ్యాసాలు

లేఖలు

సొంత వాక్యాలు

అపరిచిత గద్యం

# 1. నిరుద్యోగ సమస్య

మన దేశం ఎదుర్కొనుచున్న సమస్యలలో నిరుద్యోగ సమస్య ఒకటి. తిండికి, జీవించుటకు కావలసిన ధనమును సంపాదించుటకు చేయు ప్రయత్నమే ఉద్యోగమనవలెను. ప్రభుత్వము వద్ద గాని. ప్రయివేటు యజమానుల వద్ద గాని పనిచేయుచు నెలకు కొంత జీతమును తీసికొను విధానమునే ఉద్యోగమనుచున్నారు. మనము చేయు ప్రతి ప్రయత్నము ముఖ్యముగా జీవించుటకు చేయు ప్రయత్నమును ఉద్యోగమనవచ్చును. అట్టి ఉద్యోగము లేకపోవుట నిరుద్యోగము. నేడది ఒక పెద్ద సమస్య.

నిరుద్యోగ సమస్య యేర్పడుటకనేక కారణములు కలవు. సగము కారణములు మనంతట మనము కల్పించుకొనినవి. మిగిలినవి సహజముగా నేర్పడినవి. చక్కగా చదివి పెద్ద గుర్తింపు. ప్రసంసాపత్రములు పొందినవారు కుర్చీలో కూర్చుండి, బట్ట నలగకుండ ధనము సంపాదింపవలెనని తలచుట వలన నిరుద్యోగ సమస్య యేర్పడినది. ఉదోగ్యములను మానసికమైనవి, శారీరకమైనవి అని రెండు రకములుగా చెప్పవచ్చును. శాస్త్రజ్ఞులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు (వ్రాయుటయే పనిగ నున్నవారు), మానసికంగా పని ఎక్కువ చేయు వారు, బరువులు మోయుట, వ్యవసాయము, ఫ్యాక్టరీలలో శ్రమ చేయవలసిన ఉద్యోగులు శారీరకంగా పని ఎక్కువ చేయుదురు.

ప్రాచీన కాలమున లేని నిరుద్యోగ సమస్య నేడుద్భవించుటకు ముఖ్యకారణము వృత్తి విద్యల ననుసరించకపోవుటయే. పూర్వకాలమున మన దేశమున కుమ్మరము, కమ్మరము, వడ్రంగము, నేత మొదలగు వృత్తులు కలవు. ఆయా విద్యలయందారి తేరినవారు తమ పిల్లలకు చిన్నతనముననే ఆ విద్యలందు శిక్షణ నిచ్చి నిపుణులుగా చేసెడివారు. అప్పుడు జీవనోపాధికి లోటు లేక సుఖజీవితమును గడిపిరి. దీనివలన సులభముగా వృత్తులలో నేర్పరితనము కలుగుట, జీవనోపాధి కలుగుట జరిగినది. ఆంగ్లేయులు మనదేశమున ప్రవేశించి,

ఆధిపత్యమును పొందిన తరువాత మనలను బానిసలుగా చేయుటకు ప్రయత్నించిరి. మన వృత్తి విద్యలను నాశనము చేసిరి. నైపుణ్యముగల పనివారిని హింసించిరి. తమ దేశమున యంత్రముల ద్వారా ననేక రకముల వస్తువులను తయారుచేసి, తమ వ్యాపారాభివృద్ధికై వానిని మనదేశమున చౌకగా నమ్మసాగిరి. దాని ఫలితముగా నిరుద్యోగులేర్పడుట జరిగినది. వృత్తి పనివారు తమ వృత్తుల ద్వారా కూలిగిట్టిన, జీవనము సాగక కూలిచేయుట మొదలు పెట్టిరి. గాంధీమహాత్ముడు చరఖా పద్ధతి (రాట్నము) ప్రవేశపెట్టెను. ప్రతి యింట రాట్నము తిరగవలెనని చెప్పెను. ఆ కుటుంబములకు కావలసిన వస్త్రములకగు నూలును వారే తయారుచేసికొనుట జరిగినది. దీని వలన కొంత నిరుద్యోగ సమస్య తీరుట, తీరిక సమయములలో ధన సంపాదన చేయుట జరిగినది.

నిరుద్యోగ సమస్య విద్యావంతులలోనే గాక, కాయకష్టము చేయు వారికి, వ్యవసాయదారులకు గూడ కలదు. విద్యావంతులలో మార్పు రావలెను. ఆలోచనలలోనే మార్పు రావలెను. కష్టపడి పనిచేయుట తప్పుగాగాని, హీనముగాగాని భావించరాదు. పరిశ్రమల స్థాపనకై కుటీర, లఘు పరిశ్రమల స్థాపనకై ప్రయత్నించవలెను. వస్తూత్పత్తి యెక్కువ చేయవలెను. ఎగుమతులు పెంచవలెను. దిగుమతులు తగ్గించవలెను. దేశ సంపద కష్టించి పనిచేయగలిగిన ప్రజలపై, వస్తూత్పత్తి చేయగలిగిన నిపుణులపై ఆధారపడియుండునని గ్రహించవలెను.

**ప్రభుత్వము – బాధ్యత:** ప్రభుత్వ విధానములో గూడ మార్పు అవసరము. చిన్న చిన్న పరిశ్రమల స్థాపనకై విద్యావంతులైన నిరుద్యోగులను ప్రోత్సహించి స్వల్ప వడ్డీలపై ఋణము నివ్వవలెను. విశ్వవిద్యాలయములందే గాక ఉన్నత పాఠశాల స్థాయినుండి వృత్తి విద్యలను ప్రవేశపెట్టి విద్యార్థి ఆలోచన, కోరిక స్థాయిని బట్టి ఆయా విద్యలందు ప్రవేశము కల్పించవలెను. అప్పుడు నిరుద్యోగ సమస్య కొంతవరకు తీరును. విద్య, సంస్కారము, సభ్యత, నాగరికతలను పెంపొందించును. చక్కని ఆలోచన విద్యార్థులకు, ప్రజలకు కలుగవలెను. శారీరక,

మానసికమైన శిక్షణలు రెండును మానవుని కవసరమను విషయమును గ్రహించవలెను.

విద్యావంతులు వ్యవసాయరంగమున నిర్వహించవలసిన పాత్రను గుర్తించవలెను. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ననుసరించి పంటల రాబడి అభివృద్ధి చేయవలెను.

వ్యవసాయదారులు తమ తీరిక సమయములందు కాలమును వృథా చేయక గృహ పరిశ్రమలను స్థాపించియు, తగిన పనులు కల్పించుకొనియు వస్తూత్పత్తికి పాటు పడవలెను. దాని వలన దేశము ఆర్థికముగా ఉన్నతిని పొందగలదు.

ప్రభుత్వము ఎంప్లాయిమెంటు ఎక్చేంజీలను నెలకొల్పి ఉద్యోగములు క్రమపద్ధతినయిచ్చు ఏర్పాటు చేసినది. నిరుద్యోగ సమస్య తీర్చుటకు ప్రభుత్వము, ప్రజల సమిష్టి కృషియవసరము.

★ ★ ★

# 2. మాతృభాషలో విద్యాబోధన

ఈనాడు మాతృభాషను బోధనా మాధ్యమముగా చేయుచున్నారు. పాఠ్యగ్రంథములన్నింటిని మాతృభాషలోనికి అనువాదము చేయుచున్నారు. ప్రస్తుతము స్నాతకపట్టమువరకు మాతృభాషలోనే అధ్యయనము చేయించుచున్నారు. మన రాష్ట్రములో వ్యవహారరంగమున ఇంకను ఆంగ్ల భాషను ప్రయోగించుచున్నారు. అయినప్పటికినీ మన ప్రభుత్వకార్యాలయములందు, పరిపాలనా వ్యవహారములందును తెలుగును తప్పనిసరిగా ఉపయోగించవలెనను నిర్ణయము జరిగినది. ఇంకను సంపూర్ణంగా ఆచరణ జరుపవలసి యున్నది.

మనరాష్ట్రములో ప్రజలు మాటలాడు భాషలోనే ప్రభుత్వ వ్యవహారములు నడుపవలెనన్నది ప్రముఖమైన ఉద్దేశ్యము. పరిపాలించెడివారు, పాలింపబడెడి వారు వీరిరువురి వాడుక భాష ఒకటిగా నున్నయెడల ప్రజాస్వామ్యము వర్ధిల్లును. దేశ ప్రజలకు రాజ్యాంగమనగానేమి? చట్ట మనగానేమి? తమ బాధ్యత లెవ్వి? హక్కులేమిటి? అను విషయములు తెలియవలయునన్నచో ప్రభుత్వ వ్యవహారములన్నియు మాతృభాషలో జరుగవలెను. ప్రజాభాషలోనే ప్రభుత్వ వ్యవహారములు జరుగుట సమంజసంగా నుండును. న్యాయస్థానములయందు ప్రజాభాషలోనే వినియోగించవలెను. శాసన సభలో చట్టములు ప్రజాభాషలో చేయబడవలెను. మనదేశ ప్రజలు మాతృభాషలో శాస్త్రవిజ్ఞానము సాధింపవలెను. భాగ్యనగరంలో పందొమ్మిది వందల డెబ్బది మూడవ సంవత్సరము సెప్టెంబరు మాసము ఎనిమిది, తొమ్మిది తేదీలలో ప్రథమముగా అధికార భాషాసదస్సు నిర్వహింపబడినది.

ఆంధ్రరాష్ట్రావతరణ మారంభముగా మనరాష్ట్రములోని పెద్దలందరూ తెలుగు అధికార భాషకావలయునని ఎన్నియో తీర్మానాలు ప్రవేశపెట్టిరి. అట్టివారిలో వావిలాల గోపాలకృష్ణయ్య మున్నగువారు ఎంతయో కృషి చేసిరి. అయ్యదేవర కాళేశ్వరరావుగారి ఆధ్వర్యములో పారిభాషిక పదకోశములు సిద్ధము చేయబడినవి.

అయినప్పటికిని 1966వ సంవత్సరము వరకు అధికార భాషాశాసనములు చేయబడలేదు. శాసనము ప్రకటింపబడిన తరువాత దశాబ్దమువరకు ఎవ్వరును దీని విషయమై శ్రద్ధ వహించలేదు.

ప్రస్తుత విద్యారంగంలో పాఠ్య ప్రణాళికను ఆంధ్రములోని కనువదించిరి. బోధనా మాధ్యమమును తెలుగులోనికి మార్చిరి. కాని దీనివలన లాభము శూన్యము. తెలుగుభాషను ప్రభుత్వ కార్యాలయములలో, న్యాయస్థానములలో, ధనాగారములలో, పాఠశాలల్లోమున్నగువాని యన్నింటియందు ఒకే పర్యాయము ప్రవేశపెట్టవలెను. క్రమముగా తెలుగును అధికారభాషగా చేయవలెను. దీని వలన తెలుగుభాష సమర్థమై ప్రజల కుపయోగపడు భాషగా మారును.

★ ★ ★

# 3. ఆధునిక విజ్ఞానశాస్త్ర ప్రయోజనములు

విజ్ఞానశాస్త్రము నేడు శాఖోపశాఖలుగా విస్తరించినది. ప్రజోపయోగకరమైన ఎన్నియో సాధనములు కనుగొనబడి ప్రజాజీవనము నేడు సుకరమగుచున్నది. మన పూర్వులు ప్రకృతి శక్తులను భక్తి భావముతో పూజింపగా నేడు మనము మన మేధాశక్తిచే ఆ శక్తులను లొంగతీసికొనినాము. ఇందుకు మనకు విజ్ఞాన శాస్త్రము మిగుల తోడ్పడినదని చెప్పవచ్చును. విజ్ఞానశాస్త్రమును ఆంగ్లభాషలో 'సైన్సు' అని చెప్పుదురు. మానవుని బుద్ధి వైభవముచే నేడు విజ్ఞానశాస్త్రము దినదినాభివృద్ధి చెందుచున్నది. పదార్థ విజ్ఞానశాస్త్రము, రసాయన శాస్త్రము, వైద్య శాస్త్రము మొదలగు శాస్త్రములన్నియు విజ్ఞానశాస్త్రము యొక్క వివిధాంగములుగా పరిగణింపబడుచున్నవి.

ఆధునిక కాలమున విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనలచే పెక్కు నూతన విషయములు కనుగొనబడినవి. మానవుని యొక్క అనాగరిక దశ తొలగిపోయినది. ఒక కాలమున కాలినడకన వెళ్ళెడి జనులు నేడు సైకిళ్ళు, స్కూటర్లు, కార్లు, బస్సులు రైళ్ళు మొదలగు ప్రయాణ సాధనములచే ఎక్కువ దూరమును తక్కువ కాలములో శరీరము కష్టపడకుండ వెళ్ళగలుగుచున్నారు. నేడు మానవుడు ఎక్కడనో ఉన్న  చంద్రమండలమునకు కూడ వెళ్ళి అసాధ్యమును సుసాధ్యము చేసినాడు.

పూర్వకాలపు జనులవలె అంటురోగములకు బలికాక వానిని నివారణ మొనర్చ కలిగిన మందులను కనుగొని ఆరోగ్యమును పెంచుకొన్నాడు. రేడియో, టెలివిజను మొదలగు సాధనముల వలన దూరప్రాంతములలో జరుగు విశేషములను వినుచు, చూచుచు సంతోషపడుచున్నాడు. టెలిఫోను ద్వారా దూరప్రాంతములో నుండు జనులతో మాట్లాడగలుగుచున్నాడు. టెలిగ్రామును వార్తలను సులభముగా అందచేయుచున్నారు. నదులకు ఆనకట్టలు కట్టి కాలువల ద్వారా నీటిని పొందుచు పంటలను బాగుగా పండించుచున్నాడు. ఇంకను మేలుజాతి విత్తనములు, క్రిమి సంహారక ఔషధములు మొదలగు వాని నుపయోగించి ఎక్కువ దిగుబడిని సాధించుచున్నాడు. పెక్కు యంత్రములను కనుగొనిరి. మానవునకు కావలసిన పరికరములన్నిటిని తయారుచేసి సుఖముగా జీవించుటకు తగిన పరిస్థితులను కల్పించుకొనినాడు. నేడు ప్రపంచమందలి

ఖండముల మధ్యదూరము తగ్గిపోయి జనులందరి మధ్య సన్నిహిత సంబంధ మేర్పడుటకు విజ్ఞాన శాస్త్రవేత్తలు సలిపిన కృషి ప్రశంసనీయమైనది.

ఇంకను విజ్ఞానశాస్త్రవేత్తలు కనుగొనిన విద్యుచ్ఛక్తి వలన మానవుడు పెక్కు ప్రయోజనములను సాధించుకొనుచున్నాడు. దీపములు, ఫ్యానులు, రేడియోలు మొదలగు సాధనములెన్నియో విద్యుచ్ఛక్తి వలన పనిచేయుచున్నవి. విద్యుచ్ఛక్తి వలననే యంత్రశాలలు నడుచుచున్నవి. గ్యాసు సహాయమున మానవుడు నేడు భోజనపదార్థములను సులభముగా తయారుచేసికొనగలుచున్నాడు. చలనచిత్రములు కనుగొనబడుట వలన నేటి మానవుడు హాయిగా కాలమును గడుపుచున్నాడు. ఒక్క మాటలో చెప్పవలెనన్నచో విజ్ఞానశాస్త్రము కన్న వేరొకటి మాన ప్రగతికి తోడ్పడి యుండలేదనవచ్చును.

మంచి ననుసరించి చెడు కూడ ఉండును. ఆధునిక విజ్ఞానశాస్త్రము వలన కొంత దుష్ప్రభావము కూడ లేకపోలేదు ప్రయాణ సాధనములు, విద్యుచ్ఛక్తిమొదలు వాని వలన మానవునకు అప్పుడుప్పుడు కొన్ని ప్రమాదములు సంభవించును. విజ్ఞానశాస్త్ర పరిశోధనల ఫలితముగా నేడు కనుగొనబడిన అణుశక్తి వల్ల ప్రపంచమును క్షణములో నాశన మొదర్పగలిగిన మారణాయుధములు తయారు అగుచున్నవి. వీని వలన ఏనాటికైనను ప్రపంచపు మనుగడకే ముప్పు సంభవింపగలదు. కావున ఈ విషయమునందు ప్రపంచ దేశములన్నియు జాగ్రత్తగా వ్యవహరించవలెను. విజ్ఞానశాస్త్ర ప్రయోజనములు కేవలము శాంతియుత జీవనము నెలకొల్పుటకే పరిమితము కావలెను. మానవ వినాశమునకు దారి తీయరాదు.

నేడు మానవవిజ్ఞానశాస్త్రము వలన జన్యుశాస్త్రము అభివృద్ధియై గుండె మార్పిడి. కృత్రిమావయవములను నిర్మించుట, శోధనాళికల ద్వారా శిశువుల నుత్పత్తి చేయుట మొదలగు పనులు సుసాధ్యములగుచున్నవి. తుదకు ఆధునిక విజ్ఞాన శాస్త్ర సంపదచే మానవుడు పురోగతి సాధించుచు మృత్యుంజయుడు కాగలడనుటలో కూడ సందేహింపవలసిన పనిలేదు.

★ ★ ★

# 4. అవినీతి నిర్మూలన

ప్రతి మానవుడు సాధారణముగా సుఖవంతమైన జీవితమును గడుపవలెనని ఆశించును. కష్టములు లేకుండా సుఖములు అనుభవించవలెనని తలంచును. అందుకొరకై నీతిమార్గమును తప్పి సంచరించుచుండును. నిర్దేశితమైన నీతిని తప్పి వక్రమార్గమున నడుచుటయే అవినీతి. ఈ అవినీతినే 'లంచగొండితనము' అందురు. ఇది ప్రపంచములోని అన్నిదేశములందును కలదు. లంచగొండితనము ఒక భూతమువలె వ్యాపించి, వికటాట్టహాసము గావించుచున్నది. తుదకు మానవునిపతనం చేయునది ఈ లంచగొండితనం లేదా అవినీతి.

సమాజమందు నివసించు వివిధ వర్గ జనులలో ఈ లంచగొండితనము విశృంఖలముగా వీరవిహారము చేయుచున్నది. ఉద్యోగులు, అధికారులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు – ఈ విధముగా సమాజమందలి వీరు, వారు అను భేదము లేక అందరిలో లంచగొండితనము కనిపించుచున్నది. అవినీతి పెరుగుటలో వీరందరును ప్రముఖ పాత్ర వహించుచున్నారు. చట్టమును, రాజ్యాంగమును ధిక్కరించుటకు అవినీతి లంచము రూపములోను, బహుమతి రూపములోనూ కనిపించుచున్నది.

నేడు సమాజమందు అవినీతి తలెత్తుకొని తిరుగుచున్నది. నీతి సిగ్గుచెంది తలదించుకొన్నది. నీతిని అనుసరించువారు తెలివి తక్కువ వారుగా, చేతకానివారుగా, మూర్ఖులుగా తలంపబడుచున్నారు. సామాన్య ప్రజలు ఈ లంచగొండితనము వలన పెక్కు కష్టములకు లోనగుచున్నారు. అవినీతి క్రమక్రమముగా యువతపై కూడ ప్రభావము చూపుచున్నది. జాతి అంతయు అవినీతిచే నిర్వీర్యమై దౌర్భాగ్య స్థితిలో నున్నది.

ఈ లంచగొండితనమును నిర్మూలించుటకు ప్రతివ్యక్తి ఆత్మ విమర్శ చేసుకొనవలెను. సొంత లాభము కొంత మానుకొనవలెను. లంచమునకు, ఇతర దుర్గుణములకు, వ్యసనములకు లోనుకాకుండా, జాగ్రత్తవహించవలెను. మానవులు

కోరికలను పరిమితము గావించుకొనవలెను. ఆధ్యాత్మిక చింతనను అలవరచుకొనవలెను. దైవము యెడల విశ్వాసము పెంచుకొని, పాపభీతి కలిగి యుండవలెను. అప్పుడు ఈ అవినీతి కొంతవరకు తగ్గవచ్చును. న్యాయ మార్గమును ధర్మపద్ధతిని పాటించవలెను. లంచగొండితనమును నిర్మూలించుట ఆత్మానందమునకు మెట్టు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు పర్మిట్లు, లైసెన్సులు మొదలగు విషయములందు అవినీతికి పాల్పడరాదు. రాజకీయ నాయకులును అవినీతి మార్గములో ప్రజలకు ఏవేవో ఆశలు చూపి, కానుకలిచ్చి, అధికారమును కోరరాదు.

ప్రభుత్వమువారు అవినీతిని, లంచగొండితనమును నిర్మూలించుటకు తగిన శాసనములు చేసి అవి అమలు జరుగునట్లు చూడవలెను. ప్రతి పనికి నేడు 'లంచము' పుచ్చుకొనుట సాధారణమైనది. ఈ పద్ధతి మారవలెను. ప్రజలు నీతితో, ధర్మముతోను జీవిత గమనము సాగించవలెను. అప్పుడు కొంతవరకు లంచగొండితనము, నిర్మూలనము చేయవచ్చును. ప్రజలలో, ఉద్యోగులలో, అధికారులలో, చిత్తశుద్ధి పెరగవలెను. నీతి, నిజాయితీలకు పట్టము కట్టవలెను. ఆనాడు లంచగొండితనము కొంతవరకు నిర్మూలింపబడుతుంది. అవినీతి లేనినాడే సమాజ జీవనము ఆనందదాయకమగును.

★ ★ ★

# 5. మద్యపాన నిషేధము

'మద్యము' అనగా మత్తు కలిగించెడి పదార్థము. 'పానము' అనగా సేవించుట. 'నిషేధము' అనగా మద్యమును సేవించు ఆచారమును నిలిపివేయుట. కష్టములలో, బాధలలో నున్నవారికి మద్యపానము తాత్కాలిక విశ్రాంతిని కలిగించును. ఈ యాచారమెప్పుడు ప్రారంభిపబడినదో సరిగా తెలియదు. మహాభారతములో కచదేవయాని కథలో మద్యపానము విషయము కలదు. శుక్రాచార్యుడు మద్యపానము చేసి దానిని ఈసడించినట్లు కలదు. మానవుడు రకరకాల మత్తు పదార్థములను సేవించుచున్నాడు.

మత్తు పదార్థములు వివిధములు తాటికల్లు వంటి చౌకరకమైన మత్తు పదార్థములను పేదప్రజలు వాడుదురు. జిన్ను, రమ్ము, విస్కీ, బ్రాందీ, బీరు వంటి నున్నిత మాదకపదార్థములను ధనవంతులు సేవింతురు. వీటితో పాటు నల్లమందు, గంజాయి మొదలగు ఘనపదార్థములు కూడ మత్తులు కలిగించును. ఈ రోజులలో ఇంజక్షన్ రూపంలో కూడా మత్తు మందులు కలవు.

బలము లేని వారికి, రోగము గలవారికి పరిమితముగా తీసికొన్నచో మత్తు పదార్థము మేలు కలిగించునని వైద్యులు చెప్పుచున్నారు. ఇదే క్రమముగా మోతాదు మించిన యెడల అలవాటుగా వ్యసనముగా మారుచు. ఈ వ్యవసమును మార్చుకొనుట మిక్కిలి కష్టము. కొందరు వైద్యము కొరకు కొందరు నాగరికతకు చిహ్నముగా మత్తును సేవించెదరు. ప్రపంచమున నూటికి 25 శాతము ప్రజలు ఏదో యొక కారణమున మద్యము సేవించుచున్నారు. ఈ మద్య పానమును సేవించే స్త్రీలు కూడ గొప్ప సంఖ్యలో నుండుట విశేషము.

మత్తు పదార్థమేదైనను మనుష్యుని బానిసగా చేయును. క్రమముగా ఆరోగ్యము పాడగును. ఆయుర్దాయము తగ్గును. ఘోర వ్యాధులు సంక్రమించును. మద్యప్రియులురోగగ్రస్తులగుదురు. త్రాగుబోతులు కటుంబమును యాతనల పాలు చేయుదురు. మత్తు మందు వలన జీర్ణశక్తి

నశించును. ప్రేగులలో పుండ్లేర్పడును. హృద్రోగములు సంభవించును. కడుపులో మంట కలుగును. నేత్రదృష్టి లోపించును. నరముల బలహీనత సంభవించును. శరీరము వణకును, విసుగు పుట్టును, ఆవేశము కలుగును. ప్రమాదములు కలుగును. త్రాగినవారు దెబ్బలాడి హత్యలొనరించి జైలు పాలగుదురు. మద్యపానమత్తులు తమ జీతమునంతను వెచ్చించి రిక్త హస్తములతో ఇంటికి వచ్చి భార్యాబిడ్డలను వేధింతురు. పెద్దలు సంపాదించిన ధనమును వెచ్చించి చివరకు భిక్షులగుదురు. త్రాగి విధినిర్వహణలో శ్రద్ధ లేక పరాకు వహించి తుదకు ఉద్యోగములను కోల్పోదురు, వాహనములు నడుపువారు ప్రజల ప్రాణములను బలిగొందురు. కనుక ఇట్టి దుష్ఫలితములనొసంగు మద్యపానమును తప్పనిసరిగా నిషేధించవలెను.

మద్యపాన వ్యసనము పేదల ధనమును, ఆరోగ్యమును హరించుచున్నది. ధనవంతులను దరిద్రులను చేయుచున్నది దేశము దారిద్ర్యాంధకారములో మునిగిపోవుచున్నది. ఈ విషయము గమనించిన గాంధీజీ మద్యపాన నిషేధోద్యమమును చేపట్టెను. వీథివీథుల కడగల కల్లు సారాయి దుకాణముల వద్ద ప్రదర్శనములను నిర్వహించెను. త్రాగుబోతులైన వారికి మంచిమాటలతో నచ్చచెప్పి సంస్కరణోద్యమములు ప్రారంభిచెను. మద్యపాన నిషేధోద్యమంలో రాజకీయ నాయకులతో పాటు కవులు, గాయకులు పాల్గొని అనేక రీతుల ప్రబోధమును చేసిరి. స్వాతంత్ర్యసముపార్జనానంతరము మన రాష్ట్రప్రభుత్వము మద్యమును ఉత్పత్తి చేయుట, విక్రయించుటలను పరిమితము చేసెను. ప్రభుత్వములు మద్యపాన నిషేధ చట్టము నమలుపరచినవి. ప్రజలు మద్యపాన దుర్వ్యసనమును మరపించు ప్రయత్నములు ప్రభుత్వము చేయుచున్నది. మద్యపాన నిషేధమునకై ప్రత్యేక ప్రభుత్వ శాఖ ఏర్పడినది. ఈ శాఖ మద్యపానమును నిషేధించుటకు అనేక ప్రయత్నములు చేయుచున్నది. కాని ప్రతికార్యమునకు అనేక విఘ్నము లెదురగుచుండును. కొన్ని విపరీత పరిణామములు సైతము కలుగుచుండును. ఈ మద్యనిషేధ చట్టం వలన దొంగతనముగా మద్యము ఉత్పత్తి చేయబడుచున్నది.

మద్యము చాటుమాటుగా విక్రయింపబడుతున్నది. మద్యం దొంగతనంగా సేవింపబడుతున్నది. మద్యపాన నిషేధ శాఖ ఉద్యోగుల లంచములు మరిగి కర్తవ్యాన్ని నిర్లక్ష్యం చేసిరి. విషపూరిత మద్యం సేవించుట వలన ప్రతి సంవత్సరం అసంఖ్యాకులు మరణమునకు గురియగుచున్నారు. ఈ అంశం దేశమునకు ఆందోళన కారణమగుచున్నది. ఈ విపర్యయముల వలన ప్రభుత్వము మద్యపాన నిషేధ చట్టమును ఉపసంహరించుకున్నది.

మద్యము నుత్పత్తి చేయుట వలన, మద్యం సేవించుట వలన ప్రభుత్వానికి వందల కోట్ల కొలది ఆదాయముండవచ్చును. కాని మద్యపానం పట్ల ఆసక్తి పెంచుకొని బాలురు, బాలికలు, యువతీ, యువకులు, స్త్రీ పురుషులు అనేక కష్టనష్టాలకు గురియగు చున్నారు. స్త్రీలు మద్యపానం సేవించుట వలన వికలాంగులైన పిల్లలు పుట్టుచున్నారు. ఇట్టి మద్యపానము నిషేధించటానికి ప్రభుత్వము, సంఘసంస్కర్తలు, ప్రజలు కలసి నిషేధించవలెను. మహిళల ఆందోళనచే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం01-10-1993 నుండి మన రాష్ట్రములో సంపూర్ణముగా మద్యపానమును నిషేధించినది. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం మద్యపాన నిషేధాన్ని తొలగించింది.

★ ★ ★

# 6. పరిశుభ్రత–పచ్చదనం

ప్రకృతి భూమి, నిప్పు, నీరు, గాలి, ఆకాశం అనే పంచభూతాల కలయిక వల్ల ఏర్పడుతుంది. ఇది లేకుండా ఏ ప్రాణీ జీవించలేదు. మనిషికి నేల నివాసాన్ని ఇస్తుంది. భూమి సంపదలిస్తుంది. నీరు త్రాగాడానికి పనికివస్తుంది. పంటలకు శక్తినిస్తుంది. గాలి ప్రాణశక్తి నిస్తుంది వీటన్నిటికి మూలమైంది ఆకాశం.

మానవుడు ఆరోగ్యంగా జీవించడానికి పరిసరాలు పారిశుధ్యం ఎంతో అవసరం. ప్రకృతి పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే మనుష్యులకు అనారోగ్యం కలుగుతుంది. పరిసరాలు గుంటలలో నీరు నిలువయుండి దుర్గంధ భరితమై అనారోగ్యానికి కారణమవుతుంది. కనుక పరిసరాలలో దుర్గంధపూరితమైన నీటిగుంటలను లేకుండా చెయ్యాలి. దీనివలన మలేరియా వంటి వ్యాధులు కూడా వస్తాయి.

మనకు నీటిలో దుమ్ము ధూళిపడి నీరు చెడిపోతుంది. చెరువులు, కుంటల వంటి చోట్ల పశువులను కడిగి పాడు చేస్తూవుంటారు. బావులను, నీటికుంటలను పరిశుభ్రంగా వుంచాలి. త్రాగునీటిని శుభ్రంగా ఉంచుకోవాలి. జలకాలుష్యం జరగకుండా చూసుకోవాలి.

పరిశ్రమలు వ్యర్థ వాయువులను వదలిపెడుతూ వుంటాయి. దీనివలన గాలి కలుషితమవుతుంది. ఫ్యాక్టరీలు వదలి పెట్టే వ్యర్థ పదార్థాలు పాదరసం, సీసం వలన పారిశ్రామిక ప్రాంతాలలో వున్న గొట్టపు బావులు కూడా కలుషితమైపోతాయి.

నవీన నాగరికతలోని కార్లు, లారీలు, మోటారు సైకిళ్ళు వదలే వ్యర్థ పదార్థాల వల్ల కూడా వాతావరణ కాలుష్యమేర్పడుతుంది. వీటి వల్ల కూడా కొంత అనారోగ్యం ఏర్పడడానికి కారణమవుతుంది. కనుక మానవులు పరిసర ప్రాంతాలను తమ తమ గృహాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి.

పచ్చదనం - పరిశుభ్రతతో పాటు పరిసరాలు పచ్చగా కూడా ఉండాలి. పరిసరాలు పరిశుభ్రంగా వుండాలంటే చెట్లు పెంచాలి.

సృష్టిలో వెలసిన ప్రాణులలో చెట్లు ప్రధానమైనవి. చెట్లు ప్రకృతికి అలంకారంగా ఉంటాయి. చెట్ల వల్ల అనేక లాభాలున్నాయి. మనకు చెట్లు గొప్ప ప్రకృతి సంపదలు.

మొక్కలు కొన్ని ఆహారంగా పనికివస్తాయి. కొన్ని వంట చెరుకుగా పనికివస్తాయి. కొన్ని మందులకు పనికివస్తాయి. వృక్ష సంపద వల్ల ప్రకృతి పచ్చదనం వల్ల మానవ జీవితం సుఖమయమవుతుంది. చెట్లు ఏపుగా పెరిగితే పుష్కలంగా వానలు కురుస్తాయి. దాని వల్ల నీటి వసతి కలుగుతుంది. పంటలు పండుతాయి. కనుక 'పైరుపచ్చలే జీవనాలు' అని పెద్దలంటారు. పచ్చని చెట్ల వల్ల నీడ కూడ లభిస్తుంది. కనుక ప్రజలంతా అంతటా చెట్లను నాటాలి, విరివిగా పెంచాలి.

పరిసరాలు పరిశుభ్రంగా వుంటే పచ్చదనంతో ప్రకృతితో కళకళలాడితే మానవాళి ఆరోగ్యం చక్కగా ఉంటుంది. కనుక ప్రతి యొక్కరు పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకొని చెట్లు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలి.

★ ★ ★

# లేఖలు

బంధుమిత్రులకు అధికారులు మున్నగువారికి, లోక వ్యవహారాలు నడుపుకోవడానికి ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపేది 'లేఖ' అనబడుతుంది. ఉత్తరము, జాబు, కమ్మ అన్నిన ఇదే. లేఖవ్రాసే విషయంలో శ్రద్ధ, జాగ్రత్త అవసరం.

## లేఖా నియమాలు

1. లేఖ కుడివైపున ఊరిపేరు, దానికింద తేది వ్రాయాలి.
2. ఎడమవైపు లేఖ వ్రాసేవాళ్ళ చిరునామా, దానిక్రింద ఎవరికివ్రాస్తున్నారో వాళ్ళ చిరునామా స్పష్టంగా వ్రాయాలి.
3. సంబోధన, పద్ధతి ప్రకారం ఉండాలి. పెద్దవాళ్ళకు నమస్కారాలు అనీ, చిన్న వాళ్ళకు శుభాకాంక్షలు–శుభాశీస్సులు–ఇలా ఉండాలి.
4. విషయం స్పష్టంగా చిన్న చిన్నవాక్యాలలో ఉండాలి.
5. అధికారులకైతే లేఖచివర కృతజ్ఞతలు తెలపాలి. 'భవదీయుడు' లేదా 'తమ విధేయుడు' అని వ్రాసి క్రింద సంతకం చేయాలి. చిన్నవాళ్ళకు శుభాశీస్సులు తెలపాలి.
6. లేఖ చివర అవసరాన్ని బట్టి రాసేవాళ్ళ చిరునామా వ్రాయాలి.
7. కార్డు లేదా కవరుపై మనం ఎవరికి వ్రాస్తున్నామో వారిచిరునామాను తపాలా పిన్‌కోడ్ వీలైతే వారిఫోన్ నెంబరు కూడా వ్రాయాలి.

# నమూనాకు కొన్ని లేఖలు

## 1. తల్లి దండ్రులకు లేఖ

బెంగళూరు.

16.12.2013.

పూజ్యులైన అమ్మానాన్నలకు నమస్కారాలు.

నేను బాగున్నాను. అక్కడ మీరంతా బాగున్నట్లు తలుస్తాను. క్రిస్మస్ సెలవుల్లో ఊరికి వస్తానన్నాను. కానీ రాలేక పోతున్నాను.

కారణం– ఈ సెలవుల్లో మా తరగతి విద్యార్థులు– మా అధ్యాపకులు అందరు కలసి మైసూరు, నంజన్‌గూడు వగైరా ప్రాంతాలకు విజ్ఞానయాత్ర వెళ్తున్నాం. మా చరిత్ర అధ్యాపకులు కూడా వస్తున్నారు. అన్నీ చూచిన తర్వాత విశేషాలతో ఒకవ్యాసం వ్రాయాల్సివుంటుంది.

ప్రస్తుతం నాదగ్గర 400 రూపాయాలు మాత్రమే ఉన్నాయి. ఇంకో 500 రూ. కావలసి ఉంటుంది. వీలైనంత తొందరగా పంపిస్తారను కుంటాను.

అక్కడ నాన్నమ్మకు, చిన్నాన్నకు నా నమస్కారాలు తెలపండి, సెలవులకు రాలేదను కోకండి. సంక్రాంతి సెలవులకు తప్పకుండా వస్తాను. చెల్లాయిని బాగా చదువు కోమనండి. ఆమెకు నాముద్దులు.

నమస్కారాలతో
మీ ప్రియమైన అచ్యుత్

**చిరునామా**

పి. గణేశ్ కుమార్,
63, తేరువీధి,
కాణిపాకం (పోస్ట్)
చిత్తూరు జిల్లా
పిన్ – 517131

## 2. కళాశాల అధ్యక్షులకు లేఖ

బళ్ళారి,

09-8-2013

పి. చేతన భార్గవి,

పి.యు.సి,

వివేకానంద జూనియర్ కళాశాల

గాంధీనగర్,

బళ్ళారి.

అధ్యక్షులవారికి,

వివేకానంద జూనియర్ కళాశాల,

బళ్ళారి.

అయ్యా!

మా అన్నయ్యకు పెళ్ళి కుదిరింది. ఏర్పాట్లకు సహాయంగా ఉండాలని అమ్మ చెప్పినది. కాబట్టి నేను తప్పనిసరిగా ఉండాల్సి వస్తున్నది. ఈ కారణంగా నాకు 11-8-2013 నుండి 16-8-2013 వరకు మొత్తం 6 రోజులపాటు సెలవు మంజూరు చేయాల్సిందిగా కోరుతున్నాను.

కృతజ్ఞతాభివందనాలతో

తమ విధేయురాలు

పి. చేతన భార్గవి

## 3. అధికారికి లేఖ

బి. తరుణ్ , కోలారు,

45, కె.జి. సర్కిల్, 16-7-2013

కోలారు.

డివిజనల్ కమీషనర్ గారికి,

డివిజనల్ కమీషనర్ కార్యాలయం,

కోలారు.

అయ్యా!

మా కాలనీలో దోమలబెడద ఎక్కువగాఉంది. మెదడువాపు జ్వరాలతో చాలమంది పిల్లలు ఆస్పత్రి పాలవుతున్నారు. మాకేకాక కోలారు జిల్లా మొత్తం మీద ఈ సమస్య విపరీతంగావుంది. అన్నివార్తాపత్రికలు ఫోటోలతో కూడా వార్తలు ప్రచురిస్తున్నాయి. తాత్కాలికంగా 'బెల్లడొనా' మాత్రలివ్వడం తప్ప, శాశ్వత పరిష్కారం కోసం ఎవరూ ఆలోచించడంలేదు.

జిల్లా అధికారిగా తగిన చర్యలు తీసుకొని పిల్లల జీవితాలకు రక్షణ కల్పిస్తారని ఆశిస్తున్నాను.

కృతజ్ఞతలతో

తమ విధేయుడు

బి. తరుణ్

## 4. ఉద్యోగానికి దరఖాస్తు

బెంగళూరు,

27-3-2013

పి.జి. హితేష్
21, 'గీతారామం'
మారత్ హళ్ళి,
బెంగళూరు.

జిల్లా విద్యాశాఖాధికారి గారికి,
బెంగళూరు

అయ్యా!

**విషయం :** కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి దరఖాస్తు.

ఈ నెల 20 తేదీన ఈనాడు, జ్యోతి ఇతర వార్తాపత్రికలలో మీ ఉద్యోగ ప్రకటనల్ని చూచాను. మీరడిగిన అర్హతలన్నీ నాకున్నందున కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగానికి నేను దరఖాస్తు చేసుకుంటున్నాను. వాటికి సంబంధించిన జెరాక్సు కాపీలను ఇందు వెంట జత చేయు చున్నాను.

దయయుంచి నాదరఖాస్తును అంగీకరించి నాకు పై ఉద్యోగమును ఇప్పింప వలసినదిగా ప్రార్థించు చున్నాను.

కృతజ్ఞతలతో

తమ విధేయుడు
పి. జి. హితేష్

జతపరచినవి

1. బయొడేటా
2. విద్యార్హతలు
3. స్పోర్ట్స్ వగైరా వ్యక్తిగత ప్రతిభకు సంబంధించినవి.

## 5. పత్రికా సంపాదకులకు లేఖ

బెంగళూరు,
18-12-2013

గౌరవనీయులైన పత్రికా సంపాదకులకు
'ఈనాడు' తెలుగు దినపత్రిక,
డికెన్సన్ రోడ్,
బెంగళూరు.

ఆర్యా!

చాలా రోజులుగా నేను 'ఈనాడు' దిన పత్రిక పాఠకుణ్ణి. ఇందులో మీరు ప్రచురిస్తున్న శీర్షికలన్నీ విజ్ఞాన వినోదాత్మకంగా, ఆలోచనాత్మకంగా ఉండడమేకాకుండా ఎప్పటికప్పుడు ప్రాంతీయ, జాతీయ మరియు ప్రపంచ వార్తలనుక్షుణ్ణంగా తెలుసుకోగలుగు తున్నాను. ముఖ్యంగా పిల్లలకోసం, మహిళలకోసం మీరు ప్రచురిస్తున్న 'వసుంధర' వగైరా శీర్షికలు చాలా ఆసక్తి దాయకంగా ఉంటున్నందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను. మీ పత్రికలోని తెలుగు భాషకూడ సంప్రదాయంగా, సరళంగా ఉంటున్నది. ప్రజల్ని ప్రగతిపథం వైపు నడిపిస్తున్న మీ 'ఈ నాడు' పత్రికాధిపతులకు, కార్యవర్గానికి నా ధన్యవాదాలు.

ధన్యవాదాలు

నమస్కారాలతో
పి. ఎం. సుహాస్

చిరునామా
పి. ఎం. సుహాస్,
18, మెయిన్ రోడ్,
మత్తికెరె,
బెంగళూరు.

## 6. పోలీసు శాఖకు లేఖ

బెంగళూరు,
11-2-2013

పి. రోనఖ్
205, 'మంజులకృష్ణ' నిలయం,
డాలర్స్ కాలని,
బెంగళూరు.

సర్కిల్ ఇన్స్పెక్టర్ గారికి,
డాలర్స్ కాలని పోలీస్ స్టేషన్,
బెంగళూరు.

ఆర్యా ! నమస్కారం.

**విషయం:** వ్యక్తిగతమైన ఇబ్బందికి సంబంధించి.

నేను పి.యు.సి ప్రథమ సంవత్సరం చదువు చున్నాను. మాకు ఇక 20 రోజుల్లో పబ్లిక్ పరీక్షలుంటున్నాయి. కష్టపడి చదివి మంచిమార్కులు సాధించాలన్నది నా ధ్యేయం. బట్టలదుకాణంవాళ్ళు ఉదయం నుంచి రాత్రివరకు వ్యాపారప్రకటనలతో, సినిమాపాటలతో మైకులతో పాటు మాబుఱ్ఱలు కూడ బద్దలయ్యేట్లు విసిగిస్తున్నారు. మా ఇంటిలో అందరమూ మర్యాద పూర్వకంగా వారికి చెప్పి చూశాం, కానీవాళ్ళు తమధోరణి మార్చు కోవడం లేదు. చట్టం ఎలావుందోనాకు తెలియదు.

దయచేసి మీరు ఈ విషయంలో జోక్యం చేసుకొని ఈ ఇబ్బందిని తొలగించాలని ప్రార్థిస్తున్నాను.

కృతజ్ఞతా వందనాలతో

ఇట్లు
తమ విధేయుడు,
పి. రోనఖ్.

# సొంత వాక్యాలు

భాష అందం ఇనుమడించడానికి జాతీయాలు వాడుతారు. వీటి వాడుకవల్ల కొన్ని అక్షరాలతో విశాలమైన భావన స్ఫురింపచేయవచ్చు. జాతీయాల అర్థం సూటిగా వివరించలేం. ఉదా : 'చెనికోసుకున్న' – ఈ జాతీయం అర్థం చెవికోసుకోవడమనికాదు. శ్రద్ధగా వినడం అని. ఈ విధంగా జన వ్యవహారంలోని ముఖ్యమైన అర్థానికే ప్రాముఖ్యం ఉంటుంది. విద్యార్థులు వీటిని వాక్యాలలో రాయడం, సంభాషణల్లోనూ వాడడం వల్ల వారి భాషాజ్ఞానం పెరుగుతుంది.

1. **కొంగుబంగారం** – తిరుపతి వేంకటేశ్వరస్వామి భక్తులకు **కొంగుబంగారమై** వెలసి ఉన్నాడు.

2. **అగ్రతాంబూలం** – పెద్దరికం ఇచ్చి గౌరవించడం.
   ప్రపంచంలో భారతీయ సంస్కృతిదే **అగ్రతాంబూలం**.

3. **అడవిగాచిన వెన్నెల** – ఉపయోగం లేనిది.
   జానపదకళాకారులను ఉపయోగించుకోకపోతే వారి ప్రతిభ **అడవిగాచిన వెన్నెలే**.

4. **అభయహస్తం** – ఆపదలో ఉన్నవారిని అదుకోవడం.
   వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ **అభయహస్తం** అవసరం.

5. **ఆణిముత్యం** – గొప్పతనంగల, విలువగల.
   లాల్‌బహదూర్ శాస్త్రి మన ప్రధానలలో **ఆణిముత్యం**.

6. **ఈడుజోడు** – అనుకూలత గలిగిన, 'సరిసమానమైన'.
   పెళ్లి చేసేటప్పుడు **ఈడూజోడూ** గమనించాలి.

7. **నడుము బిగించు** – గట్టిగా ప్రయత్నించు.
   నేను కలెక్టరు కావాలని **నడుము బిగించి** చదువుచున్నాను.

8. **ఉగ్గుతో నేర్పిన విద్య** – పసినతనం నుంచే వచ్చిన విద్య

బాలచంద్రునికి పౌరుషం **ఉగ్గుతో నేర్పిన విద్య.**

9. **ఉడుతాభక్తి** – శక్తికి తగినంత, చేతనైనంత.

ప్రకృతి విపత్తుల్లో ప్రతి పౌరుడు **ఉడుతాభక్తిగా** తోడ్పడాలి.

10. **ఏ ఎండకాగొడుగు** – అవసరానికి తగిన విధంగా ప్రవర్తించడం

స్వార్థపరులు ఏ **ఎండకాగొడుగు**పడతారు.

11. **కంటికి రెప్పలాగ** – అత్యంత రక్షణతో, చాలా జాగ్రత్తతో

భారత సరిహద్దులోని సైన్యం దేశాన్ని **కంటికి రెప్పలాగ** కాపాడుతుంది.

12. **కనువిప్పు**– జ్ఞానోదయం, తమ తప్పుతెలుసుకోనడం.

నేటికాలంలో కొందరి ప్రర్తన ప్రజలకు **కనువిప్పును** కల్గిస్తుంది.

13. **కన్నీరుమున్నీరు** – మిక్కిలి దుఃఖం, ఏకధాటిగా

ప్రకృతి వైపరీత్యాలు కలిగినప్పుడు బాధితులు **కన్నీరుమున్నీరుగా** విలపిస్తారు.

14. **కుందేటి కొమ్ము** – అసలేలేనిది, సాధించలేనిది.

నైతిక విలువలు దిగజారినప్పుడు న్యాయం **కుందేటికొమ్మే** అవుతుంది.

15. **కొట్టిన పిండి** – బాగా తెలిసినది.

కవి సమ్రాట్ విశ్వనాథకు పద్యరచన **కొట్టిన పిండి.**

16. **కొరకరాని కొయ్య** – మాటవిననివాడు, మొండివాడు.

సంస్కరించరాని మూర్ఖుడు **కొరకరానికొయ్య.**

17. **గగనకుసుమం** – అందనిది, అందరానిది

ఈ రోజుల్లో కష్టించి చదువని వారికి ఉన్నతోద్యోగం **గగనకుసుమమే.**

18. **గోరు చుట్టుపై రోకటి పోటు** – దెబ్బమీద దెబ్బ, కష్టం మీద కష్టం.
ప్రమాదాల్లో దొంగల బెడద **గోరుచుట్టుపై రోకటి పోటు** వంటిది.

19. **పిట్ట కొంచెము–కూతఘనం** – చిన్నప్పుడే ఘనత చాటు.
ప్రహ్లాదుడు **పిట్ట కొంచెము–కూతఘనం** అన్నట్లు చిన్నతనముననే గొప్ప భక్తుడాయెను.

20. **చెవికోసుకొను** – చాలా ఇష్టపడడం.
చిన్న పిల్లలు కథలంటే **చెవికోసుకుంటారు.**

21. **చేదోడు వాదోడు** – పనికి, మాటకు అనరాగా ఉండడం.
బాధల్లో ఉన్నవారికి స్నేహితులు **చేదోడువాదోడుగా** ఉండాలి.

22. **తు.చ. తప్పక** – ఉన్నది ఉన్నట్లు
గురువు చెప్పినవి **తు.చ. తప్పక** పాటించేవాడు వృద్ధిలోకి వస్తాడు.

23. **తలకు మించిన భారం** – శక్తికి మించిన బరువు
అప్పులు అతిగా చేస్తే **తలకు మించిన భారం** అవుతుంది.

24. **తామర తంపర** – విస్తారం, అధికం
మనదేశంలో అక్షరాస్యత **తామర తంపరగా** వర్ధిల్లడం అవసరం.

25. **నేల ఈనినట్లు** – అసంఖ్యాకంగా, అధికంగా
తిరుపతి బ్రహ్మోత్సవాల్లో భక్తులు **నేల ఈనినట్లు** ఉంటారు.

26. **పానకంలో పుడక** – మంచి పనుల్లో విఘ్నం, మంచిలో చెడు
తరగతి గదిలో పాఠం జరుగుతుంటే కొందరు **పానకంలో పుడకలా** ప్రవేశిస్తారు.

27. **వీనులవిందు** – చెవులకు ఇంపు, వినటానికి ఆనందంగా వుండడం
జానపద గేయాలు **వీనులవిందుగా** ఉంటాయి.

★★★★★

# అపరిచిత గద్యం – అవగాహన

## 1. ఈ గద్యాన్ని చదివి, క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.

జాషువా రచనల్లో ఖండ కావ్యాలు ప్రముఖమైనవి. ఖండకావ్యాలకు అఖండ ఖ్యాతిని తెచ్చినవాడు జాషువా, జాషువా కవితల్లో స్పృశించని కథా వస్తువే లేదు. ప్రజా భాషలో రచించిన ఆయన కవితల్లో సామాజికత ప్రతిబింబిస్తుంది. జాషువా మూఢ విశ్వాసాలను ఖండించాడు. పేదరికం సహనాన్ని నేర్పితే, కుల తత్త్వం వల్ల ఎదిరించే లక్షణం అలవడింది. అందుకే జాషువా 'విశ్వనరుడు'గా పేరుగాంచాడు. జాషువా రచనల్లో అధికభాగం సంస్కృత, ఆంగ్ల, హిందీ, కన్నడ భాషల్లోకి అనువదించ బడ్డాయి. 'సుకవి జీవించు ప్రజల నాలుకల యందు' అని జాషువా అను కొన్నట్లు గానే ఆయన కవిత నిరంతరం ప్రజలనాలుకలపై నర్తిస్తూ ఉంటుంది.

### ప్రశ్నలు

1. జాషువారచనల్లో ప్రముఖమైన వేవి?
2. జాషువా కవితల్లో ఏది ప్రతిబింబిస్తుంది?
3. జాషువా ఏమని పేరుగాంచాడు?
4. పేదరికం ఏమి నేర్పుతుంది?
5. సుకవి ఎక్కడ జీవిస్తాడు?

**2. ఈ గద్యాన్ని చదివి, క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.**

పుణ్యకర్మ లెక్కువగా చేసినవారు స్వర్గాది లోకములకు వెళ్ళి పుణ్యఫలములైన సుఖభోగముల ననుభవింతురు. పుణ్యము నశించగనే వారు తిరిగి భూలోకమున జన్మింతురు. అట్లే పాపములొనర్చినవారు నరకమున కేగి దుఃఖముల ననుభవింతురు. కాబట్టి మానవుడు సత్కర్మలొనర్చి ఉత్తమ స్థితినొందుటకు ప్రయత్నింపవలెను. ప్రారబ్ధకర్మను మనముమార్చు– కొనలేము. కాని భవిష్యత్తు మనచేతిలో నున్నదనుట నిశ్చయము. కాన మానవుడు సత్కర్మలొనర్చి ఉత్తమగతి నొందుటకు తప్పక యత్నింప వలెను.

**ప్రశ్నలు**

1. పుణ్యము చేసినవారు ఏలోకమునకు వెళ్ళెదరు?
2. పుణ్యము నశించగనే తిరిగివారు ఏలోకమునకు వత్తురు?
3. పాపములొనర్చిన ఎచటికేగుదురు?
4. దేనిని మనము మార్చుకొన లేము?
5. మానవుడు ఎందు కొరకు ప్రయత్నించ వలెను?

**3. ఈ గద్యాన్ని చదివి, క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.**

కర్నూలు జిల్లాలోని అహోబలానికే 'అహోబిలం' అనికూడాపేరు. ఇదివైష్ణవులకు ప్రధానక్షేత్రం. ఇక్కడే హిరణ్యకశిపుడు పరిపాలించాడు. ప్రహ్లాదుణ్ణి హింసించాడు. విష్ణువు నరసింహరూపంతో ఉగ్రస్తంభంలో ఆవిర్భవించింది ఇక్కడే. భవనాశినీ తీరంలో నరసింహస్వామి తొమ్మిది రూపాలతో వెలసి వున్నాడు. ఈ క్షేత్రం నల్లమల అడవులలోఉంది. ఈ అడవి చిరుతపులులకు, సింహాలకు ప్రసిద్ధి. అన్నమాచార్యుడు ఈ అడవులలో నిర్భయంగా నడచి వెళ్ళాడు. ఇక్కడ దిగువ అహోబిలం, ఎగువ అహోబిలం అని రెండు ఉన్నాయి. దిగువన ప్రహ్లాదవరదుడనే పేరుతో, ఎగువన ఉగ్రనరసింహరూపంతో స్వామి ఆ విర్భవించి ఉన్నాడు. అన్నమాచార్యుడు ఈ దివ్య మూర్తులను కీర్తించాడు.

**ప్రశ్నలు**

1. అహోబిలానికి మరొక పేరేమి?
2. అహోబిలంలో ఉన్న పుణ్య తీర్థమేది?
3. అహోబిలం ఏజిల్లాలో, ఏ అడవులలో ఉంది ?
4. ఈ అడవి దేనికి ప్రసిద్ధి?
5. అహోబిల నృసింహస్వామిని కీర్తించిన వారెవరు?

**4. ఈ గద్యాన్ని చదివి, క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.**

శంతనుడు హస్తినాపుర రాజు. అతనికొడుకే గాంగేయుడు. శంతనుడు దాశరాజు కూతురైన సత్యవతిని ప్రేమిస్తాడు. తండ్రి కోరిక తీర్చేందుకై జీవితాంతం బ్రహ్మచారిగా ఉంటాననీ, సత్యవతి కుమారునకే రాజ్యం అప్పగిస్తాననీ ప్రతిజ్ఞచేసి 'భీష్ముడైనాడు' గాంగేయుడు. సత్యవతీ శంతనులకు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనే కొడుకులు కలిగారు. చిత్రాంగదుడు చనిపోయిన తరువాత విచిత్రవీర్యుడు రాజవుతాడు. ఆపై అతడు కూడా చని పోతాడు. అంబ, అంబాలిక అతని భార్యలు. వారిద్దరికీ సంతానం లేదు. సత్యవతి వ్యాసుణ్ణి తలచుకోగా అతడు ప్రత్యక్షమవుతాడు. కురువంశాన్ని నిలబెట్టమని సత్యవతి కోరుతుంది. వ్యాసుడు అంగీకరిస్తాడు.

**ప్రశ్నలు**

1. శంతనుని కొడు కెవరు?
2. గాంగేయునికి గల మరొక పేరేమి?
3. అంబ, అంబాలిక – ఎవరిభార్యలు?
4. సత్యవతి ఎవరిని తలచుకొన్నది?
5. సత్యవతి ఎవరి కుమార్తె ?

**5. ఈ గద్యాన్ని చదివి, క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.**

ఆడపిల్ల అత్తవారింట జీవించవలసిన పరిస్థితి అన్ని కాలములందును అన్నిదేశములందును గలదు. దానిలో విజయము పొందుటకు రెండే ముఖ్య ఉపాయములు. ఓర్పు, మిత భాషిత్వము. 'మూగనోము' అను విచిత్రాచారమొకటిఉంది. బాలికలు సూర్యాస్తమయ సమయంలో చక్కగా అలంకరించుకొని, కుంకుమ బరిణ, అక్షతలు తీసుకొని పొరుగిళ్ళ ముత్తయిదువల వద్దకువెళ్ళి వారిచే అక్షతలు వేయించుకు వస్తారు. ఇంత సేపును ఆ బాలికలు పెదవికదిపి మాటలాడరాదు. పలకరించినా వారుమాట్లాడ కూడదు. 'మూగనోము' దీపావళి వెళ్ళిన మరునాటినుండి కార్తీక శుద్ధ పూర్ణిమ వరకు ఒక పక్షము దినములు చేయుదురట.

**ప్రశ్నలు**

1. ఆడపిల్ల అత్తవారింట విజయం సాధించడానికి కల ఉపాయములేవి?
2. విచిత్రాచారము పేరేమి?
3. బాలికలు ఎవరిచేత అక్షతలు వేయించు కుంటారు?
4. 'మూగనోము' ను పాటించే కాలమేది?
5. పై అంశమునకు శీర్షికను పేర్కొనండి.

**6. ఈ గద్యాన్ని చదివి, క్రింద ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి.**

ఏదేశచరిత్రలో నైనా ఒక కాలంలో ఒక ఘట్టంలో ఒక మహాపురుషుడు ప్రభవించడం కద్దు. ఆధునిక తెలుగు సాహిత్య చరిత్రలో అలాంటిఘట్టం వ్యావహారిక భాషోద్యమం. ఈ ఉద్యమ ప్రవక్త గిడుగు వేంకట రామమూర్తి. ఇతడు గ్రాంథిక భాషా విద్వేషికాడు. గ్రాంథికం కోసం ఆయన కన్నా గొప్పగా శ్రమించినవాడు లేదు. కవిత్రయ మహాభారతం ఆయనకు కరతలామలకం. నన్నయ మహాభారతంనుంచి నేటిమహాకవుల రచనలదాకా రామ్మూర్తిపంతులుగారు జ్ఞాపకం పెట్టుకొన్నారు. ఆయన జ్ఞాపకశక్తి అమోఘమైనది. ఈనాడు మనం సరళమైన తెలుగు వ్యావహారికం వ్రాస్తున్నామంటే అంతా ఆయన చలువే. 'వాడుకభాషలోనే కావలసిన జ్ఞానం సంపాదించవచ్చు'-అన్నది గిడుగువారి సిద్ధాంతం. చివరకు అందరిచేత గిడుగు-'పిడుగు' అనిపించుకొన్నాడు.

**ప్రశ్నలు**

1. తెలుగులో వ్యావహారిక భాషోద్యమ ప్రవక్త ఎవరు?
2. గిడుగువారికి కరతలామలకమైన గ్రంథమేది?
3. గిడుగువారి జ్ఞాపకశక్తి ఎటువంటిది?
4. గిడుగు ఏమని సిద్ధాంతం చేశాడు?
5. గిడుగు అందరిచేత ఏమనిపించుకున్నాడు?

# ఉపవాచకం

# కెంపేగౌడ

## (బెంగుళూరు మహానగర నిర్మాత)



Kempegowda

# కెంపేగౌడ

## కర్ణాటక రాష్ట్రము – బెంగుళూరు మహానగరము

భారత దేశమందలి గణనీయమైన రాష్ట్రములలో కర్ణాటక రాష్ట్రమొకటి. ఇది ఆంధ్ర తమిళ మహారాష్ట్ర ప్రాంతములచే ఆవరింపబడియున్న దగుటచే ఆయా భాషా ప్రాంతముల సంస్కృతితో ఈ రాష్ట్ర సంస్కృతికి దగ్గర సంబంధము కలదు. కర్ణాటక సంస్కృతి దక్షిణ భారత సంస్కృతికి మారు పేరనదగినది. కను కనే దాక్షిణాత్య సంగీతమునకు కర్ణాటక సంగీతమను పేరు ప్రసిద్ధమైయున్నది. కర్ణాటక రాష్ట్రము సిరిసంపదలకు నెలవు. కళా విజ్ఞానములకు కాణాచి. భారత దేశమంతటిలో ప్రధానమైన బంగారు గనులిచ్చటనే గలవు. మంచి గంధపుటడవులకు, వన్యగజములకు, కాఫీపంటకు ఈ రాష్ట్రము ప్రసిద్ధివహించినది. బేలూరు, హాళెబీడు, హంపి మున్నగు చోట్లగల శిల్ప సంపద ఖండ ఖండాంతరవములందు ప్రసిద్ధమైనది. ప్రజాహిత తత్పరులు, కళాపోషకులునగు చాళుక్యులు, హెూయసళులు, యాదవులు, విజయనగర ప్రభువులు, ఒడయరులు మున్నగు ప్రభువుల చల్లని పరిపాలనలో కర్ణాటక రాష్ట్రము రామరాజ్యమై వెలుగొందినది.

ఈ రాష్ట్ర ప్రధాన భాష కన్నడము. కన్నడ భాషా లాలిత్యము కస్తూరితో పోల్పదగినది. 'కన్నడ కస్తూరి'యను వాడుకకూడ గలదు. ఈ భాషలో పంప, పొన్న, రన్న, కుమారవ్యాస, లక్ష్మీశాదులు మహాకవులు పాలవేకరి కదిరీపతి, కళువె వీరరాజు మొదలైన తెలుగు కవులుకూడ ఈ సీమలో వర్ధిల్లిరి. అనేక పుణ్య క్షేత్రములు యాత్రాకేంద్రవములు, ఈ రాష్ట్రమున కలవు. ఈ రాష్ట్ర ప్రజలు సహజముగ సౌమ్యస్వభావులు.

పాడిపంటలు పొంగి పొరలు ఈ రాష్ట్రమునకు రాజధాని బెంగుళూరు నగరము. హిందూదేశమందలి ప్రధాననగరములలో ఇది యొకటి. ఈ మహానగరము ప్రాచీన

ఆధునిక నాగరికతల కొక కూడలి. ఈ నగరజనులు వేషభాషల వలన అత్యాధునికమ్మైన నాగరికత మూర్తీభవించి నట్లుందురు. కాని దైవభక్తి, ప్రాచీన సంస్కృతి యందభిమానము విస్తారముగ కలవారు. ప్రతివీథిలో అడుగడుగున కానవచ్చు దేవాలయములు, సంస్కృత పాఠశాలలు , సంగీత నాట్య విద్యాలయములే ఇందుకు సాక్షి. ఈ నగరమున భారతదేశమునందలి భాషలన్నియు వినిపించుచుండును. అన్ని మతములవారును అన్నదమ్ములవలె కలసి మెలసి జీవించుచుందురు. సమగ్ర భారత దేశము యొక్క సంగ్రహ స్వరూపమే బెంగుళూరు నగరమనవచ్చును. ఇది గొప్ప విద్యాకేంద్రము. విశ్వవిద్యాలయములు, కళాశాలలు ఈ నగరమున అనేకములు గలవు. కేంద్ర రాష్ట్రప్రభుత్వముల కార్యాలయము లనేకములు ఇచ్చట గలవు. వాణిజ్య పారిశ్రామిక రంగములందు గూడ బెంగళూరు నగరము గణనీయమ్మైయున్నది. చేతిగడియారములనుండి వాయువిమానములవరకు ఇచ్చట నిర్మింపబడుచున్నవి. సబ్బులు, ఆగరవత్తులు మున్నగు సుగంధసామగ్రినుండి మేలైన పట్టువస్త్రముల వరకు ఇచ్చట ఉత్పత్తియగుచున్నవి. ఉన్నతములైన భవనములు, విశాలము లైన వీధులు, మనోహరములగు ఉద్యానవనములు, ఆహ్లాదకరమ్మైన వాతావరణముతో ఈ సుందరనగరము కన్నులపండువగుచున్నది. 'విధానసౌధ,' యుటిలిటీ బిల్డింగ్' మున్నగు భవనములు 'లాల్‌బాగ్', కబ్బన్‌పార్క్', మున్నగు ఉద్యానవనములు, బసవనగుడి, సోమేశ్వరాలయము మున్నగు దేవస్థానములు చూడదగినవెన్నో ఈ నగరమున గలవు.

బెంగళూరు నగరము కర్ణాటక రాష్ట్రములో ఒక ప్రక్కగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రముల పొలిమేరలకు దగ్గరగా నున్నది. అందుచే ఈ నగరము కర్ణాటాంధ్ర తమిళ సంస్కృతుల త్రివేణిసంగమమ్మైనది. ప్రస్తుతపు కర్ణాట రాష్ట్రములోని అధిక భాగము పూర్వము మైసూరు సంస్థానముగా నుండెడిది. మైసూరు సంస్థానముతో ఇరుగు పొరుగు రాష్ట్రములందలి కన్నడ భాషాప్రాంత ములుచేరి నేటి కర్ణాటక రాష్ట్రమేర్పడినది. రాష్ట్రమేర్పడిన పిమ్మట దానికి రాజధానియైన బెంగళూరు నగరము వెనుకటికి పదింతలుగా పెరిగినది. ఇంకను పెరుగుచున్నది. ముమ్మడి శ్రీ కృష్ణరాజేంద్రవడయర్, నాల్మడి శ్రీ కృష్ణ రాజేంద్రవడయర్, జయచామరాజేంద్రవడయర్ మున్నగు ఉదారులైనప్రభువులు,

సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ మీర్జా ఇస్మాయిల్ మున్నగు సమర్థులైన పరిపాలకుల ఏలుబడిలో ఈ నగరము దక్షిణభారత దేశమునకే తల మానికమై వెలుగొందుచున్నది.

నగరపాలక సంఘపు కార్యాలయమునకు ముందుగల రాజవీధి మధ్యగా, ఉన్నతమగు వేదికపై నెలకొల్పబడిన ఒక నిలువెత్తు విగ్రహము చూపరుల దృష్టి నాకర్షించుచుండును. అదే బెంగళూరు నగర స్థాపకుడగు కెంపేగౌడ శిలా విగ్రహము. తలపాగ, మెలితిరిగిన మీసము, ఒక చేత డాలు, మరొక చేత దూసిన కత్తి గలిగి ఆ విగ్రహము మూర్తీభవించిన వీరత్వమా యన్నట్లుండును. కెంపేగౌడ యెడల బెంగళూరు నగర వాసులకు గల గౌరవమునకు చిహ్నముగా ఈ విగ్రహము 1-11-1964 తేదీని అప్పటి మద్రాసు రాజ్యపాలకుడైన మైసూరు మహారాజ శ్రీ జయచామరాజేంద్రవడయర్ గారిచే ఆవిష్కరింపబడినది.

కెంపేగౌడ ఆంధ్రుడని చరిత్రకారులు చెప్పచున్నారు. కర్ణాటక రాజ్య రాజధాని స్థాపకుడు కన్నడిగుడేయై యుండునని కర్ణాటకులు భావించుటయు సహజమే. ఇట్లు ఆంధ్రభోజుడును, కన్నడ రాజ్యరమారమణుడునగు శ్రీ కృష్ణదేవరాయలవలె కెంపేగౌడ కూడ కర్ణాటాంధ్రులకు ఉభయులకును ఆత్మీయుడగు చున్నాడు. కెంపేగౌడ ఆదర్శ చరిత్ర పాఠకులలో దైవభక్తి, దేశభక్తి, ప్రజాను రక్తి , కార్యదీక్ష అను సద్గుణములను పెంపొందింపగలదు.

# కెంపేగౌడ పూర్వులు

కెంపేగౌడ పూర్వులు తమిళ దేశమందలి కాంచీపుర సమీపమందలి 'ఆలూరు' గ్రామనివాసులు, వారు వ్యవసాయము ప్రధానవృత్తిగాగల కాపులు కెంపాంబికా కాలభైరవులు వీరి కులదైవములు.

ఇప్పటికి సుమారు ఆరువందల ఏండ్ల నాటిమాట. కెంపేగౌడ ముత్తాత రణభైరేగౌడ. అతడు తగుపాటి స్థితిపరుడై గౌరవనీయుడై పరిసర గ్రామములకు తగవరియై యుండెను. అతనికి ఆరుగురు తమ్ములు, నలుగురు కుమారులు, ఒక

కుమార్తె కలరు. కుమార్తెపేరు దొడ్డమ్మ. ఈమె అందాలరాశి ఆమెకు తగిన వరునికై అన్వేషించుచుండెను. ఇంతలో ఆమె సౌందర్యము ఆ ప్రాంతమున బలవంతుడైన యొక పాళెగాని చెవిసోకెను. ఆ పాళెగాడు దొడ్డమ్మను తనకిచ్చి వివాహము గావింపుమని రణభైరేగౌడను నిర్భంధింపసాగెను. దుస్స్వభావుడగు ఆ పాళెగానికి తన ముద్దుబిడ్డ నొసంగుటకు రణభైరేగౌడకు మనసొప్పదయ్యెను. అధికార మదోన్మత్తుడైన పాళెకాని నిర్భంధము, బెదిరింపులు నానాటికి అధికమయ్యెను. రణభైరేగౌడ సిరిసంపదలకంటెను, ప్రాణముకంటెను, మానమునే అధికముగా భావించెడివాడు. వంశ ప్రతిష్ఠను కాపాడుటకై అతడు వాకిలిని పొలముపుత్రులను వదలి దేశాంతరము వెళ్ళుటకు ఉద్యుక్తుడయ్యెను.

రణభైరేగౌడ రహస్యముగ ప్రయాణసన్నాహములను గావించుకొని, బండ్ల కెత్తుకొన గలిగినంత సొత్తు నెత్తుకొని, సోదరుల కుటుంబములతో సహా పశ్చిమాభిముఖుడై బయలుదేరెను. పవలనక రేయనక వారు హుటాహుటిని ప్రయాణము సాగించుచుండిరి. మార్గమధ్యమున వారికి పాలారు అనునది అడ్డమయ్యెను. అది యొక పెద్ద కొండయేరు. కొండలపైనెక్కడ ఏపాటి వర్షము కురిసినను అది ఉన్నట్లుండి ఒకసారిగ ఉప్పెనవలె పొంగిపారును.రణభైరేగౌడ పరివారము నదీ తీరమును చేరుసరికి అది గట్టులొరసికొనుచు మహావేగమున పారుచుండెను. అప్పుడు దానిని దాటబూనుట ప్రాణములను దానికి సమర్పించుటే. అందుచేత చేయునది లేక వరద తీయువరకు వేటియుందమని వారు బండ్లు దింపి విశ్రాంతి గైకొనుచుండిరి.

ఇంతలో రణభైరేగౌడ కుటుంబము పలాయనమ్మైన వార్త ఎట్లో ఆ పాళె గానికి తెలియనే తెలిసెను. తన చేయి జారిపోవుచున్న అందాలబరిణె నెట్లయిన, బలప్రయోగముతోనైన, స్వాధీనము చేసికొనగోరిన ఆ దుష్టుడు వారిని గుఱ్ఱపు దండుతో వెన్నాడెను. విశ్రాంతి గైకొనుచున్న రణభైరేగౌడ పరివారము వానికి అల్లంతదూరమున కనిపించెను. ఇంతలో అంతలో వారిపైబడి తన పంతము చెల్లించు కొనగలనన్న ఆశతో ఆ దుర్మార్గుడు గుఱ్ఱములను మరింత వేగముగా దూకింపసాగెను. తమ పైకి దుమికి వచ్చుచున్న పాలెగాని దండును రణభైరేగౌడ గుర్తించెను. ఏరు దాటనీయదు; శత్రువు వచ్చి పైబడనున్నాడు. అతని వెంట పెద్ద పరివారమున్నది. తామెంతటి వీరులైనను

అల్పసంఖ్యాకులు ; శత్రువును జయింపగల్గుట కలలోని వార్త. తమ ప్రాణములను స్త్రీ గౌరవమును కాపాడు కొన గలుగుట గూడ అసంభవమనిపించెను. అయినను దైవముపై భారము వైచి ప్రాణములున్నంతవరకు వీరోచితముగా పోరాడుటకే నిశ్చయించుకొనెను.

దొడ్డమ్మ ఈ పరిస్థితిని గమనించెను. దురదృష్టవతియగు తన కారణముగ తన పుట్టినింటి బలగము సర్వనాశనమగునట్లుండెను. పుట్టినింటి చేటునకు కారణ మైన తన పుట్టువును ఆమె నిందించుకొనెను. తన భక్తిని పరీక్షించుటకే దైవశక్తి ఈ ఏటిరూపమున ప్రత్యక్షమయ్యెనని ఆమె భావించెను. సీత దమయంతి, ద్రౌపది మొదలగు సాధ్వీమణుల మానమును కాపాడిన దైవము, భక్తితో నమ్మి శరణుజొచ్చినచో తనను మాత్రమేల కాపాడదను ధైర్యము కలిగెను. తోడనే ఆమె ప్రవాహమును సమీపించి నదీదేవతను భక్తితో ఇట్లు ప్రార్థించెను.

"అమ్మా, గంగాభవానీ! ఈ నీ బిడ్డల మానప్రాణములను కాపాడుభారము ఇప్పుడు నీ పైననే నిలచియున్నది. నాపై దయతలచి వెంటనే నీ విజృంభణమును ఉపసంహరించుకొనుము. మేమీ దుర్మార్గుని చేతికి చిక్కకుండ ఆవలిగట్టు చేరునట్లనుగ్రహింపుము. నీకు నా భక్తి పూర్వకముగు కానుకగ ఇదిగో నావ్రేలి నొక దానిని సమర్పించుకొనుచున్నాను. దీనితో నీకు తృప్తి కలుగదేని నన్నే సమర్పించుకొందును. అంతటనైన నీవు ఉపశమించి నా పుట్టినింటి వారినందరను కాపాడుము".

ఇట్లనుచు ఆమె యొక చిరు కైజారుతో కుడిచేతి చిటికెన ఉంగర ముతో సహా ఖడించుకొని నదీదేవతకు సమర్పించెను. ఆమె భక్తికిని, త్యాగ మునకును, సాహసమునకును నదీదేవత సంతోషించెను. రెప్పపాటులో వరద తీసిపోయెను. మోకాటి బండిగనున్న యేటిని బండ్లు సులభముగా దాటగల్గెను. బండ్లు ఆవలిగట్టును చేరినవి, శత్రుదళము ఈ వలిగట్టును చేరినది. మరి వారు కూడ ఏరు దాటగలిగినచో గౌడ పరివారము గతియేమి? దొడ్డమ్మ గతియేమి? దేవతానుగ్రహము మరల వరద రూపమున పొంగివచ్చెను. అంతలోనే మరల ఏరు గట్టులొరసి ఉరకలు వేయుచు పారసాగెను. శత్రువు చేయునదిలేక మరలి పోయెను. ఆ వచ్చిన వరద కొన్ని దినముల వరకు అట్లే

నిలచిపోయెను. ఇంతలో గౌడ పరివారము బండ్లను మరింత వేగముగా తోలుకొని ఆ కీచకుని రాజ్యపు పొలిమేరలను దాటి దూరముగ వెడలిపోయెను. నిరాశ చెందిన ఆ దుష్టుడు వచ్చిన దారినే తిరిగిపోవలసిన వాడయ్యెను.

గౌడ పరివారము తిన్నగ కర్ణాటకమందలి నందిదుర్గమునకు తూర్పుగనున్న రామస్వామి గుట్ట సమీపమున తమ బండ్లను విడచి తాత్కాలిక నివాసముల నేర్పరచుకొనిరి. బండ్ల మీద వచ్చిన కాపులు గనుక వీరిని ఆ ప్రాంతీయులు 'బండి కాపుల' ని పిలుచుచుండిరి. వ్యవసాయము చేసికొను కాపులను కన్నడమున 'ఒక్కలిగరు' అని పిలుతురు మొరసునాటికి చెందిన ఒక్కలిగరగుటచే వీరు తరువాత 'మొరసు ఒక్కలిగరు' అని పిలువబడుచువచ్చిరి. తరువాత రణభైరేగౌడ దేవనహళ్ళి సమీపమందలి ఆహుతి (నేటి ఆవతి) గ్రామమున స్థిరపడెను. అతని సోదరులు హోసకోట, ఆనేకల్లు, కొర్తగెరె మొదలగు ప్రదేశముల కేగి వేర్వేరుగా రాజ్యములు నిర్మించుకొనిరి. రణభైరేగౌడ ఆవతిలో తమ కుల దేవతయైన వీరకెంపమ్మకు ఆలయము నిర్మించెను. తరువాత అతనికి భూమిని త్రవ్వుచుండగా ఏడు కొప్పెరల ధననిధి దొరకినదట. దానితో అతడు చెన్నకేశవాలయమును నిర్మించెను. దొడ్డమ్మ జీవితాంతము వరకు కన్యగనే యుండెను. అందుచే ఆమె పేరిట కనికలమ్మ గుడి కట్టించెను. నేటికిని ఆ గుడిలో పూజలు కన్యకలే చేయుదురట.

రణభైరేగౌడ తరువాత అతని పెద్ద కుమారుడు జయగౌడ ప్రయోజకుడై యలహంక రాజ్యమును స్థాపించుకొని యలహంక ప్రభువు అని ప్రసిద్ధుడయ్యెను. అప్పటిలో ఆ ప్రాంతమును శివసముద్రసీమ యని పిలిచెడివారు. అది విజయనగర సామ్రాజ్యమునకు లోబడినది. గంగ వంశీయులైన ఉమ్మత్తూరు సామంతుల ఏలుబడి క్రిందనుండెను. జయగౌడని తరువాత అతని కుమారుడైన గిడ్డేగౌడ ప్రభువైతన రాజ్యమును విస్తరిల్లజేసెను. గిడ్డేగౌడకు చాలకాలము వరకు పుత్రులు కలుగరైరి. తనకు కుమారుడు కలిగినచో అతనికి తన కులదేవతయగు కెంపాంబ పేరుపెట్టు కొందుననియు, తమ వంశీయులందరును అట్లే తమ కుమారులకు కెంపాంబిక పేరేపెట్టు కొందురనియు అతడు మ్రొక్కుకొనెను. ఆ మ్రొక్కుబడి ఫలితమోయన్నట్లు కొలది దినములలోనే

అతనికి కుమారుడు కలిగెను. గిడ్డేగౌడ ఆ బాలునికి కెంపేనంజేగౌడ అని నామకరణము గావించెను. ఈ మ్రొక్కుబడి కారణముగనే తరువాత ఈ వంశీయులందరును కెంపేగౌడ, హిరియ కెంపేగౌడ, సణ్ణకెంపేగౌడ, ఇమ్మడి కెంపేగౌడ, మున్నగు పేర్లుగలవారైరి.

కెంపేనంజేగౌడ తన తండ్రియనంతరము యలహంకసీమ ప్రభువై సుమారు డెబ్బది సంవత్సరములు ప్రజారంజకముగ పరిపాలించి ధర్మ ప్రభువను కీర్తిని సంపాందించెను. అతని కుమారుడే మన కథానాయకుడగు కెంపేగౌడ, కెంపేగౌడ అనునది కన్నడ భాషోచ్చారణ ననుసరించిన పేరు తెలుగు శాసనములలోను, గ్రంథ ములలోను ఇతడు 'కెంపయ్యగౌడు' అని వ్యవహరింపబడియున్నాడు. ఇతని కంటెకొంచెము చిన్నవాడైన మరియొక, కెంపేగౌడు అతని సోదర వర్గములో, నుండుటచే ఇతనిని పెద కెంపయ్యగౌడు లేక 'హిరియ కెంపేగౌడు' అని పిలుచుచుండిరి.

## నాటి దేశ పరిస్థితులు

కెంపేగౌడ కాలమునాటి మన దేశ పరిస్థితులను గూర్చి ఈ సందర్భమున సంగ్రహముగ తెలిసికొందము. ఉత్తర హిందూదేశముపై ఏడవ శతాబ్దినుండియే మహామ్మదీయుల దండయాత్రలు ప్రారంభమై క్రమముగా హిందూరాజ్యములంతరించి ముస్లిం రాజ్య ములు ప్రబలజొచ్చినవి. దక్షిణ హిందూదేశమునకు మహమ్మదీయులు మొదటి తాకిడి పదునాల్గవ శతాబ్దములో తగిలెను. 1323లో కాకతీయ సామ్రాజ్య మంతరించెను. ముంచుకొనివచ్చు చున్న ముస్లింమతపు వెల్లువనుండి హిందూమతమును రక్షించుటకై అవతరించినమహానుభావుడగు విద్యారణ్య మహర్షి 1326లో పవిత్ర తుంగభద్రా నదీతీరమున కిష్కింధా క్షేత్రములో హరిహర బుక్కరాయ సోదరులచే విద్యానగరమును స్థాపింపజేసెను. విద్యానగరమే విజయనగరమై సామ్రాజ్య స్థానమయ్యెను. విజయనగరమును వరుసగా సంగమ, సాళువ, తుళువ ఆరవీటి వంశములవారు పరిపాలించిరి. వీరందరును హిందూమత రక్షకులై మున్నూరేండ్లవరకు ముస్లిం మత ఉప్పెనను తుంగభద్రకు దక్షిణమునకు రాకుండ అడ్డుకొన గలిగిరి. వీరిలో

తుళువ వంశీయుడైన శ్రీకృష్ణదేవరాయలు అతి ప్రసిద్ధుడు, ఆయన పరిపాలన కాలము దక్షిణ భారతచరిత్రలో స్వర్ణయుగమని చెప్పదగినది. విజయనగరమును కృష్ణరాయలు పాలించుచున్న కాలముననే ఉత్తర హిందూదేశములో బాబరు మొగలాయి సామ్రాజ్యమును స్థాపించెను. దక్షిణమున బహమని రాజ్యము లేర్పడి దక్షిణాపథము నంతటిని కబళింపవలెనని చూచుచుండెను. అవక్ర పరాక్రమ శాలియగు కృష్ణరాయలు సుల్తానుల ఆటలను కట్టించుచుండెను.

కృష్ణరాయల సామ్రాజ్యము దక్షిణ హిందూ దేశమంతయు వ్యాపించియుండెను. కర్ణాంధ్ర తమిళ ప్రాంతములు ఆ సామ్రాజ్యములో చేరియుండెను. ఆయా ప్రాంతములలో పలువురు పాళెగాండ్రు విజయనగరమునకు సామంతులై సాలుసరి కప్పములు చెల్లించుచు, చక్రవర్తి సర్వాధికారమునకులోబడి చిన్న చిన్న రాజ్యములను పాలించుచుండిరి. దురాశాపరులగు కొందరు పాళెగాండ్రు అప్పుడప్పుడు ఒకరిరాజ్యమునొకరు ఆక్రమించుకొనుటయు, స్వాతంత్ర్యమును ప్రకటించుటయు జరుగుచుండెను. అట్టివారిని సమ్రాట్టు దండించి ఎవరిస్థానములో వారినుంచుచు దేశమున శాంతిభద్రతలను కాపాడుచుండెను. అట్టి విజయనగర సామంతులలో యలహంక ప్రభువులొకరు. వారు, విజయనగర సామ్రాజ్యమును భక్తి విశ్వాసములతో సేవించుచు, సమ్రాట్టునకు కుడి భుజమువలె నిలిచి 'స్వామిభక్త' బిరుదమును ధరించియుండిరి. కృష్ణరాయల పరిపాలన కాలమునాటికి కెంపేగౌడ నూనూగు మీసాల నూత్న యౌవనమందుండెను.

## కెంపేగౌడ బాల్యము

పువ్వుపుట్టగనే పరిమళించునన్నట్లు కెంపేగౌడ బాల్యము నుండియే దైవభక్తి , గురుభక్తి, ప్రభుభక్తి, స్వాభిమానము, సాహసము, దీనులయెడ దయ, మున్నగు సద్గుణ సంపద కాలవాలమై సాటి బాలురలో మేటియై ప్రకాశించుచుండెను. సాన పెట్టనిదే రత్నమైనను ప్రకాశింపదు. గురుకుల శిక్షణ లేనిదే బుద్ధియు, శీలమును వికసింపవు. అందుచే కెంపేనంజేగౌడ తన కుమారుని ఐగండ పురమునగల మాధవభట్టారకు

గురుకులమున ప్రవేశపెట్టెను. మాధవభట్టు సర్వశాస్త్ర పారంగతుడైన మహావిద్వాంసుడే గాక పరమసాత్వికుడై ఋషితుల్యజీవితమును గడిపెడివాడు. ఆయన ఆశ్రమములో రాజకుమారులు, సామాన్యులునైన పలువురు శిష్యులుండిరి. ఆయన వారినందరను ఎక్కువతక్కువలు లేక సమానమగు వాత్సల్య ముతో కలసి మెలసి మెలగుచు, గురువుల అనుగ్రహమును మిత్రుల అభిమానమును సంపాదింపగల్గెను. గురుకులమును చేరునాటికే కెంపేగౌడ గుఱ్ఱపు సవారి, కత్తిసాము మొదలగు క్షత్రవిద్యలందు, తండ్రియొద్దనే శిక్షణము నందియుండెను. గురుకులమున అతడు రాజనీతి, అర్థశాస్త్రము, సాహిత్యము మున్నగు విద్యలను గూడ అభ్యసించెను. విశేషించి పరమసాత్వికుడైన మాధవభట్టారకుని శీలసంపద యువకుడైన కెంపేగౌడ కబ్బి అతడు ఉత్తమ సంస్కారవంతుడయ్యెను.

కెంపేగౌడ పూర్వులు భైరవారాధకులని మనము చదివియుంటిమి. భైరవారాధనము జంతుబలులు, నరబలులు మున్నగు క్రూరాచారములతో కూడినది. కెంపేగౌడ అట్టి క్రూరమగు ఆరాధనా విధానము నేవగించుకొని సాత్విక పూజా విధానము ననుసరించి శివభక్తుడయ్యెను. భైరవుడు శివుని కుమారుడే యగుటచే శివారాధన తమ ప్రాచీన సంప్రదాయమునకు విరుద్ధముకాదని అతడు తన కులపు పెద్దలకు నచ్చ జెప్పి వారినికూడ సాత్త్వికమార్గమునకు త్రిప్పెను. కెంపేగౌడ వంశమునకు మూలపురుషుడైన రణభైరేగౌడ కుమార్తెయగు దొడ్డమ్మ తనచేతి చిటికెన వ్రేలిని నదీదేవతకర్పించిన దని వెనుక చదివియున్నాముగదా, నాటినుండీ వారి వంశమున ఒక వింతయైన ఆచారము బయలు దేరినది. పెండ్లికిముందు పెండ్లి కుమార్తెయొక్క కుడిచేతి చిటికెన వ్రేలిని ఉంగరముతో సహా ఖండించి కెంపమ్మకు నివేదించుట ఆచారమైనది. రక్తపాతమునొల్లని కెంపేగౌడ తన వంశమందలి ఈ క్రూరాచారమును మాన్పించెను.

గురుకులమందుండగనే కెంపేగౌడకు వీరణ్ణయను సార్థక నామధేయునిస్నేహము లభించెను. కెంపేగౌడ వీరణ్ణగౌడల స్నేహము వయసుతో పాటే పెరుగుచు బలపడుచువచ్చెను. వారిరువురకును శరీరములే భిన్నములుగాని ప్రాణ

మొక్కటియేయయ్యెను. కెంపేగౌడ ప్రభువైన పిమ్మట వీరణ్ణగౌడ అతనికి సేనానియై అతనికి సర్వకార్యములందును కుడి భుజమయ్యెను. కెంపేగౌడతో పాటు గురుకులమున విద్యాభ్యాసము గావించిన వారిలో వేదట్ల అనంతభట్టను నొక బ్రాహ్మణ యువకుడు గూడ కలడు. అతడు వేదవేదాంగములయందు పారంగతుడయ్యెను. తాను ప్రభువైన పిమ్మట కెంపేగౌడ ఈతనినే తన పురోహితునిగా నియమించుకొనెను.

కెంపేగౌడ గురుకుల వాసము ముగించుకొని గృహమున కేతెంచిన కొలది దినములకే గృహస్థుడయ్యెను. ప్రస్తుతపు హెబ్బాల్ తాలుకాలో చేరిన కొడిగె హళ్ళి గ్రామమునే ఆ దినములలో  బెంగళూరని పిలిచెడివారు. కెంపేనంజేగౌడ భార్యయు, హిరియ కెంపేగౌడ తల్లియునగు లింగమాంబ ఈ యూరి ఆడుపడుచే. ఆమె తన మేనకోడలగు చెన్నమాంబనే తనకుమారునకు వివాహము చేసికొన గోరెను. లింగమాంబ పుట్టినింటివారిది సాధారణమైన రైతు కుటుంబము, వారు పెద్దగా సంపన్నులుకారు. కెంపేనంజేగౌడ పెండ్లినాటికి యలహంక ప్రభువులింకను చిన్నపాళెగాండ్రుగానుండిరి. అందుచే అప్పటిలో కెంపేనంజేగౌడ ఆ పేదయింటి పడుచును పెండ్లాడుటకు సంకోచింప లేదు. కాని నేటికి అతని సిరి సంపదలు, బలము, అధికారము బాగుగా పెరిగి యుండెను. అందుచే పేదయింటి పిల్లను తనకోడలుగా గ్రహించుట అతనికంతగా అంగీకారము గాకుండెను. తనరాచరికమునకు సాటిరాగల ఏ రాజకుమార్తెనో తనకుమారున కిల్లాలు గావించినచో తన ప్రతిష్ఠ పెరుగుటేగాక రాజకీయముగ కూడ అదనపు అండదండలు చేకూరునని అతడు తలచుచుండెను. కాని చెన్నమాంబ సుగుణసంపదయు, రూపరేఖలును తల్లికొడుకులను ముగ్ధలను గావించెను. ఈ ఇంటి కోడలగుటకు చెన్నాంబయేయోగ్యురాలని వారిద్దరును తీర్మానించుకొనిరి. కెంపేనంజేగౌడయు వారి అభీష్టమును త్రోసిపుచ్చలేకపోయెను. చెన్నాంబ కెంపేగౌడ అర్ధాంగి యయ్యెను.

అప్పటికే బాగుగ వృద్ధుడైయున్న కెంపేనంజేగౌడ కుమారునకు పట్టముగట్టి తాను రాజకార్యములనుండి విశ్రాంతి గైకొని దైవస్మరణమందు నిమగ్నుడయ్యెను. రాజకీయ వ్యవహారములందు సుశిక్షితుడైన కెంపేగౌడ రాజ్యభారమును వహించెను.

# మూడు పువ్వులు – ఆరు కాయలు

కెంపేగౌడ అనుకూలవతియగు భార్యతో సుఖముగ సంసారముచేయుచు సమర్థతతో రాజ్యమును పాలించుచుండెను. కొంతకాలమున కాతనికొక కుమారుడు కలిగెను. వంశాచారమువననుసరించి కెంపేగౌడ తన కుమారుకిని కూడ కెంపేగౌడ అనియే నామకరణముగావించెను. తండ్రి హిరియ కెంపరాయడు కాగా కుమారుడు కుమార కెంపయ్య లేక ఇమ్మడి కెంపేగౌడ అని పిలువ బడుచుండెను. కుమారుని అభివృద్ధిని మనుమని, ఆటపాటలను చూచుకొనుచు, సుఖముగా బహుకాలము జీవించి వృద్ధులైన లింగమాంబా కెంపేనంజేగౌడలు కొంతకాలమునకు పరలోక గతులైరి. కెంపేగౌడ ప్రజారంజకుడైన పరిపాలకుడై ఒక్కలిగ వంశవిభూషణ, అరిగండభేరుండ, నిస్సీమభక్త, స్వామిభక్త, ప్రజావత్సల మున్నగు బిరుదములచే భూషితుడై శత్రువులకు సింహస్వప్నమై, పేదసాదలకు దానకర్ణుడై, దీనులకు రక్షకుడై, ఈశ్వరునకు పరమభక్తుడై, చక్రవర్తికి నమ్మిన బంటై 'ఆదర్శప్రభువ'ని పించుకొనెను.

కుమార కెంపయ్య తండ్రి భుజముల ఎత్తునకు పెరిగెను. కెంపేగౌడ తన కుమారునకు కోరమంగల గ్రామమునకు చెందిన లక్ష్మమ్మ అను కన్యామణిని తెచ్చి వివాహమొనర్చెను. లక్ష్మమ్మ కెంపేగౌడ ఇంటికి నిజముగా లక్ష్మీదేవియే అయ్యెను. ఆమె అడుగు మోపిన నాటినుండి కెంపేగౌడ ఇంట సిరిసంపదలు దిన దిన ప్రవర్ధమానములగుచువచ్చెను. లక్ష్మమ్మకు భర్తయు, అత్తమామలును భగవత్ స్వరూపులు. రాణివాసపుకాంతయయ్యు ఆమె దాసదాసీజనులకు పనులుచెప్పక అత్తమామలకు స్వహస్తములతో పరిచర్యలు చేసెడిది. ఆమె హృదయము అతి మృదులము. ఎవరి కేమాత్రము కష్టము కలిగినను ఆదయామయురాలి హృదయము తల్లడిల్లెడిది. ఇతరుల సుఖముకొర్కై తానెంతటి కష్టములనైన ఆమె చిరునవ్వుతో స్వీకరించెడిది. 'లోకారాధనమే మానవజన్మమునకు ధన్యత్వము నొసంగ గలద'ని ఆమె మనసార నమ్మెను. ప్రజాశ్రేయస్సునకై తన ప్రాణములనైన త్యాగము చేయుటకు ఆమె సదా సంసిద్ధురాలై యుండెను.

లక్ష్మమ్మనోచిన నోములు ఫలించ ఆమె కడుపు పండెను. కెంపేగౌడకు మనుమడు జన్మించెను. బాలుడే తర్వాత ముమ్మడి కెంపేగౌడగా ప్రసిద్ధుడయ్యెను. తాత కెంపేగౌడకు మనుమనిచే మీసములు లాగించుకొనుట, రాజకార్యములు చక్కబెట్టుకంటె ప్రియమయ్యెను. లక్ష్మమ్మ మరల చూలాలయ్యెను. తనకీ పర్యాయము మనుమరాలు కలుగునని చెన్నమాంబ మురిసిపోవుచుండెను. ఇట్లు కెంపేగౌడ సంసారము మూడు పూవులు ఆరు కాయలుగా నుండెను.

## విజయమునకు 'దుర్గము' మూలము

లోకములో ఇతరుల మేలుచూచి ఓర్వలేని ఈర్ష్యాపరులు కొందరుందురు. అట్టివారిలో చెన్నపట్టణ సీమను పాలించు జగదేవరాయలొకడు కెంపేగౌడ వైభవ ప్రాభవము లాతని కంటిలో నెరసులైనవి. ఎట్లయిన కెంపేగౌడదైన యలహంక రాజ్యము నపహరింపవలెనని అతనికి దురాశ కలిగెను. కాని కెంపేగౌడ అసాధారణ పరాక్రమశాలి, దానికితోడు చక్రవర్తి అండదండలు దండిగా గలవాడు. అట్టి వానిని తానొక్కడు జయింపలేడు. అందుచే దొడ్డబళ్ళాపురము, చిక్కబళ్ళాపురము, హాళవనహళ్ళి, దేవనహళ్ళి, సీర్య, సోలూరు, కుణిగలు పాళెగాండ్రను కలిపికొని యలహంకనాడుపై దండెత్తివచ్చెను. కెంపేగౌడ సైన్యము సుశిక్షితమైనది; ప్రభుభక్తిపరాయణమైనది; సైన్యావసరములకు కావలసిన మందుగుండు సామగ్రిని కూడ కెంపేగౌడ తన కర్మాగారములలోనే ఉత్పత్తి చేసికొని ఎప్పుడును కొదువలేకుండ నిలువయుంచుకొనువాడు. సింహవిక్రములైన తండ్రికొడుకులు హిరియ కెంపేగౌడ, కుమార కెంపయ్యలు ఇరువురును, వీరణ్ణగౌడయు స్వయముగ యుద్ధ రంగమునకు లంఘించి శత్రువుల బలమునంతటిని పీనుగుపెంటలు గావించిరి. దురాశాపాతకులైన పాళెగాండ్రు చావుదప్పి కన్నులొట్టబోయి పలాయనము చిత్తగించి ఎట్లో ప్రాణములతో బయటపడిరి.

విజయమును సాధించినను కెంపేగౌడకు తృప్తి కలుగలేదు. పరాజితులైన శత్రువులు తాత్కాలికముగ వెనుదీసిరేగాని వారి దురాశ చావలేదు. ఎప్పడో తాను

ఏమరియున్నప్పుడు వారు తమ ధూర్తత్వమును మరల ప్రదర్శింపకపోరు. కెంపేగౌడకు పాముల పుట్టల మధ్య పవ్వళించినట్లుండెను. గుండెపై చేయివైచుకొని నిశ్చింతగా నిదురించుటకు వీలులేకుండెను. బలమైన కోటయొకటి నిర్మించుకొన్నచో కొంతవరకు గుండె దిటవేర్పడ గలదు. విజయమును కోరు వానికి దుర్గనిర్మాణము అవశ్యకర్తవ్యమని చిన్ననాడు చదువుకొనిన దానిని కార్యరూపము నొందింపవలెనని కెంపేగౌడ నిశ్చయించుకొనెను.

కెంపేగౌడ చిన్నతనమున తనతండ్రివెంట ఒకటి రెండు పర్యాయములు విజయనగరమునకు విజయదశమి ఉత్సవములను తిలకింప నేగియుండెను. పెద్దవాడైన తర్వాత చక్రవర్తికి సాలుసరి కప్పములు సమర్పించుకొనుటకును రెండు మూడు మారు లేగియుండెను. విజయనగర సామ్రాజ్యపు సుస్థిరత్వ మునకు దాని బలమైన కోట యొకమూల కారణమని అతడు గుర్తించెను. నాటి నుండియే తానును అట్టి బలమగు కోట నొక దానిని నిర్మించుకొనవలెనని అతడు కలలు గనుచుండెను. విజయనగరము నాటి నాగరిక ప్రపంచమునకెల్ల మకుటాయమానమైన నగరము, తీర్చ దిద్దినట్లున్న ఆ విశాల రాజవీథులు, ఆకాశమునంటు సౌధములు, నందన వనతుల్యములగు ఉపవనములు, ఉన్నత శిఖర శోభితములగు దేవాలయములు కలిగి అమరావతిని తలదన్ను నట్లున్న విజయనగరమును గాంచినప్పుడెల్ల అతనికి తన యలహంక కుగ్రామమనిపించుచుండెను. సర్వవిధముల విజయనగరమునకు సాటిరాగల మహానగరమొకటి అతని మనోనేత్రము నెదుట నిలిచియుండెడిది. దానికి రూపము నిచ్చుట అతని జీవిత లక్ష్యముగానుండెను. దుర్గమును, నగరమును నిర్మించుటకు అనువగు ప్రదేశము కొరకై అతడు ఎల్లప్పుడును అన్వేషణ గావించుచుండెను. కాని ఇంతకాలము అతనికల కలగనేయుండిపోయెను. దానికి రూపుకట్టింపవలసిన అవసరము ఇప్పుడాతనికి అధికముగా తోచసాగెను.

# బెంగుళూరు నగర స్థాపన

ఒకనాడు కెంపేగౌడ వేటకై వెడలెను అచ్చటనాతని కొక అద్భుత దృశ్యము గోచరించెను. చిటికెవైచిన పారిపోవు పిరికి జంతువైన కుందేలొకటి సివంగులను కూడ చీల్చి చెండాడగల వేటకుక్కలను ఎదిరించెను. జాగిలములు తోకముడిచినవి. ఇది చూచిన కెంపేగౌడ ఆశ్చర్యచకితుడయ్యెను. నగరమున కేగిన పిదప ఈ ఆశ్చర్యకరసంఘటనను తనహితుడును, పురోహితుడునగు, అనంతభట్టున కెరిగించెను. అనంతభట్టు దీర్ఘముగా ఆలోచించి ఇట్లనెను! "మహా ప్రభూ! మీరు చూచినది నిజముగా చాల అపూర్వమైన సంఘటనయే కాని బొత్తిగా క్రొత్తది మాత్రముకాదు. చరిత్రలోఅట్టి సంఘటనలు ప్రసిద్ధములైయున్నవి. పూర్వము హంపీగ్రామ ప్రాంతమున విద్యారణ్య మహర్షి ఇట్టి దృశ్యమునే చూచెనట. ఆ ప్రదేశమునందు పిరికి పందలను, సైతము మహావీరులను చేయగల క్షాత్ర శక్తిదాగియున్నది. అది వీరభూమి అని గుర్తించిన ఆ మహర్షి ఆ ప్రదేశముననే హరిహర బుక్కరాయలచే విద్యానగరమును స్థాపింపజేసెనట. ఆ విద్యానగరమే నేడు విజయనగరమై భూదేవి కంఠహారమందలి నాయకమణియై యుండుట ప్రభువులకు విదితమేగదా ! ద్వారసముద్ర నగర స్థాపనకు సంబంధించియు ఇట్టిదే కథ యొకటివిందుము. కనుక తామీ విచిత్ర సన్నివేశమును దర్శించిన ప్రదేశము ఒక మహానగర నిర్మాణమునకు అనువైనదిగా తోచు చున్నది. తమరచ్చట దుర్గనిర్మాణము గావించుట శుభదాయకము కాగలదని నాయభిప్రాయము."

పురోహితుని హితవచనము ననుసరించి కేంపేగౌడ దుర్గనిర్మాణమునకు ఉత్సహించెను. అందులకై ముఖ్యముగ చక్రవర్తియగు అచ్యుతదేవరాయల అనుమతి అవసరమైయుండెను. కెంపేగౌడవంశము స్వామిభక్తికి పేరందినది. స్వయముగా కెంపేగౌడ శ్రీ కృష్ణదేవరాయల దిగ్విజయ యాత్రలో పాల్గొని, సైన్యమునకు ముందువరుసలోనిలువబడి పరాక్రమము ప్రకటించి రాయల ప్రశంసలందికొనెను. కృ ష్ణరాయల భుజశక్తికిని, తిమ్మరుసు ధీశక్తికిని వెరచి సామ్రాజ్య మునకు విధేయులైయున్న కొందరు పాళెగాండ్రు వారిరువురు స్వర్గస్థులైన పిమ్మట చక్రవర్తియైన అచ్యుత దేవరాయల

బలహీనతను అవకాశముగాగొని స్వతంత్రులగుటకు ప్రయత్నించుచుండిరి. అట్టివారిలో చెన్న పట్టణపు పాళెగాడగు జగదేవరాయలు ముఖ్యుడు. జగదేవరాయలకు కెంపేగౌడపై గల ద్వేషమునకు గల కారణములలో కెంపేగౌడ స్వామిభక్తియు నొకటి. జగదేవరాయలు దురాశా పూరిత పథకములు సాగకుండ కెంపేగౌడ ఎప్పటికప్పుడు అడ్డుకొనుచుండెను. అట్టి స్వామిభక్తుడగు కెంపేగౌడ దుర్గమును నిర్మించుకొనుట సామ్రాజ్యభద్రత కెంతేని ప్రయోజనకారి కాగలదు. అందుచే అచ్యుత దేవరాయలు కెంపేగౌడకు దుర్గనిర్మాణమునకు సంతోషముతో అనుమతినొసంగెను.

సమ్రాట్టు అనుమతి లభింపగనే కెంపేగౌడ ఒక శుభముహూర్తమున ఆ గండుగడ్డపై కోటకట్టుటకు శంకుస్థాపన గావించెను కట్టబోవు నగరమునకు పేరేమిపెట్టవలెనను ప్రశ్నయుదయించెను. ఈ సంఘటన జరిగిన ప్రదేశమునకు కొలది దూరముననే చెన్నమాంబ జన్మస్థలమగు బెంగళూరు గ్రామము కలదు. కెంపేగౌడ ఆ గ్రామ నామమునే తాను కట్టబోవు పట్టణమునకు పెట్టుటకు నిశ్చయించెను.

## బెంగుళూరు పూర్వచరిత్ర

కెంపేగౌడ కోట కట్టుటకు పూర్వమే ఆ సమీపమున బెంగళూరును గ్రామము నెలకొనియున్నదని తెలిసి కొనియుంటిమి గదా ! ఈ గ్రామము అతిప్రాచీనమైనది. పూర్వము అది జైనమతమున కొక కేంద్రమై యుండెడిది. ఈ గ్రామమునకు బెంగుళూరును పేరేర్పడిన విధమును గూర్చి యొక 'దంతకథ' కలదు.

నేడు మహానగరముగనున్న బెంగళూరు ప్రాంతమంతయు పూర్వము మహారణ్యముగ నుండెడిది. కెంపేగౌడ కాలమునాటికి అది అరణ్య ప్రాంతమే గదా ! ఒకప్పుడు దేవనూరును పాలించు వీరభల్లాణ మహారాజు ఈ ఆడవికి వేటలాడుటకేగెను. వేట తమకమున అతడు తన పరివారమునుండి వేరుపడి అడవిలోనికి దూరముగా పోయెను. తిరిగి తన పరిజనులను కలసికొన లేకపోయెను. దారితప్పి అతడా అరణ్యమంతయు తిరిగి అలసిపోయెను. అంతలో చీకటికూడ పడెను. రాత్రివేళ

అరణ్యమధ్యమున తలదాచుకొనదగు తావే మహారాజునకు కనిపింపదాయెను. ఇంతలో దూరమునుండి మినుకు మినుకు మను దీపపు కాంతి అతనికి గోచరించెను. అదియే అతనికి ఆశాజ్యోతియయ్యెను. ఆ దీపపు వెలుగును బట్టి పోవగ పోవగ అతని కొక చిన్న కుటీరము కనిపించెను. ఆ కుటీరములో ఒక వృద్ధురాలు ఒంటరిగ నివసించుచుండెను. మహారాజు తనకా రాత్రికి కుటీరములోఆశ్రయమొసగుమని ఆ పేద వృద్ధురాలిని ప్రార్థించెను. ఆమెకతడు మహారాజని తెలియదు. ఎవరో పాపము అడవిలో దారితప్పిన బాటసారియనియే తలంచెను. ఆమె జాలిగుండె కలది. అతనిని సాదర ముగా లోనికి ఆహ్వానించెను. మహారాజునకు ఆకలి దహించివేయుచుండెను. కాని ఆ పేదరాలియొద్ద మహారాజున కాతిథ్యమొసగుటకై రాజోచితమైన ఆహారమేమియును లేదు. ఆమె తాను తినుటకై వండికొనిన గుగ్గిళ్ళు మాత్రమే కలవు. ఆమె వానినే అతనికి సమర్పించెను. అకలిగొనియున్న మహారాజున కాగుగ్గిళ్ళే అమృతాయమాన మనిపించెను. గుగ్గిళ్ళుతిని నీరుత్రాగి మహారాజు గుర్రునత్రేన్చెను. పేదరాలొసంగిన నులక కుక్కియే మహారాజునకు హంసతూలికాతల్పమయ్యెను. రాత్రియంతయు సుఖముగా నిద్రించి తెల్లవారి లేచుసరికి అతనికి బడలిక తీరెను. పరిజనులును తమ ప్రభువును వెదకికొనుచు అప్పటికి వచ్చి చేరిరి. మహారాజా వృద్ధురాలి యొద్ద సెలవుగైకొని తన నగరమునకేగెను. పిదప నిరాశ్రయుడైన తనకాశ్రయమొసగిన ఆ దయామయురాలియెడ కృతజ్ఞతా సూచకముగా ఆ ప్రాంతమునా వృద్ధురాలికి మాన్యముగా నొసగి ఒక గ్రామము చేర్పరచి 'బెందకాళూరు' (గుగ్గిళ్ళుగ్రామము) అని పేరుపెట్టెను. ఆ బెందకాళూరే జనులనోళ్ళలో నలిగి క్రమముగా 'బెంగళూరు' లేక 'బెంగుళూరు'గా రూపొందెను.

## లక్ష్మమ్మ ఆత్మబలిదానము

కోట నిర్మాణము శరవేగమున సాగిపోవుచుండెను. కాని సింహద్వారము దగ్గరకు వచ్చుసరికి దై వము వ్యతిరేకించెను. ఎత్తించిన సింహద్వారము తెల్ల వారు సరికి కూలిపోయెను. అది శిల్పుల అజాగరూకత ఫలితమని భావించి కెంపేగౌడ వారిని గట్టిగా

మందలించెను. వారును మరునాడు మరింత జాగరూకతతో సింహద్వారమును పునర్నిర్మించిరి. కాని తెల్లవారు సరికి అది మరల కూలి పోయెను. గౌడ మరింత నేర్పరులైన శిల్పులను రప్పించెను. కాని ప్రయోజనము లేకపోయెను. ఎన్నిసారు లెత్తించినను సింహద్వారము మాటిమాటికి కూలిపోసాగెను. కెంపేగౌడ గ్రహదేవతా శాంతికై పూజలు చేయించెను. కాని ప్రయోజనము పూజ్యమయ్యెను. ప్రజలు పలువిధముల చెప్పికొనసాగిరి. దుర్గనిర్మాణము దైవమున కిష్టము లేదని కొందరనిరి. మాధవ భట్టారకుని గురుకులమున శిక్షితుడైన కెంపేగౌడ సాత్విక పూజా విధానముల సభిమానించు వాడుకనుక పూజాదులన్నియు ఫలపుష్పాదుల నివేదనము తోను అన్నధాన బ్రాహ్మణ సమారాధనములతోనే ముగించెనుగాని జంతుబలుల నొసంగ డయ్యెను 'రక్త పిపాసువులైన క్షుద్ర శక్తులు కొన్ని యపండును. వానికి తృప్తికలిగించుట అపసరము. కెంపేగౌడ వానిని అలక్ష్యము చేసెను. అందుచేతనే ఈ అవాంతరము కలిగినది'. అని పలువురు చెప్పికొన జొచ్చిరి.

ఇప్పుడైన జంతుబలుల నొసంగ వలెనని కొందరనిరి. మొదట నయినచో జంతుబలులతో సరిపోయెడిది. ఇప్పుడు నరబలినే యొసంగవలెనని మరికొంద రనిరి. పులిమీద పుట్రవలె ఒక పూజారికి పూనకము వచ్చెను. నిండు గర్భిణి యైన ముత్తైదువును బలియొసంగినగాని సింహద్వారము నిలువదని గణాచారి పలికెను. పదిమంది అవుననిన అవుననిరి. దారుణమైన ఈ వార్త కార్చిచ్చువలె సీమయంతయు వ్యాపించెను. కెంపేగౌడ చెవిని కూడ పడెను. కాని జంతుబలినే అంగీకరింపని ఆ పరమ సాత్త్వికుడు నరబలికి అంగీకరించునా? స్త్రీహత్య, అందును నిండు చూలాలిని వధించుట మహాపాతకము. తలచుటకే భయంకరమైన ఈ ఘోర కార్యమున కొడిగట్టుటకంటె మానుటయే మేలని అతడు పలికెను. ఈ వార్త మెల్లగ అంతఃపురమున కూడ ప్రాకెను. చెన్నమాంబ కూడ భర్త నిర్ణయమునే సమర్థించెను.

కెంపేగౌడ కోడలు లక్ష్మమ్మ నిండుగర్భిణియైయుండెను. ఆమెకూడ జంతుబలి విషయములో అత్తమామల మతము ననుసరించునదే. అయినను బహు పర్యాయములు సింహద్వారము కూలుటయు, గణాచారి పలుకులనే పలువురు సమర్థించుటయు

ఆమెకు కూడ గణాచారి పలికినదే నిజమను నమ్మికను కలిగించెను. తమ స్వార్థమునకై నోరులేని జంతువులనో, దిక్కులేని ఏ పేద వానినో బలియొసంగుట పాపహేతువగును గాని, ప్రజాక్షేమమును కోరి ఎవరైన ఆత్మబలిదానము గావించినచో అది పుణ్యకార్యమే యగును గదా ! యని ఆమె భావించెను. ఆ పుణ్యమును తానే ఏల సంపాదించుకొనరాదు ? నూరేండ్లు బ్రతికినను చావు తప్పదు. అది ఇట్టి ప్రజాహిత కార్యమునకై కలుగుటకంటె జీవితమునకు సార్థకత ఏమియుండగలదు? ఇట్టి అవకాశము తనకు లభించినచో అది అదృష్టమే అని లక్ష్మమ్మ భావించెను. తన తలపు అత్తమామలకు గాని, భర్తకు గాని తెలిసినచో వారు దీనిని సాగనీయరను భయముతో లక్ష్మమ్మ తన ఆలోచనను బయటి కేమాత్రమును పొక్కనీయ లేదు. నాటి రాత్రియే ఆమె నిదురించుచున్న భర్తపాదములకు కడసారిగా మ్రొక్కి, పసివాడైన కుమారుని ముద్దిడుకొని, అత్తమామల నుద్దేశించి నమస్కరించి అంతఃపురము నుండి వెడలెను. సింహద్వారము నొద్దకేగి తన బలిదానమును స్వీకరించియైన కోటను కాపాడుడని దేవతలను ప్రార్థించి తన శిరమును తానే ఖండించుకొని నేలపైవ్రాలెను.

మరునాటి ఉదయము సింహద్వారము కూలిపోకుండుటను దూరమునుండి చూచిన కెంపేగౌడ చాల సంతోషించెను. కాని దగ్గరకు వచ్చి రక్తపు మడుగులో పడియున్న కోడలిని చూడగనే పిడుగడచినట్లు కుప్పగూలెను.

## నగర నిర్మాణము

లక్ష్మమ్మ మృతివలన శోక సముద్రమున మునిగిన కెంపేగౌడ దుర్గ నిర్మాణము పట్ల విరక్తి జనించెను. అమర జీవియైన లక్ష్మమ్మ పేరుమీదుగా ఆమె జన్మస్థానమైన కోరమంగల గ్రామమున నొక ఆలయమును నిర్మింపజేసెను. కుమార కెంపయ్య దుఃఖమునకు మేరయే లేకుండెను. అయినను తన అర్థాంగి గావించిన ఆత్మత్యాగము వ్యర్థమగుట కాతడు సమ్మతింపలేక పోయెను. అందుచే అతడే పూనుకొని తండ్రి అనుమతితో దుర్గ నిర్మాణమును పూర్తి గావించెను. సింహద్వారము నొద్ద దుర్గ రక్షకులుగ

విఘ్నేశ్వరుని, ఆంజనేయు ప్రతిష్టించెను. ఇట్లు దుర్గ నిర్మాణము 1537లో పూర్తియయ్యెను.

కెంపేగౌడ దుర్గము నిర్మించిన వృత్తాంతము తెలిసి అచ్యుతదేవరాయలు చాల సంతోషించెను. యలహంకకు తోడుగా హళే బెంగళూరు, వర్తూరు, చేవూరు, హలసూరు, తెంగేరి (నేటి కెంగేరి), తలగట్టపురము, జిగణి, కుంబళగోడు, కానకానళ్ళి, బాణావర, హెసరగట్ట అను గ్రామములను గూడ కెంపేగౌడకు జాగీరుగా నొసంగెను. ఈ పండ్రెండు ఈగామములపై కెంపేగౌడకు సాలునకు ముప్పదివేల వరహాల ఆదాయము వచ్చుచుండెను. ఈ ఆదాయము నంతటిని అతడు తటాకములు, దేవాలయముల వంటి ప్రజోపయోగ కార్యములకు వెచ్చించుచుండెను.

దుర్గ నిర్మాణమైన పిమ్మట కెంపేగౌడ దానిననుసరించి నగర నిర్మాణమున కుపక్రమించెను. ఒక శుభముహూర్తమున విశాల మైదాన మధ్య భాగమున నాలుగు జతల ఎడ్లకు అరకలు పూన్చి నాలుగు దిక్కులకు నాగేటి చాలులు దున్నించెను. తూర్పున హలసూరు వరకును, పడమట అరళేపేటవరకును. ఉత్తరమున యలహంక వరకును, దక్షిణమున కోటవరకును సాగిన ఆ చాళ్ళనే రాజవీథులుగా రూపొందించెను. ఆ వీథుల మధ్య పేటల నేర్పరచెను. నగర మునకు నాలుగు దిక్కుల గల ఎత్తైన గుట్టలపై కావలి గోపురములను నిర్మించెను. అవి నగర రక్షణమునకును, నగరము ముందు ముందు వ్యాపింపగల మేరలను సూచించుటకును ఉద్దేశింపబడెను. కెంపేగౌడ దూరదృష్టికి ఇవి సూచకములైయున్నవి. 'లాల్‌బాగ్' నందలి గుట్టపై నొకటియు, కెంపాంబుధి గట్టుపై నొకటియు, వయాలిదిన్నె 'రైఫిల్ బట్స్' మీద నొకటియు, 'అల్సూరు వాటర్ వర్క్స' దగ్గర నొకటియు గల ఈ శిఖరములు కెంపేగౌడ శిఖరములని పిలువ బడుచు నేటికిని దర్శనీయములైయున్నవి.

నాడు కెంపేగౌడ నిర్మించిన అనేక దేవాలయములు నేటికిని సుస్థిరములై, భక్తులకు వరప్రదములై, యాత్రికులకు దర్శనీయములై యున్నవి. వానిలో బసవన్నగుడి, విఘ్నేశ్వరాలయము, ఆంజనేయాలయము, గంగాధరేశ్వరాలయము,

హరిహరాలయము, వీరభద్రాలయము చెప్పదగినవి. ఇవియన్నియు నగర మునకు దక్షిణభాగమున గలవు. ఆ ప్రాంతమంతయు పెద్దపెద్ద రాతిబండలుగల గుట్టలతో నిండియుండెను. ప్రసిద్ధశిల్పియగు జక్కనాచార్యుని వంశీయుడైన ఒక మహాశిల్పిని రప్పించి కెంపేగౌడ ఒక్కొక్కరాతిబండ నొక దేవతామూర్తిగ మలిపించెను. ఒక పెద్ద రాతిగుండు బసవన్నగా రూపొందెను. మరొక బండ విఘ్నేశ్వరు డయ్యెను. ఒక పెద్ద చట్రాయి ఆంజనేయమూర్తి దాల్చెను. గంగాధరేశ్వరాలయ నిర్మాణము మరింత విన్నాణముతో కూడినది. ఒక సహజమైన కొండగుహయే దేవాలయముగ రూపొందింపబడెను.అందు చేతనే దానిని గవిగంగాధరేశ్వ రాలయమందురు. దేవాలయమునకు ముందు ఏకశిలానిర్మితములైన త్రిశూలము, డమరుకము, రెండు చక్రములు, ఒక ఛత్రము స్థాపింపబడినవి. ఇవి ఒక్కొక్కటియు పదునైదడుగుల ఎత్తుగలిగి శిల్పకళాశోభితములై చూపరులకు ఆశ్చర్యము గొలుపుచుండును. హలసూరు నందలి ప్రసిద్ధమైన సోమేశ్వరాలయము కూడ కెంపేగౌడ నిర్మాణమే. అచ్చట అతనికి భూగర్భమందలి నిధులు దొరికెననియు, వానితోనే అతడా దేవాలయమును నిర్మించెననియు చెప్పుదురు. నగర మధ్యమున గల రంగనాథాలయము, వేంకటరమణస్వామి ఆలయము కూడ కెంపేగౌడ నిర్మాణములే యందురు.

పౌరుల స్నాన పానాదులకును, వ్యవసాయమునకును ఉపయోగించు నట్లు కెంపేగౌడ ఎన్నియో తటాకములను త్రవ్వించెను. వానిలో కెంపాంబుధి, హలసూరు సరస్సు ముఖ్యమైనవి. బసవన్నగుడి నెలకొనియున్న వృషభాద్రినుండి వృషభావతియనునొక యేరుపుట్టి పారుచుండెడిది. దానికి ఆడ్డుకట్టకట్టి కెంపాంబుధి రూపొందింప బడెను. అట్లే హలసూరు సరస్సులోనికి ఆ ప్రాంతమందలి కొన్ని చిన్న చిన్న ఏరులు మళ్ళింపబడి దానిని సంవత్సరము పొడవున ఎండిపోని మహా సముద్రము గావించెను.

ఇట్లు నిరంతరము ప్రజలమేలునకై పాటుబడుచు ఇరువదేండ్లకు పైగా తనకత్తికి ఎదురులేనట్లు పరిపాలన సాగించెను.

# కెంపేగౌడ నిర్బంధము

ఇక్కడ విజయనగరములో 1542లో సమ్రాట్టగు అచ్యుత దేవరాయలు స్వర్గస్థుడయ్యెను. సదాశివరాయలు రత్నసింహాసనాసీనుడయ్యెను. పేరునకు సదాశివరాయలు చక్రవర్తియైనను, నిజమునకు కృష్ణరాయల అల్లుడగు అళియ రామరాయలే సర్వాధికారియై సదాశివరాయల పేరుమీదుగా తానే పరిపాలన చేయుచుండెను. రామరాయలు నిరంకుశుడును, చండశాసనుడును అగుటచే శత్రువులకేగాక మిత్రులకు గూడ అతని పేరు సింహస్వప్నమగుచుండెను. అతనియెడ సామంతులకు భక్తి కంటె భయమే ఎక్కువగా నుండెడిది. అందుచేవారు బహిరంగముగ వినయమునే ప్రకటించుచున్నను, అంతరంగమున అసూయా ద్వేషములతో కుమ్మరావములవలె కుములు చుండిరి.

ఇక్కడ కెంపేగౌడ సిరిసంపదలు దినదిన ప్రవర్ధమానములగుచుండెను. అతని అధికార ప్రాభవములకు అంతులేకుండెను. అట్టితరుణమున కెంపేగౌడ తాను సామంతుడనను మాట మరచి ఒక టంకశాలను స్థాపించి స్వతంత్రముగా నాణెములను ముద్రింపసాగెను. కెంపేగౌడపై ఎట్లయిన కక్ష సాధింపవలెనని ఎదురుచూచుచున్న జగదేవరాయలకిది చక్కని యవకాశమయ్యెను. అతడు వెంటనే విజయనగరమున కేగి కెంపేగౌడ సామ్రాజ్యాధికారమును ధిక్కరించి స్వాతంత్ర్యమును ప్రకటింప బూనియున్నాడనియు, స్వతంత్రముగా నాణె ములను ముద్రించుట దానికి తొలిచర్యయనియు సదాశివరాయల యొద్ద చాడి చెప్పెను. ఇంతలో సాలుసరి నజరానా చెల్లింపునకై కెంపేగౌడ విజయదశమి ఉత్సవముల సమయమునకు విజయనగరమునకు పోయెను. సదాశివరాయ లాతనిని నాణెముల ముద్రణవిషయమై ప్రశ్నించెను. తనకు సామ్రాజ్యాధి కారమును ధిక్కరించు తలపులేదని కెంపేగౌడ విన్నవించుకొనెను. కాని జగదేవరాయల చాడీలనే నమ్మిన సదాశివరాయలు కెంపేగౌడను సామ్రాజ్య ద్రోహిగా నిర్ణయించి కారాగారబద్ధునిగావించి, అతని రాజ్యమును జగదేవరాయల కొసంగెను.

ఆనెగొందిలో ఒక రాజోచితభవనమున కెంపేగౌడ నిర్బంధింప బడెను. అట్లాతడు ఐదు సంవత్సరములు చెరయందు మ్రగ్గుచుండెను. కెంపేగౌడ అభిమానులు అతనిని

చెరనుండి విడిపింపవలెనని ఎన్నో ప్రయత్నములు చేసిరి. కాని జగదేవ రాయల చాడీలు తలకెక్కిన సదాశివరాయులు అతని విడుదల కంగీకరింపడయ్యెను. ఇంతలో అహమ్మద్‌నగర, బిజాపుర, గోల్కొండ సుల్తానులు కలిసి విజయనగరముపై దండెత్తి వచ్చుటకు సిద్ధమగుచుండిరి. వారి నెదుర్కొనుటకు విజయనగర ప్రభువులకు చాలధనము కావలసివచ్చెను. ఈ అవకాశమును చూచుకొని కెంపేగౌడ అభిమానులు రామరాయలకు పెద్దమొత్తమును అపరాధ శుల్కముగా చెల్లించి కెంపేగౌడను కారాగార విముక్తుని గావించిరి.

కెంపేగౌడ బెంగళూరుకు వచ్చి జగదేవరాయలనుండి తనరాజ్యమును తిరిగి స్వాధీనము చేసికొని పూర్వమువలెనే పరిపాలింపసాగెను. బెంగళూరు ప్రజలుతమ ప్రభువు తిరిగి వచ్చి రాజ్యభారమును వహించినందులకు ఆనందోత్సాహములతో వేడుకలు గావించుకొనిరి.

## చరమదశ

రక్షసతంగడి యుద్ధములో మహమ్మదీయులు జయించిరి. విజయనగరము పరాజయము పొందెను. రామరాయలు యుద్ధరంగమున హతుడయ్యెను. సదా శివరాయలు విజయనగరమును విడిచి పెనుగొండకు పారిపోయెను. విజయవంతములైన ముస్లింసైన్యములు విజయనగరమును ప్రవేశించి అమరావతివలె వైభవో పేతమ్మైన ఆ నగరమును సర్వనాశనము చేసి శ్మశాన తుల్యముగావించెను. దానితో విజయనగర సామ్రాజ్యపు ప్రభ దాదాపు అంతరించెను. కొందరు సామంతులు స్వతంత్రులు కాజొచ్చిరి. కాని కెంపేగౌడమాత్రము తన జీవి తాంతమువరకు సమ్రాట్టగు సదాశివరాయలను భక్తి విశ్వాసములతో సేవించుచునే యుండెను. కాని విజయనగర వినాశమునుగాంచిన పిమ్మట కెంపేగౌడ రాజ్య కార్యముల యెడ విరక్తుడయ్యెను. కుమార కెంపయ్యకు పట్టము కట్టి అతడు శివగంగయందు నివసింపసాగెను. తనకాలము నంతటిని అచటి గంగాధరేశ్వరుని సేవలోనే గడుపుచు ఈశ్వరునిలో ఐక్యమయ్యెను. గంగాధరేశ్వరునకు నమస్కరించుచున్న కెంపేగౌడ విగ్రహము ఆ ఆలయమున నేటికిని కలదు. అది అతని ఈశ్వరభక్తికి సాక్షీభూతమ్మైయున్నది.

కుమార కెంపయ్య కెంపేగౌడయను పేర రాజ్యభారము వహించి తండ్రివలెనే శూరుడై, సామ్రాజ్యభక్తి తత్పరుడై, ప్రజారంజకుడై తన రాజ్యమును మరింత విస్తృతమును, సంపన్నమును గావించెను. తన తండ్రి నిర్మించిన దేవాలయములను పునర్నిర్మించి పెంపొందించెను. తానును అనేక దేవాలయ తటాకాదుల నిర్మాణము గావించెను. అగ్రహారములను దానమొనరించెను. తండ్రిని మించిన కీర్తిని సంపాదించెను. చివరి దినములలో అతడు మాగడిని జయించి అచటినుండియే పరిపాలనము చేయుచువచ్చెను. అతని వంశీయులు మరికొన్ని తరములవరకు మాగడిలో ప్రభుత్వము సాగించిరి. వీరందరిని చరిత్రకారులు 'మాగడి కెంపేగౌడలు' అని పిలుచుచున్నారు.

## కవిగా కెంపేగౌడ

కెంపేగౌడ చిన్నతనమున యుద్ధవిద్యలనేగాక సాహిత్య విద్యను కూడ అభ్యసించెనని చదివియున్నావము. అతడు యువకుడుగ నున్నపుడు పలుపర్యాయములు విజయనగరమునకేగి ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయలు భువన విజయ సభలో నడుపుచుండు సాహిత్యగోష్ఠులను దర్శించి కవితాస్ఫూర్తిని పొందుచుండువాడు. విజయనగరములో ఐదేండ్లపాటు నిర్బంధమునందుండుట కూడ అతనికి కీడులో మేలయ్యెను. ఈకాలములో అతనిలో దాగియున్న కవితాశక్తి నూతనోత్తేజమునందెను. కెంపేగౌడ రచించిన 'గంగాగౌరీ విలాసము' అను తెలుగు యక్షగాన కావ్యమొకటి అసంపూర్ణస్థితిలో లభించుచున్నది. దొరకిన భాగమును బట్టి కెంపేగౌడ చక్కని ధారాశుద్ధి గలిగి రసవంతమైన కవిత్వమును చెప్పగల సుకవియని తెలియుచున్నది.

సుకవులకు సారమై బహు

కుకవులకెద శూలమై యకుంఠితధారై

చకచకిత వాద్యములునై

వికసించును పెద్దకంపె విభు సత్కవితల్.

గంగాగౌరి విలాసము

సంగతి పదపద్యములను సరసతమీఱన్

రంగద్భాషణములు చెల

గంగా పెదకెంపరాయ ఘనుడొనరించెన్.

అని గ్రంథారంభమున అతడు తన కవిత్వమును గురించి చెప్పికొన్న మాటలలో అతిశయోక్తి లేదనిపించును. సవతులగు గంగాగౌరుల మధ్య మచ్చరము. వారి అలుకలు, ఇద్దరు ఇల్లాండ్ర మధ్య ఈశ్వరుడు పడినపాట్లు చివరకు ఇద్దరిని నేర్పుతో లాలించి కోపము చల్లార్చి సుఖించుట ఈ కావ్యమందలి కథ.

పరాక్రమము, దైవభక్తి, దానపరతలకు తోడు కవితాశక్తి కూడ కలిగియుండిన కెంపేగౌడ శ్రీకృష్ణదేవరాయలతో పోల్చదగియున్నాడు. అతడు పాలించినది చిన్నరాజ్యమేయైనను గుణగణములలో అతడు మహారాజులకు తీసిపోవువాడు కాడు. సర్వవిధముల కెంపేగౌడ ఒక మహాపురుషు డనదగియున్నాడు. బెంగుళూరు నగరము అతని ధవళకీర్తిని ఆ చంద్రతారార్కము దేదీప్యమానముగ నిలుపగలదు. ఈ మహా పురుషుని పేరు చిరస్థాయిగా నగరములోని మెజిస్టిక్ బస్టాండునకు కెంపేగౌడ బస్టాండుగా నామకరణము చేసి, కర్ణాటక ప్రజలు, ప్రభుత్వము **కెంపేగౌడగారి** ఋణము తీర్చుకొన్న వారైన్నారు.

## ప్రశ్నలు

1. బెంగుళూరు నగరపు గొప్పదనమును వివరింపుము?
2. దొడ్డమ్మ పాళెగాని చేజిక్కకుండ తప్పించుకొనిన విధమును తెలుపుము?
3. కెంపేగౌడ బాల్య విశేషముల నెరిగింపుము?
4. కెంపేగౌడ కోటను బెంగుళూరు వద్దనే ఏలకట్టెనో తెలుపుము?

5. బెంగుళూరు అను పేరేర్పడిన విధమును విశదీకరింపుము?

6. లక్ష్మమ్మ బలియైన వృత్తాంతమును వివరింపుము?

7. కెంపేగౌడ  బెంగుళూరు నగరమును వృద్ధిచేసిన విధమును తెలుపుము?

8. కెంపేగౌడ  కావించిన ప్రజోపయోగ కార్యములను వివరింపుము?

9. కెంపేగౌడ  నిర్భంధమునకు కారణమును తెలుపుము?

10. కెంపేగౌడ  నిర్భంధమునుండి విడుదలయైన విధము నెరిగింపుము?

11. కెంపేగౌడ  రచించిన గ్రంథమును గురించి తెలుపుము?

12. కెంపేగౌడ కాలమునాటి  దేశ పరిస్థితులను వివరింపుము?

★ ★ ★ ★ ★

| | పద్యభాగం | | knowledge | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | 1 | 2 | 3 | 4 | 5 | 10 | 1 |
| 1 | ఏకలవ్యుడు | 6 | 1 | | 3 | 4 | | | |
| 2 | కన్యక | 5 | | | | | | | |
| 3 | గజేంద్ర మోక్షం | 6 | | | | 4 | | | |
| 4 | హనుమత్సందేశము | 5 | | | | | | | |
| 5 | కుంతీకుమారి | 5 | | | | 4 | | | |
| 6 | హంపీ క్షేత్రం | 5 | | | | | | | |
| 7 | వ్యాసమహర్షి | 5 | | | | | | | |
| 8 | గోదావరి | 3 | | | | | | | |
| | **గద్యభాగము** | 5 | | | | | | | |
| 9 | బుద్ధిబలం | 5 | | 2 | | | | | |
| 10 | విదుర నీతులు | 5 | 1 | | | | | | |
| 11 | బసవేశ్వరుడు | 4 | | | | | | | |
| 12 | సౌరశక్తి | 4 | | | 3 | | | | |
| 13 | వివేకానంద సందేశం | 4 | | | | | | | 1 |
| 14 | నిగమశర్మ అక్క | 5 | | | | 4 | | | |
| 15 | ఎర్రనగారి సావిత్రి | 4 | 1 | | | | | | |
| 16 | త్యాగరాజు | 4 | | | | | | | |
| 17 | వ్యాకరణము | 15 | | 2 | | | | | |
| 18 | వ్యాసాలు | 8 | | | | | | 10 | |
| 19 | సొంత వాక్యాలు | 4 | | | | | | | |
| 20 | లేఖలు | 4 | | | | | 5 | | |
| 21 | అపరిచిత గద్యం | 4 | 1 | | | | | | 1 |
| 22 | కెంపేగౌడ (ఉపవాచకం) | 10 | | | | | | 10 | |

| Comprehension | | | | | Expression | | | | | | Appreciate | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 3 | 4 | 5 | 10 | 1 | 2 | 3 | 4 | 5 | 10 | 1 | 2 | 3 | 4 | 5 | 10 | |
| | | | | | | 2 | | | | | | | | | | | |
| | | | | | | | | | | | | | | | | | |
| | | 4 | | | 1 | | | | | | | | | | | | |
| | 3 | 4 | | | | | | | | | | | | | | | |
| | | | | | | | | 4 | | | 1 | | | 4 | | | |
| | | | | | | | | 4 | | | | | | | | | |
| | | 4 | | | | | | | | | | | | | | | |
| | | | | | | | 3 | | | | 1 | | | | | | |
| | | | | | | | | | | | | | | | | | |
| | | | | | | | | | | | | | | | | | |
| 2 | | | | | | | | | | | | | | | | | |
| | | 4 | | | | | | | | | | | | | | | |
| | | | | | | | | | | | 1 | | | | | | |
| 4 | | | | | 1 | | | | | | | | 3 | | | | |
| | | | | | | | | | | | | | | | | | |
| | 3 | | | | | | | | | | | | | | | | |
| | | | | | | | | 4 | | | | | | | | | |
| 2+2 | | | | | | 2 | | | | | | 2 | | | | | |
| | | | | 10 | | | | | | | | | | | | 10 | |
| | | | | | | | | | | | | | | | | | |
| | | | 5 | | | | | | | | | 2 | | | | | |
| | | | | | 1 | | | | | | 1+1 | | | | | | |
| | | | | 10 | | | | | | | | | | | | | |

# MODEL QUESTION PAPER

## I P.U.C. - TELUGU

**Time : 3 hrs.** **2013** **Max.Marks : 100**

**(Code No. 05)**

**I.** ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క వాక్యములో సమాధానాలు వ్రాయుము :

**5 x 1 = 5**

1. నన్నయ ఏ కాలం వాడు ?
2. పోతనగారి బిరుదమేమి ?
3. హంపీ సమీపమున నున్న నది పేరేమి ?
4. కుంతి ఎవరి కుమార్తె ?
5. వ్యాసమహర్షి తండ్రి ఎవరు ?

**II.** ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క వాక్యములో సమాధానాలు వ్రాయుము :

**5 x 1 = 5**

6. 'శశము' – అనగా నేమి ?
7. విదురుడు ఎవరికి నీతులు చెప్పాడు ?
8. త్యాగయ్య తల్లిదండ్రు లెవరు ?
9. సత్యవంతుడు మరణిస్తాడని ఎవరు చెప్పారు ?
10. బసవేశ్వరుడు ఎవరివద్ద మంత్రిగానుండెను ?

**III.** ఈ క్రింది పద్యాలలో <u>ఒకదానిని</u> పాదభంగము లేకుండా పూరించండి :

**1 x 5 = 5**

11. ఎవ్వని చేజనించు ............ శరణంబు వేడెదన్.

12. మునిమంత్రమ్ము ....... కుంతి సౌభాగ్యముల్.

IV. **ఈ క్రింది పద్యాలలో <u>ఒకదానికి</u> భావం వ్రాయండి.** 1 x 5 = 5

13. అలవైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబుదా
పల మందార వనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోదియగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము "పాహిపాహి" యన గుయ్యాలించి సంరంభియై.

14. అది రమణీయ పుష్పవన – మావన మందొక మేడ – మేడపై
నదియొక మాఱుమూలగది – ఆగది తల్పులు తీసి మెల్లగా
పదునయిదేండ్ల యీడుగల బాలిక – పోలిక రాచపిల్ల – జం
కొదవెడి కాళ్ళతోడ దిగుచున్నది క్రిందకు మెట్లమీదుగన్ !

V. **ఈ క్రింది ప్రశ్నలలో <u>రెండింటికి</u> సమాధానములు వ్రాయండి :**

**2 x 4 = 8**

15. ఏకలవ్యుడు ఏరీతిగా అస్త్రవిద్యలు నేర్చాడు ?

16. సీత, హనుమంతునితో తన సందేహాన్ని ఎలా చెప్పింది ?

17. పెట్టెను అమర్చడానికి కుంతి ఏమేమి చేసింది ?

VI. **ఈ క్రింది ప్రశ్నలలో <u>రెండింటికి</u> సమాధానాలు వ్రాయండి :**
**2 x 4 = 8**

18. నిగమశర్మ అక్క తన తమ్ముని సరిదిద్దడానికి చేసిన ప్రయత్నమేమి?

19. సావిత్రి, సత్యవంతుని వివాహమాడిన విధమును తెల్పండి.

20. వ్యవసాయ రంగంలో సౌరశక్తి ఎలా ఉపయోగపడుతుంది ?

VII. **ఈ క్రింది వానిలో <u>రెండింటికి</u> సందర్భసహిత వ్యాఖ్యలు వ్రాయుడు :**

**2 x 3 = 6**

21. అస్త్ర విద్యారహస్యంబు లర్థి బడవ.

22. వినడె చూడడె తలపడె వేగరాడె !

23. నన్నును దల్లిమారుగాంగని కొలువంగ నేర్చు.

**VIII. ఈ క్రిందివానిలో <u>రెండింటికి</u> సందర్భ సహిత వ్యాఖ్యలు వ్రాయుడు :**

**2 x 3 = 6**

24. వంతు నీ పాలం బడియె.

25. ధనానికంటే గుణానికే ప్రథమ గౌరవం.

26. అయితే ఆ డబ్బును దేవుడే కాపాడుకుంటాడు.

**IX. వీనిలో <u>ఒకదానిని</u> గూర్చి వ్రాయండి : 1 x 10 = 10**

27. కెంపేగౌడ బాల్య విశేషములను తెల్పండి.

28. కెంపేగౌడ బెంగళూరు నగరమును వృద్ధి చేసిన విధమును వివరింపుము.

29. కెంపేగౌడ నిర్బంధమునకు కారణములు తెల్పుము.

**X. వీటిలో <u>మూడింటిని</u> విడదీసి సంధి పేరు, సూత్రము వ్రాయండి :**

**3 X 2 = 6**

30. కలడందురు.

31. స్వారి యొనర్చిన

32. ఎన్నటికైన.

33. అక్కోమలి.

34. నిట్టూర్పు

**XI.** గణవిభజన చేసి, యతిని గుర్తించి ఇది ఏపద్య పాదమో తెల్పుము : **1 x 5 = 5**

35. కనకము తాచినన్ కొలిమి గాచిన తగ్గనె వన్నె వాసియున్.

**XII.** ఇందులోగల అలంకారమును వివరించండి : **1 x 5 = 5**

36. కలడు కలండనెడువాడు కలడో ! లేడో !

**XIII.** వీటిలో <u>రెండింటికి</u> సొంతవాక్యాలు వ్రాయండి : **2 x 3 = 6**

37. కొంగుబంగారం

38. పిట్టకొంచెము–కూతఘనము

39. ఉడుతాభక్తి

40. ఈడు జోడు

**XIV.** వీనిలో <u>ఒకదానిని</u> గూర్చి లేఖ వ్రాయండి : **1 x 5 = 5**

41. సెలవు మంజూరుకోసం కళాశాల అధ్యక్షులకు లేఖ.

42. ఉద్యోగానికి దరఖాస్తు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారికి లేఖ.

**XV.** వీనిలో <u>ఒకదానిని</u> గూర్చి వ్యాసం వ్రాయండి : **1 x 10 = 10**

43. నిరుద్యోగ సమస్య.

44. అవినీతి నిర్మూలన.

45. పరిశుభ్రత – పచ్చదనం.

**XVI.** ఈ గద్యాన్ని చదివి క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి :

**5 x 1 = 5**

పుణ్యకర్మ లెక్కువగా చేసినవారు స్వర్గాదిలోకములకు వెళ్ళి పుణ్యఫలములైన సుఖభోగముల ననుభవింతురు. పుణ్యము నశించగనేవారు తిరిగి భూలోకమున జన్మింతురు. అట్లే, పాపము లొనర్చినవారు నరకమున కేగి దుఃఖముల ననుభవింతురు. కాబట్టి మానవుడు సత్కర్మలొనర్చి ఉత్తమస్థితి నొందుటకు ప్రయత్నింప వలెను. ప్రారబ్ధ కర్మను మనము మార్చుకొన లేము.. కాని, భవిష్యత్తు మనచేతిలో నున్నదనుట నిశ్చయము. కాగ మానవుడు సత్కర్మలొనర్చి ఉత్తమగతి నొందుటకు తప్పక యత్నింప వలెను.

ప్రశ్నలు :

46. పుణ్యము చేసినవారు ఏలోకమునకు వెళ్ళెదరు ?
47. పుణ్యము నశించగనే తిరిగి వారు ఏలోకమునకు వత్తురు ?
48. పాపములొనర్చినవారు ఎచ్చటి కేగుదురు ?
49. దేనిని మనము మార్చుకొన లేము ?
50. మానవుడు ఎందుకొరకు ప్రయత్నించ వలెను ?

★★★★★

# DEPARTMENT OF PRE-UNIVERSITY EDUCATION
## Sampige Road, Malleswaram, Bangalore.

Syllabus Prepared for **I PUC - 2013.**

Sub/Code : **·Telugu (05)** Total Teaching hrs.-120

పద్యభాగము (Poetry) - 40 periods.

| Sl. No. | Topic | Text Selected | Name of the Author/Writer | Teaching hours. (40) |
|---|---|---|---|---|
| 1. | ఏకలవ్యుడు | ఆంధ్రమహా భారతము | నన్నయ్య | 6 |
| 2. | కన్యక | ముత్యాల సరాలు | గురజాడ అప్పారావు | 4 |
| 3. | గజేంద్రమోక్షము | ఆంధ్రమహాభాగవతము | పోతన | 6 |
| 4. | హనుమత్సందేశము | మొల్ల రామాయణము | మొల్ల కవయిత్రి | 6 |
| 5. | కుంతీకుమారి | ఖండకావ్యం | కరుణశ్రీ డా॥ జంధ్యాల పాపయ్యశాస్త్రి | 6 |
| 6. | హంపీక్షేత్రము | గబ్బిలము | గుఱ్ఱం జాషువా | 4 |
| 7. | వ్యాసమహర్షి | శ్రీవ్యాసవిలాస ప్రబంధము | డా॥ సి.వి. సుబ్బన్న శతావధాని | 5 |
| 8. | గోదావరి | ఖండకావ్యము | అడవి బాపిరాజు | 3 |
| | | | మొత్తం | **40** |

# DEPARTMENT OF PRE-UNIVERSITY EDUCATION
## Sampige Road, Malleswaram, Bangalore.

Syllabus Prepared for **I PUC - 2013.**

Sub/Code : **Telugu (05)** Total Teaching hrs.-120

గద్యభాగము (Prose) - 35 periods.

| Sl. No. | Topic | Text Selected | Name of the Author/Writer | Teaching hours. (35) |
|---|---|---|---|---|
| 1. | బుద్ధి బలం | మిత్రలాభం | పరవస్తు చిన్నయసూరి | 4 |
| 2. | విదురనీతులు | భారతం | ఉషశ్రీ | 5 |
| 3. | బసవేశ్వరుడు | – | – | 4 |
| 4. | సౌరశక్తి | ఆంధ్రప్రభ దినపత్రిక | డా॥ విజయ లక్ష్మి | 4 |
| 5. | వివేకానంద సందేశం | రామకృష్ణ మిషన్ ప్రచురణ | హౌరా, పశ్చిమ బెంగాల్ | 4 |
| 6. | నిగమశర్మ అక్క | సారస్వతాలోకం | రాళ్ళపల్లి. అనంతకృష్ణ శర్మ | 5 |
| 7. | ఎర్రనగారి సావిత్రి | భావనాతరంగిణి | డా॥ జె. మునిరత్నం | 4 |
| 8. | త్యాగరాజు | శ్రీనివాస భారతి | డా॥ కె. సర్వోత్తము రావు | 5 |
| | | | మొత్తం | **35** |

# I PUC, TELUGU - 2013

## Revised Syllabus (Code - 05)

పద్యభాగము

| Sl. No. | Objectives | Chapter/ Unit | Introductory Subject | No. of hours | Hearing out comes | Evaluation | Activities | Application with Indian culture |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| **1** | విద్యార్థులలో విద్యపట్ల జిజ్ఞాస, గురుభక్తి పెంపొందించుట. | **ఏకలవ్యుడు** | మహాభారతం పరిచయం | 06 | జిజ్ఞాస, గురుభక్తి | ఏకలవ్యుని గురుభక్తి ఎట్టిది ? | చిన్న నాటి నుండి చదువు చెప్పిన గురువులను గుర్తుచేసికొని, వారి పేర్లు వ్రాయుట. | భారతీయ సంస్కృతిలో గురువునకుగల గౌరవం, గురు–శిష్య సంబంధాల ప్రాధాన్యం. |
| **2** | కన్యక కావించిన హితబోధ నేటి తరం మహిళలకు ఆదర్శం. | **కన్యక** | ఆధునిక కవిత పరిచయం | 04 | పురుషులకు కనువిప్పు కలిగించుట. | కన్యక హితబోధను వివరించండి. | గురజాడ సంఘసంస్కరణ. | 'ప్రాతదంతా మంచి అనుకోరాదు' అన్నమన సంస్కృతికి అనుగుణంగా బాల్య వివాహాల నిషేధం. సంఘ సంస్కరణం. |
| **3** | అహంకారములేని భక్తిని పెంపొందించుకోవడం. | **గజేంద్ర మోక్షం** | మహాభాగవతం పరిచయం | 06 | భగవంతుని అనుగ్రహం పొందడం. | గజేంద్రుని 'మొర'ను వివరించండి. | గజేంద్రుని పూర్వజన్మ వృత్తాంతాన్ని సేకరించండి. | భారతీయ సంస్కృతిలో 'భగవంతుని నమ్మినవాడు ఎన్నడూ చెడిపోడు' అన్న సత్యాన్ని చాటి చెప్పడం. |
| **4** | కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం, స్వామి భక్తి, కర్తవ్య నిర్వహణ. | **హనుమ త్సందేశం** | రామాయణ పరిచయం | 06 | స్వామిభక్తి, కర్తవ్య నిర్వహణ | హనుమంతునిలోని సమయస్ఫూర్తి, వాక్పటిమ, వినయగుణం కర్తవ్య దీక్షలను వివరించండి. | సుందరకాండం లోని కథను సంగ్రహంగా తెల్పండి | కష్టాలలో ఉన్నవారిని ఆదుకోవాలనే సిద్ధాంతాన్ని ఆంజనేయస్వామి స్వయంగా పాటించి చూపడం. స్వామిభక్తి భారతీయ సంస్కృతిలో ఒక భాగం. |

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|
| **5** | సుకుమారమైన మనస్తత్వాన్ని కలిగి ఉండడం. | **కుంతీకుమారి** | ఆధునిక ఖండకావ్య పరిచయం | 06 | హృదయ మార్దవం, జీవితం పట్ల బాధ్యత పెంపొందించు కోవడం. | కుంతి మాతృ హృదయాన్ని వివరించండి. | కరుణశ్రీ గారి ఇతర రచనలను సేకరించండి. | భారతీయ సంస్కృతిలో తల్లికిగల స్థానాన్ని, సరళ హృదయాన్ని బోధిస్తున్నదీ పాఠం. |
| **6** | కర్ణాటకలోని హంపీ పురాతన వైభవాన్ని విద్యార్థులకు గుర్తు చేయడం. | **హంపీక్షేత్రం** | రసమయమైన ఆధునిక పద్య రచనా వైభవాన్ని పరిచయం చేయడం. | 04 | పురాతన కళా ఖండాలను, కట్టడాలను కాపాడుకోవాలనే తపన కల్గించడం. | హంపి వైభవాన్ని వివరించండి. | ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులంతా హంపీయాత్రకు వెళ్ళి రావడం. | మన ప్రాచీన భారతీయులు శిల్పకళల పట్ల ఎంత అంకిత భావం కలిగినవారో, అట్టి హంపి శిథిలమైతే వారిమనోవేదన మన సంస్కృతికి అద్దం పడుతోంది. |
| **7** | ఋషి ఋణాన్ని తీర్చుకొనే విధాన్ని గుర్తు చేయడం. | **వ్యాసమహర్షి జననం** | భారత, భాగవత, పురాణ పరిచయం. ఆధునిక ప్రౌఢ ప్రబంధ కవిత పరిచయం | 05 | ఋషులు మరియు తల్లిదండ్రుల పట్ల భక్తి, విశ్వాసములు పెంపొందించు కొనుట. | వ్యాస మహర్షి జనన వివరములు తెలియ జేయండి. | అష్టాదశ పురాణముల పేర్లు, భారతములోని 18 పర్వముల పేర్లు సేకరించండి. అష్టావధానమంటే ఏమిటో తెలిసికోండి. | భారతీయ సంస్కృతిలో ఋషులకుగల మహోన్నత స్థానాన్ని తల్లిదండ్రుల పట్ల పుత్రులకు ఉండవలసిన భక్తి భావాన్ని విశదం చేస్తున్నది వ్యాసమహర్షి జననం. |
| **8** | ప్రకృతి ఆరాధన, ప్రశాంత జీవనం. | **గోదావరి** | ఆధునికగేయ కవిత, ప్రకృతి ఆరాధన, పర్యావరణ పరిరక్షణ పరిచయం. | 03 | ప్రకృతి ఆరాధన, ప్రశాంత జీవనం. | 'గోదావరి' పరవళ్ళను కవి ఏవిధంగా వర్ణించాడు ? | గోదావరి నదిని ప్రత్యక్షముగాగాని లేదా దూరదర్శన్‌లోగాని చూడండి. | మన సంస్కృతిలో నదీమతల్లులను గౌరవించడం, పూజించడం, ప్రకృతి ఆరాధనలోని పరమార్థం ఈ పాఠంలో వివరించబడింది. |

గద్యభాగము

| Sl. No. | Objectives | Chapter/ Unit | Introductory Subject | No. of hours | Hearing out comes | Evaluation | Activities | Application with Indian culture |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
| **1** | జీవితంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను తెలుసుకోవడం. | **బుద్ధిబలం** | పూర్వపు తెలుగు గ్రాంథిక వచన రచనా స్వరూప పరిచయం. | 04 | నిజ జీవితంలో సమస్యలు – పరిష్కార మార్గాలు | కుందేలు సింహమును మట్టుబెట్టిన విధమును వివరించండి. | చిన్నయ సూరి వ్రాసిన ఇతర నీతి కథలను సేకరించండి. | సంస్కృత భాషలోని హితోపదేశ కావ్య సారాన్ని గ్రహించి, జీవితంలో అనుసంధానించుకోవడం. |
| **2** | జీవితగమనానికి అనువైన రాచబాటను ఏర్పరచేవి విదుర నీతులు. | **విదుర నీతులు** | తేటనైన తెలుగు వ్యావహారిక రచనా పరిచయం. | 05 | పుత్రవ్యామోహంలోని ధృతరాష్ట్రుని దుర్దశనను చూచి విద్యార్థి తన జీవితగమనాన్ని సరిదిద్దుకోవడం. | నీకు నచ్చిన విదురనీతులను ఎనిమిదింటిని వ్రాయుము. | విదుర నీతులను నిజ జీవితంలో అనుసంధానించుకోవడం. | భారతీయ సంస్కృతిలో 'పెద్దల మాట చద్ది మూట' అన్నదాన్ని గుర్తించడం. |
| **3** | కర్ణాటక దేశంలోని గొప్ప సంఘసంస్కర్తను గూర్చి తెలుపడం. | **బసవేశ్వరుడు** | సంఘసేవా ప్రాముఖ్యాన్ని తెలియ చేయడం. | 04 | సంఘసేవకు విద్యార్థులు పూనుకొని ఆదర్శ ప్రాయులు కావడం. | బసవేశ్వరుని జీవితాన్ని సంక్షిప్తంగా వివరించండి. | బసవేశ్వరుని 'వచనములు' సేకరించి, అవి సంఘానికి ఎలా ఉపకరించాయో పరిశీలించండి. | భారతీయ సంస్కృతిలో మహాత్ముల జీవితాలను ఆదర్శంగా ఎలా జీవించాలో తెలుసుకోవడం. |
| **4** | సౌరశక్తి వినియోగం – విద్యుచ్ఛక్తి లోటును పూరించుకోవడం. | **సౌరశక్తి** | సౌరశక్తి ప్రాధాన్యం. | 04 | విజ్ఞానశాస్త్ర దృక్పథంతో సౌరశక్తి వినియోగం– లైట్లు వెలగడం, నీళ్ళుతోడడం, కుక్కర్లు, వ్యవసాయం మొ॥ వాటికి వాడడం. | 'భూమిపై ప్రాణుల మనుగడకు సూర్యుడే ఆధారం'– ఎట్లు ? వివరించండి. | సౌరశక్తి ఏఏ కోణాల్లో ఎలా ఉపయోగించబడుతున్నదో పరిశీలించి వ్రాసుకోవడం. | నక్షత్ర, గ్రహ, తారలకు అధిపతియైన సూర్యుని దివ్య శక్తిని గుర్తంచడం. సకల దేవతాస్వరూపునిగా భావించడం. |

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|
| **5** | విద్యార్థులలో మాతృ దేశం పట్ల అంకితభావం, పెంపొందించడం. | **వివేకానందుని సందేశం** | భారతీయ సంస్కృతి, విలువలు పెంపొందించుటలో వివేకానందస్వామి కృషి–పరిచయం. | 04 | మానవీయ విలువలు, భారతీయ ఔన్నత్యాన్ని గూర్చి గ్రహించడం. | ఉన్నత స్థితిని చేరుకోవడానికి వివేకానందుడిచ్చిన సందేశం | స్వామి వివేకానందుడు అమెరికాలోని చికాగోలో చేసిన ప్రసంగాన్ని గూర్చి వివరంగా తెలుసుకోవడం. | సన్యాసం పట్ల, త్యాగం పట్ల, మహాత్ముల పట్ల భారతీయుల గౌరవాన్ని చాటడం. |
| **6** | చెడుమార్గంలో నడువకుండా మంచిమార్గంలో ఎలా నడవాలో గ్రహించి, ఆచరించడం. | **నిగమశర్మ అక్క** | నీతి శతకాల ప్రభావం, వేమన బోధనలు, సుభాషితాలు మున్నగు వాటినిగూర్చి పరిచయం, నీతి కథల పరిచయం. | 05 | చెడుమార్గంలో నడచిన నిగమ శర్మకు ఏ దుర్గతి పట్టిందో తెలుసుకొని నిజ జీవితంలో జాగ్రత్తపడడం. | నిగమశర్మ అక్క తన తమ్ముని సరిదిద్దడానికి చేసిన ప్రయత్నాన్ని వివరించండి | తెనాలి రామకృష్ణుని కథలను, ఇతర నీతి కథలను సేకరించండి. | భారతీయ సంస్కృతిలో ఆడపడుచుకు ఉన్న గౌరవాన్ని తెలియ జేయడం. |
| **7** | నియమ బద్ధంగా జీవించడంవల్ల కలిగే ప్రయోజనాన్ని గ్రహించడం. పాతివ్రత్య ధర్మ ప్రాముఖ్యం. | **ఎఱ్ఱనగారి సావిత్రి** | భారతీయ సంస్కృతిలో మనపురాణగాథల పరిచయం, సతీసావిత్రి కథా పరిచయం. | 04 | నియమబద్ధంగా జీవించడం – పాతివ్రత్య మహిమను గుర్తించడం. | యమధర్మ రాజుతో సావిత్రి సంభాషణను వ్రాయండి. | పతివ్రతల కథలను సేకరించండి. | భారతీయ సంస్కృతిలో పాతివ్రత్య ధర్మాన్ని తెలుపడం. |
| **8** | లలితకళలలో సంగీతం పట్ల ఆసక్తిని పెంపొందించడం. దైవభక్తి మహిమను గ్రహించడం. | **త్యాగరాజు** | సుప్రసిద్ధ వాగ్గేయకారుల పరిచయం. | 05 | కళోపాసనవల్ల జీవితాన్ని ప్రశాంతంగా గడపగలమనే సత్యాన్ని గ్రహించ గలగడం. | త్యాగయ్య జీవితాన్ని సంగ్రహంగా వివరించండి. | సుప్రసిద్ధ వాగ్గేయ కారుల జీవితాలను సేకరించండి. | భారతీయ సంస్కృతిలో సంగీతమునకుగల ప్రాధాన్యాన్ని గుర్తించండి. |

ఉపవాచకం - కెంపేగౌడ (బెంగళూరు మహానగర నిర్మాత)

| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | కర్ణాటక రాష్ట్ర రాజధాని, నేటి దివ్య సుందర ఉద్యాన నగరి బెంగళూరు ఈ స్థాయిలో ఉండుటకు మూలకారకులైన **కెంపేగౌడ** మహాశయుల జీవితగాథ విద్యార్థులలో 'కృషియే కైంకర్య మ'నే మహోన్నత భావాన్ని పెంపొందిస్తుంది. | కెంపేగౌడ (బెంగళూరు మహానగర నిర్మాత) | మహాత్ముల జీవిత చరిత్రలు పరిచయం చేయడం. | 10 | పట్టుదలతో పాటు, నిరంతర కృషి ఉంటే మానవుడు చేయరానిదేమీ లేదంటూ చాటుతుంది కెంపేగౌడ పాఠ్యాంశం. | కెంపేగౌడ బెంగళూరు నగరాన్ని నిర్మించడం, అభివృద్ధి చేయడాన్ని గూర్చి వివరించండి. | కర్ణాటక రాష్ట్ర సర్వతోముఖాభి వృద్ధికి తోడ్పడిన రాణి చెన్నమ్మ, సంగోళి రాయణ్ణ, టిప్పుసుల్తాన్, విశ్వేశ్వరయ్య మొ॥ మహనీయులను గూర్చి తెలుసుకోండి. | ఎక్కడైతే ఉత్సాహము, సాహసము, ధైర్యము, బుద్ధి మొ॥ సద్గుణాలుంటాయో అక్కడ లక్ష్మి, కీర్తి ఉంటాయి అన్న భారతీయ సంస్కృతిని జీర్ణించుకొన్న కెంపేగౌడ బెంగళూరు నగరనిర్మాణంలో చూపిన ప్రతిభ, కృషి అందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. |

పి.యు.సి. విద్యార్థుల వయస్సును, మానసిక స్థాయిని దృష్టిలో ఉంచుకొని వారిలో సువిశాల జాతీయ భావాలు పెంపొందించు కొనే విధంగా ఈ పాఠ్య గ్రంథాన్ని రూపొందించాం.

విద్యార్థులకు అవసరమైన **''అభ్యాస వేదిక''**ను చేర్చడంవల్ల వారిలో సాహిత్య వ్యాకరణాది పరిజ్ఞానం పెరుగుతుందని ఆశిస్తున్నాం. చివరిగా వ్యాసాలు, లేఖలు, అపరిచిత గద్యం చేర్చడం వల్ల విద్యార్థులలో ఆలోచనాశక్తిని పెంపొందించు కోవడానికి అనుకూలంగా ఉంది.

ప్రథమ పి.యు.సి. భాషాగ్రంథాల అధ్యయనానికి సుమారు 120 పీరియడ్ల సమయం లభించును. దీనిని దృష్టిలో పెట్టుకొని పద్యభాగానికి 40, గద్య భాగానికి 35, ఉపవాచకానికి 10, వ్యాకరణాదికాలకు 35 పీరియడ్లగా అధ్యాపకులు కేటాయించుకోవచ్చును. చిట్టచివరిగా **'మాదిరి ప్రశ్నపత్రం'** 100 మార్కులకు జత చేయబడింది.

పదవి పూర్వ శిక్షణా శాఖవారి సూచనల మేరకు నేటి విద్యా విధానాల్ని దృష్టిలో ఉంచుకొని ఈ పాఠ్యపుస్తకమూ, ఉపవాచకము ప్రథమ పి.యు.సి. విద్యార్థుల భాషా పటిమను, సామాజిక విలువలను పెంపొందిస్తాయని విశ్వసిస్తూవున్నాం.

**DEPARTMENT OF PRE-UNIVERSITY EDUCATION**
**Sampige Road, Malleswaram, Bangalore.**

Syllabus Prepared for **I PUC - 2013.**

Sub/Code : **·Telugu (05)** Total Teaching hrs.-120

**Non-detailed Text - (10)**

| Sl. No. | Topic | Text Selected | Name of the Author/Writer | Teaching hours. (10) |
|---|---|---|---|---|
| 1. | కెంపేగౌడ (బెంగళూరు మహానగర నిర్మాత) | కర్నాటక సర్కార ప్రచురణ బెంగళూరు నగర | Extract from N.D. Text published by Karnataka Govt. | 10 |

**Grammer etc.** Total hrs. - 35

| Sl. No. | Topic | Teaching hours. (35) |
|---|---|---|
| 1. | సంధులు | **5** |
| **2.** | ఛందస్సు | **5** |
| **3.** | అలంకారాలు | **5** |
| **4.** | వ్యాసములు | **8** |
| **5.** | లేఖారచన | **4** |
| **6.** | సొంతవాక్యాలు | **4** |
| **7.** | అపరిచిత గద్యం (ప్రశ్న జవాబులు) | **4** |
| | మొత్తం | **35** |

**Period allottment schedule** Periods

| Sl. No. | Topic | Teaching hours. (120) |
|---|---|---|
| 1. | పద్యభాగం | 40 |
| 2. | గద్యభాగం | 35 |
| 3. | వ్యాకరణం | 15 |
| 4. | నమూనాలు | 20 |
| 5. | ఉపవాచకం | 10 |
| | మొత్తం | **120** |

# MODEL QUESTION PAPER

## I P.U.C. - TELUGU

**Time : 3 hrs.　　2013　　Max.Marks : 100**

**(Code No. 05)**

**I.** ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క వాక్యములో సమాధానాలు వ్రాయుము :

**5 x 1 = 5**

1. నన్నయ ఏ కాలం వాడు ?
2. పోతనగారి బిరుదమేమి ?
3. హంపీ సమీపమున నున్న నది పేరేమి ?
4. కుంతి ఎవరి కుమార్తె ?
5. వ్యాసమహర్షి తండ్రి ఎవరు ?

**II.** ఈ క్రింది ప్రశ్నలకు ఒక్కొక్క వాక్యములో సమాధానాలు వ్రాయుము :

**5 x 1 = 5**

6. 'శశము' – అనగా నేమి ?
7. విదురుడు ఎవరికి నీతులు చెప్పాడు ?
8. త్యాగయ్య తల్లిదండ్రు లెవరు ?
9. సత్యవంతుడు మరణిస్తాడని ఎవరు చెప్పారు ?
10. బసవేశ్వరుడు ఎవరివద్ద మంత్రిగానుండెను ?

**III.** ఈ క్రింది పద్యాలలో ఒకదానిని పాదభంగము లేకుండా పూరించండి :

**1 x 5 = 5**

11. ఎవ్వని చేజనించు ............ శరణంబు వేడెదన్.



12. మునిమంత్రమ్ము ....... కుంతి సౌభాగ్యముల్.

**IV.** ఈ క్రింది పద్యాలలో ఒకదానికి భావం వ్రాయండి.　　**1 x 5 = 5**

13. అలవైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబుదా
పల మందార వనాంతరామృత సరఃప్రాంతేందు కాంతోపలో
త్పల పర్యంక రమావినోదియగు నాపన్న ప్రసన్నుండు వి
హ్వల నాగేంద్రము ''పాహిపాహి'' యన గుయ్యాలించి సంరంభియై.

14. అది రమణీయ పుష్పవన – మావన మందొక మేడ – మేడపై
నదియొక మాఱుమూలగది – ఆగది తల్పులు తీసి మెల్లగా
పదునయిదేండ్ల యీడుగల బాలిక – పోలిక రాచపిల్ల – జం
కొదవెడి కాళ్ళతోడ దిగుచున్నది క్రిందకు మెట్లమీదుగన్ !

**V.** ఈ క్రింది ప్రశ్నలలో రెండింటికి సమాధానములు వ్రాయండి :

**2 x 4 = 8**

15. ఏకలవ్యుడు ఏరీతిగా అస్త్రవిద్యలు నేర్చాడు ?
16. సీత, హనుమంతునితో తన సందేహాన్ని ఎలా చెప్పింది ?
17. పెట్టెను అమర్చడానికి కుంతి ఏమేమి చేసింది ?

**VI.** ఈ క్రింది ప్రశ్నలలో రెండింటికి సమాధానాలు వ్రాయండి :

**2 x 4 = 8**

18. నిగమశర్మ అక్క తన తమ్ముని సరిదిద్దడానికి చేసిన ప్రయత్నమేమి?
19. సావిత్రి, సత్యవంతుని వివాహమాడిన విధమును తెల్పండి.
20. వ్యవసాయ రంగంలో సౌరశక్తి ఎలా ఉపయోగపడుతుంది ?

**VII.** ఈ క్రింది వానిలో రెండింటికి సందర్భసహిత వ్యాఖ్యలు వ్రాయుడు :

**2 x 3 = 6**

21. అస్త్ర విద్యారహస్యంబు లర్థి బడవ.

22. వినడె చూడడె తలపడె పేగరాడె !

23. నన్నును దల్లిమారుగాంగని కొలువంగ నేర్చు.

**VIII. ఈ క్రిందివానిలో రెండింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు వ్రాయుడు : 2 x 3 = 6**

24. వంతు నీ పాలం బడియె.

25. ధనానికంటే గుణానికే ప్రథమ గౌరవం.

26. అయితే ఆ డబ్బును దేవుడే కాపాడుకుంటాడు.

**IX. వీనిలో ఒకదానిని గూర్చి వ్రాయండి : 1 x 10 = 10**

27. కెంపేగౌడ బాల్య విశేషములను తెల్పండి.

28. కెంపేగౌడ బెంగళూరు నగరమును వృద్ధి చేసిన విధమును వివరింపుము.

29. కెంపేగౌడ నిర్బంధమునకు కారణములు తెల్పుము.

**X. వీటిలో మూడింటిని విడదీసి సంధి పేరు, సూత్రము వ్రాయండి : 3 X 2 = 6**

30. కలడందురు.

31. స్వారి యొనర్చిన

32. ఎన్నటికైన.

33. అక్కోమలి.

34. నిట్టూర్పు



**XI. గణవిభజన చేసి, యతిని గుర్తించి ఇది ఏ పద్య పాదమో తెల్పుము : 1 x 5 = 5**

35. కనకము తాచినన్ కొలిమి గాచిన తగ్గనె వన్నె వాసియున్.

**XII. ఇందులోగల అలంకారమును వివరించండి : 1 x 5 = 5**

36. కలదు కలండనెడువాడు కలదో ! లేడో !

**XIII. వీటిలో రెండింటికి సొంతవాక్యాలు వ్రాయండి : 2 x 3 = 6**

37. కొంగుబంగారం

38. పిట్టకొంచెము-కూతఘనము

39. ఉడుతాభక్తి

40. ఈడు జోడు

**XIV. వీనిలో ఒకదానిని గూర్చి లేఖ వ్రాయండి : 1 x 5 = 5**

41. సెలవు మంజూరుకోసం కళాశాల అధ్యక్షులకు లేఖ.

42. ఉద్యోగానికి దరఖాస్తు చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారికి లేఖ.

**XV. వీనిలో ఒకదానిని గూర్చి వ్యాసం వ్రాయండి : 1 x 10 = 10**

43. నిరుద్యోగ సమస్య.

44. అవినీతి నిర్మూలన.

45. పరిశుభ్రత – పచ్చదనం.

**XVI.** ఈ గద్యాన్ని చదివి క్రింది ప్రశ్నలకు సమాధానాలు వ్రాయండి :

**5 x 1 = 5**

పుణ్యకర్మ లెక్కువగా చేసినవారు స్వర్గాదిలోకములకు వెళ్ళి పుణ్యఫలములైన సుఖభోగముల ననుభవింతురు. పుణ్యము నశించగనేవారు తిరిగి భూలోకమున జన్మింతురు. అట్లే, పాపము లొనర్చినవారు నరకమున కేగి దుఃఖముల ననుభవింతురు. కాబట్టి మానవుడు సత్కర్మలొనర్చి ఉత్తమస్థితి నొందుటకు ప్రయత్నింప వలెను. ప్రారబ్ధ కర్మను మనము మార్చుకొన లేము.. కాని, భవిష్యత్తు మనచేతిలో నున్నదనుట నిశ్చయము. కాగ మానవుడు సత్కర్మలొనర్చి ఉత్తమగతి నొందుటకు తప్పక యత్నింప వలెను.

**ప్రశ్నలు :**

46. పుణ్యము చేసినవారు ఏలోకమునకు వెళ్ళెదరు ?
47. పుణ్యము నశించగనే తిరిగి వారు ఏలోకమునకు వత్తురు ?
48. పాపములొనర్చినవారు ఎచ్చటి కేగుదురు ?
49. దేనిని మనము మార్చుకొన లేము ?
50. మానవుడు ఎందుకొరకు ప్రయత్నించ వలెను ?

★★★★★